
'గ్రామం ప్రగతిపథంలో ఉంటే ఎవ్వరూ మురా కక్షల జోలికి వెళ్లరు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+16 వెల: ₹ 5.00

సంపుటి: 11 సంచిక: 310

గురువారం 31-1-2019



'హంగ్' అభివృద్ధికి అడ్డు

పూర్తి మద్దతుతోనే పురోభివృద్ధి... సూరత్, దండి సభల్లో మోదీ - 13లో



నేటి నుంచి పార్లమెంట్

రఫేల్, రైతుల సమస్యలపై నిలదీతకు విపక్షాలు రెడీ - 13లో

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



బుధవారం రాత్రి నుమాయిష్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో ఆహుతవుతున్న స్టాళ్లు

మంటల్లో నుమాయిష్

నాంపల్లి ఎగ్జిబిషన్‌లో భారీ అగ్నిప్రమాదం ● బుగ్గిపాలైన 400 స్టాళ్లు

- ఓ బ్యాంకు స్టాల్‌లో షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం
- దావానలంలా విస్తరించిన మంటలు
- తప్పిన ప్రాణనష్టం.. అయినా భారీ ఆస్తి నష్టం
- ప్రాణాలు కాపాడుకునేందుకు పరుగులు తీసిన సందర్శకులు
- స్వల్ప తొక్కిసలాట.. అరగంట ఆలస్యంగా రంగంలోకి ఫైరింజన్లు... నష్ట పరిహారం కోసం హోం మంత్రి మహమూద్ అలీ ఘెరావ్

సాక్షి, హైదరాబాద్: ప్రజలకు వినోదాన్ని పంచే.. ఎగ్జిబిషన్‌లో పరిస్థితి విషాదకరంగా మారింది. హైదరాబాద్‌లోని నాంపల్లిలో ప్రతిఏటా జరిగే అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన (నుమాయిష్) అగ్నికి ఆహుతైంది. బుధవారం రాత్రి ఏడున్నర గంటల ప్రాంతంలో రేగిన నిప్పురవ్వలు.. చూస్తుండగానే దావానలంలా మారి క్షణాల్లో అక్కడున్న స్టాళ్లను బూడిద చేశాయి. అగ్నికీలలు ఎగసిపడ్డాయి. అయితే.. ఈ ఘటన జరిగిన సందర్భంలో సుమారు యాభైవేలకు పైగా సందర్శకులు ఎగ్జిబిషన్‌లో వివిధ స్టాళ్లలో ఉన్నప్పటికీ.. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ఉధృతంగా ఎగసిపడిన మంటలు, దట్టమైన పొగ కారణంగా సుమారు ఏడుగురు అస్వస్థతకు గురవడంతో.. వీరికి సమీపంలోని మిగతా 2వ పేజీలో ▶

ఊళ్లపై గులాబీ జెండా

పంచాయతీ ఎన్నికల్లో టీఆర్‌ఎస్‌దే హవా

మూడో విడతలోనూ ఆ పార్టీకే అధిక స్థానాలు



8,264 టీఆర్‌ఎస్ మద్దతుదారులు

2,688 కాంగ్రెస్ మద్దతుదారులు

1,371 పంచాయతీల్లో స్వతంత్రుల పాగా

170 బీజేపీ మద్దతుదారులు

77 టీడీపీ మద్దతుదారులు

5లో

"రాష్ట్రంలో పంచాయతీ పోరు ముగిసింది. ఊళ్లలోనూ గులాబీ జెండా ఎగిరింది. అసెంబ్లీ ఎన్నికల వెంటనే జరిగిన 'పంచాయతీ'లోనూ టీఆర్‌ఎస్‌కే జనం జై కొట్టారు. మూడు విడతలుగా జరిగిన ఈ ఎన్నికల్లో ప్రతీ విడతలోనూ అధికార పార్టీ హవా కొనసాగింది. మొత్తం 12,686 గ్రామ పంచాయతీలకు గాను 8264 చోట్ల టీఆర్‌ఎస్ మద్దతుదారులు విజయం సాధించారు. 2,688 చోట్ల కాంగ్రెస్ మద్దతుదారులు గెలుపొందారు.

దశలవారీగా గ్రామపంచాయతీ ఎన్నికల ఫలితాలివీ...

దశ	టీఆర్‌ఎస్	కాంగ్రెస్	టీడీపీ	బీజేపీ	సీపీఐ	సీపీఎం	ఇతరులు
మొదటి దశ	2,769	917	29	66	14	33	642
రెండో దశ	2,865	770	39	43	12	22	379
మూడో దశ	2,630	1,001	9	61	13	19	350
మొత్తం	8,264	2,688	77	170	39	74	1,371

టైమ్స్ నౌ- వీఎంఆర్ సర్వే

మ్యాజిక్ ఫిగర్‌కు మోదీ సర్కార్ దూరం



- లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయే 252, యూపీఏ 147, ఇతరులు 144 స్థానాల్లో విజయం
- బీజేపీకి సొంతంగా 215, కాంగ్రెస్‌కు 96 స్థానాలు

13లో

ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్‌ఆర్‌సీపీ హవా

- మొత్తం 25 లోక్‌సభ స్థానాలకుగాను 23 చోట్ల విజయం 2లో

తెలంగాణలో టీఆర్‌ఎస్ ఆధిక్యం 13లో



ఇదేం చలి బాబోయ్

- వివరాలు 2లో

జిల్లాలు.. 33

కొత్తగా ములుగు, నారాయణపేట జిల్లాల ఏర్పాటు

- నెల క్రితం ముసాయిదా ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- అభ్యంతరాలకు ముగిసిన తుది గడువు
- ఒకట్రెండు రోజుల్లో రెండు జిల్లాల ఏర్పాటుపై ఉత్తర్వులు - 4లో



తాత్కాలికమే కానీ.. వరాల జల్లే!

- బడ్జెట్‌పై కర్షకులు, కార్పొరేట్ల అంచనా
- తాత్కాలిక బడ్జెటేనని స్పష్టం చేసిన కేంద్రం
- ఎన్నికల నేపథ్యంలో కీలక నిర్ణయాలకు అవకాశం
- జైట్లీ బదులుగా ఈసారి పీయూష్ గోయెల్ సమర్పణ
- రైతులకు నేరుగా నగదు బదిలీ చేసే పథకానికి చోటు
- ఆదాయపు పన్నులోనూ ఊరటనిస్తారని ఆశలు

- వివరాలు 2లో



కలప అమ్మకాలపై సెస్

- ప్రత్యేక పన్నుపై సర్కారు సమాలోచనలు
- వ్యవసాయ ఉత్పత్తులపై మార్కెట్ ఫీజు తరహాలో..
- దీన్ని హరితహారం కోసం వినియోగించాలని యోచన
- అటవీ నిబంధనలను కఠినతరం చేయనున్న ప్రభుత్వం - 4లో

ఇదేం చలి బాబోయ్!

- నేడు ఉత్తర తెలంగాణలో తీవ్ర శీతల గాలులు
- 24 గంటల్లో భారీగా పడిపోయిన పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు
- సాధారణం కంటే 9 డిగ్రీల వరకు తగ్గుదల
- రాజధానిలో ఏడేళ్ల తర్వాత తక్కువ ఉష్ణోగ్రతల నమోదు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంపై చలి పంజా విసురుతోంది. మూడునాలుగు రోజులుగా చలితో జనం గజగజలాడుతున్నారు. జలుబు, దగ్గులతో బాధపడుతున్నారు. కొన్నిచోట్ల స్వైన్‌ఫ్లూ బారిన పడుతున్నారు. ప్రస్తుతం హిందూ మహాసముద్రం దాన్ని ఆనుకుని ఉన్న ఆగ్నేయ బంగాళాఖాతం ప్రాంతాల్లో అల్పపీడనద్రోణి బలహీనపడింది. మరోవైపు ఉత్తర దిశ, ఈశాన్య దిశ నుంచి గాలులు వీస్తున్నాయి. దీంతో వచ్చే రెండ్రోజులు రాష్ట్రంలో పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉంది. ఈ ప్రభావంతో గురువారం ఉత్తర తెలంగాణలోని ఆదిలాబాద్, కొమురంభీం, నిర్మల్, మంచిర్యాల, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, నిజామాబాద్, కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి జిల్లాలో చలిగాలుల తీవ్రత ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం సీనియర్ అధికారి రాజారావు వెల్లడించారు. ఇదిలావుండగా గత 24 గంటల్లో చలి రాష్ట్రాన్ని కమ్మేసింది. ఆదిలాబాద్‌లో రాత్రి ఉష్ణోగ్రత ఏకంగా 7 డిగ్రీలకు పడిపోయింది. హన్మకొండలో రాత్రి ఉష్ణోగ్రత సాధారణం కంటే 9 డిగ్రీలు తక్కువగా నమోదైంది. ఇక్కడ సాధారణ రోజుల్లో రాత్రి ఉష్ణోగ్రత 18 డిగ్రీలు నమోదు కావాలి. కానీ 9 డిగ్రీలే నమోదైంది. హైదరాబాద్, రామగుండంలో ఏడు డిగ్రీలు తక్కువగా 9 డిగ్రీల చొప్పున కనిష్ట ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. నిజామాబాద్‌లో రాత్రి ఉష్ణోగ్రత ఆరు డిగ్రీలు తక్కువగా 10 డిగ్రీలు నమోదైంది. అలాగే పగటి ఉష్ణోగ్రతలు కూడా పలుచోట్ల సాధారణం కంటే రెండు నుంచి ఏడు డిగ్రీల వరకు తక్కువగా నమోదయ్యాయి. నిజామాబాద్‌లో పగటి ఉష్ణోగ్రత సాధారణం కంటే ఏడు డిగ్రీలు తక్కువగా 25 డిగ్రీలు రికార్డయింది. దీంతో జనం ఇబ్బందులు పడ్డారు.

రాజధానిలోనూ చలిగాలులు..

ఉత్తర, ఈశాన్య గాలుల తీవ్రత నగరాన్ని గజగజ వణికిస్తోంది. దీంతో ఏడేళ్ల అనంతరం జనవరి మాసంలో అతి తక్కువగా 9.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఇది సాధారణ ఉష్ణోగ్రతల కంటే ఏడు డిగ్రీలు తక్కువ. సహజంగా జనవరి 15 తర్వాత పగటితో పాటు రాత్రి ఉష్ణోగ్రతలు కూడా క్రమంగా పెరగాల్సి ఉన్నా.. ఇటీవలి తుపాను అనంతరం శీతల గాలుల తీవ్రత ఇంకా కొనసాగుతోంది. దీంతో పగటి పూట సైతం తక్కువ ఉష్ణోగ్రతలే నమోదు అవుతున్నాయి. బుధవారం 26.7 డిగ్రీలు నమోదైంది. ఇదిలా ఉంటే మరో వారం రోజుల పాటు చలి గాలుల తీవ్రత కొనసాగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. నగరంలో ఒక్కసారిగా అత్యల్ప ఉష్ణోగ్రతల మూలంగా జలుబు, జ్వరంతో బాధపడే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. గుండె, శ్వాస సంబంధ వ్యాధులున్న వారు తప్పనిసరైతే తప్ప చలిగాలిలో బయటికి రావద్దని వైద్య ఆరోగ్యశాఖ హెచ్చరించింది. మరోవైపు స్వైన్ ఫ్లూ తీవ్రత కూడా ఉండటంతో నగరవాసులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. మరో నాలుగు రోజుల పాటు అత్యల్ప ఉష్ణోగ్రతలే నమోదు కానున్నాయి.

ఉద్దేశ పూర్వకంగానే జగన్‌పై హత్యాయత్నం

తేల్చి చెప్పిన ఎన్‌ఐఏ

సాక్షి, అమరావతి: ఏపీ ప్రతిపక్ష నేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిపై గత ఏడాది అక్టోబర్ 25న విశాఖ విమానాశ్రయంలో జరిగిన హత్యాయత్నం ఉద్దేశపూర్వకంగా జరిగిందేనని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) తేల్చి చెప్పింది. ఆ దాడి గురి తప్పకపోయుంటే మరణం సంభవించి ఉండేదని, అందుకే జగన్‌పై జరిగిన దాడిని రాష్ట్ర పోలీసులు హత్యాయత్నంగా పరిగణిస్తూ, ఆ మేరకు ఐపీసీ సెక్షన్ 307 కింద కేసు నమోదు చేశారని వివరించింది. విమానాశ్రయంలో చట్ట విరుద్ధంగా, ఉద్దేశ పూర్వకంగా ఏదైనా ఉపకరణాన్ని, ఆయుధాన్ని ఉపయోగించి హింసకు పాల్పడటం ద్వారా ఎవరైనా తీవ్రంగా గాయపడినా, మరణించినా అది పౌర విమానయాన చట్టం ప్రకారం చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిర్వచన పరిధిలోకి వస్తుంది. జగన్‌పై జరిగిన దాడి ఘటనకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సీఐఎస్ఎఫ్), ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ), ఎన్‌ఐఏలు ఇచ్చిన సమాచారాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, విశ్లేషించిన తర్వాతే ఇది పౌర విమానయాన చట్టం కింద చట్ట వ్యతిరేక కార్యకలాపాల పరిధిలోకి వస్తుందని కేంద్ర ప్రభుత్వం ప్రాథమిక అభిప్రాయానికి వచ్చిందని ఎన్‌ఐఏ వివరించింది. ఇందుకు అనుగుణంగానే ఈ ఘటనపై దర్యాప్తును తమకు అప్పగిస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసిందని పేర్కొంది.

క్షేత్ర స్థాయి దర్యాప్తు ఆధారంగా చార్జిషీట్

'ఈ విషయంలో కేంద్రం చాలా జాగ్రత్తగా నిర్ణయం తీసుకుంది. ఎన్‌ఐఏ చట్టంలోని సెక్షన్ 6(5) కింద ఉన్న అధికారాన్ని ఉపయోగించి ఈ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులు రాజ్యాంగ విరుద్ధం, చట్ట విరుద్ధం ఎంత మాత్రం కాదు. ఎన్‌ఐఏ చట్టంలోని సెక్షన్ 6 (6) ప్రకారం ఈ కేసు దర్యాప్తునకు సంబంధించిన రికార్డులు, డాక్యుమెంట్లన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వం లేదా రాష్ట్ర పోలీసులు ఎన్‌ఐఏకు అందజేయాలి. అయితే ఈ కేసులో మేం పలుమార్లు అభ్యర్థించినా, ఎన్‌ఐఏ ఆదేశించినా కూడా రాష్ట్ర పోలీసులు ఇప్పటి వరకు రికార్డులు, డాక్యుమెంట్లను తమకు సమర్పించలేదంది. దీంతో క్షేత్ర స్థాయి దర్యాప్తు ఆధారంగా దర్యాప్తు అధికారి ఈ నెల 23న ఎన్‌ఐఏ ప్రత్యేక కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టేయండి' అని ఎన్‌ఐఏ హైకోర్టును అభ్యర్థించింది.

రాష్ట్ర ప్రభుత్వం కౌంటర్ దాఖలుకు గడువు

జగన్‌పై జరిగిన హత్యాయత్నం ఘటనపై దర్యాప్తును ఎన్‌ఐఏకు అప్పగిస్తూ కేంద్ర హోం శాఖ జారీ చేసిన ఉత్తర్వును సవాలు చేస్తూ రాష్ట్ర హోం శాఖ ముఖ్య కార్యదర్శి ఏఆర్ అనూరాధ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై ఇటీవల విచారణ జరిపిన న్యాయమూర్తి జస్టిస్ గుడిసేవ శ్యాంప్రసాద్ పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వం, ఎన్‌ఐఏలను ఆదేశించారు. తాజాగా ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా, అటు ఎన్‌ఐఏ, ఇటు కేంద్ర ప్రభుత్వం తరఫున ఎన్‌ఐఏ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఎస్.ప్రవీణ్‌కుమార్ దాఖలు చేసిన కౌంటర్‌ను అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ) బొప్పుడి కృష్ణమోహన్ న్యాయమూర్తి ముందు ఉంచారు. ఈ కౌంటర్‌కు తిరుగు సమాధానం ఇస్తూ అఫిడవిట్ దాఖలు చేసేందుకు ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) డి.రమేశ్ గడువు కోరారు. ఇందుకు న్యాయమూర్తి అంగీకరిస్తూ విచారణను ఫిబ్రవరి 12కి వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఏపీలో వైఎస్సార్‌సీపీదే హవా

- టైమ్స్ నౌ–వీఎంఆర్ సర్వే వెల్లడి
- ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే 23 లోక్‌సభ స్థానాల్లో విజయకేతనం
- టీడీపీ కేవలం 2 స్థానాలకే పరిమితం

సాక్షి, అమరావతి: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హవా కొనసాగుతుందని టైమ్స్ నౌ – వీఎంఆర్ సర్వే వెల్లడించింది. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే రాష్ట్రంలో మొత్తం 25 లోక్‌సభ స్థానాలకుగాను వైఎస్సార్‌సీపీ 23 సీట్లలో విజయకేతనం ఎగరవేస్తుందని తెలిపింది. టీడీపీ కేవలం రెండు సీట్లకు మాత్రమే పరిమితమవుతుందని, జాతీయ పార్టీలు బీజేపీ, కాంగ్రెస్‌లు ఖాతా తెరవలేవని చెప్పింది. వైఎస్సార్ సీపీ, టీడీపీల మధ్య ఓట్ల వ్యత్యాసం కూడా భారీగానే ఉంటుందని సర్వే పేర్కొంది. వైఎస్సార్‌సీపీకి 49.5 శాతం ఓట్లు, టీడీపీకి 36 శాతం, బీజేపీ (ఎన్‌డీఏ)కి 4.8 శాతం, కాంగ్రెస్ (యూపీఏ)కు 2.5 శాతం ఓట్లు పడతాయని వెల్లడించింది. 2014 లోక్‌సభ ఎన్నికల్లో ఏపీలో టీడీపీ, బీజేపీ కలిసి పోటీ చేయగా టీడీపీకి 15 సీట్లు, బీజేపీకి రెండు సీట్లు, వైఎస్సార్‌సీపీకి 8 సీట్లు వచ్చిన విషయం తెలిసిందే.



మహాత్మునికి వైఎస్ జగన్ ఘన నివాళి

సాక్షి, హైదరాబాద్: మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం హైదరాబాద్‌లోని లోటస్‌పాండ్‌లో గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అమెరికన్ కాన్సులేట్ జనరల్ క్యాథరిన్ హడ్డా, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మాజీ ఎంపీ మిథున్‌రెడ్డి తదితరులు కూడా పాల్గొని మహాత్మునికి నివాళులర్పించారు.

జగన్‌ను కలసిన యూఎస్ కాన్సులేట్ జనరల్

ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని యూఎస్ కాన్సులెట్ జనరల్ క్యాథరిన్ హడ్డా బుధవారం లోటస్‌పాండ్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు విషయాలపై వారు చర్చించారు.

మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైఎస్ జగన్. చిత్రంలో యూఎస్ కాన్సులేట్ జనరల్ క్యాథరిన్ హడ్డా, వేమిరెడ్డి తదితరులు

తాత్కాలికమే కానీ.. వరాల జల్లే!

బడ్జెట్‌పై కర్షకులు, కార్పొరేట్ల అంచనా

- తాత్కాలిక బడ్జెటేనని స్పష్టం చేసిన కేంద్రం
- ఎన్నికల నేపథ్యంలో కీలక నిర్ణయాలకు అవకాశం
- జైట్లీ బదులుగా ఈసారి పీయూష్ గోయెల్ సమర్పణ
- రైతులకు నేరుగా నగదు బదిలీ చేసే పథకానికి చోటు
- ఆదాయపు పన్నులోనూ ఊరటనిస్తారని ఆశలు



తాత్కాలిక బడ్జెట్ ప్రవేశపెట్టాలన్న సంప్రదాయాన్ని పాటిస్తూనే.. రాబోయే ఎన్నికల్ని దృష్టిలో ఉంచుకుని కీలక నిర్ణయాలను వెలువరించేలా నరేంద్ర మోదీ ప్రభుత్వం వ్యూహాత్మక బడ్జెట్‌కు కసరత్తు చేస్తోంది. ఫిబ్రవరి మొదటి తారీఖున బడ్జెట్ ప్రవేశపెట్టే సంప్రదాయాన్ని గతేడాది నుంచి ప్రారంభించిన మోదీ సర్కారు.. సంప్రదాయానికి భిన్నంగా ఈసారి తాత్కాలిక బడ్జెట్ కాకుండా పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెడుతుందన్న వార్తలు వెలువడ్డాయి. దీనికితోడు బుధవారం ఉదయం ఆర్థిక శాఖ ఒక వాట్సాప్ సందేశంలో.. 2019–20 బడ్జెట్‌ను తాత్కాలిక బడ్జెట్‌గా పేర్కొనవద్దని పేర్కొంది. దీనిపై కాంగ్రెస్ సహా విపక్షాల నుంచి విమర్శలొచ్చాయి. దీంతో వెనక్కు తగ్గిన ఆర్థిక శాఖ.. తాత్కాలిక బడ్జెట్‌నే ప్రవేశపెడుతున్నట్లు బుధవారం సాయంత్రం స్పష్టం చేసింది.

తాత్కాలికమైతేనేం..

బడ్జెట్ తాత్కాలికమా? పూర్తిస్థాయిలోనా అన్న సంగతి పక్కన పెడితే.. ఎన్నికల దృష్ట్యా ప్రభుత్వం కీలక నిర్ణయాలు వెలువరించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఎన్డీయే సర్కారు ఈ ఐదేళ్ల పదవీకాలంలో ప్రవేశపెడుతున్న చివరి బడ్జెట్ ఇదే. ఇప్పటిదాకా ఐదు బడ్జెట్‌లు ప్రవేశపెట్టిన అరుణ్‌జైట్లీ అనారోగ్య కారణంగా.. ఆ బాధ్యతల్ని స్వీకరించిన రైల్వే మంత్రి పీయూష్ గోయెల్ తాజా బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఎన్నికల ముందు బడ్జెట్ కావటంతో దీనిపై సామాన్యుల నుంచి కార్పొరేట్ల వరకు ఎన్నో వర్గాలు ఆశలు పెట్టుకున్నాయి. రైతులకు ఆర్థిక ప్రయోజనాలతో కూడిన ప్యాకేజీ, వేతన జీవులకు ఆదాయపన్ను మినహాయింపు వంటి ప్రయోజనాలు ఉండొచ్చన్న అంచనాలతోపాటు అత్యధిక సంఖ్యలో ఉన్న చిరువ్యాపారులకు రుణాల పరంగా వెసులుబాటు కల్పించొచ్చని భావిస్తున్నారు.

రైతులపై వరాల జల్లు!

రైతులకు సబ్సిడీలకు బదులు నేరుగా నగదును అందించే ప్రతిపాదనను కేంద్ర సర్కారు పరిశీలిస్తున్నట్టు.. ఈ వ్యవహారంతో సంబంధమున్న వర్గాలు చెబుతున్నాయి. ఎరువులు సహా అన్ని రకాల సబ్సిడీలను కలిపి ఆ మొత్తాన్ని రైతులకు నేరుగా నగదును అందించే ఉద్దేశంతో ప్రభుత్వం ఉంది. దీన్ని కనుక అమల్లోకి తెస్తే కేంద్ర ప్రభుత్వంపై అదనంగా రూ.70,000 కోట్ల భారం పడుతుందని అంచనా. రెండోసారి కేంద్రంలో మళ్లీ అధికారం చేపట్టాలనుకుంటున్న మోదీ ప్రభుత్వానికి.. నిరాశ, నిస్పృహలతో ఉన్న రైతాంగాన్ని సంతోషపెట్టే నిర్ణయాలు తీసుకోక తప్పని పరిస్థితి నెలకొంది. మరోసారి రైతుల రుణమాఫీ నిర్ణయాన్ని ప్రతిపక్ష కాంగ్రెస్ తీసుకొస్తుండడంతో ఏదో ఒకటి చేయక తప్పనిసరి పరిస్థితిని మోదీ సర్కారు ఎదుర్కొంటోంది. వ్యవసాయరంగానికి రుణాల లక్ష్యాన్ని 10% పెంచి రూ.12 లక్షల కోట్లు చేసే అవకాశాలు కూడా ఉన్నాయని వినిపిస్తోంది. గత కొన్నేళ్లుగా వ్యవసాయరంగ రుణ లక్ష్యాలు పెరుగుతూ వస్తున్నాయి. 2017–18లో రూ.11.68 లక్షల కోట్ల రుణాలను రైతులకు అందజేశారు. నిజానికి పెట్టుకున్న లక్ష్యం రూ.10 లక్షల కోట్ల కంటే ఇది ఎంతో ఎక్కువ. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2018–19) సర్కారు రూ.11 లక్షల కోట్ల లక్ష్యం విధించుకుంది. పైగా స్వల్పకాలం సాగు రుణాలను 3% సబ్సిడీ రేటుపై 7% అందిస్తోంది. సకాలంలో చెల్లింపులు చేస్తే అదనంగా మరో 3% రాయితీ కూడా ఇస్తోంది. దీంతో అసలు వడ్డీ రేటు 4% పడుతోంది.

ఆదాయపు పన్ను పరిమితి పెంపు!

ఇక మధ్యతరగతి వర్గాలు ఆదాయపన్ను పరంగా మినహాయింపులు ఈ ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో ఉంటాయని ఆశిస్తున్నారు. ఆదాయపన్ను ప్రామాణిక మినహాయింపు రూ.2.5 లక్షల నుంచి పెంచే అవకాశం కూడా కనిపిస్తోంది. సెక్షన్ 80–సీ కింద వివిధ మార్గాల్లో చేసే రూ.1.5 లక్షల పెట్టుబడులపై పన్ను మినహాయింపు ఉంది. పెరుగుతున్న ఆదాయం, ద్రవ్యోల్బణం నేపథ్యంలో దీన్ని రూ.2–2.5 లక్షలు చేయాల్సిన అవసరం ఉందని, అదే జరిగితే ఆర్థిక పరిపుష్టికి ప్రోత్సాహం ఇచ్చినట్టు అవుతుందని బ్యాంక్ బజార్ సీఈవో అదిల్‌శెట్టి అభిప్రాయపడ్డారు. మెట్రో నగరాల్లో ఇళ్ల కొనుగోలుదారులకు ఆదాయపన్ను మినహాయింపును రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షలు చేయాలన్న డిమాండ్ కూడా ఉంది. ఇతర డిమాండ్లలో.. కేవలం ఈక్విటీ ఫండ్స్‌కే కాకుండా, డెట్, హైబ్రిడ్ ఫండ్స్ కూడా సెక్షన్ 80–సీ కింద మినహాయింపు కల్పించడం.. దీర్ఘకాలిక మూలధన లాభం రూ.లక్ష దాటితే పన్ను పరిమితిని పెంచడం వంటివి కూడా ఉన్నాయి.

– సాక్షి, బిజినెస్ డెస్క్

వాస్తవ పరిస్థితులివీ!

జీడీపీలో ద్రవ్యలోటును 2018–19 ఆర్థిక సంవత్సరానికి 3.3%కు కట్టడి చేయాలన్నది కేంద్ర ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యం. కానీ ఈ లక్ష్యం డిసెంబర్ నాటికే దాటిపోయింది. దీంతో మిగిలి ఉన్న కాలానికి వ్యయాల పరంగా చాలా పరిమితులున్నాయి. ఈ నేపథ్యంలో పన్ను తగ్గింపులు, ఇతర ప్రోత్సాహకాలకు తాత్కాలిక బడ్జెట్‌లో చోటు కల్పిస్తే.. అవి 2019–20 ఆర్థిక సంవత్సరం ద్రవ్యలోటు లక్ష్యాలపై భారం చూపిస్తాయి. 2014లో ఆర్థిక మంత్రిగా జైట్లీ బాధ్యతలు స్వీకరించే నాటికి ద్రవ్యలోటు 5% ఉంది. ప్రపంచ ఆర్థిక సంక్షోభం తర్వాత.. నాటి యూపీఏ సర్కారు ద్రవ్యపరమైన ప్రోత్సాహకాలను ప్రవేశపెట్టింది. కానీ, వీటిని సకాలంలో ఉపసంహరించుకోలేదు. దీని కారణంగా 2009–10 ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యలోటు జీడీపీలో 6.5%కు పెరిగిపోయింది. దీన్ని కనిష్ట స్థాయికి తీసుకొచ్చేందుకు నరేంద్ర మోదీ సర్కారు గట్టి ప్రయత్నాలనే చేసింది. చమురు ధరలు కనిష్ట స్థాయిలకు చేరడం ఇందుకు సాయపడింది. అయితే, జీఎస్టీని అమల్లోకి తేవడం, బ్యాంకుల రీ–క్యాపిటలైజేషన్ సాయం అంచనాలను మించడంతో ద్రవ్యలోటు ప్రణాళికలపై ఒత్తిడికి దారితీశాయి. దీంతో 2017–18లో 3.2% లక్ష్యాన్ని చేరడంలో వెనుకబడింది. గత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటు 3.5% వద్ద స్థిరపడింది. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2018–19లో ద్రవ్యలోటు 3.3% లక్ష్యం కాగా, డిసెంబర్ వరకు తొమ్మిది నెలల కాలానికే ఈ లక్ష్యానికి 115 శాతానికి చేరింది. దీంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 3.3% లక్ష్యాన్ని చేరుకోవడంపై అనుమానాలు నెలకొన్నాయి.

మొదటి బడ్జెటే తాత్కాలికం!

భారత తొలి ఆర్థిక మంత్రి ఆర్కే షణ్ముగం చెట్టి స్వతంత్ర భారతంలో ప్రవేశపెట్టిన మొదటిదే తాత్కాలిక బడ్జెట్. దీన్ని 1947 నవంబర్ 26న ప్రవేశపెట్టారు. ఆ తర్వాత ఐదు బడ్జెట్‌లను కొత్తగా ఎన్నికైన ప్రభుత్వాల ఆర్థికమంత్రులు ప్రవేశపెట్టారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు ప్రవేశపెట్టే తాత్కాలిక లేదా ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో విధాన నిర్ణయాలు ప్రకటించకూడదు. అయితే, 1947 నవంబర్ 26న ప్రవేశపెట్టిన తొలి తాత్కాలిక బడ్జెట్ అని ఆ సమయంలో.. నాటి ఆర్థిక మంత్రి చెట్టి పేర్కొనలేదు. కానీ, 1948 ఫిబ్రవరి 28న రెండో బడ్జెట్ ప్రవేశపెడుతూ, మొదటిది తాత్కాలిక బడ్జెట్ అని చెప్పారు. కేంద్రంలో తొలి కాంగ్రెసేతర సర్కారు (జనతాపార్టీ) ఆర్థిక మంత్రిగా హెచ్‌ఎం పటేల్ 1977లో ఓటాన్ అకౌంట్ సమర్పించారు. 1991లో చంద్రశేఖర్ కేబినెట్‌లోని ఆర్థిక మంత్రి యశ్వంత్‌సిన్హా తాత్కాలిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. మన్మోహన్‌సింగ్.. 1996 పార్లమెంటు ఎన్నికల ముందు తొలిసారి తాత్కాలిక బడ్జెట్ సమర్పించారు. 2009 లోక్‌సభ ఎన్నికల ముందు జనవరిలో ఆర్థిక మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ప్రణబ్ ముఖర్జీ మొదటిసారి తాత్కాలిక బడ్జెట్ సమర్పించారు. 2014 ఫిబ్రవరి 17న ఆర్థిక మంత్రి పి.చిదంబరం తాత్కాలిక బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఇప్పుడు జైట్లీకి అనారోగ్యం కారణంగా రైల్వే మంత్రి పీయూష్ గోయల్‌కు ఓటాన్ అకౌంట్ ప్రవేశపెట్టే అవకాశం దక్కింది.



బుధవారం నాంపల్లి ఎగ్జిబిషన్‌లో ఉవ్వెత్తున ఎగసిపడుతున్న మంటలు



అగ్ని ప్రమాదంలో కాలిపోయిన దుస్తులు





ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న బాధితులు

మంటల్లో నుమాయిష్

▶ మొదటి పేజీ తరువాయి

కేర్, ఉస్మానియా ఆసుపత్రుల్లో చికిత్సనందిస్తున్నారు. ఆస్తి నష్టం మాత్రం వందల కోట్లలో ఉండొచ్చని ప్రాథమిక అంచనా. దాదాపు 400 స్టాళ్లు బూడిదయ్యాయి. దీంతో ఆ స్టాళ్ల యజమానుల ఆవేదన వర్ణనాతీతంగా మారింది. వారిని ఓదార్చడం ఎవరి తరమూ కావడం లేదు. రాత్రి 10.30 గంటల వరకు కూడా మంటలు ఆర్పేందుకు అగ్నిమాపక సిబ్బంది ప్రయత్నిస్తూనే ఉన్నారు. మిగిలిన స్టాళ్లకు మంటలు విస్తరించకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

7.30గంటల సమయంలో..

ఎప్పటిలాగే.. మధ్యాహ్నం 3 గంటలకు ఎగ్జిబిషన్ ప్రారంభమైంది. అయితే.. సాయంత్రం 7.30 గంటల ప్రాంతంలో వనితా మహావిద్యాలయ సమీపంలో ఏర్పాటు చేసిన జైళ్ల, ఆంధ్రాబ్యాంక్ స్టాళ్ల సమీపం నుంచి మంటలు మొదలయ్యాయి. సందర్శకులు, స్టాళ్ల యజమానులు చూస్తుండగానే.. ఈ మంటలు గాంధీ విగ్రహం సమీపంలోని హెచ్‌పీ గ్యాస్, పిస్తా హౌజ్ స్టాళ్ల మధ్య, వీటికి ఎదురుగా ఉన్న స్టాళ్లకు వ్యాపించాయి. వీటిలో చేనేత, దుస్తులు, చెప్పులు, గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్ వస్తువుల స్టాళ్లే ఎక్కువగా ఉన్నాయి. వీటితోపాటు జైళ్లు, ఆర్బీఐ, ఆంధ్రాబ్యాంక్, రియల్ ఎస్టేట్ స్టాళ్లన్నీ దగ్ధమయ్యాయి. కశ్మీర్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి వచ్చిన వారి స్టాళ్లలోని చిన్న గ్యాస్ సిలిండర్లు (వారు వంట వండుకునేవి) పేలిపోయి భారీ శబ్దాలు వినిపించాయి. దీంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది.

కలకలం

మంటలు క్షణాల్లోనే పెరిగిపోతుడడంతో స్టాళ్ల యజమానులతోపాటు అక్కడికొచ్చిన సందర్శకుల్లో ఆందోళన పెరిగిపోయింది. ఎటుపోవాలో అర్థంకాక.. ప్రాణాలు కాపాడుకునేందుకు చెరోపక్కకు పారిపోయే ప్రయత్నం చేయడంతో.. ఒక దశలో స్వల్ప తొక్కిసలాట జరిగింది. ఈ సందర్భంగా అనేక మంది కిందిపడిపోయి స్వల్పంగా గాయపడ్డారు. ఆహ్లాదకరంగా ఉన్న ఎగ్జిబిషన్‌లో పరిస్థితి క్షణాల్లోనే భయానకంగా మారడంతో.. బయట నుండి రావాల్సిన సందర్శకులను నిలిపేయటంతో పాటు, లోపల ఉన్న సందర్శకులు సైతం పిల్లాపాపలతో గాంధీభవన్, అజంతా, గోషామహల్ గేట్ల వైపు పరుగులు తీశారు. సాయంత్రం ఏడు గంటల నుండి పదిన్నర గంటల వరకు చెలరేగిన అగ్నికీలల్లో సుమారు 400 స్టాళ్లు పూర్తిగా దహనం అయ్యాయి. దీంతో ఆస్తినష్టం వందల కోట్లలో ఉంటుందని జీహెచ్‌ఎంసీ అధికారులు అంచనాకు వచ్చారు.


అరగంట తర్వాత వచ్చిన ఫైరింజన్

తొలుత నిప్పురవ్వలు వచ్చి మంటలు అంటుకోగానే ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. అయితే ఆ సమయంలో నుమాయిష్ గేటు బయటే ఉన్న ఫైరింజన్ లోపలకు వచ్చేందుకు 28 నిమిషాల సమయం పట్టిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. దురదృష్టవశాత్తూ.. అందులోనూ మంటలార్పేందుకు సరిపోయేన్ని నీళ్లు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. అగ్నిప్రమాదం విషయమై ఉన్నతాధిరులు జోక్యం చేసుకుని సుమారు 18 ఫైరింజన్లు పంపినా.. రాత్రి పదిన్నర గంటల వరకు మంటలు అదుపులోకి రాలేదు. మాజీ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్, మేయర్ బొంతు రామ్మోహన్, కమిషనర్ దాన కిషోర్‌లు ఎగ్జిబిషన్ గ్రౌండ్ చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. ఈ దుర్ఘటన తర్వాత.. ఎగ్జిబిషన్ గ్రౌండ్ నుండి వెళ్లిపోయే సందర్శకుల కోసం అర్థరాత్రి వరకు ఉచితంగా మెట్రో రైళ్లను నడిపారు.

నష్టపరిహారం కోసం ఆందోళన

మంటలు అదుపులోకి వచ్చిన తర్వాత ఎగ్జిబిషన్ గ్రౌండ్‌కు వచ్చిన హోంమంత్రి మహమూద్ అలీకి స్టాళ్ల యజమానుల నుండి నిరసన ఎదురైంది. సకాలంలో ఫైరింజన్లు రాకపోవటం వల్లే తమ స్టాళ్లు అగ్నికి ఆహుతి అయ్యాయని హోంమంత్రిని చుట్టుముట్టి, తమకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.ఒక దశలో పోలీస్‌లు జోక్యం చేసుకుని ఆందోళనకారులను చెదరగొట్టారు. అనంతరం కొందరు ప్రతినిధులు మహమూద్ అలీతో సమావేశమై తమ పరిస్థితిని వివరించారు. ప్రభుత్వం తప్పక న్యాయం చేస్తుందని ఈ సందర్భంగా హోంమంత్రి వారికి భరోసా ఇచ్చారు. ప్రతి ఏడాది లాగే ఈసారి కూడా జనవరి 1న ప్రారంభమైన 79వ పారిశ్రామిక ప్రదర్శన (ఎగ్జిబిషన్)ను 23 ఎకరాల్లో 2900 స్టాళ్లతో ఏర్పాటు చేశారు. ఫిబ్రవరి 15 వరకు సాగే ఈ ఎగ్జిబిషన్‌ను సుమారు 25–30లక్షల మంది సందర్శిస్తారు. జైళ్లు, అటవీశాఖలతో పాటు జమ్మూకశ్మీర్, ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల నుండి చేతివృత్తి కళాకారుల రూపొందించే వస్త్రాలు, కళాఖండాలకు సంబంధించిన స్టాళ్లున్నాయి.

కళ్లముందే కాలిపోయాయి: అక్బర్ అలీ



మేం ప్రతి ఏటా స్టాల్స్ ఏర్పాటు చేస్తాం. ఈ యేడు పోచంపల్లితో పాటు ఇతర చేనేత వెరైటీలతో నాలుగు స్టాళ్లు ఏర్పాటు చేశాము. తొలుత ఆంధ్రాబ్యాంక్ స్టాల్ పక్క స్టాల్‌నుండి చెలరేగిన మంటలు చూస్తుండగానే విస్తరించాయి. నా స్టాళ్లలోని సుమారు 60 లక్షల విలువైన వస్త్రాలు దహనం అయ్యాయి. ఇప్పుడేం చేయాలో అర్థం కావటం లేదు.

ఫైరింజన్ల ఆలస్యం



ఫైరింజన్లు సకాలంలో వచ్చుంటే ఇంత నష్టం జరిగేది కాదు. మేం ఫోన్ చేసిన చాలా సేపటికి ఫైరింజన్లు వచ్చాయి. పోచంపల్లి ఖాదీతో మేం ఏర్పాటు చేసిన స్టాళ్లు చూస్తుండగానే కాలిపోయాయి. ప్రాణం అరచేతిలో పెట్టుకుని పరిగెత్తడం మినహా.. మరేం చేయలేకపోయా. నాకు సుమారు 7 లక్షల నష్టం వాటిల్లింది. ప్రభుత్వమే ఆదుకోవాలి. లేకపోతే ఆత్మహత్య తప్పదు.

–చింతాడ గోవర్ధన్, పోచంపల్లి



గత అనుభవాల దృష్ట్యా.. మనం ఏది తలపెట్టినా స్వప్రయోజనాలకోసమే అనుకుంటున్నార్సార్!

ఏడో వేతన సిఫారసుల అమలుకు నివేదిక

ప్రభుత్వానికి అందజేసిన ఉన్నత స్థాయి కమిటీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో పనిచేసే అధ్యాపకులకు కేంద్ర ఏడో వేతన సిఫారసులను అమలు చేసేందుకు ప్రభుత్వం నియమించిన ఉన్నత స్థాయి కమిటీ బుధవారం ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. సచివాలయంలో విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ మిశ్రాకు ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ తుమ్మల పాపిరెడ్డి, కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసరావు ఈ నివేదికను అందజేశారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న, రిటైర్ అయిన బోధన సిబ్బందికి వచ్చే ఏప్రిల్ నుంచి పెరిగిన వేతనాలను ఇవ్వాలని ఆ నివేదికలో పేర్కొన్నారు. మరోవైపు 2016 జనవరి నుంచే ఈ సిఫారసులు అమలు చేయాల్సి ఉన్నందున బకాయిలను కూడా చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఇందుకు మొత్తంగా రూ. 264 కోట్లు వెచ్చించాల్సి ఉంటుందని వెల్లడించారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం 50 శాతం నిధులను, రాష్ట్రం మిగతా 50 శాతం నిధులను వెచ్చించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

రీసెర్చ్ ఫెలోషిప్ పెంపు

సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వ సంస్థలు, ఏజెన్సీల్లో పరిశోధన, అభివృద్ధి విభాగాల్లో పరిశోధన విద్యార్థులకు జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ (జేఆర్ఎఫ్), సీనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ (ఎస్ఆర్ఎఫ్) కింద ప్రతి నెల ఇచ్చే మొత్తాన్ని సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ పెంచింది. ఇప్పటివరకు జేఆర్ఎఫ్ కింద ఒక్కో విద్యార్థికి నెలకు రూ.25 వేలు ఇస్తుండగా దాన్ని రూ.31 వేలకు పెంచింది. ఎస్ఆర్ఎఫ్‌కు ప్రస్తుతం నెలకు రూ.28 వేలు ఇస్తుండగా దాన్ని రూ.35 వేలకు పెంచింది. ఈ పెంపు 2019 జనవరి 1వ తేదీ నుంచి వర్తిస్తుందని పేర్కొంది. పరిశోధన విద్యార్థులకు జేఆర్ఎఫ్ కింద రెండేళ్లు, ఎస్ఆర్ఎఫ్ కింద మూడేళ్ల పాటు ప్రతి నెలా ఈ మొత్తాన్ని చెల్లించనుంది.

బీఎస్ఎన్ఎల్ ఫ్యాన్సీ నంబర్ల ఈ-వేలం

సాక్షి, హైదరాబాద్: బీఎస్ఎన్ఎల్ ఫ్యాన్సీ నంబర్ల ఈ–వేలం ఈనెల 30 నుంచి ఫిబ్రవరి 3 వరకు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ టెలికాం సర్కిల్ సీజీఎం వి.సుందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్యాన్సీ నంబర్లు వెబ్‌సైట్ http:// eauction. bsnl. co. in లో అందుబాటులో ఉన్నాయని, ఆసక్తి గల వినియోగదారులు ఫ్యాన్సీ మొబైల్ నంబర్ల కోసం ఈ–వేలంలో పాల్గొనవచ్చని ఆయన పేర్కొన్నారు.

ఎయిర్‌పోర్టులో 2కిలోల బంగారం పట్టివేత

శంషాబాద్: విమానంలో సీటు కింద దాచిన రెండు కిలోల బంగారాన్ని డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఉదయం దుబాయి నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి వచ్చిన ఎయిర్ ఇండియా విమానంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. అధికారులు తనిఖీలు చేపడుతున్న సమాచారంతో బంగారాన్ని తరలిస్తున్న వ్యక్తి దాన్ని సీటు కిందే వదిలిపెట్టి వెళ్లిపోయాడు. బంగారం విలువ సుమారు రూ.60 లక్షలు ఉంటుందని అధికారులు నిర్ధారించారు. ప్రయాణికుడి వివరాలను అధికారులు ఆరాతీస్తున్నారు.

ఎలైట్ బార్లపై పిల్ కొట్టివేత

ప్రభుత్వ ఉత్తర్వుల్లో జోక్యానికి నిరాకరణ

సాక్షి, హైదరాబాద్: ఎక్కువ డబ్బు చెల్లించి, విలాసవంతమైన సౌకర్యాలు పొందాలనుకునే వారి కోసం ‘ఎలైట్ బార్ల’ ఏర్పాటు చేసుకునేందుకు అనుమతినిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంలో జోక్యానికి హైకోర్టు నిరాకరించింది. ఇది ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమని స్పష్టం చేసింది. ఎక్కువ డబ్బు చెల్లించే అవకాశం ఉన్న వారే ఆ బార్లకు వెళ్తారని, దాని వల్ల మిగిలిన వారికి వచ్చిన నష్టం ఏమీ లేదని హైకోర్టు తేల్చి చెప్పింది. వాణిజ్య పరమైన బార్లకు అనుమతినిచ్చే విషయంలో ప్రజా ప్రయోజనాలు ఏ విధంగా దెబ్బతింటాయని ప్రశ్నిస్తూ, ఎలైట్ బార్లపై దాఖలైన వ్యాజ్యాన్ని కొట్టేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ తొట్టతిల్ బి.రాధాకృష్ణన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డిలతో కూడిన ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎలైట్ బార్లకు అనుమతినిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ వరంగల్ జిల్లాకు చెందిన ఆర్.శ్రీహరి హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు.

ఎన్నికల ఫలితాలపై అనుమానాలున్నాయ్

మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై ఉన్న అనుమానాలను ఎన్నికల సంఘం నివృత్తి చేయాలని, దానికి రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలని మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్ డిమాండ్ చేశారు. రెండు రోజులక్రితం లగడపాటి ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణతో కలసి అమరావతిలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబును కలసిన అనంతరం బుధవారం ఢిల్లీ వచ్చి మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ఎన్నికల ఫలితాలపై అనేక అనుమానాలు ఉన్నాయని, ఎన్నికల అనంతరం ఓట్ల శాతాన్ని లెక్కించేందుకు ఎన్నికల సంఘానికి రెండు రోజుల సమయం ఎందుకు పట్టింది?, ఈవీఎంలలో, వీవీప్యాట్‌లలో ఓట్ల తేడాలు ఎందుకొచ్చాయన్న అనుమానాలు నివృత్తి చేయాలన్నారు. ఒకవైపు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తరువాత జరిగిన పంచాయతీ ఎన్నికల్లో పూర్తిగా తుడిచిపెట్టుకుపోవాల్సిన ప్రతిపక్ష పార్టీ పుంజుకోవడం లాంటి పరిణామాలు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై అనుమానాలు రేకెత్తిస్తున్నాయని చెప్పారు. ఈ అనుమానాలన్నింటినీ నివృత్తి చేస్తే తన సర్వే ఫలితాలు తప్పని క్షమాపణలు చెబుతానని ఆయన అన్నారు.



బుధవారం మహాత్మాగాంధీ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి, మండలి చైర్మన్ స్వామిగౌడ్, ఎంపీ దత్తాత్రేయ, హోంమంత్రి మహమూద్‌అలీ, హైదరాబాద్ మేయర్ బొంతు రామ్మోహన్, ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి, సీఎస్ ఎస్.కె.జోషి తదితరులు

జాతిపితకు ఘన నివాళి

బాపూ ఘాట్‌లో గాంధీకి ప్రముఖుల నివాళి

హైదరాబాద్: జాతిపిత మహాత్మా గాంధీకి ప్రముఖులు ఘనంగా నివాళులర్పించారు. లంగర్‌హౌస్ త్రివేణి సంగం వద్ద బుధవారం బాపూ ఘాట్‌లో జరిగిన గాంధీ వర్ధంతి కార్యక్రమంలో స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో పలువురు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బాపూ ధ్యాన మందిరంలో నిర్వహించిన సర్వమత ప్రార్థనల్లో పాల్గొన్నారు. గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు.

సామూహిక శ్రద్ధాంజలి....

గాంధీ వర్ధంతి సందర్భంగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు సామూహిక శ్రద్ధాంజలి ఘటించారు. బాపూఘాట్ గాంధీ విగ్రహం వద్దకు పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు ఉదయం 10 గంటల 50 నిమిషాలకు చేరుకున్నారు. అనంతరం పోలీసుల ఆదేశాలతో 11 గంటలకు ప్రజలు వాహనాలను ఎక్కిడికక్కడ నిలిపి రెండు నిమిషాల పాటు మౌనం పాటించి సామూహిక శ్రద్ధాంజలి ఘటించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా బాపూ ఘాట్, ధ్యానమందిరం, బాపూ సమాధిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. నివాళులు అర్పించిన వారిలో స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, మండలి చైర్మన్ స్వామిగౌడ్, హోంమంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్యేలు శ్రీనివాస్ గౌడ్, కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, ఎంపీ దత్తాత్రేయ, పొంగులేటి సుధాకర్, మర్రి శశిధర్ రెడ్డి, నిరంజన్, చాడ వెంకట రెడ్డి, ఎస్కే జోషి తదితరులు ఉన్నారు.

స్లిప్పుల లెక్కింపునకు ఆదేశాలివ్వండి

- హైకోర్టును ఆశ్రయించిన పద్మావతిరెడ్డి, అద్దంకి దయాకర్
- 45 రోజుల్లో ఆ స్లిప్పులపై వివరాలు తుడిచిపెట్టుకుపోతాయి
- కోర్టుకు నివేదించిన పిటిషనర్ల న్యాయవాదులు
- అలా ఏం కాదు.. ఐదేళ్ల వరకు వివరాలుంటాయి
- కేంద్ర ఎన్నికల సంఘం న్యాయవాది
- పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలన్న ధర్మాసనం



సాక్షి, హైదరాబాద్: ఇటీవల తమ నియోజకవర్గాల పరిధిలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి వీవీ ప్యాట్ స్లిప్పులను లెక్కించేలా కేంద్ర ఎన్నికల సంఘాన్ని (ఈసీ) ఆదేశించాలని కోరుతూ కాంగ్రెస్ నేతలు ఎన్.పద్మావతిరెడ్డి, అద్దంకి దయాకర్, బీఎస్పీ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి దాఖలు చేసిన వ్యాజ్యాలపై హైకోర్టు స్పందించింది. ఈ మొత్తం వ్యవహారానికి సంబంధించి పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఈసీని ఆదేశించింది. ఫిబ్రవరి 7 లోపు కౌంటర్ దాఖలు చేయాలని ఈసీకి స్పష్టం చేసిన హైకోర్టు.. ఈ కౌంటర్‌కు 14వ తేదీ లోపు తిరుగు సమాధానం ఇస్తూ అఫిడవిట్ దాఖలు చేయాలని పిటిషనర్లను ఆదేశించింది. ఫిబ్రవరి 14న తదుపరి విచారణ చేపడతామంది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ తొట్టతిల్ బి.రాధాకృష్ణన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డిలతో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈవీఎంల ద్వారా తమకు వచ్చిన ఓట్లకు, వీవీ ప్యాట్‌లలో నమోదైన ఓట్లకు తేడా ఉందని, అందువల్ల వీవీ ప్యాట్‌లలో వచ్చిన ఓట్లను లెక్కించేలా కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరుతూ కోదాడ కాంగ్రెస్ అభ్యర్థి పద్మావతిరెడ్డి, తుంగతుర్తి కాంగ్రెస్ అభ్యర్థి అద్దంకి దయాకర్‌లు హైకోర్టులో తాజాగా పిటిషన్లు దాఖలు చేశారు. ఇదే అంశంపై బీఎస్పీ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి గతంలోనే పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలన్నింటిపై సీజే నేతృత్వంలోని ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది.

వీవీ ప్యాట్‌లను లెక్కించాల్సి ఉన్నా ఆ పని చేయలేదు..

పిటిషనర్ల తరఫున తూమ్ శ్రీనివాస్ తదితరులు వాదనలు వినిపిస్తూ.. తుంగతుర్తి నియోజకవర్గంలో 18 ఈవీఎంలు సరిగ్గా పనిచేయలేదని, అందువల్ల వీవీ ప్యాట్‌ల ఓట్లను లెక్కించాల్సిన అవసరం ఉందన్నారు. ఓటు వేసిన ఫలితం ఈవీఎంలపై కనిపించనప్పుడు, నిబంధనల ప్రకారం ఆ ఈవీఎంలను పక్కన పెట్టేయాల్సి ఉంటుందని తెలిపారు. అన్ని ఈవీఎంల ఓట్ల లెక్కింపు పూర్తయిన తరువాత, ఈ పని చేయని ఈవీఎంలకు సంబంధించిన వీవీ ప్యాట్‌లను లెక్కించాల్సి ఉంటుందని, అయితే తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలో అలా జరగలేదన్నారు. ఇది ఎన్నికల నిబంధనలకు విరుద్ధమని తెలిపారు.

45 రోజుల్లో తుడిచిపెట్టుకుపోతాయి..

కోదాడ నియోజకవర్గంలో పలు పోలింగ్ కేంద్రాల్లో పిటిషనర్లకు తెలియకుండా యూనిట్లను మార్చేశారని వివరించారు. ఈవీఎం ఓట్లకు, వీవీ ప్యాట్‌లకు మధ్య ఉన్న తేడాల విషయంలో ఎన్నికల సంఘం సరిగా స్పందించలేదన్నారు. లోపాలున్న చోట వీవీ ప్యాట్‌లను పరిశీలించాల్సి ఉన్నా, ఎన్నికల అధికారులు ఆ పని చేయలేదని వివరించారు. దీని వల్ల వీవీ ప్యాట్‌లను తీసుకొచ్చిన లక్ష్యం నెరవేరడం లేదన్నారు. వీవీ ప్యాట్ స్లిప్పులు థర్మల్ పేపర్‌పై ముద్రితమవుతాయని, నిపుణులు చెప్పే దానిని బట్టి వీటిపై ముద్రితమైన వివరాలు 45 రోజుల్లో తుడిచిపెట్టుకుపోతాయన్నారు. వీవీ ప్యాట్‌ల ద్వారా థర్మల్ పేపర్‌పై ముద్రితమైన వివరాలు తుడిచిపెట్టుకుపోతే తాము ఈ వ్యాజ్యాలు దాఖలు చేసి ఎటువంటి ప్రయోజనం ఉండదని కోర్టుకు నివేదించారు.

ఐదేళ్ల వరకు ఉంటాయి..

పిటిషనర్ల వాదనలను ఎన్నికల సంఘం తరఫు న్యాయవాది అవినాశ్ దేశాయ్ తోసిపుచ్చారు. థర్మల్ ప్రింట్ ఐదేళ్ల వరకు ఉంటుందన్నారు. వీవీ ప్యాట్‌లను భద్రం చేశామని చెప్పారు. ఎన్నికల ఫలితాలపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే, వాటిపై ఎన్నికల పిటిషన్లు దాఖలు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఇలా దాఖలు చేసే రిట్ పిటిషన్‌లపై న్యాయస్థానాలు జోక్యం చేసుకోరాదని తెలిపారు. వాదనలు విన్న ధర్మాసనం.. ఈ వివరాలన్నింటితో కౌంటర్ దాఖలు చేయాలని అవినాష్‌కు స్పష్టం చేసింది. ఫిబ్రవరి 7 లోపు కౌంటర్ దాఖలు చేయాలని ఈసీకి స్పష్టం చేసిన ధర్మాసనం.. ఫిబ్రవరి 14లోపు ఆ కౌంటర్‌కు సమాధానం ఇవ్వాలని పిటిషనర్లను ఆదేశించింది.

కొత్త జోన్లతో గొప్ప చిక్కే!

- గురుకుల పోస్టుల విభజనపై అయోమయం
- జోన్లు, మల్టీ జోన్ల వారీగా విభజనపై కసరత్తు
- రాష్ట్రపతి ఉత్తర్వులు వర్తించే అంశంపై ప్రభుత్వ సలహా తీసుకోవాలని నిర్ణయం
- గురుకుల సొసైటీలకు ఒకే తరహా సర్వీసు నిబంధనలు ఉండాలని అభిప్రాయం
- పోస్టుల విభజన తేలాకే కొత్త నియామకాలు!

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లోని పోస్టుల విభజనపై అయోమయం నెలకొంది. కొత్త గురుకులాల ఏర్పాటు నేపథ్యంలో పోస్టుల భర్తీకి ప్రభుత్వం అవకాశమిస్తుండగా.. వాటిని ఎలాంటి నిబంధనలకు లోబడి నియమించాలనే అంశంపై సొసైటీల్లో గందరగోళం నెలకొంది. రాష్ట్రంలో కొత్తగా జోన్లు, మల్టీజోన్లు ఏర్పాటు చేస్తూ రాష్ట్రపతి గతేడాది గెజిట్ జారీ చేశారు. ఈనేపథ్యంలో గురుకులాల్లోని మెజారిటీపోస్టులు జోన్ల కేటగిరీకి సంబంధించినవే కావడంతో చిక్కులు మొదలయ్యాయి. రాష్ట్రపతి ఉత్తర్వులు వచ్చాక గురుకుల నియామకాల బోర్డు ఎలాంటి నోటిఫికేషన్లు విడుదల చేయలేదు. తాజాగా ప్రభుత్వం 4,322 పోస్టులు మంజూరు చేసింది. కొన్ని బోధనేతర కేటగిరీకి సంబంధించి దాదాపు 300 పోస్టుల భర్తీ పెండింగ్‌లో ఉంది. వీటి నియామకంపై సొసైటీల్లో సందిగ్ధం నెలకొంది.

పోస్టులు విభజిస్తేనే భర్తీకి ఆస్కారం..

ప్రస్తుతం గురుకుల సొసైటీల్లోని పోస్టులను విభజించాలి. జోన్లు, మల్టీ జోన్ల పరిధిలో, జిల్లా పరిధిలో వచ్చే పోస్టులను గుర్తించాలి. ప్రస్తుతం గురుకులాల్లో పోస్టుగ్రాడ్యుయేట్ టీచర్(పీజీటీ), ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్(టీజీటీ), జూనియర్ లెక్చరర్(జేఎల్), ప్రిన్సిపల్ పోస్టులు జోనల్ పద్ధతిలోభర్తీ చేశారు. ఇదివరకు రాష్ట్రంలో రెండు జోన్లు మాత్రమే ఉండటంతో ఆమేరకే నియామకాలు చేపట్టారు. గతేడాది అక్టోబర్ నుంచి కొత్త జోన్లు అమల్లోకి వచ్చాయి. రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం రాష్ట్రంలో 7జోన్లు, 2మల్టీజోన్లు ఏర్పాటయ్యాయి. ఈనేపథ్యంలో ప్రభుత్వం మంజూరు చేసిన పోస్టులను జోన్ల వారీగా విభజించాకే నియామకాలు చేపట్టాలి. ఈనేపథ్యంలో ఇటీవల జరిగిన గురుకుల సొసైటీ కార్యదర్శుల సమావేశంలో ఈ అంశంపై చర్చించారు. రాష్ట్రపతి ఉత్తర్వులు సొసైటీలకు వర్తిస్తాయా.. లేదా.. అనే అంశంపైనా చర్చించిన కార్యదర్శులు ప్రభుత్వ సలహా తీసుకోవాలని నిర్ణయించారు. ప్రభుత్వం చేసిన సూచనల ఆధారంగా నియామకాలు చేపట్టాలని యోచిస్తున్నారు.

ఒకే సర్వీసు నిబంధనలు..

ఉద్యోగుల సర్వీసు నిబంధనలను సైతం ఒకే తరహాలో రూపకల్పన చేసే అంశంపై గురుకుల సొసైటీ కార్యదర్శుల సమావేశంలో చర్చ జరిగింది. ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, విద్యాశాఖ గురుకులాల్లో సొసైటీల వారీగా సర్వీసు నిబంధనలున్నాయి. వీటిలో చాలా అంశాలు ఒకే తరహాలో ఉన్నాసర్వీసులు, పదోన్నతుల్లో వేర్వేరుగా ఉన్నాయి. ఎస్సీ గురుకులాల్లో ప్రిన్సిపాల్‌పోస్టులు గ్రేడ్–1, గ్రేడ్–2గా ఉండగా.. ఎస్టీ గురుకులాల్లో ప్రిన్సిపాల్ పోస్టుల్లో కేటగిరీలు లేవు. జూనియర్ కాలేజీల్లోజూనియర్ లెక్చరర్ నుంచి నేరుగా ప్రిన్సిపాల్ పదోన్నతి ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో అన్ని గురుకుల సొసైటీలకు ఒకే తరహా నిబంధనలు చేస్తే బాగుంటుందనే అభిప్రాయం కార్యదర్శుల సమావేశంలో వ్యక్తమైంది. ఈ అంశాన్ని కూడా ప్రభుత్వానికి నివేదించాలని నిర్ణయించారు. మరోమారు బోర్డు కార్యదర్శుల సమావేశంలో చర్చించాక తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు ఓసీనియర్ అధికారి అన్నారు.

ట్యాంపరింగ్ అసాధ్యం

- సీఈఓ రజత్‌కుమార్ వెల్లడి
- ఎన్నికల ప్రక్రియపై రేడియో జాకీలకు అవగాహన కార్యక్రమం



హైదరాబాద్: ఈవీఎంలను ట్యాంపరింగ్ చేసేందుకు అవకాశం లేదని, అది అసాధ్యమని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) రజత్‌కుమార్ స్పష్టం చేశారు. ఈవీఎంలను ట్యాంపరింగ్ చేయవచ్చనే ఆరోపణలను ఆయన కొట్టిపారేశారు. సాంకేతికంగా ఎంతో కట్టుదిట్టమైన భద్రతతో ఈవీఎంలను రూపొందించారని చెప్పారు. అణుబాంబు వేసినా ఈవీఎంలు భద్రంగా ఉంటాయని తెలిపారు. దీనిపై ఎవరు మాట్లాడినా అది అవాస్తవమేనని.. వాటి పనితీరును ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. బుధవారం హోటల్ టూరిజం ప్లాజాలో ఎన్నికల ప్రక్రియ విధానంపై ‘రేడియో జాకీలకు’అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రజత్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రజలు రేడియో కార్యక్రమాలను ఆదరిస్తున్నారని, అందువలన రేడియో జాకీలుగా విధులు నిర్వహిస్తున్నవారు ఓటర్లను చైతన్యపరిచి ఓటరుగా తమ పేర్లను నమోదు చేసుకుని, ఓటుహక్కును వినియోగించుకునేలా చూడాలన్నారు. ముఖ్యంగా ప్రతి ఒక్కరూ ఓటరుగా ఎలా నమోదు కావాలి.. ఓటరు జాబితాలో పేర్లు, చిరునామాల్లో తప్పులు ఉంటే వాటిని ఎలా సరిచేసుకోవాలి వంటి పలు అంశాలపై ఓటర్లకు అవగాహన కల్పించాలని కోరారు.

అర్బన్‌లో పోలింగ్ తక్కువ..

హైదరాబాద్‌లో పోలింగ్ శాతం తగ్గిందని, దానిని పెంచేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు రజత్ కుమార్ చెప్పారు. నక్సలైట్ల ప్రభావం అధికంగా ఉన్న ఛత్తీస్‌గఢ్‌లో 76 శాతం పోలింగ్ నమోదు అయిందని, తెలంగాణలో మాత్రం 73.4 శాతమే నమోదు అయిందన్నారు. అర్బన్ ప్రాంతాల్లోనూ పోలింగ్ శాతం పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవడం తమ బాధ్యతగా భావించాలన్నారు. అనంతరం జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ ముషారఫ్ ఈవీఎంలు, వీవీప్యాట్‌ల పనితీరును రేడియో జాకీలకు వివరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సీఈఓలు అమ్రపాలి, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకు..కలిసొచ్చిన ‘సంక్రాంతి’

- పెరిగిన ఆదాయం... ఆన్‌లైన్, యాప్ టికెట్లలో మెరుగుదల
- టికెట్‌లేని ప్రయాణాలు గణనీయంగా తగ్గుదల
- రైళ్ల పర్యవేక్షణకు ప్రత్యేక బృందం

సాక్షి, హైదరాబాద్: ఈసారి దక్షిణ మధ్య రైల్వేకు ‘సంక్రాంతి’ కలిసొచ్చింది.రవాణా పరంగా ఆదాయం సమకూర్చింది.ఈ సెలవుల్లో రద్దీకి అనుగుణంగా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాలకు పలు ప్రత్యేక రైళ్లను దక్షిణమధ్య రైల్వే నడిపింది. హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల నుంచి జనవరి 5 నుంచి 25వ తేదీ వరకు 203 ప్రత్యేక రైళ్లు నడిచాయి. ఇందులో సువిధ, జనసాధారణ్ రైళ్లు కూడా ఉన్నాయి.వీటిని విజయవాడ, రాజమండ్రి, కాకినాడ, విశాఖపట్నం, విజయనగరం, తిరుపతి మార్గాల్లోనే నడిపారు. ప్రత్యేక రైళ్లలో కేవలం 50 శాతం అదనంగా చార్జీలు వసూలు చేయగా, 60 జనసాధారణ రైళ్లలో మామూలు చార్జీలే వసూలు చేశారు. ప్రత్యేక రైళ్ల నిర్వహణ వాటి ప్రచారానికి రైల్వే అధికారులు ఏర్పాటు చేసిన బృందం, తీసుకున్న చర్యలు ఈసారి సత్ఫలితాలను ఇచ్చాయి.

ఉపకరించిన యాప్‌లు..మాధ్యమాలు

ఆటోమేటిక్ టికెట్ వెండింగ్ మెషీన్ (ఏటీవీఎం), కరెన్సీ ఆపరేటెడ్ టికెట్ వెండింగ్ మెషీన్ (సీవోటీవీఎం), జనసాధారణ్ టికెట్ బుకింగ్ సేవక్ (జేటీబీఎస్)తోపాటు యూటీఎస్ టికెట్ మొబైల్ యాప్‌ల వినియోగం పెరిగిన కారణంగా ప్రయాణికులు టికెట్లను సులువుగా తీసుకోగలిగారు.ప్రత్యేక రైళ్ల సమాచారాన్ని సోషల్ మీడియా, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ఎప్పటికపుడు చేరవేయడంలో దక్షిణ మధ్య రైల్వే సమాచార ప్రజాసంబంధాల విభాగం సఫలీకృతమైంది. ప్రత్యేక రైళ్లు, టికెట్ రహిత, ఆన్‌లైన్, యాప్‌ల ద్వారా టికెట్లు కొనుగోలు పెరగడానికి ఇది దోహదపడింది.ఈ సందర్భంగా జనవరి 11, 12, 13 తేదీల్లో జంటనగరాల్లోని వివిధ స్టేషన్ల నుంచి రూ.3.99 కోట్లు టికెట్ల రూపంలో వసూలయ్యాయి.గతేడాది ఈ మొత్తం రూ.3.08 కోట్లు ఉంది.అంటే గతేడాది కన్నా ఇది 29 శాతం అధికం. మొత్తం 4.49 లక్షల అన్‌రిజర్వుడు ప్యాసింజర్లు ప్రయాణాలు సాగించగా, గతేడాది ఈ సంఖ్య 3.79 లక్షలుగా ఉంది. పోయినేడాది కన్నా 18 శాతం పెరుగుదల నమోదైంది. అయితే ఇదే సమయంలో తెలంగాణ, రాయల సీమ జిల్లాలకు ప్రత్యేక రైళ్లను నడపక పోవడంపై విమర్శలు వచ్చాయి. రైళ్లు కొరవడి ఈ మార్గాలకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ప్రైవేటు బస్సు యాజమాన్యాల దోపిడీలో చిక్కుకున్నారు.

మా శ్రమ ఫలించింది

ఈసారి ద.మ.రైల్వేలో ప్రత్యేక రైళ్ల నిర్వహణలో మంచి ఫలితాలు వచ్చాయి. టికెట్లు లేకుండా ప్రయాణాలు సాగించే వారి సంఖ్య (40 శాతం) గణనీయంగా తగ్గింది. ఇలాంటి వారికి విధించే జరిమానాల్లోనూ 38 శాతం తగ్గుదల నమోదైంది. ప్రతిరోజూ టికెట్‌లేకుండా ప్రయాణించే వారి సంఖ్య 32 శాతానికి తగ్గింది.అధికారులు అనేక దశల్లో తీసుకున్న చర్యలే కారణం.

– సీహెచ్. రాకేశ్, సీపీఆర్వో, ద.మ.రైల్వే

మోదీ ‘మన్‌కీ బాత్’ మాటలకు అర్థాలు వేరు

- గాంధీజీని హత్య చేసిన అసహనమే నేడు బుసలు కొడుతోంది: సురవరం
- రాజ్యాంగంపై మతోన్మాదం, సామ్రాజ్యవాదుల దాడి: హరగోపాల్

సాక్షి, హైదరాబాద్: ప్రధాని నరేంద్రమోదీ ‘మన్‌కీ బాత్’లో చెప్పే మాటలు, ఆయన లోపలి మాటలు పరస్పరం భిన్నమైనవి, మోసపూరితమైనవని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి ధ్వజమెత్తారు. మగ్దూంభవన్‌లో బుధవారం నిర్వహించిన ‘లౌకికవాదాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించుకుందాం’అనే అంశంపై సదస్సులో సురవరం పాల్గొని మాట్లాడారు. తమకు అనుకూలంగా లేని వారిని దేశద్రోహులుగా, అర్బన్ నక్సలైట్లుగా బీజేపీ, సంఘ్ పరివార్ శక్తులు ముద్ర వేస్తున్నాయని విమర్శించారు. నాడు గాంధీని హత్య చేసిన అసహనమే నేడు దేశవ్యాప్తంగా బుసలు కొడుతోందన్నారు. మైనారిటీలు, దళితులతోపాటు శాస్త్రీయ ఆలోచనలు ప్రచారం చేసే మేధావులు, భావప్రకటనా స్వేచ్ఛ కోరే ప్రొఫెసర్లు, విద్యార్థి సంఘ నాయకులు దాడులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

రాజ్యాంగంపై దాడి: హరగోపాల్

అన్నిరకాల అసమానతలు దూరం చేయాలని, సంపద కేంద్రీకృతం కాకూడదని చెప్పిన రాజ్యాంగంపై ప్రస్తుతం మతోన్మాదులు, సామ్రాజ్యవాదుల దాడి జరుగుతోందని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. అన్ని మతాలు కలసి ఉండాలని చెప్పేదే సెక్యులరిజమని, అందుకు భిన్నంగా గాంధీజీ నుంచి జర్నలిస్ట్ గౌరీ లంకేశ్‌ల వరకు పరిస్థితులు హింసాత్మకంగా మారాయన్నారు. రక్షణరంగాన్ని కూడా ప్రైవేటీకరించే వారు ఇంకా దేశభక్తి గురించి ఏం మాట్లాడతారని ప్రశ్నించారు. రాజ్యాంగం, లౌకికవాదానికి ఏర్పడిన ప్రమాదం ఎదుర్కొనేందుకు పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ స్వయం ప్రతిపత్తి ఉన్న వ్యవస్థలను బలహీనపరచడం ద్వారా రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నం జరుగుతోందన్నారు. ఈ సమావేశానికి డా.సుధాకర్ అధ్యక్షత వహించగా పార్టీ నాయకులు ఈటీ నర్సింహ, ఉజ్జిని రత్నాకరరావు తదితరులు పాల్గొన్నారు.

లేటరల్ ఎంట్రీ ఇంజనీరింగ్ సీట్లు కుదింపు

- 20 శాతం నుంచి 10 శాతానికి తగ్గించిన ఏఐసీటీఈ
- 10 వేల సీట్ల వరకు తగ్గే అవకాశం
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమల్లోకి..



సాక్షి, హైదరాబాద్: పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తి చేసిన విద్యార్థులకు ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరంలో ఇప్పటివరకు కల్పిస్తున్న సీట్లను (లేటరల్ ఎంట్రీ) అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) కుదించింది. 20 శాతం ఉన్న లేటరల్ ఎంట్రీ సీట్లను 10 శాతానికే పరిమితం చేయాలని స్పష్టం చేసింది. 2019–20 విద్యా సంవత్సరం ప్రవేశాల్లో దీన్ని కచ్చితంగా అమలు చేయాలని ఇటీవల ఏఐసీటీఈ జారీ చేసిన ఇంజనీరింగ్ కాలేజీల అప్రూవల్ హ్యాండ్ బుక్‌లో ఈ విషయాన్ని స్పష్టం చేసింది. దీంతో ఈసారి డిప్లొమా విద్యార్థులకు ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరంలో లభించే ఇంజనీరింగ్ సీట్లు 10 వేలు తగ్గనున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలోని 205 ఇంజనీరింగ్ కాలేజీల్లో దాదాపు లక్ష వరకు సీట్లు ఉన్నాయి. వాటిల్లో 70 శాతం సీట్లను కన్వీనర్ కోటా ద్వారా, 30 శాతం సీట్లను మేనేజ్‌మెంట్ కోటా ద్వారా ప్రవేశాలు జరుగుతున్నాయి. వీటికి అదనంగా పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తి చేసిన విద్యార్థులు ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరంలో చేరేందుకు ఈ–సెట్‌ను నిర్వహిస్తోంది. అందులో అర్హత సాధించిన వారికి ర్యాంకును బట్టి ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో 20 శాతం (ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీల్లో 10 శాతం సీట్లు) సీట్లలో ప్రవేశాలు కల్పిస్తోంది. దాదాపు 20 వేల సీట్లు లభిస్తున్నాయి. ఏఐసీటీఈ తాజాగా జారీ చేసిన నిబంధనల ప్రకారం ఆ సీట్లు 10 వేలకే పరిమితం కానున్నాయి. డిప్లొమా విద్యార్థులకు రావాల్సిన మరో 10 వేల సీట్లకు కోత పడనుంది. 2011 వరకు రాష్ట్రంలో లేటరల్ ఎంట్రీ సీట్లు 10 శాతమే ఉండేవి. 2012లో ఏఐసీటీఈ 20 శాతానికి పెంచడంతో ప్రభుత్వం ఆ మేరకు ఉత్తర్వులు జారీ చేసి, మంజూరైన ఇన్‌టేక్‌కు అదనంగా 20 శాతం సీట్లలో డిప్లొమా పూర్తయిన విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తోంది. కాగా, విదేశీ విద్యార్థుల కోసం సృష్టించే సూపర్ న్యూమరరీ సీట్లు 5 శాతం కలుపుకుని లేటరల్ ఎంట్రీ కోటా 15 శాతానికి మించొద్దని స్పష్టం చేసింది. దానికి సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపేందుకు ఉన్నత విద్యామండలి కసరత్తు చేస్తోంది.

విద్యార్థుల సంఖ్య పెరుగుతోందనే..

బీటెక్‌లో ఒక్కో బ్రాంచి సెక్షన్‌లో 60 మంది విద్యార్థులకు అనుమతి ఉంది. ఇవి కాకుండా ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరం వచ్చే సరికి లేటరల్ ఎంట్రీ ద్వారా ఒక్కో బ్రాంచికి 12 మంది అదనంగా వస్తున్నారు. వీటికి అదనంగా జమ్మూ, కశ్మీర్ వంటి ప్రాంతాలకు చెందిన విద్యార్థులకు సీట్లిచ్చేలా ఏఐసీటీఈ ఆదేశాలు జారీ చేస్తోంది. దీని ద్వారా మరో నలుగురైదుగురు విద్యార్థులు వస్తున్నారు. వీటికి అదనంగా విదేశీ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా 10 శాతం సూపర్ న్యూమరరీ సీట్లు సృష్టించి ప్రవేశాలు కల్పించాలని ఏఐసీటీఈ స్పష్టం చేసింది. ఇందులో భాగంగా వచ్చే వారే కాకుండా లేటరల్ ఎంట్రీలో మరో 5 శాతం మంది విద్యార్థులు వచ్చే అవకాశం ఉంది. దీంతో విద్యార్థుల సంఖ్య క్లాస్ రూమ్ నిబంధనలను మించిపోతోంది. ఈ నేపథ్యంలో లేటరల్ ఎంట్రీ విద్యార్థుల సంఖ్యను కుదించినట్లు ఉన్నత విద్యా శాఖ వర్గాలు పేర్కొన్నాయి.



హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.రాధాకృష్ణన్‌కు బీసీ నోట్‌బుక్‌ను అందజేస్తున్న బీసీ కమిషన్ చైర్మన్ రాములు, సభ్యులు

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి 'బీసీనోట్'

అందజేసిన బీసీ కమిషన్ చైర్మన్ రాములు

సాక్షి, హైదరాబాద్: బీసీ కమిషన్ నివేదికలు, గ్రంథాలను ఇంగ్లిష్‌లో రూపొందించిన బీసీ నోట్‌బుక్‌ను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ తొట్టతిల్ బి.రాధాకృష్ణన్‌కు బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు, సభ్యుడు ఆంజనేయగౌడ్ అందజేశారు. బుధవారం హైకోర్టు చీఫ్ జస్టిస్ ఛాంబర్‌లో బీసీ కమిషన్ బృందం ఆయనతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల పెంపుదలకు సిఫారసు చేస్తూ ప్రభుత్వానికి గతంలో సమర్పించిన నివేదికలోని పలు అంశాలను వివరించారు. రాష్ట్రంలో ప్రస్తుతం అమలవుతున్న బీసీ రిజర్వేషన్లను కూడా సీజే దృష్టికి తీసుకెళ్లారు. బీసీ ఇంగ్లిష్ నోట్‌బుక్‌తో పాటు ఎన్కే మురళీధర్‌రావు, జస్టిస్ ఒ.చిన్నపరెడ్డి నివేదికల తెలుగు ప్రతులను కూడా సమర్పించారు. ఈసందర్భంగా బీసీ కమిషన్ బృందాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించినట్లు చైర్మన్ బీఎస్ రాములు తెలిపారు.

లోక్‌సభకు పోటీ చేస్తా

- అసెంబ్లీ ఎన్నికల అక్రమాలపై కాంగ్రెస్ పోరాడుతుంది
- టీపీసీసీ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్



సాక్షి, హైదరాబాద్: తాను వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో పోటీచేస్తానని టీపీసీసీ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్ వెల్లడించారు. అయితే, ఏ స్థానం నుంచి పోటీ చేయాలన్నది పార్టీ నిర్ణయిస్తుందని, ఎక్కడి నుంచి పోటీచేయమన్నా అందుకు సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. గాంధీభవన్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ దొడ్డిదారిన గెలిచారని విమర్శించారు. వీవీప్యాట్‌లను లెక్కించాలని తాము కోరుతున్నామని, కాలం గడిచేకొద్దీ సాక్ష్యాలు తారుమారయ్యే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో తాము వేసిన పిటిషన్‌పై వీవీ ప్యాట్‌ల వివరాలు ఐదేళ్లు ఉంటాయని ప్రభుత్వం తరఫు న్యాయవాది కోర్టులో చెప్పారని, దీనిపై వచ్చేనెల 7లోపు కౌంటర్ దాఖలు చేయాలని కోర్టు చెప్పిందని ఆయన వెల్లడించారు. తెలంగాణలో ప్రజాస్వామ్యంతో పాటు ఓట్ల కూల్చివేత కూడా జరిగిందని, ఎన్నికల్లో జరిగిన అక్రమాలపై కాంగ్రెస్ పోరాటం ఆపే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు.

వ్యవసాయాన్ని అధోగతిపాలు చేశాయి

కాంగ్రెస్, బీజేపీలపై గుత్తా సుఖేందర్‌రెడ్డి ధ్వజం



సాక్షి, హైదరాబాద్: దేశంలో వ్యవసాయాన్ని కాంగ్రెస్, బీజేపీలు అధోగతిపాలు చేశాయని తెలంగాణ రాష్ట్ర రైతు కార్పొరేషన్ చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి విమర్శించారు. ఈ దేశంలో రైతుని నాశనం చేసింది ఆ పార్టీలేనన్నారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ దక్షిణాది రాష్ట్రాల కిసాన్ సమావేశంలో వ్యవసాయాన్ని అధోగతిపాలు చేసింది కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలేనని నేతలు మాట్లాడటంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. లోక్‌సభకు ఎన్నికలు సమీపిస్తున్నందున ఇప్పుడు పార్టీలన్నీ మొసలికన్నీరు కారుస్తున్నాయని విమర్శించారు. రైతును ప్రధాన కేంద్రంగా చూస్తున్నాయని ఆరోపించారు. ఎవరు ఏనాడూ ఊహించని విధంగా సీఎం కేసీఆర్ వ్యవసాయ, ఆర్థిక విధానాలు దేశానికి దిక్సూచిలా మారాయన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మొదలుకొని వివిధ రాష్ట్రాలు ఇప్పుడు రైతుబంధు, రైతుబీమా పథకాలపై దృష్టిసారించారన్నారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. లీటరు పాలకు నాలుగు రూపాయలు ప్రోత్సాహకాన్ని అమలు చేస్తున్నామన్నారు. నాలుగున్నర ఏళ్ల పాలనలో ఎక్కడా ఎరువుల కొరత లేదనీ, నాణ్యమైన విత్తనాలు అందిస్తున్నామని ఆయన తెలిపారు. జాతీయ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రిజర్వేషన్ల సాధనకు 1న చలో ఢిల్లీ




సాక్షి, హైదరాబాద్: చట్టసభల్లో బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌తో ఫిబ్రవరి 1వ తేదీన చలో ఢిల్లీ నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య పేర్కొన్నారు. 10 శాతం జనాభా ఉన్న అగ్రకులాలకు 10 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం..బీసీలకు ఎందుకివ్వడం లేదని ప్రశ్నించారు. బీసీలకు చట్ట సభలతో పాటు విద్య, ఉద్యోగాలు, పదోన్నతుల్లో 50శాతం రిజర్వేషన్లు ఇవ్వాల్సిందేనని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వాల నిర్లక్ష్యంతో బీసీలు అన్ని రంగాల్లో తీవ్రంగా నష్టపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. పలు సంస్థలు చేపట్టిన సర్వేల్లోనూ బీసీల ఆర్థిక, సామాజిక స్థితి స్పష్టమైందన్నారు. బీసీ రిజర్వేషన్లు సాధించేవరకు పోరాటం ఆపబోమని, శుక్రవారం చేపట్టే చలో ఢిల్లీకి బీసీ యువత, విద్యార్థులు అధికసంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు.

వినియోగదారుల సలహా కేంద్రం భేష్

ఎన్‌సీడీఆర్‌సీ చైర్మన్ జస్టిస్ ఆర్.కె.అగర్వాల్

సాక్షి, హైదరాబాద్: వినియోగదారుల హక్కుల పరిరక్షణలో రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాల విభాగం (రిడ్రసల్ సెల్) కృషి ప్రశంసనీయమని జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ (ఎన్‌సీడీఆర్‌సీ) చైర్మన్ జస్టిస్ ఆర్.కె.అగర్వాల్ అన్నారు. ఈ నెల 28 నుంచి హైదరాబాద్‌లో విచారణ జరుపుతున్న అగర్వాల్, సభ్యురాలు ఎం.శిరీష బుధవారం పౌరసరఫరాల భవన్‌లోని వినియోగదారుల సలహా కేంద్రం, కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించారు. అలాగే ఈ-పాస్, ఐరిస్ ద్వారా రేషన్ సరుకులు తీసుకునే విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వినియోగదారుల ఫిర్యాదులు, వాటి పరిష్కారానికి సలహా కేంద్రం తీసుకుంటున్న చర్యలు, రోజుకు ఎన్ని ఫిర్యాదులు వస్తున్నాయి, ఏ రకమైన ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయి వంటి అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. 2018లో హెల్ప్‌లైన్‌కు 18 వేల కాల్స్ రాగా, వాటిలో 444 ఫిర్యాదులను నమోదు చేసి 396 కేసులను పరిష్కరించామని వినియోగదారుల వ్యవహారాల కార్యదర్శి అకున్ సబర్వాల్ వెల్లడించారు.

భాషా పండితులకు త్వరలో తీపి కబురు



సాక్షి, హైదరాబాద్: భాషాపండితులకు స్కూల్ అసిస్టెంట్ టీచర్లుగా పదోన్నతి కల్పించే హామీ నెరవేర్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించిందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డి తెలిపారు. భాషాపండితులు త్వరలోనే తీపి కబురు వింటారని ఆశాభావం వ్యక్తం చేశారు. బుధవారం పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ విజయ్‌కుమార్ ఈ అంశంపై చర్చించారని, తమ ప్రతిపాదనలను వెంటనే ప్రభుత్వానికి నివేదిస్తానని విజయ్‌కుమార్ హామీ ఇచ్చినట్లు పాతూరి తెలిపారు. ప్రాథమికోన్నత పాఠశాలలు, ఉన్నత పాఠశాలల్లో పనిచేసే వివిధ సబ్జెక్టుల స్కూల్ అసిస్టెంట్ టీచర్ల తరహాలోనే భాషా పండితులకు పదోన్నతి కల్పించే అంశంపై ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీకి అనుగుణంగా చర్యలు ప్రారంభించాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌ను కోరామని, ఆయన సానుకూలంగా స్పందించారని పాతూరి అన్నారు.

జిల్లాలు.. 33

కొత్తగా ములుగు, నారాయణపేట జిల్లాలు

- నెల క్రితం ముసాయిదా ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- అభ్యంతరాలకు బుధవారంతో ముగిసిన తుది గడువు
- ఒకట్రెండు రోజుల్లో రెండు జిల్లాల ఏర్పాటుపై ఉత్తర్వులు
- కొత్తగా నాలుగు మండలాల ఏర్పాటుపైనా ఆదేశాలు
- పరిశీలనలో మరో నాలుగు రెవెన్యూ డివిజన్ల ఏర్పాటు
- మారనున్న తెలంగాణ రాష్ట్ర భౌగోళిక రూపం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ భౌగోళిక స్వరూపం మళ్లీ మారుతోంది. మరో రెండు కొత్త జిల్లాలు ఏర్పాటుకానున్నాయి. ములుగు, నారాయణపేట జిల్లాల ఏర్పాటు ప్రక్రియ ముగింపు దశకు చేరింది. ఈ రెండు జిల్లాల ఏర్పాటుపై నెల రోజులుగా అభ్యంతరాలు, సలహాలు, సూచనలను స్వీకరించే ప్రక్రియ జరిగింది. బుధవారంతో ఇది ముగిసింది. ప్రాథమిక నోటిఫికేషన్‌లో ఎలాంటి మార్పులు లేకుండానే ములుగు, నారాయణపేట జిల్లాల ఏర్పాటు పూర్తి కానుంది. ఒకట్రెండు రోజుల్లోనే రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేయనుంది. అనంతరం ఈ రెండు జిల్లాలు మనుగడలోకి వస్తాయి. దీంతో రాష్ట్రంలో జిల్లాల సంఖ్య 33కు పెరగనుంది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం జిల్లాల పునర్విభజన మొదలైంది. 2016, అక్టోబర్ 11న కొత్తగా 21 జిల్లాలు ఏర్పాటయ్యాయి. తాజాగా రెండు జిల్లాలు ఏర్పాటవుతున్నాయి. ములుగు, నారాయణపేట జిల్లాల ఏర్పాటుపై డిసెంబర్ 31న రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేయాలని రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారీ భూపాలపల్లి, మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ప్రాథమిక నోటిఫికేషన్‌పై 30 రోజుల పాటు అభ్యంతరాలు, సలహాలు, సూచనలను స్వీకరించాలని సూచించారు. ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా కలెక్టర్లు ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేశారు. నోటిఫికేషన్‌పై అభ్యంతరాలు, సూచనలు ఇచ్చే గడువు పూర్తయ్యింది. ప్రభుత్వ ప్రతిపాదనలపై ఎలాంటి అభ్యంతరాలు రానట్లు తెలుస్తోంది. దీంతో కొత్తగా రెండు జిల్లాల ఏర్పాటుపై ఉత్తర్వులు జారీ కానున్నాయి.

మరో నాలుగు మండలాలు...

రెండు కొత్త జిల్లాలతోపాటు నాలుగు మండలాలను ఏర్పాటు చేస్తూ నెల క్రితం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నిజామాబాద్ జిల్లాలో చందూరు, మోస్రా, మేడ్చల్ జిల్లాలో మూడుచింతలపల్లి, సిద్దిపేట జిల్లాలో నారాయణరావుపేట మండలాలను కొత్తగా ఏర్పాటు చేసింది. అలాగే ప్రస్తుతం జనగామ జిల్లాలో ఉన్న గుండాల మండలాన్ని యాదాద్రి భువనగిరి జిల్లాలో కలిపేలా ఉత్తర్వులు జారీ చేసింది. వీటిపైనా ప్రభుత్వం తుది ఉత్తర్వులు జారీ చేయనుంది. ప్రస్తుతం రాష్ట్రంలో 585 మండలాలు ఉన్నాయి. జిల్లాల పునర్విభజన సమయంలో ప్రభుత్వం కొత్తగా 125 మండలాలను ఏర్పాటు చేసింది. కొత్తగా ఏర్పాటయ్యే నాలుగింటితో రాష్ట్రంలోని మొత్తం మండలాల సంఖ్య 589కి పెరగనుంది. అలాగే రాష్ట్రంలో మొదట 38 రెవెన్యూ డివిజన్లు ఉండేవి. జిల్లాల పునర్విభజన సమయంలో వీటి సంఖ్య 69కి పెరిగింది. కొత్తగా కోరుట్ల, జోగిపేట, కొల్లాపూర్, ఖానాపూర్ రెవెన్యూ డివిజన్ల ఏర్పాటు ప్రతిపాదనలను ప్రభుత్వం పరిశీలిస్తోంది.

- **ములుగు జిల్లా:** ములుగు, వెంకటాపూర్, గోవిందరావుపేట, తాడ్వాయి, ఏటూరునాగారం, కన్నాయిగూడెం, మంగపేట, వెంకటాపురం(కె), వాజేడు మండలాలు. ప్రస్తుతం ఇవి జయశంకర్ భూపాలపల్లి జిల్లా పరిధిలో ఉన్నాయి.
- **నారాయణపేట జిల్లా:** దామరగిద్ద, ధన్వాడ, కోస్గి, కృష్ణ, మద్దూరు, మాగనూరు, మక్తల్, మరికల్, నారాయణపేట, నర్వ, ఊట్కూరు, కోయిల్‌కొండ మండలాలు. ప్రస్తుతం మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో ఉన్నాయి.

కలప అమ్మకాలపై సెస్

- ప్రత్యేక పన్నుపై సర్కారు సమాలోచనలు
- వ్యవసాయ ఉత్పత్తులపై మార్కెట్ ఫీజు తరహాలో..
- దీన్ని హరితహారం కోసం వినియోగించాలని యోచన
- కోట్లలో టర్నోవర్ జరుగుతున్నా.. ఆదాయం అంతంతే
- దీంతో అటవీ నిబంధనలను కఠినతరం చేయనున్న ప్రభుత్వం



టింబర్‌డిపోల్లో కలప

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: అటవీ సంపద తరుగుతున్నా సర్కారు ఖజానాకు పెద్దగా ఒరుగుతున్నదేమీ లేదని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. అందుకోసం ఇకపై కలప క్రయవిక్రయాలపై ప్రత్యేక పన్ను విధించాలని యోచిస్తోంది. విలువైన అటవీ సంపద కారణంగా టింబర్ డిపోలు, సామిల్లుల్లో కోట్ల రూపాయల్లో టర్నోవర్ జరుగుతోంది. అయినా.. దీని వల్ల రాష్ట్ర సర్కారు ఖజానాకు పెద్దగా ఒరిగిందేమీ ఉండటం లేదు. మరోవైపు, విలువైన టేకు వనాలు క్రమంగా మైదానాలుగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో అటవీ విస్తీర్ణాన్ని 35%కు పెంచాలనే లక్ష్యంతో.. హరితహారం కార్యక్రమానికి ప్రభుత్వం ఏటా వందల కోట్ల రూపాయలు వెచ్చిస్తోంది. ఇకపై.. కలప విక్రయాలపై విధించనున్న పన్ను మొత్తాన్ని.. హరితహారం కార్యక్రమానికి వినియోగించాలని యోచిస్తోంది. ఈ విషయాన్ని అటవీశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో అటవీ చట్టంలో మార్పులు చేర్పులు చేయాలని యోచిస్తోంది. 'జంగిల్ బచావో.. జంగిల్ బడావో'అనే నినాదంతో అటవీరక్షణపై పకడ్బందీ చర్యలకు శ్రీకారం చుట్టింది. కలప స్మగ్లింగ్‌పై ఉక్కుపాదం మోపాలని నిర్ణయించింది. కలప అక్రమ రవాణాను చూసీచూడనట్లు వ్యవహరించిన అటవీశాఖ ఉన్నతాధికారులపై కూడా కఠినంగా వ్యవహరిస్తోంది. ఇందులో భాగంగా అటవీ నిబంధనలను కఠినతరం చేయాలని నిర్ణయించారు. ఈ మార్పుల్లో భాగంగా ఫారెస్టు పన్నును కూడా విధించేలా నిబంధనలను మార్చాలని భావిస్తోంది.

మార్కెట్ ఫీజు మాదిరిగా...

ఆయా వ్యవసాయ ఉత్పత్తులపై ప్రస్తుతం జీఎస్టీతో పాటు, 1% మార్కెట్ ఫీజు వసూలు చేస్తున్నారు. మార్కెట్ యార్డుల్లోనే కాకుండా, ఆ మార్కెట్ కమిటీ పరిధిలో ఎక్కడ క్రయవిక్రయాలు జరిగినా 1% మార్కెట్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. అలాగే టేకు కలపపై ప్రస్తుతం 18% జీఎస్టీ అమల్లో ఉంది. ఇందులో 9% ఎస్జీఎస్టీ, 9%సీజీఎస్టీ. ఈ పన్నులో 50% రాష్ట్ర వాటా ఉన్నప్పటికీ, అదనంగా కొంత పన్ను విధించడం ద్వారా హరితహారం వంటి అటవీ అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణకు మరింత ప్రోత్సాహం ఉంటుందని సర్కారు భావిస్తోంది. ప్రస్తుతం టింబర్ డిపోలు, సామిల్లులపై సరైన నిఘా కొరవడటంతో.. కలపపై ఆదాయం ప్రభుత్వానికి వచ్చే నామమాత్రంగానే ఉంటోంది. వాణిజ్యపన్నుల శాఖ పరిధిలో ఉండే ఈ సామిల్లులు, టింబర్ డిపోలు ఎంత చెల్లిస్తే అంతే అన్న ధోరణిలో అధికారులు వ్యవహరిస్తున్నారు. దీంతో రూ.కోట్ల విలువైన అటవీసంపద తరిగిపోతున్నా.. సర్కారు ఖజానాకు పెద్దగా ఒరిగిందేమీ లేకుండా పోతోంది.

ఇతర దేశాల నుంచి కలప దిగుమతి

నిజామాబాద్ జిల్లాలో దాదాపు 105 టింబర్ డిపోలు, సామిల్లులు ఉన్నాయి. వీటిలో స్మగ్లింగ్ కలపతోనే ఏటా కోట్ల రూపాయల దందా చేసేవే ఎక్కువ. కొన్ని సామిల్లులకు మహారాష్ట్రలోని యావత్‌మాల్, కిన్వట్, పాండ్రకవుడా అటవీశాఖ డిపోల నుంచి.. మధ్యప్రదేశ్ (లక్కడ్ గంజ్), గుజరాత్ (గాంధీధామ్) వంటి రాష్ట్రాల నుంచి కూడా కలప దిగుమతి అవుతోంది. మయన్మార్, చైనా తదితర దేశాల నుంచి కూడా రాష్ట్రానికి కలప దిగుమతి చేసుకుంటున్నారు. అలాగే ఘనా వంటి ఆఫ్రికా దేశాల నుంచి కూడా కలప వస్తోంది. బాంబే షిప్‌యార్డుల నుంచి ఇక్కడికి తరలించి స్థానిక అవసరాలకు కలపను వినియోగిస్తున్నారు. ఈ క్రమంలో వందల కోట్ల రూపాయల టర్నోవర్ జరుగుతోంది. కానీ జీఎస్టీ రూపంలో ప్రభుత్వ ఖజానాకు చేరుతున్నది నామమాత్రమే. దీంతో మార్కెట్ ఫీజు మాదిరిగా కొంత మొత్తాన్ని ప్రత్యేక పన్నుగా విధించాలని ప్రభుత్వం యోచిస్తోంది.

'వ్యవసాయ' శాఖలన్నీ ఒకే గొడుగు కిందకు

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె.జోషి వెల్లడి ● పాడికి పంటకు కలిపి రుణాలివ్వాలన్న పార్థసారథి

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ శాఖల పునర్వ్యవస్థీకరణలో భాగంగా వ్యవసాయ, అనుబంధ రంగాల శాఖలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చే ఆలోచనలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఉన్నారని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె.జోషి వెల్లడించారు. జాతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంకు (నాబార్డు) రూపొందించిన 2019–20 తెలంగాణ రాష్ట్ర రుణ విధాన పత్రాన్ని బుధవారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఒకే రంగానికి చెందిన శాఖలు వేరువేరుగా కాకుండా ఒకే విభాగం కిందకు వచ్చే విధంగా కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు. రైతుల ఆదాయం రెట్టింపు చేయడం అంత సులువు కాదని, అందుకు తగిన విధంగా చర్యలు తీసుకుంటేనే అది సాధ్యపడుతుందన్నారు. ఆ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఉపకరిస్తున్నాయన్నారు. కాకపోతే దేశవ్యాప్తంగా సగటున 3 శాతమే వ్యవసాయ వృద్ధి రేటు ఉంటుందని, ఇది ఇలాగే కొనసాగితే 20 ఏళ్లు అయినా కూడా రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయలేమన్నారు. వ్యవసాయ యాంత్రీకరణలో కూడా భారీ మార్పులు రావాల్సి ఉందని జోషి అభిప్రాయపడ్డారు. చిన్న కమతాలు ఉన్నవారందరూ కూడా యంత్రాలు కొనుగోలు చేయడం కాకుండా ఓలా, ఉబర్ తరహా అద్దెకు యంత్రాలు లభించేలా మార్పులు రావాలన్నారు. నిర్వహణ వ్యయం తగ్గిస్తే రైతుకు చాలావరకు ఉపశమనం కలుగుతుందని, రైతుబంధు పథకంతో రాష్ట్ర వ్యవసాయ రంగంలో చాలా మార్పు వచ్చిందన్నారు. జిల్లా స్థాయిలో జరిగే డీసీసీ భేటీలు పకడ్బందీగా జరగడం లేదన్నారు. ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు మాట్లాడుతూ, అనుబంధ రంగాలపై నాబార్డు దృష్టి సారించాలన్నారు. పెద్దఎత్తున సబ్సిడీలు ఇస్తున్నప్పటికీ, అవి వాటి ఉద్దేశ్యాన్ని నెరవేర్చడం లేదని వ్యాఖ్యానించారు. వరి, గోధుమలే పంటలు కాదని, పప్పు, చిరుధాన్యాలు, కూరగాయల సాగుపై రైతులు దృష్టి సారించేలా ప్రోత్సహించాలన్నారు.

సేంద్రియ సాగుకు పంట రుణాలివ్వాలి

సేంద్రియ పంటలకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ కల్పించి, రుణాలు అందేలా చూడాలని వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి సి.పార్థసారథి బ్యాంకర్లకు విజ్ఞప్తి చేశారు. దీనిపై త్వరలోనే ఒక నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. అలాగే పాడికీ, పంటలకు కలిపి ఒకే రుణం కింద ఎందుకు ఇవ్వరాదని, ఈ విషయంపై బ్యాంకులు ఆలోచన చేయాలని సూచించారు. వ్యవసాయ రుణాల విషయంలో బ్యాంకులు నిర్లక్ష్యంగా ఉంటున్నాయన్నారు. ఎప్పుడు సమావేశం నిర్వహించినా మూడు నెలల కిందటి రుణాల పంపిణీ సమాచారంతో వస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇంత పెద్ద బ్యాంకింగ్ వ్యవస్థలో ఐటీని వినియోగించుకోలేరా అని ప్రశ్నించారు. సగటున ఒక రైతుకు ఉండాల్సిన భూ కమతాల విస్తీర్ణం తగ్గిపోతున్నదని, ఇలాగే కొనసాగితే వ్యవసాయం కష్టమేనని పార్థసారథి ఆందోళన వ్యక్తం చేశారు. 1970లో సగటున ఒక రైతు 3 హెక్టార్ల భూమి కలిగి ఉంటే ఇప్పుడు అది ఒక హెక్టారుకు పడిపోయిందన్నారు. బ్యాంకులు వివిధ రకాల రుణాలు ఇస్తున్న క్రమంలో ఆ సొమ్ము గ్రామాల్లోకి వెళ్తుందని, అయితే అది ఏ రకంగా వినియోగం అయిందనే దానిపై నాబార్డు ఒక ర్యాండమ్ సర్వే చేయాలని సూచించారు. ఈ సమావేశంలో నాబార్డు సీజీఎం విజయ్‌కుమార్, ఆర్‌బీఐ జనరల్ మేనేజర్ సుందరం శంకర్, ఎస్‌ఎల్‌బీసీ జనరల్ మేనేజర్ రమేశ్, ఆంధ్రాబ్యాంకు ఈడీ ఎ.కె.రథ్, తదితరులు పాల్గొన్నారు.



881 / 1000

వెయ్యి మందికి 881 మంది ఆడ శిశువులు

లింగ నిష్పత్తిలో జాతీయ సగటు కంటే తెలంగాణలో మెరుగు

- దేశవ్యాప్తంగా వెయ్యి మంది మగ శిశువులకు 877 మందే ఆడ శిశువులు
- పుట్టుక రిజిస్ట్రేషన్ ఆధారంగా లింగ నిష్పత్తిని అంచనా వేసిన కేంద్రం
- దేశంలో అబార్షన్లు, భ్రూణ హత్యలు పెరుగుతుండటమే కారణమా?
- కేసీఆర్ కిట్‌తో పరిస్థితి మెరుగవుతుందంటున్న వైద్యాధికారులు

2016లో లింగ నిష్పత్తిలో టాప్ 10 రాష్ట్రాలు



రాష్ట్రం	
సిక్కిం	999
ఛత్తీస్‌గఢ్	980
నాగాలాండ్	967
అరుణాచల్ ప్రదేశ్	964
మిజోరం	964
కేరళ	954
త్రిపుర	917
జమ్మూ కశ్మీర్	914
పశ్చిమ బెంగాల్	911
హిమాచల్ ప్రదేశ్	910

మగ శిశువులు / ఆడ శిశువులు

నోట్: కేంద్రపాలిత ప్రాంతాలను పరిగణలోకి తీసుకోలేదు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మగ, ఆడ శిశువుల నిష్పత్తి జాతీయ సగటు కంటే కాస్తంత మెరుగ్గా ఉంది. పుట్టుక సందర్భంగా జరిగే రిజిస్ట్రేషన్ల ఆధారంగా లింగ నిష్పత్తిని 2016లో లెక్కగట్టిన కేంద్ర ప్రభుత్వం ఆ లెక్కలను తాజాగా విడుదల చేసింది. పుడుతున్న వారిలో జాతీయ సగటులో 1,000 మంది మగ శిశువులు ఉంటే, 877 మంది ఆడ శిశువులు ఉన్నారు. కానీ తెలంగాణలో మాత్రం ఆడ శిశువులు 881 మంది పుట్టారని కేంద్రం తన నివేదికలో తెలిపింది. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ చిట్టచివరన ఉంది. ఆ రాష్ట్రంలో 1,000 మంది మగ శిశువులకు కేవలం 806 మంది ఆడ శిశువులే ఉన్నారు. రాజస్తాన్‌లోనూ 806 మంది ఆడ శిశువులే ఉన్నారు. అన్ని రాష్ట్రాల్లో కంటే ఆంధ్రప్రదేశ్, రాజస్తాన్‌లు లింగ నిష్పత్తిలో భారీ తేడాతో చివరిస్థానంలో ఉండటం గమనార్హం. అయితే తెలంగాణలో మాత్రం హెచ్చుతగ్గులు కనిపించాయి. 2015లో జాతీయ సగటు 1,000 మంది మగ శిశువులకు 881 మంది ఆడ శిశువులు పుట్టగా, తెలంగాణలో 834 మంది మాత్రమే పుట్టారు. 2016లో జాతీయ సగటు 877కు తగ్గగా, తెలంగాణలో 881కు చేరింది. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం ఈ సగటు దారుణంగా పడిపోవడం గమనార్హం. 2015లో 1,000 మంది మగ శిశువులకు 971 మంది ఆడ శిశువులు పుడితే ఇప్పుడు దారుణంగా 806కు పడిపోయింది. తమిళనాడు కూడా జాతీయ సగటు కంటే దారుణమైన పరిస్థితుల్లోనే ఉంది.

కరీంనగర్ జిల్లాలో 713 మందే..

కరీంనగర్ జిల్లాలో 2014లో 1,000 మంది మగ శిశువులకు ఏకంగా 1080 ఆడ శిశువులు ఉన్నారు. 2015లో 959 మంది ఆడ శిశువులు పుడితే, 2016లో అదికాస్తా దారుణంగా 713 మందికి పడిపోయింది. నల్లగొండ జిల్లాలో 2014లో 1,000 మంది మగ శిశువులకు 1060 మంది ఆడ శిశువులు పుడితే, 2015లో 959 మంది ఉండగా, 2016లో దారుణంగా 773కు పడిపోయింది. హైదరాబాద్, మెదక్ జిల్లాల్లో మాత్రం ఇతర జిల్లాల కంటే మెరుగైన పరిస్థితి ఉంది. ఇప్పటికీ కడుపులో ఆడపిల్ల ఉన్నట్లు గుర్తించి భ్రూణ హత్యలకు పాల్పడుతున్నారా అన్న అనుమానాలు ఉన్నాయి. ప్రధానంగా ప్రైవేటు ఆస్పత్రులు అనైతిక చర్యలకు పాల్పడుతుండటంతో అబార్షన్లు పెరుగుతున్నట్లు విశ్లేషకులు చెబుతున్నారు. అయితే తెలంగాణలో ఇప్పుడు ఆ పరిస్థితి మారుతుందని అధికారులు చెబుతున్నారు. తెలంగాణ ఏర్పడ్డాక ప్రభుత్వం చేపట్టిన అనేక కార్యక్రమాలు లింగ నిష్పత్తిలో భారీ తేడా లేకుండా చేశాయంటున్నారు. గతంలో ప్రైవేటు ఆస్పత్రుల్లోనే ప్రసవాలు అధికంగా జరిగేవి. తర్వాత ప్రభుత్వం సర్కారు దవాఖానాల్లో ప్రత్యేక వసతులు కల్పించింది. దీంతో 2015–16లోనే ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల శాతం 30 నుంచి 41 శాతానికి చేరుకున్నాయని చెబుతున్నారు. దీని వల్ల 2016 తర్వాత పరిస్థితి మెరుగుపడిందని చెబుతున్నారు.

పథకాలతో పరిస్థితిలో మార్పు..

రాష్ట్ర ప్రభుత్వం 2017 నుంచి ప్రారంభించిన కేసీఆర్ కిట్, అలాగే అప్పటికే ప్రారంభించిన కల్యాణలక్ష్మి పథకాల వల్ల ఆడ శిశువును కోల్పోవడానికి ఎవరూ సిద్ధపడటం లేదు. కల్యాణలక్ష్మి ద్వారా ఆడ బిడ్డ పుడితే పెళ్లి ఖర్చు కోసం రూ.లక్ష నూటా పదహార్లు ఇస్తున్నారు. ఇది ఆడ పిల్లల తల్లిదండ్రుల్లో ఆత్మస్థైర్యం నింపింది. ఇక కేసీఆర్ కిట్‌తోనూ శిశువులకు రక్షణ కవచం ఏర్పడింది. కేసీఆర్ కిట్ పథకం ద్వారా ప్రభుత్వం ప్రోత్సాహకం కింద మగ బిడ్డ పుడితే రూ.12 వేలు, ఆడ పిల్ల పుడితే రూ.13 వేలు ప్రోత్సాహకం ఇస్తోంది. అలాగే కేసీఆర్ కిట్ ఇస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు పెరిగాయని వైద్య ఆరోగ్యశాఖ మాజీ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి అభిప్రాయపడ్డారు. దీనివల్ల అబార్షన్లు నిలిచిపోయినట్లు అధికారులు విశ్లేషిస్తున్నారు.

జనన ధ్రువీకరణ మరింత సులభతరం...

మున్సిపాలిటీలు, గ్రామాల్లో జనన ధ్రువీకరణ ఇప్పటికీ ఒక ప్రహసనంగా మారింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో దాన్ని నమోదు చేసుకోవడం, పొందడం గగనంగా మారింది. ఇప్పుడు ప్రైవేటు ఆస్పత్రుల్లోనూ పొందే వీలు కల్పించినా అది పూర్తిస్థాయిలో అమలు కావడం లేదన్న చర్చ జరుగుతోంది. దీనివల్ల కొన్ని సందర్భాల్లో పిల్లల నమోదు పూర్తిస్థాయిలో ఉండటం లేదన్న విమర్శలున్నాయి. అందువల్ల రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. తల్లిదండ్రులే సంబంధిత వెబ్‌సైట్‌లో వివరాలను నమోదు చేయడం ద్వారా జనన ధ్రువీకరణ పొందవచ్చని అధికారులు చెబుతున్నారు. 'వెబ్‌సైట్‌లోకి వెళ్లి శిశువు వివరాలు నమోదు చేయాలి. ఆ తర్వాత దాన్ని ప్రింట్‌గా తీసుకుని ధ్రువీకరణ పత్రంగా వాడుకోవచ్చు. అయితే ఒక శిశువు పేరుతో మరొకటి తీసుకోవడానికి వెబ్‌సైట్ అంగీకరించదు'అని ఆరోగ్య కుటుంబ సంక్షేమ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసరావు 'సాక్షి'కి తెలిపారు.

ఊళ్లపై గులాబీ జెండా

- పంచాయతీ ఎన్నికల్లో టీఆర్ఎస్‌దే హవా
- 8,264 పంచాయతీల్లో అధికార పార్టీ మద్దతుదారుల విజయం
- కాంగ్రెస్‌కు 2,688.. బీజేపీకి 170.. టీడీపీకి 77 స్థానాలు
- 1,371 పంచాయతీల్లో స్వతంత్రుల పాగా



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పంచాయతీ పోరు ముగిసింది. గ్రామగ్రామాన గులాబీ జెండా ఎగిరింది. మూడు విడతలుగా జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో పల్లె ప్రజలు అధికార పార్టీకే పట్టం కట్టారు. రాష్ట్రవ్యాప్తంగా 12,730 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించగా.. వివిధ కారణాలతో 47 పంచాయతీల్లో పోలింగ్ నిలిచిపోయింది. రిజర్వేషన్ల కారణంగా 24 చోట్ల నామినేషన్లు దాఖలు కాలేదు. మరో 23 పంచాయతీల్లో ఎన్నికలు కోర్టు కేసులతో వాయిదా పడ్డాయి. ఫలితంగా 12,683 గ్రామ పంచాయతీల్లో సర్పంచ్, వార్డు సభ్య స్థానాలకు ఎన్నికలు జరిగాయి. వీటిలో 8,264 స్థానాల్లో టీఆర్ఎస్ మద్దతుదారులు విజయం సాధించారు. 2,688 చోట్ల కాంగ్రెస్ మద్దతుదారులు గెలుపొందారు. ఇక భారతీయ జనతా పార్టీ 170, తెలుగుదేశం పార్టీ 77, సీపీఐ 39, సీపీఎం 74 పంచాయతీలు కైవసం చేసుకోగా.. 1,371 పంచాయతీల్లో స్వతంత్రులు పాగా వేశారు.

మూడో విడతలో 88.03% పోలింగ్...

చివరి విడతగా బుధవారం జరిగిన ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా 88.03% పోలింగ్ నమోదైంది. మూడోవిడతలో మొత్తం 4,116 పంచాయతీలకు గాను 4,083 పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. వీటి పరిధిలో 45.23లక్షల మంది ఓటర్లుండగా.. 39.82 లక్షల మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఓట్లు వేసిన వారిలో మహిళలు 20.14 లక్షలు, పురుషులు 19.68 లక్షల మంది ఉన్నారు. యాదాద్రి–భువనగిరి జిల్లాలో అత్యధికంగా 94.99% పోలింగ్ నమోదైంది. 94.56 శాతం పోలింగ్‌తో ఖమ్మం జిల్లా రెండో స్థానంలో ఉండగా.. సూర్యాపేట (92.6%), నల్లగొండ (91.73%), మహబూబాబాద్ (91.54%), సిద్దిపేట (90.73%), మెదక్ (90.28%), సంగారెడ్డి (90.15%) వరుసగా తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. జగిత్యాల జిల్లాలో అత్యల్పంగా 77.7% పోలింగ్ జరిగింది.

మూడో విడతలో జిల్లాలవారీగా ఏ పార్టీ మద్దతుదారులకు ఎన్ని పంచాయతీలు?

జిల్లా	టీఆర్ఎస్	కాంగ్రెస్	టీడీపీ	బీజేపీ	సీపీఐ	సీపీఎం	ఇతరులు
ఆదిలాబాద్	112	31	0	1	0	0	19
కుమ్రం భీం	57	35	0	0	1	0	20
మంచిర్యాల	55	23	0	0	0	0	14
నిర్మల్	76	34	0	3	0	0	18
జగిత్యాల	85	21	0	3	0	0	18
కరీంనగర్	82	9	1	6	0	0	11
పెద్దపల్లి	38	25	0	6	0	0	12
రాజన్న	63	8	0	1	0	0	17
భద్రాద్రి	106	45	1	0	0	0	11
ఖమ్మం	114	50	2	0	5	10	11
జోగులాంబ	49	14	0	1	0	0	11
మహబూబ్‌నగర్	150	51	0	2	0	0	24
నాగర్ కర్నూల్	107	32	0	1	0	0	12
వనపర్తి	57	25	1	0	0	1	3
మెదక్	120	15	0	0	0	0	7
సంగారెడ్డి	137	55	0	0	0	0	7
సిద్దిపేట	89	16	0	0	0	0	17
నల్లగొండ	138	99	0	2	4	0	14
సూర్యాపేట	95	47	0	0	1	3	8
యాదాద్రి	88	45	0	2	2	3	7
కామారెడ్డి	112	39	0	4	0	0	14
నిజామాబాద్	152	35	4	6	0	0	12
మేడ్చల్	0	0	0	0	0	0	0
రంగారెడ్డి	82	76	0	16	0	0	24
వికారాబాద్	90	46	0	2	0	0	10
జనగామ	77	8	0	0	0	2	4
జయశంకర్	61	45	0	0	0	0	4
మహబూబాబాద్	109	33	0	2	0	0	11
వరంగల్ రూరల్	83	31	0	0	0	0	6
వరంగల్ అర్బన్	46	8	0	0	0	0	4

2న గ్రామపంచాయతీల తొలి సమావేశం

- అదే రోజున బాధ్యతలు స్వీకరించనున్న సర్పంచ్‌లు
- 11 నుంచి శిక్షణ తరగతులు
- పంచాయతీ విధులు, కొత్త పంచాయతీ చట్టంపై అవగాహన

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మూడు విడతలుగా నిర్వహించిన గ్రామపంచాయతీ ఎన్నికలు బుధవారంతో ముగిశాయి. ఈ నెల 21, 25, 30 తేదీల్లో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో (హైదరాబాద్ జిల్లా మినహా) జరిగిన పంచాయతీ ఎన్నికల్లో గెలిచిన సర్పంచ్‌లు, వార్డు మెంబర్లకు ఫిబ్రవరి 2ను అపాయింట్‌మెంట్ డేగా నిర్ణయిస్తూ పంచాయతీరాజ్ శాఖ నోటిఫికేషన్ జారీచేసింది. ఫిబ్రవరి 2న కొత్త గ్రామపంచాయతీలు కొలువుదీరనున్నాయి. అదేరోజున కొత్త గ్రామపంచాయతీల తొలి సమావేశం జరగనుంది. అప్పుడే సర్పంచ్‌లు, వార్డు సభ్యులు పదవీ స్వీకారం చేస్తారు. ఆ రోజు నుంచి పదవీ కాలం ఐదేళ్ల పాటు కొనసాగనుంది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ) నోటిఫికేషన్లకు అనుగుణంగా మూడు దశలుగా ఈ ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే. వివిధ కారణాలతో అంతకు ముందు, ఈ నెల 30న ఎన్నికలు జరగని పంచాయతీలు, ఇంకా గడువు ముగియని పంచాయతీలకు పంచాయతీరాజ్‌శాఖ విడిగా అపాయింటెడ్ డేను ప్రకటించనుంది. ఈ మేరకు పంచాయతీరాజ్‌శాఖ కమిషనర్ నీతూ కుమారి ప్రసాద్ నోటిఫికేషన్ జారీ చేశారు. స్థానిక సంస్థల ప్రతినిధులకు ముఖ్యంగా గ్రామస్థాయిల్లోని పంచాయతీ సర్పంచ్‌లకు కొత్త పంచాయతీరాజ్ చట్టంతో సహా గ్రామస్థాయిలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న హరితహారం తదితర కార్యక్రమాల గురించి సమగ్ర అవగాహన కల్పించి, క్షేత్రస్థాయిలో అభివృద్ధిలో భాగస్వాములను చేయాలన్న సీఎం కేసీఆర్ ఆదేశాల నేపథ్యంలో ఈ శిక్షణ కార్యక్రమాలకు ప్రాధాన్యత ఏర్పడింది.

11 నుంచి సర్పంచ్‌లకు శిక్షణ..

రాష్ట్రవ్యాప్తంగా గెలుపొందిన సర్పంచ్‌లకు ఫిబ్రవరి 11 నుంచి మార్చి 1 వరకు ఆయా జిల్లాల వారీగా విభజించి మూడు విడతలుగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఒక్కో విడతలో రెండు బ్యాచ్‌లుగా వంద మందికి (ఒక్కో బ్యాచ్‌కు 50 మంది చొప్పున) శిక్షణ ఇస్తారు. తొలి విడత శిక్షణను ఫిబ్రవరి 11 నుంచి 15 వరకు, రెండో విడత శిక్షణను ఫిబ్రవరి 18 నుంచి 22 వరకు, మూడో విడత శిక్షణ ఫిబ్రవరి 25 నుంచి మార్చి 1 వరకు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. సంబంధిత జిల్లా కేంద్రాల్లో శిక్షణ కార్యక్రమం ఉంటుంది. ముందుగా శిక్షకులకు శిక్షణ కోసం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఏర్పాట్లు చేసింది. ఫిబ్రవరి 1 నుంచి 5 వరకు 15 జిల్లాలకు చెందిన అధికారులకు, మిగిలిన 15 జిల్లాల అధికారులకు ఫిబ్రవరి 6 నుంచి 10 వరకు మాస్టర్ ట్రైనర్స్ శిక్షణనిస్తారు. ఒక్కో జిల్లా నుంచి పంచాయతీ చట్టాలపై అవగాహనతో పాటు, శిక్షణ కార్యక్రమాల్లో తగిన అనుభవమున్న పది మంది అధికారులకు (ఒక ఎంపీడీవో, ఒక ఈఓపీఆర్‌డీ, ఒక పంచాయతీ సెక్రటరీతో పాటు ఏడుగురు విశ్రాంత ఉద్యోగులు) శిక్షణ ఇస్తారు. రాష్ట్రీయ గ్రామీణ స్వరాజ్ అభియాన్ (ఆర్‌జీఎస్ఏ) కింద ఇండక్షన్ ట్రైనింగ్ ఇవ్వడం తప్పనిసరి కాబట్టి శిక్షణ నిర్వహించేందుకు పంచాయతీరాజ్ శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

కొత్త పంచాయతీరాజ్ చట్టంపై అవగాహన..

తాజాగా ఎన్నికైన సర్పంచ్‌లకు ప్రధానంగా రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన కొత్త పంచాయతీ రాజ్ చట్టం పట్ల అవగాహన కల్పించేందుకు ఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గ్రామపంచాయతీ కార్యాలయం నిర్వహణ, పంచాయతీ కార్యదర్శులు, ఇతర సిబ్బందితో సమన్వయం, రాష్ట్రంలో ప్రత్యేక శ్రద్ధ చూపి చేపడుతున్న హరితహారం, శానిటేషన్, మోడల్ గ్రామాలు తదితర అంశాలు ఈ శిక్షణలో భాగంగా ఉంటాయి.

‘సింథటిక్’తో సింపుల్‌గా దోచేశారు

- జీహెచ్ఎంసీలో భారీ కుంభకోణం
- నకిలీ వేలి ముద్రలతో పారిశుధ్య కార్మికుల హాజరు నమోదు
- భారీగా వేతనాలు నొక్కేసిన ఫీల్డ్ అసిస్టెంట్లు
- 84 కృత్రిమ ఫింగర్ ప్రింట్‌ల స్వాధీనం
- 9 మంది ఎస్ఎఫ్ఏలపై చర్యలు





స్వాధీనం చేసుకున్న నకిలీ వేలిముద్రలను మీడియాకు చూపెడుతున్న విశ్వజిత్ కంపాటి

సాక్షి, హైదరాబాద్: జీహెచ్ఎంసీలో భారీ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. పారిశుధ్య కార్మికుల హాజరులో శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్లు అవకతవకలకు పాల్పడుతున్నట్లు బయటపడింది. కార్మికుల బయోమెట్రిక్ హాజరులో అక్రమాలు జరిగినట్లు తేలింది. నకిలీ (సింథటిక్) వేలిముద్రలు తయారు చేసి వాటితో పారిశుధ్య కార్మికులు హాజరు కాకపోయినా హాజరు వేసి వారి వేతనాలు కాజేశారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం తనిఖీలు జరిపిన ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం చాలా కాలంగా జరుగుతున్న గుట్టును రట్టు చేసింది. ఏకంగా 84 మంది నకిలీ వేలి ముద్రలను స్వాధీనం చేసుకున్నారు.

9 మందిపై వేటు.. క్రిమినల్ కేసులు..

జీహెచ్ఎంసీలో నకిలీ వేలిముద్రలతో పారిశుధ్య కార్మికుల హాజరు నమోదు చేస్తున్నారన్న ఆరోపణలపై ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్ విభాగం బృందాలు దాదాపు వారం రోజుల పాటు రెక్కీ నిర్వహించి హైదరాబాద్‌లోని 12 ప్రాంతాల్లో ఎస్ఎఫ్ఏలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాయి. 84 కృత్రిమ (సింథటిక్) వేలిముద్రలు స్వాధీనం చేసుకున్నట్లు జీహెచ్ఎంసీ ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ (ఈవీడీఎం) డైరెక్టర్ విశ్వజిత్ కంపాటి తెలిపారు. 17 మంది ఎస్ఎఫ్ఏలను తనిఖీ చేయగా, 9 మంది వద్ద ఈ నకిలీ ఫింగర్ ప్రింట్స్‌ను గుర్తించినట్లు తెలిపారు. బుధవారం ఉదయం నుంచి విజిలెన్స్ విభాగం అడిషనల్ ఎస్పీ సురేందర్‌రెడ్డి, డీఎస్పీ మురళి ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారని చెప్పారు. 9 మంది ఎస్ఎఫ్ఏలను విధుల నుంచి తొలగించి క్రిమినల్ కేసులు నమోదు చేయనున్నట్లు వెల్లడించారు. నకిలీ వేలిముద్రలతోపాటు 12 బయోమెట్రిక్ మెషీన్లను స్వాధీనం చేసుకున్నారు.

పది రూపాయల్లోపే తయారీ..

కొవ్వొత్తిని కాల్చగా వచ్చిన ద్రవాన్ని అట్టముక్కపై వేస్తారు. కొద్దిగా ఆరిన ద్రవంపై వేలిముద్ర వేయిస్తారు. తర్వాత కొంచెం ఫెవికాల్ వేస్తారు. అది గట్టిపడ్డాక దిగువనున్న పేపర్‌ను తొలగిస్తే ఫింగర్‌ప్రింట్ మిగులుతుంది. దీనితో బయోమెట్రిక్ హాజరు నమోదు చేస్తున్నారు. నకిలీ వేలిముద్రల ద్వారా భద్రతా పరమైన సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీటి తయారీకి రూ.5 నుంచి రూ.10 లోపే ఖర్చు కావడం గమనార్హం. బయోమెట్రిక్ హాజరును ఆధార్ అనుసంధానంతో పాటు జీపీఎస్‌నూ జత చేయడంతో అవకతవకలకు పాల్పడే వీలుండదని భావించిన అధికారులు.. తాజా ఉదంతంతో కంగుతిన్నారు.

- 2017 మేలో జీహెచ్ఎంసీ బయోమెట్రిక్ హాజరు ప్రారంభించింది. ఒక్క నెలలోనే రూ.2.86 కోట్లు మిగులు కనిపించింది. విధులకు గైర్హాజరైన వారిపేరిట జరిగిన స్వాహా అది. అలా ఏడాదికి రూ.35 కోట్ల మిగులు కనిపించింది.
- మే 21 నుంచి జూన్ 20 వరకు బయోమెట్రిక్ హాజరు ఆధారంగా వేతనాలు చెల్లించారు. దీంతో ఒక్క నెలలోనే రూ.2,86,34,946 తేడా కనిపించింది. బయోమెట్రిక్ హాజరు లేనప్పుడు 2016 డిసెంబర్ 21 నుంచి 2017 జనవరి 20 వరకు రూ.34,64,22,282 వేతనాలుగా చెల్లించగా, బయోమెట్రిక్ హాజరు అమలు చేశాక 2017 మే 21 నుంచి జూన్ 20 వరకు రూ.31,77,87,336 మాత్రమే చెల్లించారు.

ప్రమేయమున్న అధికారులపై చర్యలు

మేయర్ బొంతు రామ్మోహన్

పారిశుధ్య కార్మికుల బోగస్ హాజరు నమోదు చేస్తున్న 9 మంది ఎస్ఎఫ్ఏలను విధుల నుంచి తొలగించి వారిపై కేసులు నమోదు చేయాల్సిందిగా మేయర్ బొంతు రామ్మోహన్ అధికారులను ఆదేశించారు. నకిలీ వేలిముద్రలకు సంబంధించి పూర్తి స్థాయి దర్యాప్తు నిర్వహించి, ఇందులో ప్రమేయం ఉన్న అధికారులు, సిబ్బందిని కూడా గుర్తించాలని ఆదేశించారు.



బుధవారం గాంధీభవన్‌లో మహాత్మాగాంధీకి నివాళులర్పిస్తున్న భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తదితరులు

మహాత్మా గాంధీకి కాంగ్రెస్ నివాళి

సాక్షి, హైదరాబాద్: మహాత్మా గాంధీ 71 వ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ ఘనంగా నివాళులర్పించింది. బుధవారం ఉదయం గాంధీభవన్‌లో గాంధీ చిత్రపటానికి టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. నేతలు మాట్లాడుతూ నాడు గాంధీ నేతృత్వంలో దేశానికి స్వాతంత్ర్యం తెచ్చే పోరాటం జరిగిందని, ఇప్పుడు మోదీ నియంత పాలనను ఓడించి ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు రాహుల్‌గాంధీ నేతృత్వంలో రెండో స్వాతంత్ర్య పోరాటం మొదలైందని అన్నారు. బీజేపీ ప్రభుత్వం గాడ్సే విధానాలను అనుసరిస్తోందని, కాంగ్రెస్ మాత్రం గాంధీ ఆశయాల అమలు కోసం పోరాటం చేస్తోందని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో నగర కాంగ్రెస్ అధ్యక్షుడు అంజన్‌కుమార్ యాదవ్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవి, కుమార్‌రావు, ప్రధాన కార్యదర్శులు బొల్లు కిషన్, ప్రేమ్‌లాల్, సీజే శ్రీనివాస్, కైలాశ్, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.800 కోట్ల బిల్లులకు లైన్‌క్లియర్!

సాక్షి, హైదరాబాద్: సాగునీటి ప్రాజెక్టుల నిధులపై నీటి పారుదల శాఖ అధికారులతో చర్చించిన ఆర్థిక శాఖ రూ.800 కోట్ల మేర బిల్లులకు లైన్ క్లియర్ చేసినట్లు తెలిసింది. ఏకంగా రూ.10వేల కోట్ల మేర బిల్లులు పెండింగ్‌లో ఉండటం, ఈ నిధులకే నీటి పారుదల నుంచి ఒత్తిడి పెరగడం, దీనిపై స్వయంగా సీఎస్ ఎస్కే జోషి ఆదేశాలు జారీ చేయడంతో ఆర్థిక శాఖలో కదలిక వచ్చింది. అత్యంత ప్రాధాన్యం ఉన్న ప్రాజెక్టులు, చాలా రోజులుగా పెండింగ్‌లో ఉన్న పనులకు సంబంధించి బిల్లులకే ఈ నిధులను విడదల చేసినట్లుగా తెలిసింది. మరో 1,000 కోట్ల నిధులను కూడా త్వరలోనే విడుదల చేయనున్నారని సమాచారం.

సర్వీసు రూల్స్ పోరాటం కొనసాగుతుంది

టీఎస్ పీఆర్‌టీయూ స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: పంచాయతీరాజ్ టీచర్లు, ప్రభుత్వ టీచర్లకు కలిపి ఏకీకృత సర్వీసు రూల్స్ సాధనకు చేపట్టిన తమ పోరాటం కొనసాగుతుందని టీఎస్ పీఆర్‌టీయూ వెల్లడించింది. ఈ విషయంలో తాము వెనక్కి తగ్గేది లేదని, సర్వీసు రూల్స్ సాధనే తమ లక్ష్యమని పీఆర్‌టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సరోత్తంరెడ్డి, కమలాకర్‌రావు తెలిపారు. మేనేజ్‌మెంట్ల వారీగా పదోన్నతులను ఇవ్వాలని సీఎంను కోరామన్నారు. పాఠశాలల్లో పని చేసే టీచర్ల విషయంలోనే మేనేజ్‌మెంట్ వారీగా పదోన్నతులు కల్పించాలని కోరామని, కేసు సుప్రీం కోర్టులో ఉన్న సమయంలోనూ 2009, 2015 సంవత్సరాల్లో ప్రభుత్వం అలా టీచర్లకు పదోన్నతులు కల్పించిందని పేర్కొన్నారు. ఎస్జీటీ నుంచి స్కూల్ అసిస్టెంట్‌కు, స్కూల్ అసిస్టెంట్ నుంచి హెడ్‌మాస్టర్ పోస్టులకు ఎవరి మేనేజ్‌మెంట్‌లో వారికి పదోన్నతులు ఇచ్చిందని, వాటినే ఇప్పుడు పునరుద్ధరించాలని కోరామని తెలిపారు. విద్యాశాఖ పర్యవేక్షణాధికారి పోస్టులైన ఎంఈవో, డిప్యూటీ ఐవోఎస్, ఉప విద్యాధికారి, డైట్ లెక్చరర్, ఎస్‌సీఈఆర్‌టీ లెక్చరర్ వంటి పోస్టుల్లో పదోన్నతులు కల్పించేందుకు అవసరమైన ఏకీకృత సర్వీసు రూల్స్ కోసం పోరాటం కొనసాగిస్తామని వివరించారు.

రాష్ట్ర రుణ ప్రణాళిక... లక్ష్యం రూ. లక్ష కోట్లు

- 2019–20 ఆర్థిక సంవత్సరానికి నాబార్డు ఫోకస్ పేపర్ విడుదల
- అందులో రూ. 71 వేల కోట్లు వ్యవసాయం, దాని అనుబంధ రంగాలకే
- పంట రుణాలకు రూ.49,785 కోట్లు కేటాయించాలని దిశానిర్దేశం

సాక్షి, హైదరాబాద్: రూ.లక్ష కోట్లతో రాష్ట్ర రుణ ప్రణాళిక ఉండాలని నాబార్డు నిర్ణయించింది. ఈ మేరకు బ్యాంకులకు దిశానిర్దేశం చేస్తూ బుధవారం ‘స్టేట్ ఫోకస్ పేపర్–2019–20’ను విడుదల చేసింది.రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి ఆధ్వర్యంలో విడుదల చేసిన ఈ పత్రంలో మొత్తం 70 శాతం పంట రుణాలకే కేటాయించాలని దిశానిర్దేశం చేయడం గమనార్హం. వ్యవసాయానికి తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నందున ఆ మేరకు కేటాయింపులు పెంచాలన్నది నాబార్డు ఉద్దేశంగా కనిపిస్తోంది. 2019–20 ఆర్థిక సంవత్సరానికి గాను వివిధ రంగాలకు రుణ కేటాయింపులు ఎలా ఉండాలన్న దానిపై నాబార్డు అన్ని జిల్లాల నుంచి వివిధ శాఖల ద్వారా క్షేత్రస్థాయి వివరాలను సేకరించింది. వాటిని క్రోడీకరించి ఈ ఫోకస్ పేపర్‌ను విడుదల చేసింది. దీని ఆధారంగానే రాష్ట్ర రుణ ప్రణాళికను రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమితి (ఎస్ఎల్‌బీసీ) త్వరలో విడుదల చేయనుంది.

పంట రుణాలకు రూ. 49,785 కోట్లు...

క్షేత్రస్థాయి సర్వేల ద్వారా వేసిన అంచనా ప్రకారం వచ్చే ఆర్థిక సంవత్సరంలో 1,01,378 కోట్ల రుణం లక్ష్యంగా ముందుకు వెళ్లాలంది. 2018–19 ఫోకస్ పేపర్‌లో రాష్ట్ర రుణ పరిమితి రూ. 83,388 కోట్లు కాగా, ఈసారి అదనంగా రూ. 17,990 కోట్లు కేటాయించాలని పేర్కొంది. రూ. 70,965 కోట్లు ఇచ్చి వ్యవసాయం, పశుసంవర్ధకశాఖ, మత్స్యశాఖ సహ అనుబంధ రంగాలకు ప్రాధాన్యాన్ని ఇవ్వాలంది. అందులో రూ. 46,344 కోట్లు పంట రుణాలకు , అంటే 2018–19 లక్ష్య పత్రంతో పోలిస్తే అదనంగా రూ. 3,441 కోట్లు కేటాయించాలంది. వ్యవసాయ యాంత్రీకరణ కోసం రూ. 2,833 కోట్లు ఇవ్వాలని నిర్ణయించింది. వ్యవసాయ మార్కెటింగ్‌లో మౌలిక సదుపాయాలు, గోదాములకు రూ. 1,401 కోట్లు కేటాయించాలని సూచించింది. గృహ రుణాలకు రూ. 5,834 కోట్లు, విద్యా రుణాలకు రూ. 2,009 కోట్లు కేటాయించింది.

సన్నచిన్నకారు రైతులే లక్ష్యంగా...

సన్నచిన్నకారు రైతులే లక్ష్యంగా రుణ ప్రణాళిక ఉండాలని నాబార్డు సూచించింది. రాష్ట్రంలో వారి సంఖ్యే అధికంగా ఉన్నందున అందుకు అనుగుణంగానే రుణ ప్రణాళికను ఖరారు చేయాలని బ్యాంకులకు సూచించింది.సోయాబీన్, పప్పుధాన్యాల సాగును పెంచాలని విజ్ఞప్తి చేసింది. అందుకు అనుగుణంగానే పంట రుణ ప్రణాళికను తయారు చేసినట్లు తెలిపింది.అందుకే 2018–19 కంటే 2019–20 పంట రుణాలను 17 శాతం పెంచామంది. సాగు ఖర్చు పెరుగుతుండటం, కూలీల కొరత కారణంగా వ్యవసాయ యాంత్రీకరణను ప్రోత్సహించాల్సిన అవసరాన్ని నాబార్డు గుర్తించింది. యాంత్రీకరణకు అధిక కేటాయింపులు చేసినట్లు తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు ఆహార శుద్ధి పరిశ్రమల స్థాపనపై దృష్టిసారించింది. ఆ రంగంలో రుణాల కోసం రూ. 1,145 కోట్లు కేటాయించినట్లు వివరించింది.

2019-20 నాబార్డు స్టేట్ ఫోకస్ పేపర్ ప్రకారం రుణ ప్రణాళిక అంచనా

అంశం	కేటాయింపు (రూ. కోట్లలో)
1) పంట రుణాలు	49,785.59
2) వ్యవసాయం, దాని అనుబంధ రంగాలు	21,179.58
3) సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు	21,065.98
4) విద్య రుణాలు	2,009.41
5) గృహ రుణాలు	5,834.94
6) రెన్యూవబుల్ ఎనర్జీ	317.38
7) సామాజిక మౌలిక సదుపాయాలు	1008.92
8) ఇతరాలు	176.80
మొత్తం	1,01,378.60

జేఈఈ అడ్వాన్స్‌డ్ కటాఫ్ 87.71

- జనవరిలో జేఈఈ రాసిన విద్యార్థుల సంఖ్య మేరకు అంచనా!
- రెండో దఫా జేఈఈ తర్వాత 88.43కు పెరిగే అవకాశం
- పరీక్షకు హాజరయ్యే వారి సంఖ్యతో మారనున్న ఓపెన్ కేటగిరీ కటాఫ్



సాక్షి, హైదరాబాద్: జేఈఈ మెయిన్ స్కోర్‌ను మార్కుల రూపంలో కాకుండా పర్సంటైల్ విధానంలో ఇచ్చినప్పటికీ జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు ఎంపికయ్యే వారి సంఖ్యను లెక్కించుకోవడం సులభమేనని నిపుణులు చెబుతున్నారు. ఈసారి జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హులుగా పరిగణనలోకి తీసుకునే వారి కటాఫ్ ఓపెన్ కేటగిరీలో 87.71 ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. ఈ నెల 8 నుంచి 12 వరకు జరిగిన జేఈఈ మెయిన్ పరీక్షల స్కోర్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఈ నెల 19న ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే అందులో పర్సంటైల్ ఇవ్వడంతో కొంతమంది విద్యార్థులు అడ్వాన్స్‌డ్ కటాఫ్ ఎంత ఉండవచ్చన్న అనుమానాల్లో పడ్డారు. దీనిపై ఆందోళన చెందాల్సిన అవసరమే లేదని, పర్సంటైల్ విధానం ప్రకారం అడ్వాన్స్‌డ్‌కు కటాఫ్ లెక్కించుకోవచ్చని జేఈఈ నిపుణులు చెబుతున్నారు. జనవరిలో జరిగిన పరీక్షలకు హాజరైన విద్యార్థుల సంఖ్య మేరకు ఓపెన్ కేటగిరీలో కటాఫ్ 87.71 ఉండే అవకాశం ఉందని వెల్లడించారు. అయితే ఏప్రిల్‌లో రెండో దఫా జేఈఈ మెయిన్ పరీక్ష ఉన్నందున దానికి హాజరయ్యే విద్యార్థుల సంఖ్య బట్టి కటాఫ్‌లో మార్పులు ఉంటాయి. అప్పుడే కటాఫ్ పర్సంటైల్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ప్రకటించనుంది.

ఓపెన్ కేటగిరీ కటాఫ్ లెక్కింపు ఇలా..

సాధారణంగా అన్ని కేటగిరీల్లో కలిపి 2.24 లక్షల మంది విద్యార్థులను జేఈఈ అడ్వాన్స్‌డ్ రాసేందుకు అర్హులుగా పరిగణనలోకి తీసుకుంటారు. గతంలో సమాన మార్కులు వచ్చిన విద్యార్థులను అడ్వాన్స్‌డ్‌కు పరిగణనలోకి తీసుకోవడంతో మరో 7 వేలు పెరిగి 2.31 లక్షలకు చేరుకుంది. ఈసారి మాత్రం టాప్ 2.24 లక్షల మందినే జేఈఈ అడ్వాన్స్‌డ్ రాసేందుకు పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది. దీని ప్రకారం 50.5 శాతం విద్యార్థులను ఓపెన్ కేటగిరీలో తీసుకోవాలి. దీంతో ఓపెన్ కేటగిరీలో ఎంపిక చేసే విద్యార్థుల సంఖ్య 1,13,120 అవుతుంది. అందులో దివ్యాంగులను 5 శాతం మినహాయిస్తే 1,07,464 మందిని ఓపెన్ కేటగిరీలో అడ్వాన్స్‌డ్‌కు ఎంపిక చేస్తారు. జనవరిలో జరిగిన జేఈఈ పరీక్షకు మొత్తం 8,74,469 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో అడ్వాన్స్‌డ్‌కు ఓపెన్ కేటగిరీలో పరిగణనలోకి తీసుకునే విద్యార్థుల శాతం 12.2890577 అవుతుంది. జనవరి పరీక్షలో టాప్ పర్సంటైల్ 100.0000000. అందులో నుంచి ఓపెన్ కేటగిరీ విద్యార్థుల పర్సంటేజీని తీసేస్తే 87.7109423 పర్సంటైల్ వస్తుందని, ఓపెన్ కేటగిరీలో కటాఫ్‌గా ఉండే పర్సంటైల్ అదే అయ్యే అవకాశం ఉందని జేఈఈ నిపుణులు సురేష్‌కుమార్ వివరించారు. ఇది పూర్తిగా జనవరి పరీక్షకు హాజరైన విద్యార్థుల సంఖ్య మేరకేనని పేర్కొన్నారు. వాస్తవానికి జనవరిలో జరిగే జేఈఈ మెయిన్‌కు హాజరయ్యేందుకు దరఖాస్తు చేసుకున్న వారిలో 54,729 మంది విద్యార్థులు పరీక్ష రాయలేదు. అంటే వారంతా ఏప్రిల్ జరిగే పరీక్షకు హాజరయ్యే అవకాశం ఉంటుంది. దీంతో ప్రస్తుతం రాసిన వారు, పరీక్ష రాయని వారు కలుపుకుని విద్యార్థుల సంఖ్య 9,29,198కి చేరే అవకాశం ఉంది. ఈ విద్యార్థుల సంఖ్య ప్రకారం చూస్తే ఓపెన్ కేటగిరీ విద్యార్థుల సంఖ్య (దివ్యాంగులు కాకుండా) 1,07,464 మంది. దీన్ని పరీక్షకు హాజరైన మొత్తం విద్యార్థుల సంఖ్యతో చూస్తే 11.56524228 శాతం. టాప్ పర్సంటైల్ 100 అయినందున అందులో నుంచి 11.56524228ని తీసివేస్తే 88.4347577 వస్తుంది. అదే ఓపెన్ కేటగిరీ కటాఫ్ అవుతుంది. ఏప్రిల్‌లో పరీక్షకు హాజరయ్యే విద్యార్థుల సంఖ్యను బట్టి ఇది మారనుంది. ఐఐటీల్లో సీట్లు పెరిగితే మాత్రం అడ్వాన్స్‌డ్‌కు పరిగణనలోకి తీసుకునే విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంటుంది. మరోవైపు కటాఫ్ కూడా భారీగా తగ్గే అవకాశం ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు.

సాగునీటి ప్రాజెక్టులపై ప్రజెంటేషన్

వివిధ రాష్ట్రాల ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్‌లకు అవగాహన

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో నిర్మాణమవుతున్న సాగునీటి ప్రాజెక్టులపై వివిధ రాష్ట్రాలకు చెందిన ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారులకు ఆ శాఖ ఇంజనీర్లు ప్రజెంటేషన్ ఇచ్చారు. భారత ప్రభుత్వం డీవోపీటీ శాఖ ద్వారా పంపబడిన అధికారులకు మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ నిర్వహిస్తున్న 5 రోజుల శిక్షణా కార్యక్రమాల్లో భాగంగా బుధవారం ఇక్కడి జలసౌధ కార్యాలయంలో కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ కార్యక్రమాలపై ఇంజనీర్లు ప్రజెంటేషన్లు ఇచ్చారు. ఈ సందర్భంగా కాళేశ్వరం ఇంజనీర్ ఇన్ చీఫ్ హరిరామ్ ప్రాజెక్టు లక్ష్యాలను, సాంకేతిక వివరాలను మ్యాప్ ద్వారా వివరించారు. ప్రత్యక్ష ప్రసారాల ద్వారా హైదరాబాద్ నుంచే ప్రాజెక్టు పనులని పర్యవేక్షిస్తున్న విధానాన్ని వివరించారు. ఆ తర్వాత డ్రోన్ కెమెరాలతో ప్రాజెక్టు పనుల వీడియో రికార్డింగ్ చూపించారు. రెండేళ్లలో మేడిగడ్డ మొదలు మిడ్‌మానేరు వరకు 95 శాతం పూర్తి చేసిన పనుల తీరును వివరించారు. ఈ ఏడాది జూన్ నాటికి గోదావరి నుంచి నీటిని పంపింగ్ చేయడానికి పూర్తి స్థాయిలో సిద్ధమవుతున్నామని తెలిపారు. అనంతరం మిషన్ కాకతీయ లక్ష్యాలను ఈసీ శ్యాంసుందర్ వివరించారు. మిషన్ భగీరథపై రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ జగన్ మోహన్ వివరిస్తూ, మూడేళ్లలో సుమారు 25 వేల గ్రామాలకు ఇంటింటికి నల్లా ద్వారా నీరందించే ఈ బృహత్తర కార్యక్రమం పూర్తి కావచ్చిందని గణాంకాలు, చిత్రాలతో వివరించారు. ఈ మార్చి నెలాఖరుకు మిషన్ భగీరథ పూర్తి స్థాయిలో నీరు అందిస్తుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ఈ కార్యక్రమాల వలన ప్రజలకు మేలు జరుగుతుందని అధికారులు తెలిపార.

సాక్షి
గురువారం, జనవరి, 31

మళ్లీ స్వైన్‌ఫ్లూ విజృంభణ

దేశంలోని వివిధ ప్రాంతాల్లో మరోసారి స్వైన్ ఫ్లూ స్వైరవిహారం చేస్తోంది. ఈ వ్యాధితో గత నెల రోజుల్లో 169మంది మరణించగా, 4,571మందికి వైరస్ సోకిందని గణాంకాలు చెబుతున్నాయి. రాజస్తాన్, గుజరాత్, ఢిల్లీ, పంజాబ్, హర్యానా, మహారాష్ట్రల్లో ఇది అధికంగా ఉండగా, ఇతర రాష్ట్రాల్లో అక్కడక్కడ ఈ కేసులు బయటపడుతున్నాయి. తెలంగాణలో, ప్రత్యేకించి హైదరాబాద్‌లో స్వైన్‌ఫ్లూ కేసుల నమోదు పెరిగింది. ఈ నెలలోనే 150మంది దీని వాత పడ్డారు. ఈ మహమ్మారి మన దేశంలో మొదటిసారి బయటపడి పదేళ్లవుతోంది. కానీ పదే పదే ఇది విజృంభించడాన్ని చూస్తుంటే ఈ వ్యాధి విషయంలో మనం నేర్చుకున్నదేమీ లేదని అర్థమవుతుంది. వాతావరణంలో ఉష్ణోగ్రతలు తగ్గే వర్షాకాలం, శీతాకాలాల్లో ఈ వైరస్ విజృంభిస్తుందని తెలియనిదేమీ కాదు. మరీ ముఖ్యంగా ఈసారి ఉష్ణోగ్రతలు ఎన్నడూలేని స్థాయిలో బాగా తగ్గాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ చాలాచోట్ల రాత్రి ఉష్ణోగ్రతలు 19 డిగ్రీల సెల్సియస్ వరకూ వచ్చాయి. కానీ ముందస్తు చర్యల్లో, వ్యాధి ప్రబలుతున్నదని అర్థమయ్యాక చేపట్టవలసిన చర్యల్లో అధికార యంత్రాంగాలు విఫలమవుతున్నాయి. కొంచెం హెచ్చుతగ్గులతో అన్ని రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి ఉండటం ఆందోళన కలిగిస్తుంది. ఈ నిర్లక్ష్యం కారణంగా దేశవ్యాప్తంగా వేలాదిమంది మృత్యువాత పడుతున్నారు. నిరుడు వివిధ రాష్ట్రాల్లో 14,992 కేసులు బయటపడగా, 1,103మంది మరణించారు.

జాతీయ వ్యాధుల నియంత్రణ కేంద్రం(ఎన్‌సీడీసీ) గణంకాల ప్రకారం దేశంలో ఈ నెల రోజుల్లో బయటపడిన 4,571 స్వైన్‌ఫ్లూ కేసుల్లో 40 శాతం... అంటే 1,856 కేసులు రాజస్తాన్‌వే. మరణాలు కూడా అక్కడే అధికం. ఇంతవరకూ దేశవ్యాప్తంగా స్వైన్‌ఫ్లూ బారినపడి మరణించిన 169 మందిలో 72 మంది ఆ రాష్ట్రంవారే. ఢిల్లీలోనూ వైరస్ వ్యాప్తి తీవ్రంగానే ఉంది. అక్కడ 11 మంది చనిపోయారు. ఈ వైరస్ జాడ కనబడిన తర్వాత తక్షణం నియంత్రణ చర్యలు తీసుకోవాలని, లేనట్టయితే అది శరవేగంగా విస్తరించడం ప్రారంభమవుతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ విస్తరణకు దారితీసే అంశాలేమిటో, అది సోకకుండా ఉండటానికి తీసుకోవాల్సిన ముందస్తు చర్యలేమిటో విస్తృతంగా ప్రచారం చేస్తే తప్ప ప్రజానీకంలో అవగాహన కలగదు. గతంలో ఇది విజృంభించినప్పుడు ప్రభుత్వాలు చురుగ్గా వ్యవహరించాయి. అప్పట్లో వివిధ మార్గాల్లో అప్రమత్తత పెంచారు. కానీ అది సరిపోదు. ప్రతియేటా వర్షాకాలం ప్రారంభమైంది మొదలుకొని వేసవి సమీపించేవరకూ ఈ విషయంలో ప్రభుత్వాలు చర్యలు తీసుకోక తప్పదు. స్వైన్ ఫ్లూను మూడు కేటగిరిలుగా విభజించారు. ఇందులో ఏ, బీ వైరస్‌ల వల్ల రోగికి తక్షణ ప్రమాదం ఉండదు. మూడో కేటగిరి వైరస్ సోకినవారికి మాత్రం అత్యవసర చికిత్స అవసర మవుతుందని, వెంటనే వెంటిలేటర్ పెట్టాల్సి ఉంటుందని వైద్య నిపుణులు అంటున్నారు. వ్యాధి తీవ్రత ఉన్నదని ప్రకటించిన ప్రాంతాల్లో ఎక్కువ జనసమ్మర్థం ఉండేచోటకు వెళ్లరాదని కూడా వారి సలహా. అసలు పారిశుద్ధ్యం సక్రమంగా ఉంటే వ్యాధుల విస్తరణ ఇంతగా ఉండదు. అది కొరవ డినప్పుడే విషజ్వరాలైనా, మరే ఇతర అంటువ్యాధులైనా కాటేస్తాయి. ఆ విషయంలో కూడా చర్యలు అవసరమని గుర్తించాలి.

స్వైన్‌ఫ్లూ అయినా, మరేవిధమైన ప్రమాదకర అంటువ్యాధి అయినా ప్రబలడం మొదలైందంటే దాని నష్టం బహుముఖంగా ఉంటుంది. వెనువెంటనే కనబడే ప్రాణనష్టం మాత్రమే కాదు... సామాజికంగా, ఆర్థికంగా కూడా వాటి ప్రభావం ఉంటుంది. సకాలంలో చర్యలు తీసుకోనట్టయితే ప్రభుత్వాలు ఆసుపత్రి సౌకర్యాల కోసం, ఔషధాల కోసం భారీ మొత్తంలో వ్యయం చేయాల్సి ఉంటుంది. వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరిగేకొద్దీ ఉత్పాదకత ఆమేరకు కుంటుబడుతుంది. విదేశీ యాత్రీకుల రాక, వారివల్ల వచ్చే రాబడి తగ్గుతుంది. కనుక ఈ విషయంలో శాశ్వత ప్రాతిపదికన చర్యలు తప్పనిసరి. అంటువ్యాధులు ప్రబలినప్పుడు పైనుంచి కిందివరకూ ఎవరికి ఏఏ బాధ్యతలుంటాయో తెలియజెప్పే మాన్యువల్ రూపొందాలి. మన దేశంలో సాంక్రమిక వ్యాధుల చట్టం, పశు సంపద దిగుమతి చట్టం వంటివి బ్రిటిష్ పాలకులు తీసుకొచ్చిన చట్టాలు. వాటి స్థానంలో వర్తమాన అవసరాలకు తగ్గట్టు సమర్థవంతమైన కొత్త చట్టాలు రూపొందించాల్సిన అవసరాన్ని మన పాలకులు ఇంకా గుర్తించలేదు. ఒక రాష్ట్రంలో వ్యాధి సోకిందని తెలియగానే వెనువెంటనే అన్ని రాష్ట్రాలనూ అప్రమత్తం చేయడం, ఎటువంటి చర్యలు అమల్లోకి రావలసి ఉన్నదో వివరిస్తూ సూచనలు జారీచేయడం జరగాలి. ఏ కాలంలో ఏఏ వ్యాధులు ప్రబలే అవకాశమున్నదో గుర్తించి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడం అవసరమే అయినా, అంతకుమించి బాధ్యతలను నిర్దిష్టంగా నిర్ణయించడం అవసరం. స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకుంటే తక్కువ వ్యవధిలో ఎక్కువమంది ప్రజలకు సమాచారం చేరేసే వీలుంటుంది.

నిజానికి నిరుడు ఆగస్టులోనే దేశంలో ఈ స్వైన్‌ఫ్లూ వైరస్ బయటపడింది. అప్పటినుంచీ ఒక్కొక్క రాష్ట్రాన్నీ తాకుతూ వస్తోంది. కానీ ప్రభుత్వాలు సకాలంలో పకడ్బందీ చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యాయి. అదే జరిగి ఉంటే ఈ అంటువ్యాధి నియంత్రణ సాధ్యమయ్యేది. 2009 తర్వాత ఈ స్థాయిలో వైరస్ విజృంభించడం ఇదే మొదటిసారని ప్రపంచ ఆరోగ్య సంస్థ అప్పట్లోనే చెప్పింది. అయిదేళ్లలోపు పిల్లల్లోనూ, గర్భిణుల్లోనూ, సీనియర్ సిటిజన్లలోనూ ఈ వ్యాధి ప్రభావం ఎక్కువని వైద్య నిపుణులు చెబుతారు. మిగిలినవారికి సోకినా ప్రమాద తీవ్రత తక్కువ ఉంటుంది. జలుబు, దగ్గు, జ్వరం, ఒళ్లు నొప్పుల తీవ్రంగా ఉన్నప్పుడు వైద్యుల్ని ఆశ్రయించాలని విస్తృతంగా ప్రచారం చేస్తే ప్రజలకు దీనిపై అవగాహన ఏర్పడుతుంది. తెలంగాణలో మూడేళ్లక్రితం స్వైన్ ఫ్లూ సోకినప్పుడు వైద్య ఆరోగ్య శాఖ చురుగ్గా వ్యవహరించి వివిధ రకాల చర్యలు తీసుకుంది. కానీ ఈసారి మాత్రం చేష్టలుడిగి ఉండిపోయింది. అన్ని స్థాయిల్లోనూ జవాబుదారీతనాన్ని స్పష్టంగా నిర్ణయించిప్పుడే ఇలాంటి నిర్లక్ష్యం విరగడవుతుంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ విళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు పుష్యమాసం, తిథి బ.ఏకాదశి రా.7.30 వరకు, తదుపరి ద్వాదశి నక్షత్రం జ్యేష్ఠ రా.9.12 వరకు, తదుపరి మూల, వర్జ్యం తె.5.40 నుంచి 7.22 వరకు (తెల్లవారితే శుక్రవారం), దుర్ముహూర్తం ఉ.10.21 నుంచి 11.06 వరకు, తదుపరి ప.2.50 నుంచి 3.35 వరకు, అమృతఘడియలు... ప.12.04 నుంచి 1.43 వరకు.

సూర్యోదయం : 5.37
సూర్యాస్తమయం : 5.51
రాహుకాలం : ప. 1.30 నుంచి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుంచి 7.30 వరకు

భువిపై మెరిసిన రత్నం భూపేన్



''భూమిని చీల్చుకుంటూ నేలంతా పరుచుకొని పారుతున్న నీకు,
లక్షలాది ప్రజల హాహాకారాలు వినపడలేదా?
నైతికతా, మానవతా ధ్వంసమైన చోట...
చేష్టలుడిగి చూస్తున్నావా?
నిర్లక్ష్యంగా, నిశ్శబ్దంగా, దారితెన్నూలేక
ఎందుకా పరుగు నీకు గంగా''
''వేనోళ్ళ ఘోషిస్తోన్న నీ చరితెక్కడ?
సామాజిక అశాంతిపట్ల ఎందుకీ మౌనం''

... అని బ్రహ్మపుత్రానదిని నిలదీసిన కవి, గాయకుడు, సంగీత విజ్ఞానఖనీ, సామాజిక సేనాని వేరెవ్వరో కాదు గానగంధర్వుడు భూపేన్ హజారికా. మిత్రులూ, సన్నిహి తులూ, అభిమానులూ, శ్రేయోభిలాషులూ భూపేన్‌దా అని ప్రేమగా పిలుచుకునే నాటి జనగాననిధీ, నేటి భారత రత్న భూపేన్ హజారికా ప్రశ్నలో సామాజిక బాధ్యత ఉంది. నదీనదాలను ప్రశ్నించడమే కాదు ప్రపంచ ప్రజల మనసులను తన గానామృత జలపాతంలో ముంచెత్తిన సంగీత సామ్రాజ్య రారాజు భూపేన్ దా. అతి సాధారణ కుటుంబం నుంచి వచ్చి అనతి కాలంలోనే లక్షలాది ప్రజల గుండెల్లో ఒదిగిపోయిన భూపేన్ హజారికా జీవితంలో ఏ కోణాన్ని తడిమి చూసినా ప్రజలఘోషే పల్లవై పలుకుతుంది. ఆయనలోని సంగీతం, సామాజిక చైతన్యం అతడిని అరుదైన సంగీతోద్యమ సేనానిగా నిలిపాయి.

గొప్ప మానవతావాది అయిన భూపేన్ హజారికా అస్సాంలోని సదియా గ్రామంలో 1926, సెప్టెంబర్ 8వ తేదీన నీలకంఠ హజారికా, శాంతి ప్రియ హజారికాలకు జన్మించారు. హజారికా తల్లిదండ్రులిద్దరూ ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నారు. అస్సాంలో షెడ్యూల్డ్ కులాలలో ఒకటైన కాయిబర్త కులానికి చెందినవాడు హజారికా. తండ్రి నీలకంఠ హజారికా ఆ ప్రాంతంలో సామాజిక ఉద్యమాలలో, కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనేవాడు. దానితోపాటు భూపేన్‌దా తల్లిదండ్రులిద్దరూ సంగీతంలో ప్రవేశం ఉన్నవారే. ఆయన మేనమామకు కూడా సంగీతంలో ప్రావీణ్యం ఉంది. భూపేన్‌దా తండ్రి 1929లోనే గౌహతిలోని బరాల్ ముఖ్ ప్రాంతానికి బదిలీ అయ్యారు. అక్కడి నుంచి 1935లో తేజ్‌పూర్‌కు వెళ్ళిన తర్వాత అక్కడ భూపేన్‌దా రాజకీయ ఓనమాలు దిద్దారు. ప్రముఖ నాటక రచయిత, కవి, అస్సాం ప్రప్రథమ సినీదర్శకులు జ్యోతిప్రసాద్ అగర్వాల్ పరిచయంతో పదేళ్ళ వయస్సులోనే 1936లో సెలోనా కంపెనీకి చెందిన అరోరా స్టూడియోలో భూపేన్‌దా పాడిన తొలి పాటను రికార్డు చేశారు. పన్నెండేళ్ళ వయస్సులోనే జ్యోతిప్రసాద్ అగర్వాల్ నిర్మించిన 'ఇంద్రమాలతి' సినిమాలో భూపేన్‌దా గొంతు నుంచి జాలు వారిన రెండు పాటలు ఆయన జీవితాన్ని మలుపుతిప్పాయి. అది మొదలు 2011లో తుదిశ్వాస వీడేవరకూ ఆయన గాత్రమే ఊపిరిగా బతికారు. అస్సామీ, బెంగాలీ, హిందీ, ఇంగ్లీషు, ఉర్దూ లాంటి విభిన్న భాషల్లోని వేనవేల పాటల్లోకి ఆయన గొంతు తర్జుమా అయ్యింది. వైవిధ్యాన్ని ఆరాధించే ప్రతి సంగీత ప్రియుడి ఇంటా ఆయన గొంతు ప్రతిధ్వనించింది. పాటే ప్రాణంగా బతికిన అలాంటి గొప్ప సంగీత స్వాప్నికుడిని ఇంటర్వ్యూ చేసే మహావకాశం ఒక జర్నలిస్టుగా నాకు దక్కింది.

1994 నవంబర్‌లో హైదరాబాద్‌లో జరిగిన అంతర్జాతీయ బాలల చలనచిత్రోత్సవానికి ఆయన జ్యూరీ మెంబర్‌గా వచ్చారు. హజారికా బాల్యం, యవ్వనం, జీవితం అంతా కవిత్వం, గాత్రంతో నిండి ఉంటాయి. తల్లిదండ్రులే తనకు తొలి స్ఫూర్తి అంటారు. ఆ తర్వాత తన చుట్టూ ఉన్న సమాజం నుంచి చాలా నేర్చుకున్నానని స్వయంగా చెపుతారు. బడికెళ్ళి రాగానే ప్రతి రోజూ సాయంకాలం ఇంటి దగ్గర ఉండే లారీ డ్రైవర్లతో కూర్చొని వాళ్ళు పాడే పాటలు, వారి టేప్ రికార్డర్లలో పెట్టుకునే పాటలు వింటూ గడపడం భూపేన్ దా దినచర్యలో భాగమైంది. భూపేన్ దా జీవితంలో మరో ముఖ్యమైన మలుపు బిష్ణురభాను కలుసుకోవడం. బిష్ణురభా సోషలిస్టు రాజకీయాలు కలిగిన కవి, గాయకుడు. పేదలు, శ్రామికులు, పీడితుల గురించి బిష్ణురభా పాడేపాటలు భూపేన్ దా సైద్ధాంతిక దృక్పథానికి బాటలు వేశాయి. అదేవిధంగా తనను గాయకుడిగా సినీరంగానికి పరిచయం చేసిన జ్యోతి ప్రసాద్ అగర్వాల్ నుంచే హజారికాకు మార్క్సిస్టు సిద్ధాంతంతో పరిచయమైంది.

కొత్త కోణం



భూపేన్ హజారికాతో వ్యాస రచయిత మల్లెపల్లి లక్ష్మయ్య

భూపేన్‌దా తల్లిదండ్రులకు తమ కొడుకు జర్నలిస్టు కావాలని ఉండేది. కానీ ఆయన ప్రపంచం సంగీతమే. అయితే తల్లిదండ్రుల కోరిక మేరకు కలకత్తాలో బీఏ డిగ్రీ, బనారస్ హిందూ యూనివర్సిటీ నుంచి ఎంఏ పట్టాను సాధించారు. చాలా కొద్దికాలం గౌహతీలోని రేడియో కేంద్రంలో పనిచేశారు. ఆ తర్వాత స్కాలర్‌షిప్ రావడంతో జర్నలిజంలో ఉన్నత విద్యను అభ్యసించడానికి 1949 లో అమెరికాలోని కొలంబియా విశ్వవిద్యాలయానికి వెళ్ళారు. ఆయన కొలంబియాలో చదువుతున్న సమయంలో నల్లజాతి ప్రజల హక్కుల ఉద్యమం ఉధృతంగా సాగుతోంది. ఆ ఉద్యమంలో నల్లజాతి గాయకుడు పాల్ రాబ్సన్ ఒక ధిక్కార స్వరం. భూపేన్ హజారికాను పాల్ రాబ్సన్ సంగీతం, పాటలు అమితంగా ఆకర్షించాయి. దీంతో నల్లజాతి ప్రజా ఉద్యమంలో హజారికా కూడా భాగమయ్యారు. పాల్ రాబ్సన్ ప్రదర్శనల మీద అమెరికా పోలీసుల నిర్బంధం తీవ్రంగా ఉండేది. చాలాసార్లు పాల్‌రాబ్సన్‌తో పాటు, ప్రదర్శనలను చూడటానికి వచ్చిన ప్రేక్షకులను కూడా అరెస్టు చేసే వాళ్ళు. అదే సందర్భంలో భూపేన్ హజారికా కూడా రెండు సార్లు అరెస్టయ్యారు. ఆ సమయంలో అప్పటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ సోదరి విజయలక్ష్మీ పండిట్ అమెరికాలో భారత రాయబారిగా ఉన్నారు. ఆమే స్వయంగా జోక్యం చేసుకొని భూపేన్ హజారికాను విడుదల చేయించినట్టు, భూపేన్ స్వయంగా నాతో ఇంటర్వ్యూలో చెప్పారు. ఆ తరువాత కూడా ఆయన తన విప్లవ రాజకీయాల నుంచి వెనుదిరగలేదు. భారతదేశంలోనూ అదే స్ఫూర్తిని కొనసాగించారు. 1953వ సంవత్సరంలో అమెరికా నుంచి భారత దేశానికి తిరిగిరాగానే ఆనాడు కమ్యూనిస్టుల నాయకత్వంలో ఉన్న భారత ప్రజానాట్య మండలి (ఇప్టా)తో సన్నిహిత సంబంధాలు ఏర్పరుచుకున్నారు. 1955లో గౌహతిలో జరిగిన ఇప్టా అఖిల అస్సాం మూడవ మహాసభలకు ఆహ్వాన సంఘం కార్యదర్శిగా పనిచేశారు. అస్సాంలో.. ప్రత్యేకించి ఈశాన్య రాష్ట్రాల పర్వతాలు, అడవులు, నదులు, సముద్రం ఆయన పాటల్లో ప్రతిధ్వనించేవి. తేయాకు తోటల్లో పనిచేసే మహిళా కార్మికుల దయనీయ స్థితిని ప్రతిబింబిస్తూ తాను రాసిన ''ఏక్ కలి దో పత్తియా'' అనే పాట ఆయన్ను శ్రామికజనపక్షపాతిగా నిలబెట్టాయి. పల్లకీలు మోసే బోయీలపై రాసిన ''డోల.. హో.. డోల'' పాట వారి చెమట చుక్కల విలువను ఇనుమడిస్తుంది. ఇలా ఆయన రాసి, పాడిన ప్రతి పాటా జనప్రియమై, ప్రజల నీరాజనాలందుకుంది.

కవిగా, గాయకుడిగా, సంగీత దర్శకుడిగా, సినిమా దర్శకుడిగా పదుల సినిమాల నిర్మాణంలో భాగస్వామి అయ్యారు. ఎన్నో అవార్డులను, రివార్డులను సొంతం చేసుకున్నారు. సినిమా రంగంలో అత్యున్నతమైన దాదాసాహెబ్ ఫాల్కే అవార్డును అందుకున్నారు. పద్మశ్రీ, పద్మవిభూషణ్ బిరుదులను సొంతం చేసుకున్న భూపేన్‌దాకి మరణానంతరం 2019లో భారత రత్న అవార్డునిచ్చారు. ప్రపంచ ప్రజల మదిలో తనదైన స్థానం సంపాదించుకున్న భూపేన్ దా నిగర్వి. 1994లో నేను ఇంటర్వ్యూ చేసిన సందర్భంలో ఎ.ఆర్.రెహమాన్‌పై మీ అభిప్రాయం ఏమిటని అడిగాను. ఎ.ఆర్.రెహమాన్ కృషిని ఆయన ప్రశంసిస్తూనే, శాస్త్రీయ సంగీతంతోనే సంతృప్తి పడకుండా, ప్రజల నాలుకల మీద నాట్యమాడే సంగీత ఝురులను ఒడిసిపట్టుకోగలిగితే రెహమాన్ మంచి సంగీత దర్శకుడవుతాడని చెప్పారు.

భూపేన్ హజారికా జీవితంలో మరొక ముఖ్యమైన ఘట్టం ప్రముఖ చలనచిత్ర దర్శకురాలు, రచయిత కల్పనా లజ్మీతో పరిచయం. 1980 ప్రారంభంలో వీరిద్దరికీ పరిచయం ఏర్పడింది. ఆ తర్వాత ఆయన తుది శ్వాస విడిచే వరకూ ఇద్దరూ మంచి మిత్రులుగా కొనసాగారు. వీరిద్దరూ 1986లో ''ఏక్ పల్'' అనే చిత్రానికి సంగీత దర్శకత్వం అందించారు. ఈ ఇరువురి కాంబినేషన్‌లో చాలా అద్భుతమైన సినిమాలు వచ్చాయి. సినీ ప్రపంచంలో తమదైన ముద్రవేసారు. కల్పనా లజ్మీ, భూపేన్ దా కలిసే జీవించారు. కలిసే స్వప్నించారు. ఆ ఇద్దరి కలల కొనసాగింపుగా వచ్చిందే 'రుడాలి' సినిమా. అదే భారతదేశ చలన చిత్ర రంగంలో సంచలనం రేపింది. మాధురీ దీక్షిత్ నటించిన 'దామిని' సినిమా కూడా వేనోళ్ళ కొనియాడబడింది. వీరిద్దరి సహజీవనం మీద ఎన్నో పుకార్లు వచ్చాయి. ఎన్నెన్నో విమర్శలను ఎదుర్కొన్నారు. అయినా కల్పనా లజ్మీ, భూపేన్‌లు ఒకరికోసం ఒకరన్నట్టుగా బతికారు.

రాజకీయంగా భూపేన్ దా నిర్వహించిన పాత్ర మరువలేనిది. 1967–72 మధ్యలో అస్సాం శాసన సభలో ఎమ్మెల్యేగా కూడా ఆయన పనిచేశారు. అస్సాంతో సహా ఈశాన్య రాష్ట్రాల్లో జరిగిన అనేక ఉద్యమాలతో భూపేన్ దాకు సత్సంబంధాలుండేవి. ఈశాన్య రాష్ట్రాలను ఢిల్లీ ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయనే వాదనను భూపేన్ అవకాశం వచ్చినప్పుడల్లా వినిపించారు. సాయుధ తిరుగుబాట్లను ప్రత్యక్షంగా సమర్థించకపోయినా, అటువంటి పరిణామాలకు ప్రభుత్వాలదే బాధ్యతని తేల్చి చెప్పిన ధీశాలి. అస్సాంలో అస్సాం గణపరిషత్ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఆయన తన నిరసన గళాన్ని విడువలేదు. ఆ ప్రభుత్వం కూడా అస్సాం ప్రజల ఆకాంక్షలను నెరవేర్చలేదని బహిరంగంగా చెప్పారు. నవంబర్ 5, 2011న కన్నుమూసిన భూపేన్‌దాకు ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది నివాళి అర్పించారు. గౌహతిలో నవంబర్ 9వ తేదీన జరిగిన అంత్యక్రియల్లో దాదాపు 5 లక్షల మంది పాల్గొనడం 'భారతరత్న' కంటే చాలా ముందు సంగీత సామ్రాజ్యాధిపతికి భారత ప్రజలిచ్చిన ఘనమైన నివాళి.


వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు । మొబైల్ : 81063 22077

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

బుల్లెట్స్



"జాతిపిత మహాత్మాగాంధీ నుంచి కర్ణాటకకు చెందిన జర్నలిస్టు గౌరీ లంకేష్ వరకూ హంతకుల బుల్లెట్లు క్రూరత్వాన్నే ప్రదర్శించాయి. అయినా వ్యవస్థపై మా ప్రతిఘటన ధైర్యంగా కొనసాగింది. వారి బుల్లెట్లు హతమార్చడాన్ని, విడదీయడాన్నీ లక్ష్యంగా చేసుకున్నాయి. అసమ్మతినీ, వైవిధ్యాన్నీ, ప్రజాస్వామ్యాన్ని నిలుపుకోవడం కోసమే మా ఈ పోరాటం"

– ఉమర్ ఖలీద్
విద్యార్థి నాయకుడు

అనుసరణ



"కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, ప్రధాని నరేంద్ర మోదీ ఒకరి నొకరు అనుసరిస్తున్నారా? పడిపోయిన కెమెరామన్‌కు రాహుల్ సహాయం చేసిన మరునటి రోజే, సూరత్‌లో స్పృహ కోల్పోయిన వ్యక్తిని మోదీ కూడా అలాగే ఆదుకోవడం విడ్డూరం"

– సునేత్ర చౌదరి
ఎన్ డీటీవీ పొలిటికల్ ఎడిటర్

ప్రశ్న



"రాహుల్ గాంధీ ప్రకటించిన కనీస వేతన హామీ పథకంపై డబ్బులు ఎలా వస్తాయి, తీరుతెన్నులేమిటంటూ అనేక మంది ప్రశ్నలు లేవనెత్తడం ఆరోగ్యకరం, ఆనందకరం. అయితే, ప్రధాని నరేంద్ర మోదీ ఇస్తున్న హామీల గురించి కూడా ఇలాగే ప్రశ్నించాలని ఎవరైనా, ఎప్పుడైనా అనుకున్నారా?"

– అజయ్ కామత్, నేత్ర వైద్యుడు

పండుగ



"గాంధీజీపై దాడిని హిందూ మహాసభ సెలబ్రేట్ చేసుకుంది. ఉగ్రవాద దాడులను ముస్లింలు సెలబ్రేట్ చేసుకోగా నేనెప్పుడూ చూడలేదు. భారతదేశంపట్ల విశ్వసనీయత గురించి ముస్లింలనే ఎందుకు ప్రశ్నిస్తారు?"

– ప్రశాంత్ కనోజియా, ద వైర్ జర్నలిస్ట్

దొంగలు



"ఢిల్లీలోని ఖాన్ మార్కెట్‌లో చిల్లర దొంగతనాల గురించి చాలాసార్లు విన్నాను. అక్కడి పోలీస్ స్టేషన్ ఎదుట జర్నలిస్ట్ నిధి తండ్రి మొబైల్‌ఫోన్ అపహరణకు గురైనా పట్టించుకునే నాథుడే లేడు. ఓ ఏడాది క్రితం అదే ప్రాంతంలో జేఎన్‌యూ విద్యార్థి సంఘం మాజీ నాయకురాలు షెహ్లా రషీద్‌కు కూడా ఇదే పరిస్థితి ఎదురయ్యింది. అక్కడ సుమారు పది సీసీటీవీ కెమెరాలు ఉన్నా... ఢిల్లీ పోలీసులు ఈ దుశ్చర్యలను ఎందుకు నిలువరించలేకపోతున్నారు? దొంగలను ఎందుకు పట్టుకోలేకపోతున్నారో నాకు అర్థం కావటం లేదు?"

– తహ్సీన్ పూణావాలా
కాలమిస్ట్

వార్షికం

జీవన కాలమ్



నటి కృష్ణవేణితో వ్యాస రచయిత గొల్లపూడి

ఈ వార్షికం ప్రతీ యేటా ఇచ్చే పద్మ అవార్డుల గురించి కాదు. ఇవ్వని పద్మ అవార్డుల మీద నా స్పందన గురించి. 'వార్షికం' అనే మాటలో వైదికంగా దుర్మార్గమయిన అర్థం. ఇంక కెలకను.

చాలాసార్లు ఈ అవార్డులు పూర్తిగా చచ్చిపోయిన వారికో, లేదా సగంసగం పోతున్న వారికో ఇవ్వడం రివాజు. అయితే ఈ సంవత్సరం చాలా కారణాలకి ఆనందించదగ్గ విషయం– మిత్రులు సిరివెన్నెల సీతారామశాస్త్రి పద్మశ్రీ. సాహితీపరులకిచ్చే సత్సాంప్రదాయం, ఓ సినీ గేయ రచయితకి– అందునా సీతారామశాస్త్రికి ఇవ్వడం చాలా హర్షణీయం. ఈ అవార్డులు సాధారణంగా ఇంత దూరం ప్రయాణం చెయ్యవు.

కానీ ఇదేమిటి! శాస్త్రిగారి పేరు పక్కన 'తెలంగాణ' అన్న మాట ఉంది. వారి పేరుని తెలంగాణ ప్రభుత్వం సూచించిందా? ఆశ్చర్యం లేదు. ఏపీ ప్రభుత్వానికి అంత తీరిక లేదు. అలనాడు బాలసుబ్రహ్మణ్యం, పి. సుశీల పద్మ అవార్డులను తమిళనాడు ప్రభుత్వం ప్రతిపాదించింది. వారి సినీ రచయిత వైరముత్తు పద్మభూషణ్. ఏమయినా తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

శాస్త్రిగారి గొప్పతనానికి ఒకే ఒక మచ్చుతునకని ఉటంకించాలని ఉంది. 1992లో నేనూ, జేవీ సోమయాజులు, పద్మనాభం, తులసి ప్రభృతులం అమెరికా వెళ్లాం. నేను 'మనిషి గోతిలో పడ్డాడు' అనే నాటికని రాశాను. గోతిలో పడిన మనిషిని చూసి రకరకాల సామాజిక స్థాయిలకు చెందిన వ్యక్తులు అతని స్థితిని విశ్లేషిస్తారు. చివరికి అతనికి సహాయం చెయ్యకపోగా పెద్ద బండ రాయితో చంపుతారు. అక్కడొక పాట ఉంటే ముగింపు బాగుంటుందని మాకనిపించింది. ఎలాంటి పాట ఉండాలి? అనుకోలేదు. అప్పుడు మా శ్రీనివాస్ బతికే ఉన్నాడు. నేను పాట చేయిస్తానన్నాడు. సీతారామశాస్త్రి దగ్గరికి పరిగెత్తాడు. కథ చెప్పాడు. న్యాయంగా ఎలాంటి పాట రాయాలి? చచ్చిపోతున్న వ్యక్తి– సమాజ స్వార్థానికి బలి అయిన వ్యక్తి ఆర్తనాదం.

శ్రీశ్రీ ఆవేశంగా 'ఎముకలు కుళ్లిన వయస్సు మళ్లిన....' అంటారేమో! వేటూరి 'ఈ అపరభీష్ముల రాజ్యంలో ఎందరో బృహన్నలలు...' అంటారేమో! ఆత్రేయ 'ఈ స్వార్థపరుల ప్రపంచంలో తలపగిలిన దీనుడు...' అంటారేమో!

సీతారామశాస్త్రిని నేనెప్పుడూ కలవలేదు. చావు బతుకుల్లో ఉన్న మనిషి– గోతిలో కొన ఊపి రితో ఉన్నాడు. అతని మాట... శాస్త్రి అన్నాడు కదా...

'నాకెంతో సంతోషంగా ఉంది
నాకెంతో ఆనందంగా ఉంది
చరిత్ర లోతెంతో కొలవగలిగినందుకు
తలెత్తి పాతాళం చూడగలిగినందుకు...'

విశీర్ణమైన మనిషి పాతాళంలో చచ్చిపోతూ– మానవాళి నీచత్వపు లోతుల్ని చూశానని నవ్వుకున్నాడట! నిర్ఘాంతపోయాను. సిరివెన్నెల– ఓ కవితను– పది సాధారణమైన ఆలోచనల స్థాయిని చీల్చి ముందుకు వెళ్తాడు. అక్కడా అతను మొదటి పల్లవి. అతనికి పద్మశ్రీ తెలుగు కవితకి పట్టాభిషేకం. మన తెలుగువారికి మనల్ని చూసి మనం గర్వపడే సహృదయం లేదు. తమిళులకీ, బెంగాలీలకీ అది సొత్తు.

ఈ దేశంలో ఓ మహానటి ఉన్నారు. కృష్ణవేణి. ఆమెకి 94 సంవత్సరాలు. మిత్రులు రావికొండలరావుగారు నాకు మెసేజ్ పంపారు. తన ఆరవ యేట నుంచే నటనా రంగంలో కాలుమోపి, మీర్జాపురం రాజావారి ఇల్లాలుగా సినీ నిర్మాత అయి ఓ మహానుభావుడు ఎన్టీఆర్‌నీ, ప్రతినాయక పాత్రలు ధరించిన పద్మవిభూషణ్ అక్కినేనిని హీరోగా 'కీలుగుర్రం'లో పరిచయం చేసిన విదుషీమణి– నా చిన్నతనంలో 'లక్ష్మమ్మ'ని తన్మయులమై చూసిన గుర్తు ఇంకా చెరిగిపోలేదు– కృష్ణవేణి గారిని ఇంకా తెలుగుజాతి గౌరవించుకోలేదు.

చెన్నైలో నాలుగు రోడ్ల కూడలిలో ప్రముఖ రచయిత– ఆనాడు పద్మ అవార్డుకి నోచుకోని కన్నదాసన్ విగ్రహం ఉంది. మన ఆత్రేయకీ, పింగళికీ లేదు. ఎన్.ఎస్. కృష్ణన్ విగ్రహం ఉంది. మన రేలంగికీ, శివరావుకీ లేదు. పద్మభూషణ్ శ్రీపాద పినాకపాణి గౌరవానికి సెమ్మంగుడి అభిరుచి పెట్టుబడి అంటారు. మహా గాయకుడు అన్నమాచార్యను ఆకాశంలో నిలిపిన అజరామరమైన కీర్తనలు చేసి, తన జీవితాన్నే ఒక ఉద్యమం చేసుకున్న బాలకృష్ణ ప్రసాద్ వంటి శిష్యుడిని సమర్పించిన నేదునూరిని ఈ జాతి గౌరవించుకోలేదు. మన గొప్పతనాన్ని చూసి మాత్రమే కాదు, చూపి, నెత్తికెత్తుకుని గర్వపడటం జాతి సంస్కారం. ఏపీ ప్రభుత్వం అలాంటి పనిచెయ్యదేం?

ఏ కూడలిలోనో ఓ రమణారెడ్డి, ఓ సముద్రాల, ఓ వేటూరి పలకరించరేం? తమిళనాడులో సంగీత కళానిధులూ, పద్మశ్రీలూ ఎటుచూసినా కనిపిస్తారు. 'మా మహనీయుల్ని ఆకాశంలో నిలిపే ఉపకారం మీరు చేసిపెట్టండయ్యా' అని చరిత్ర చెప్తూంటే– సిగ్గుతో తలవంచుకుని వారి మధ్యనుంచి నడుచుకు పోతూంటాను.

బడుగు విద్యార్థుల సంక్షేమం పట్టదా?

అభిప్రాయం



డా॥ కత్తి పద్మారావు

రెండు తెలుగు రాష్ట్రాల్లో పాలకులు సంక్షేమ హాస్టళ్ళను గాలికి వదిలేశారు. రెండు రాష్ట్రాల్లో కలిపి 5,765 సంక్షేమ వసతి గృహాలు ఉన్నాయి. ఇందులో 8,70,000 మంది పిల్లలు చేరి చదువుకుంటున్నారు. రెండు రాష్ట్రాల్లో రెండు లక్షలకు పైగా వార్షిక బడ్జెట్ వుంది. కానీ సంక్షేమ హాస్టళ్ళు మాత్రం నలభై రెండు శాతం అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. ఒక్కొక్క గదిలో పది మంది పిల్లల్ని కుక్కారు. ఒక్కొక్క బాత్‌రూమ్‌ను ముప్పై మందిదాకా ఉపయోగిస్తున్నారు. బాత్‌రూమ్‌లు ఎప్పటివో. హాస్టళ్ళ క్యాంపస్‌లోకి వెళితే దుర్వాసన. వంటగది అంతా ఈగల మయం. పిల్లల శరీరం నిండా గజ్జి, తామర వంటి చర్మవ్యాధులతో గోళ్ళు పెంచుకొని గీకటం వల్ల రక్తపు మరకలు వారి శరీరం మీద కనపడుతున్నాయి. ఇక ఆడపిల్లల విషయానికి వస్తే 52 మంది ఒక బాత్‌రూమ్ లోనే స్నానం చేయాలి. ఈ సంవత్సరం 10 వేలమంది ఆడపిల్లలు ఈ దుర్భర పరిస్థితులు భరించలేక చదువు కూడా మానుకున్నారు. యాభైశాతం హాస్టళ్ళకు మంచి నీళ్ళు లేవు. హాస్టల్లో చదివే ఆడపిల్లలకు అయితే నూటికి తొంభైతొమ్మిది మందికి తగిన పాళ్లలో రక్తం లేదు. ఉడికీ ఉడకని అన్నంతో కడుపులో నొప్పి. చింతపండు బాగా పిసికిన చారు పోయడంతో విపరీతమైన కడుపు మంటలు, అల్సర్లు. పిల్లలకు జీవితం మీద విరక్తి కలుగుతుంది.

చంద్రబాబు తన మనవడికి పట్టువస్త్రాలు కట్టి, టోపీలు పెట్టి, రత్నాలతో కూడిన దండలు వేసి తిరుపతి వేంకటేశ్వర స్వామి చుట్టూ ప్రదర్శనలు చేయిస్తున్నారు. కానీ తన పరిపాలనలో ఉన్న పిల్లలకు దుప్పట్లు లేక చలికి గజగజవణుకుతూ ఒక పిల్లవాడు ఇంకో పిల్లవాణ్ని కరుచుకొని పడుకుంటున్నారని తెలియదా! ఈ హాస్టళ్ళల్లో ఎస్సీ, ఎస్టీ పిల్లలు వుంటారని వాళ్ళకు తెలుసు. ఈ పిల్లలు చదువుకోవడం, ఆరోగ్యంగా ఉండటం పాలకులకు ఇష్టం లేదనిపిస్తోంది. 2016–17 ఆర్థిక సంవత్సరంలో తెలుగు రాష్ట్రాల వసతి గృహాలకు వినియోగించాల్సిన డబ్బు 33% ఖర్చుకాకుండా మిగిలిపోయింది. అంటే ఎస్సీ, ఎస్టీ పిల్లల సంక్షేమంపై ఖర్చు పెట్టకూడదు, వీళ్ళకు విద్య రాకూడదు, వీళ్ళు మెరుగ్గా ఉండకూడదు, వీళ్ళు కళగా ఉండకూడదు, వీళ్ళు ఆరోగ్యంగా ఉండకూడదనే ఫ్యూడల్ భావజాలం సీఎంలిద్దరికీ ఉంది. 2017–18లో విషజ్వరాలతో హాస్టళ్ళ నుంచి పదివేల మంది విద్యార్థుల వరకు ఇళ్ళకు వెళ్ళిపోయారు. నలభై శాతం మంది విరోచనాల బారిన పడ్డారు.


సాంఘిక సంక్షేమ హాస్టళ్ళంటే బందెల దొడ్లనీ, కిటికీల తలుపులు సరిగా లేక కుక్కలు వచ్చి అక్కడ పడుకుంటాయని, మంచాలు దుప్పట్లు లేక గచ్చు బండల మీద ఒట్టి ఒంటితో విద్యార్థులు పడుకుంటారని కాగ్, లోకాయుక్త సంస్థలు తమ రిపోర్టులో పేర్కొన్నాయి. హైకోర్టు ఆరేళ్ళ క్రితమే హాస్టళ్ళ మీద దాఖలైన పిటిషన్ మీద విచారిస్తూ 'ఈ పిల్లలు మనుషులు కాదా, పాలకులకు మానవత్వం లేదా?' అని వ్యాఖ్యానించింది. జ్ఞానం విషయం అలా ఉంచి, బడుగు పిల్లల పట్ల కనీసం కరుణ, మానవత్వం కూడా లేవని బాబు నిత్యం నిరూపించుకుంటున్నారు.

ఏపీ రాష్ట్రంలో శిశువులను కనలేక తల్లులు, తల్లి ప్రసవంలోనే పిల్లలు వేలాది మంది చనిపోతున్నారు. వీరందరూ బడుగు జీవుల పిల్లలే కదా! కొందరు మరింత కోటీశ్వరులు కొందరు మరింత పేదలు అవ్వడానికి బాబు కారణం కాదా? పసుపు కుంకుమల పేరుతో డ్వాక్రా మహిళలకు 10 వేల ఫండ్ ఇస్తానంటున్నారు కానీ దాని కంటే మద్యపాన నిషేధం చేస్తే కుటుంబం, ఊళ్ళు బాగుపడతాయి కదా! తాను ఎన్నికల్లో గెలవడం కోసమే బెల్టు షాపులను ఉధృతంగా పెంచుతున్నారు. ఈ ఒక్క సంవత్సరంలో ఆరు లక్షల మంది అమ్మాయిలు లేత వయస్సులో భర్తలేని వారు కావడానికి బాబు మద్యవిధానం కారణం కాదా!

అంబేడ్కర్ పాలకునికి సామాజిక న్యాయ దృష్టి ఉండాలని చెప్పాడు. రాజ్యాంగం బడుగుల విద్యా వ్యవస్థకు పటిష్టమైన పునాదులు ఏర్పరచింది. సంక్షేమ రాజ్యం అంటే విద్యా, వైద్య రంగాల్ని నిరంతరం ప్రజ్వలింప జేయడం. కానీ లక్షల మంది బడుగు పిల్లల శరీర శక్తిని, మానసిక శక్తిని నిర్వీర్యం చేస్తున్న చంద్రబాబు రాజ్యాంగ లక్ష్యాలనే నిరాకరిస్తున్నారు. పైకి ఎన్ని మాటలు చెప్పినా బడుగు జీవుల సంక్షేమాన్ని తెలుగు నేలను పాలిస్తున్న పాలకులు తూట్లు పొడుస్తున్నారు. ఓటు పునాదిగా ఉన్న రాజకీయాలు, ఓట్లు లేనివారి జీవన విధ్వంసానికి పూనుకుంటున్నాయనే చారిత్రక సత్యాన్ని గమనించి నూతన సామాజిక విప్లవానికి అందరు సన్నద్ధం కావాల్సిన సమయం ఇది. చరిత్ర నియంతలను కూలుస్తుంది. ప్రజాస్వామ్య వాదులకు పట్టం గడుతుంది. అసలైన వ్యక్తిత్వ నిర్మాణానికి రాజ్యాంగమే గీటురాయి.

వ్యాసకర్త సామాజిక తత్వవేత్త, నవ్యాంధ్ర పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు। 98497 41695

సాక్షి
ఫ్యామిలీ
నల్లగొండ
గురువారం
31-1-2019



ఇంతకుముందు 'ఎమ్టీనెస్ట్ సిండ్రోమ్' గురించి మాట్లాడాం. వృద్ధ దంపతులు.. పిల్లలు దగ్గర లేకపోవడం వల్ల ఎన్నో మానసిక వ్యథలకు గురి అవుతారు. అలాంటి వ్యధే.. 'లేట్ ఆన్‌సెట్ సైకోసిస్' కూడా. పిల్లల్లాగే, భర్తా దూరమైపోతాడేమోనన్న మానసిక స్థితి ఇది. షష్టిపూర్తి అయిపోయినా.. దంపతులు ప్రేమించుకోవడమే కాదు.. ప్రేమను వ్యక్తం చేసుకోవడమూ అవసరమే అంటున్నారు డాక్టర్లు.

ఆమెకు 60 ఇప్పుడు అనుమానం

అమ్మ ఎలా ఉంది నాన్నా?

వారానికి ఒకసారి ఫోన్ మోగుతుంది. అమెరికా నుంచి అబ్బాయి.

'ఎలా ఉన్నావు నాన్నా'

'బాగున్నారా' 'అమ్మ ఎలా ఉంది?'

'బాగుంది. దానికేం?'

'ఏమైనా కావాలా నాన్నా'

'నాకేం కావాలిరా? నీకేమైనా కావాలంటే చెప్పు పంపుతా'

'ఏం అక్కర్లేదు నాన్నా.. ఇక్కడ ఏం కావాలన్నా దొరుకుతుంది. ఉండనా?'

ఫోన్ పెట్టేస్తాడు.

మరి కాసేపట్లో ఫోన్ మోగుతుంది. అమెరికా నుంచే. ఈసారి అమ్మాయి.

'ఫోన్ దగ్గర పెట్టుకోండి నాన్నా. కాల్ చేసినప్పుడు ఎత్తరు'

'వాకింగ్‌కు వెళ్లానమ్మా'

'కాదులెండీ... అమ్మ ఏదో తెమ్మనుంటుంది వెళ్లుంటారు'

'సరిగ్గా చెప్పావు'

'అమ్మను మరీ గారాం చేస్తారు మీరు. అమ్మ ఎలా ఉంది? బాగుంది కదా'

'అయ్యో... దానికేం తల్లీ... బ్రహ్మాండంగా ఉంది'

'ఈ సంవత్సరం కూడా రావడం కుదిరేలా లేదు నాన్నా. పిల్లలకు ఎగ్జామ్స్. ఇంకా ఈయనకు కూడా లీవు దొరకదు'

'పర్లేదమ్మా... ఏం పర్లేదు. మీరు హ్యాపీగా ఉండండీ చాలు'

'థ్యాంక్యూ నాన్నా. ఉంటాను' పెట్టేస్తుంది.

అబ్బాయి ఒక మాట అని ఉంటే బాగుండేది.

'అమెరికాలో అన్నీ దొరుకుతున్నాయి... ఒక్క అమ్మానాన్న ప్రేమ తప్ప' అని.

అమ్మాయి ఇంకో మాట కూడా అనాల్సింది– 'ఈసారి ఏమైనా సరే వచ్చి ఒక నెల రోజులు ఉంటాం నాన్నా' అని.

కొడుకు, కూతురు ఇలా ఫోన్ పలకరింపులు కాకుండా నేరుగా ఆ అమ్మానాన్నలను చూసి ఉన్నా, తమతో తీసుకెళ్లి ఉన్నా కథ వేరేగా ఉండేది.

* * *

శ్రీనివాసరావు, సీత ఇద్దరూ ఆ కాలనీలో ఎన్నో ఏళ్లుగా ఉంటున్నారు. ఇద్దరినీ ఎవరూ పేర్లతో పిలువరు. ఆయనను 'సారు గారు' అనీ ఆమెను 'మేడమ్ గారు' అని పిలుస్తారు. ఇద్దరూ కాలేజీలో లెక్చరర్లుగా పని చేసి రిటైర్ అయ్యారు. ఇద్దరూ ఒకప్పుడు పెద్దలను ఎదిరించి ప్రేమ వివాహం చేసుకొని వార్తలు సృష్టించారు. కులాలు వేరు కావడం వల్ల ఇరు వర్గాల వాళ్లు పిల్లలు పుట్టి కొంచెం పెద్దవాళ్లు అయ్యేవరకు కూడా దూరం పెట్టారు. ఆ తర్వాత కలిసినా మునుపటి బంధం మిస్సయినట్టే. అంతవరకూ సీతా మేడమ్‌కు భర్తే తోడు. పిల్లలు తోడు. కాలనీవాసులు తోడు. ఆయనకు ఆమె అంటే చాలా ప్రేమ. కొంగు పట్టుకునే తిరుగుతాడు. తనకు క్లాసులు లేకపోయినా ఆమెకు క్లాసులు ఉన్నంత వరకూ ఉండి ఇంటికి తీసుకువెళతారు. ఇద్దరికీ చదువు విలువ తెలుసు. కనుక పిల్లలను బాగా చదివించారు. పిల్లలూ బాగా చదువుకున్నారు కనుక అమెరికాలో స్థిరపడ్డారు. కొడుక్కు కోడలు అమెరికాలోనే దొరికింది. కూతురుకు అల్లుడూ అమెరికాలోనే దొరికాడు.

రిటైరయ్యాక 'ఇన్నాళ్లూ అలవాటు పడ్డ ప్రాణాలు ఇక్కడే ఉంటాం' అని వాళ్లు అన్నారు.

'లేదు.. మీరొచ్చి మా దగ్గర ఉండాల్సిందే' అని పిల్లలు బలవంత పెట్టడం మర్చిపోయారు.

* * *

ఒకరోజు శ్రీనివాసరావు బజారు నుంచి వచ్చేసరికి సీత వీధిలోనే నిలబడి అనుమానంగా చూస్తూ ఉంది.

'ఏమిటి?' అన్నాడాయన గేటు వరకూ వచ్చాక.

'అదే... ఎవత్తది' అందామె.

ఆయన ఉలిక్కిపడి అటూ ఇటూ చూసి 'ఎవరూ' అన్నాడు.

'మీరు వీధి చివర ఎవర్తోనో కబుర్లు చెప్పి వచ్చారు. ఏమీ ఎరగనట్టు నాటకాలాడుతున్నారే' అంది.

శ్రీనివాసరావుకు అయోమయంగా అనిపించింది.

'ఎవర్తోనూ మాట్లాడలేదే'

'అన్నీ గమనిస్తున్నాను. ఈ వయసులో మీకు వేషాలు మొదలయ్యాయి. ఎవరితోనో పోయి నా కొంప ముంచడానికేగా' ఏడుస్తూ లోపలికి పరిగెత్తుకుని పోయింది.

శ్రీనివాసరావు జీవితంలో దురదృష్టకరమైన దశ నాటితో మొదలైంది.

* * *

అతనికి అరవై ఆరు. ఆమెకు అరవై. ఈ వయసులో ఒక మధురమైన జీవితం గడపాలని అనుకున్నాడు శ్రీనివాసరావు. ప్రేమ వివాహం కావడం వల్ల, పెద్దల ఆదరణ లేకపోవడం వల్ల, పేదరికం నుంచి రావడం వల్ల, ఉద్యోగమే సర్వస్వమనుకుని చేశాడు. ఆమె కూడా అంతే కష్టపడింది. ఇన్నాళ్లకు బాధ్యతలు తీరి సంతోషాలు పంచుకుందామనుకుంటే ఈ సమస్య వచ్చిపడింది. అనుమానం. తీవ్ర అనుమానం. అతడు ఏం చేస్తున్నాడు... ఎవరితో మాట్లాడుతున్నాడు... ఇంట్లో నుంచి ఎన్నింటికి బయటకు వెళ్లి ఎన్నింటికి వస్తున్నాడు... ఇవన్నీ ఆమె ఆరా తీసేది. అసలు ఏమీ చేయకుండా కిటికీలో నుంచి ఆకాశం వైపు చూస్తూ నిలుచున్నా 'ఎవరిని చూస్తున్నారు?' అని వెనగ్గా వచ్చి అడిగేది.

> అన్నీ గమనిస్తున్నాను. ఈ వయసులో మీకు వేషాలు మొదలయ్యాయి. ఎవరితోనో పోయి నా కొంప ముంచడానికేగా!

శ్రీనివాసరావు మెల్లగా కాలనీలో ఆడవాళ్లతో మాట్లాడటం మానేశాడు. అప్పుడప్పుడు డౌట్స్ కోసం గర్ల్ స్టూడెంట్స్ వచ్చేవారు. వాళ్లను రాకుండా చేశాడు. సమస్య సాల్వ్ కాలేదు.

చివరికి పనిమనిషిని కూడా తీసేయాల్సి వచ్చింది. ఊహు... లాభం లేకపోయింది.

అతడికి కోపంగా ఉంది. బాధగా ఉంది. భార్య మీద ప్రేమ క్షణక్షణానికి తరిగిపోయి విసుగూ చిరాకూ ఎక్కువవుతున్నాయి. పిల్లలకు చెప్పాలంటే ఎలా చెప్పాలో తెలియడం లేదు. ఇరుగూ పొరుగూ వారికి చెప్తే పరువు పోతుందని అదో భయం.

లోపల లోపల నలిగిపోయి ఒళ్లు అలసిపోయి ఒంటిమీద స్పృహలేనట్టు నిద్ర పోతున్నా ఆమె అనుమానంగా వచ్చి అతడి గదిలో తొంగి చూసేది.

* * *

'దీనిని లేట్ ఆన్‌సెట్ సైకోసిస్ అంటారు' అన్నాడు సైకియాట్రిస్ట్ ఆమెను తీసుకొని వచ్చిన శ్రీనివాసరావుతో.

'ఆమె లోలోపల ఏదో తీవ్రమైన భయం ఉంది. పిల్లలు ఎలా అయితే తనను వదిలి వెళ్లిపోయారో మీరు కూడా అలా వదిలివెళ్లిపోతారనే భయం గూడు కట్టిపోయింది. అనుమానం హేతువును తినేస్తుంది. మానసిక అస్థిమితం చిత్తాన్ని దెయ్యాల కార్ఖానా చేసేస్తుంది. మనం చాలా ప్రయత్నించాలి. మందులతోనూ మందులు లేకుండానూ' అన్నాడు సైకియాట్రిస్ట్.

'ఇదేం జబ్బు డాక్టర్. ఎవరికైనా చెప్పుకోవడానికైనా సిగ్గుగా ఉంది. ఈ వయసులో నా మీద అభాండాలు వేస్తుందంటే నాకు చాలా ఇబ్బందిగా ఉంది. అందుకే ఈ ట్రీట్‌మెంట్‌ను సీక్రెట్‌గా పెట్టి చేయండి' రిక్వెస్ట్ చేశాడు శ్రీనివాసరావు.

'చూడండి శ్రీనివాసరావుగారూ... అసలు ముందు మనం చేయాల్సిన పని మీ పిల్లలను ఇన్‌వాల్వ్ చేయడమే. ఎందుకంటే, మీరు బయటి వ్యక్తి. కాని పిల్లలు ఆమె లోపలి నుంచి వచ్చారు. తల్లికి పిల్లల స్పర్శ, స్పందన, పరామర్శ, ఎదురుగా ఉండటం ఇవెప్పుడూ ఆమెకు బలాన్ని ఇస్తాయి. ఆమెకు ఏ అనారోగ్యం వచ్చిందో ఆమెకు తెలియదు. ఆమె బిహేవియర్ కూడా ఆమెకు గుర్తు ఉండదు. మెల్లగా ఆమెను పిల్లల్లో పడేయండి. మందులు ఇద్దాం. కౌన్సెలింగ్ కూడా చేద్దాం' అన్నాడు సైకియాట్రిస్ట్.

'అలాగే మీరు కూడా మీలో ఉన్న ప్రేమ ఆమెకు తెలిసేలా చేయండి. మీరు ఆమెను ప్రేమించే రోజుల్లో ఎన్నో ప్రేమలేఖలు రాసి ఉంటారు. నువ్వంటే నాకు ప్రేమ అని ఉంటారు. అని పెళ్లయ్యాక ఇన్నేళ్లలో ఒక్కసారి కూడా ఆ మాట అని ఉండరు. అన్నారా?'

'లేదు డాక్టర్'

'అనుమానం జబ్బు కానీ ప్రేమ ఆశించడం జబ్బు కాదు. మీ ప్రేమ ప్రదర్శనే ఆమెకు సగం మందు. మగవాళ్ల ప్రపంచాన్ని ఫిల్ చేయడానికి చాలా ఉంటాయి. కాని స్త్రీల ప్రపంచాన్ని ఫిల్ చేసేది మాత్రం తన కుటుంబ సభ్యుల ఆప్యాయత, కన్సర్న్ మాత్రమే'....

* * *

రోజులు గడిచాయి. మొదటిసారి వీసాలు కట్టించుకుని శ్రీనివాసరావు, సీత అమెరికా వెళ్లారు.

కొడుకు, కూతురు ఇద్దరూ అక్కడి నుంచే డాక్టర్‌తో ఆమెకు తెలియకుండా మాట్లాడారు.

ఒడిలో ఎగిరొచ్చి కూచునే మనవడు ఆమెకు సగం నయం చేశాడు. ఆమె దగ్గర వేమన పద్యం అతి కష్టం మీద నేర్చుకున్న మనవరాలు మరో సగం నయం చేసింది. శ్రీనివాసరావు చాటుమాటుగా అందించే ప్రేమలేఖలు ఆమె సిగ్గులమొగ్గై అందుకుంటోంది.

'అమ్మ ఎలా ఉంది' అని ఫోన్‌లో అడిగితే అమ్మకు ఎప్పుడూ నయం కాదు.

అమ్మ సమక్షంలో అమ్మతో గడిపితేనే అమ్మ ఎలా ఉందో తెలుస్తుంది.


'మా అమ్మ చాలా బాగుంది' అని నమ్మకంగా చెప్పగలిగే పిల్లలు ఇప్పుడు ఎందరు ఉన్నారు?

– కథనం: సాక్షి ఫ్యామిలీ

ఇన్‌పుట్స్: **డాక్టర్ కల్యాణ చక్రవర్తి**, సైకియాట్రిస్ట్

చెట్టు నీడ

శ్రీ సౌమ్యరామ



ఎంత కోపం వచ్చినప్పటికీ, రాముడు విచక్షణ కోల్పోయిన సందర్భాలు లేవు. తనను అరణ్యవాసం చేయమన్న కైకను ఎందరు ఎన్ని విధాల దూషించినప్పటికీ, తాను మాత్రం తూలనాడలేదు రాముడు. దశరథుడు, కౌసల్య, లక్ష్మణుడు, అయోధ్యాపురవాసులు ఆఖరికి కన్నకొడుకయిన భరతుడు కూడా కైకను నిందిస్తారు. అయినా రాముడు వారందరినీ వారిస్తూ ''ఇప్పటివరకూ కైక నన్ను కన్నకొడుకు కన్నా ఎక్కువగా ఆదరించింది. ఇప్పుడు మాత్రమే ఆమె ఇలా ప్రవర్తిస్తోందంటే దైవ నిర్ణయమే తప్ప వేరు కాదు. దశరథుడు కూడా ధర్మానికి, ఇక్ష్వాకువంశ రాజుల సత్యనిష్ఠకు కట్టుబడి కైక కోరికలకు తలవంచాడే తప్ప, వాంఛకు వశుడై కాదు. తల్లిదండ్రుల మాటను గౌరవించాల్సిన ధర్మం నా మీద ఉంది కాబట్టి తనకు పెద్దకొడుకుగా రాజ్యాధికారం ఉన్నా, అరణ్యవాసమే మిన్న'' అని అడవులకు వెళ్లాడు.

భరతుడు రాముని అయోధ్యకు తీసుకు రావడానికి తన మాతలతో, వశిష్ఠాది గురువులతో, పెద్ద సైన్యంతో అడవికి వస్తున్నప్పుడు, లక్ష్మణుడు అనుమానించి, కోపోద్రిక్తుడై భరతుడి మీద యుద్ధానికి సిద్ధపడినప్పుడు, రాముడు భరతుని పట్ల కోపం తెచ్చుకోకుండా అతని నిజాయితీని సరిగ్గా అంచనా వేశాడు. అధర్మం ఎవరు చెప్పినా రామునికి కోపం వస్తుంది. 'తండ్రి అయినా సరే, చనిపోయిన దశరథుని మాట మన్నించనక్కరలేదు' అని జాబాలి అనే పురోహితుడు చెప్పినప్పుడు, రామునికి కోపం వచ్చింది. కానీ తొందరపడకుండా శాంతవాక్యాలతోనే జాబాలిని ఖండించాడు.

ఇక సుగ్రీవుడు తనకు రాముడిచ్చిన గడువు పూర్తయినప్పటికీ, భోగాలలో మునిగి తేలుతూ, సీతాన్వేషణ ఇంకా మొదలుపెట్టక పోవడంతో రామునికి కోపం వస్తుంది. కానీ దానిని అణచుకుంటాడు. ''మిత్రుడు కాబట్టి మెల్లగా చెప్దాము, ఒక అవకాశం ఇద్దాము. అయినా వినకపోతుంటే అప్పుడు 'వాలి వెళ్లిన దారిలోనే నిన్నూ పంపిస్తాము' అని'' చెప్పి రమ్మని లక్ష్మణుని పంపిస్తాడు. అదే వాలి విషయానికి వచ్చేసరికి అతడు అధర్మాన్నే అనుసరించాడు కాబట్టి హెచ్చరికలు లేకుండా శిక్షిస్తాడు. ఇక్కడ సుగ్రీవునిది కర్తవ్య నిర్వహణా లోపం, వాలిది అధర్మం. కర్తవ్య నిర్వహణలో పొరపాటు సహించవచ్చు కాని, అధర్మాన్ని మాత్రం సహించకూడదని రాముడు తన చేతల ద్వారా చెప్పాడు.

పై మూడు సంఘటనలలో రాముడు ఎవరి మీద కోపం తెచ్చుకోకూడదో, కోపం వచ్చినా దాన్ని ఎలా అదుపులో ఉంచుకోవాలో చెప్పన్నాడు. మనం శ్రీరామచంద్రమూర్తి నుండి నేర్చుకోవలసినది అదే.

– డి.వి.ఆర్.

బ్యూటిప్

కళ్ల కింద నలుపు తగ్గాలంటే...



మానసిక ఒత్తిడి, నిద్రలేమి, పోషకాహార లోపం వల్ల కళ్ల కింద నల్లని వలయాలు ఏర్పడతాయి. ఇవి ముఖ సౌందర్యాన్ని దెబ్బతీస్తాయి. కళ్ల కింద నలుపు తగ్గాలంటే...

- అర టీ స్పూన్ బాదంపప్పు పొడి, కొద్దిగా గంధం పొడి, అర టీ స్పూన్ బంగాళదుంప రసం, పది చుక్కల నిమ్మరసం కలిపి కళ్ల కింద నల్లని వలయాలున్నచోట మృదువుగా రాయాలి. పదినిమిషాలు కళ్లు మూసుకొని, విశ్రాంతి తీసుకొని, తర్వాత చల్లని నీళ్లతో శుభ్రపరచాలి. రోజు విడిచి రోజు ఇలా చేయడం వల్ల నల్లని వలయాలు తగ్గుతాయి.
- గింజలేని ద్రాక్షపండ్లను సగానికి కట్ చేసి, నలుపుదనం ఉన్నచోట ఉంచి, పది నిమిషాలు ఉంచి తర్వాత శుభ్రపరుచుకోవాలి.
- టీ స్పూన్ తేనెలో 2–3 కుంకుమపువ్వు రేకలు కలిపిన మిశ్రమాన్ని నల్లనివలయాలు, మచ్చలు ఉన్న చోట రాస్తే నలుపు తగ్గి, ముఖ కాంతి పెరుగుతుంది.
- రాత్రి పడుకునే ముందు క్యాబేజీని ఉడికించిన నీళ్లను చల్లార్చి ఆ నీటిని దూది ఉండతో కళ్ల కిందా, ముఖమంతా రాసుకోవాలి. పది నిమిషాల తర్వాత ముఖం శుభ్రపరుచుకోవాలి. రోజూ ఈ విధంగా చేస్తూ ఉంటే నల్లని వలయాలు తగ్గుముఖం పడతాయి. ముఖకాంతి పెరుగుతుంది.

సవరణ

నిన్నటి ఫ్యామిలీ పేజీలో ప్రచురితమైన 'పాపం' ఆర్టికల్‌లో...'కడుపున ఆడపిల్ల పుట్టింది అంటే... అదనపు భారం అని కాదు అర్థం. అంత్యకాలంలో అన్నానికి భరోసా ఉంటుంది' అని రాసిన వాక్యం... ఎడిటింగ్ పొరపాటు వల్ల 'కడుపున ఆడపిల్ల పుట్టింది అంటే... అదనపు భారం అనుకున్నా, అంత్యకాలంలో అన్నానికి భరోసా ఇచ్చేది ఆడపిల్లే' అని ప్రచురితమైంది. గమనించగలరు. – ఫీచర్స్ ఎడిటర్

అదర్ స్టోరీ

నరకం నుంచి బయటికి

పెళ్లయిన ప్రతి ముగ్గురిలో ఒక స్త్రీ.. గృహహింసకు గురవుతున్న దేశం మనది! చట్టాలు, కోర్టులు, పోలీసు వ్యవస్థ.. ఎన్ని ఉన్నా, ఇంటి నాలుగు గోడల మధ్య భర్త, ఇతర కుటుంబ సభ్యులు పెట్టే నరకయాతనను అడ్డుకోలేక పోతున్నాయి. ఒకవేళ ఏ బాధితురాలైనా తనను తాను కాపాడుకోడానికి, తన పిల్లల్ని తీసుకుని బయటి ప్రపంచంలోకి పారిపోయి వచ్చినా.. తల్లీపిల్లలకు రక్షణ ఎవరిస్తారు? చేయడానికి ఆమెకు పని ఎవరు చూపిస్తారు? మళ్లీ అక్కడ కూడా ఇంటిలాంటి సమాజమే వారిని వెంటపడి వేధిస్తే? ఇంట్లో ఉండడమే నయమనిపిస్తే?!

''లేదు, లేదు.. నయం అనిపించదు. నరకంలోకి వెళ్లినా ఇల్లు నయం అనిపించదు'' అని జులేఖా, షైమీన్, రాణి, మమత, జ్యోతి, సునీత, ప్రీతి అంటున్నారు. వీళ్లందరిదీ ఒకటే కథ.. గృహహింస. వీళ్లందరినీ చేరదీసింది ఒకే సంస్థ.. 'గౌరవి'. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో 2014లో ప్రారంభమైన 'గౌరవి' గత నాలుగేళ్లుగా.. ఇంటి హింసను తట్టుకోలేక ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వచ్చిన బాలికలకు, గృహిణులకు ఆశ్రయం ఇస్తోంది. 'హోమ్ షుడెన్ట్ హర్ట్' (ఇల్లు బాధించకూడదు) అనే క్యాంపెయిన్‌తో ఏ ఆసరాలేని ఆడపడుచులను ఆదుకుంటోంది. 'గౌరవి' చేయూతతో బోరుబావుల్లోంచి ప్రాణాలతో బయటికి వచ్చినట్లుగా కొత్త జీవితాన్ని ఆరంభించి, ఆదర్శంగా నిలుస్తున్న కొంత మంది మహిళల సంక్షిప్త వ్యథనాలివి.



● **శివానీ షైనీ,** 'గౌరవి' మేనేజర్

'తోడుగా నేను లేనా' అన్నాడు!


జులేఖాకు 19 ఏళ్లకే పెళ్లైంది. ఆ వెంటనే భర్త ఆమెను భౌతికంగా హింసించడం మొదలైంది. భార్యను కొట్టడం కూడా దాంపత్య జీవితంలో ఒక భాగమే అనుకున్నట్లు, అదొక దైనందిన వైవాహిక ధర్మంగా ఆమెను కొట్టేవాడు! గదిలోకి తోసి, తలుపులు వేసి నరకం చూపించేవాడు. ఆమె ఓర్చుకున్నా ఆమె దేహం ఎన్నాళ్లని తట్టుకుంటుంది. ఓ రోజు భర్త దెబ్బలకు నిలువునా కూలిపోయింది. అమ్మానాన్న వచ్చి వెంటనే ఆసుపత్రిలో చేర్పించారు. ఆమె కోలుకుని ఇంటికి రాకముందే ఆమె భర్త రెండో పెళ్లి చేసుకుని వెళ్లిపోయాడు. అత్తింట్లో ఒంటరిగా ఉండిపోయింది. 'తోడుగా నేను లేనా' అని ఓ రాత్రి ఆమె మామ (భర్త తండ్రి) ఆమె పడుకుని ఉన్న గదిలోకి వచ్చాడు. అప్పట్నుంచి కొత్త నరకం మొదలైంది. ఇల్లొదిలి పారిపోయింది. తనకుంటూ చిన్న ఉపాధిని ఏర్పరచుకుంది. మహిళలెవరైనా తనకు తారసపడితే వారిని చేరదీసి ఒక దారి చూపిస్తోంది.

నా కూతుర్ని నాలా కానివ్వను

షైమీన్పై నిత్యం ఆమె భర్త చెయ్యి చేసుకునేవాడు. అవసరం లేకున్నా అలవాటుగా ఆ పని చేసేవాడు. ఉదయాన్నే లేవలేకపోయినందుకు, ఒంట్లో బాగోలేదు అన్నందుకు, ఫోన్‌లో పుట్టింటి వాళ్లతో మాట్లాడినందుకు భర్త ఆగ్రహించేవాడు. కర్రనో, కుర్చీనో.. చేతికి అందిన దాన్ని తీసుకుని ఆమెపై విసిరేవాడు. షైమీన్ గర్భిణిగా ఉండగా ఓ రోజు బలంగా కడుపులో కొట్టడంతో గర్భస్రావం జరిగి, ఆమె ప్రాణం పోయినంత పని జరిగింది. మళ్లీ గర్భం దాల్చినప్పుడు ఆడబిడ్డను కన్నందుకు ఆమెను వదిలేసి వెళ్లిపోయాడు. షైమీన్ కోర్టుకు వెళ్లింది. కోర్టు అతడి నుంచి ఆమెకు 4,500 రూపాయల పరిహారం ఇప్పించింది. షైమీన్ ఇప్పుడు స్వయం ఉపాధితో తనను, తన కూతుర్ని పోషించుకుంటోంది. ''నా కూతుర్ని నాలా కానివ్వను. ఆమెకు ఆరోగ్యవంతమైన జీవితాన్ని, చక్కటి చదువును అందిస్తాను'' అంటోంది.

సంపాదిస్తేనే భార్యకైనా గౌరవం

రాణి రెండో బిడ్డను కడుపులో మోస్తున్నప్పుడు ఆమె భర్త ఆమెను చావబాదాడు! 'మళ్లీ కనుక కూతుర్నే కన్నావంటే, ముగ్గుర్నీ కలిపి పాతేస్తాను' అని హెచ్చరించాడు. రాణి భయపడిపోయింది. అప్పటికే ఆమెకు ఒక కూతురు. ఆమెకు అర్థమైంది. అతడు అన్నంత పనీ చేస్తాడని. ఆరేళ్ల వైవాహిక బంధాన్ని తెంపేసుకుని, ఇంట్లోంచి వెళ్లిపోయింది. కోర్టులో విడాకుల కేసు ఇంకా నడుస్తూనే ఉంది. కేసుతో సంబంధం లేకుండా, భర్త విదిలించే డబ్బుల కోసం చూడకుండా కష్టం చేసుకుంటూ తన కాళ్ల మీద తను నిలబడింది. ఇద్దరు ఆడపిల్లల్ని ఎలాంటి భయాలు లేకుండా మురిపెంగా పెంచుకుంటోంది. ''డబ్బు సంపాదిస్తున్న భార్యను మాత్రమే మగవాళ్లు గౌరవంగా చూస్తారు. లేకుంటే.. చులకన చేస్తారు'' అని రాణి అంటోంది, భర్త తనను ఎంత హీనంగా చూసిందీ గుర్తు చేసుకుంటూ.



ఇప్పుడెవరికీ భయపడే పని లేదు

మమత మరొక బాధితురాలు. ఆమెనే కాదు, పిల్లల్ని కూడా కొట్టేవాడు ఆమె భర్త. 'ఇలాంటి భర్త వద్దు' అనుకుని బయటికి వచ్చేసింది. పిల్లల్ని హాస్టల్‌లో చేర్చింది. నాలుగు రాళ్లు సంపాదిస్తోంది. ''ఇప్పుడు నేనెవరికీ భయపడే పని లేదు. నా బతుకు నేను బతుకుతున్నాను. నా పిల్లలకు మంచి జీవితాన్ని ఇస్తాను'' అని ఆత్మవిశ్వాసంతో చెబుతోంది.

ఫ్రెండ్స్ ముందు కొట్టేవాడు

జ్యోతి చైల్డ్ కౌన్సిలర్‌గా చేస్తోంది. పన్నెండేళ్ల వైవాహిక జీవితంలోని దుర్భరమైన హింస నుంచి విముక్తి కోసం ఆమె గడప బయటికి అడుగుపెట్టింది. భర్త ప్రతి విషయంలోనూ ఆమెను నియంత్రించేవాడు. ఎలాంటి దుస్తులు వేసుకోవాలి, ఎవరితో మాట్లాడాలి.. ఏం తినాలి? ఎప్పుడు నిద్రపోవాలి.. అన్నీ అతడి ఆదేశానుసారం జరగాల్సిందే! చివరికి అతడి ఫ్రెండ్స్ ముందుకు కూడా ఆమెను కొట్టడం మొదలుపెట్టాడు. అతడికి విడాకులిచ్చేశాక జ్యోతి చైల్డ్ సైకాలజీ చదువుకుంది. చదువుకు తగ్గ జాబ్ వెతుక్కుంది. కొడుకును తన దగ్గరే ఉంచుకున్నాడు భర్త. ఇప్పుడా కొడుకు కోసం న్యాయ పోరాటం చేస్తోంది. ''నా భర్త నుంచి విడిపోగానే నాకు రెక్కలు వచ్చినట్లుగా అయింది. చాలా ఆనందంగా అనిపించింది. 'ఇకనుంచీ నా ఇష్టం వచ్చినట్లు నేను ఉండొచ్చు కదా' అన్న ఆలోచన నాలో జీవితేచ్ఛను కలిగించింది. నా జీవితానికి ఒక అర్థం కనిపిస్తోంది'' అని జ్యోతి సంతోషంగా చెబుతోంది.

నా ఫొటో వేసి రాయండి

సునీత భర్త ప్రతిరోజూ తాగి వచ్చి, సునీతతో అయినదానికీ, కానిదానికీ గొడవపడేవాడు. ఇక అతడితో కలిసి ఉండలేని పరిస్థితికి వచ్చేసింది సునీత. ఆ సమయంలో బంధువులు చొరవ చూపి, భార్యాభర్తల్ని మ్యారేజ్ కౌన్సెలింగ్‌కి తీసుకెళ్లారు. 'సరే, నేనిక తాగను. గొడవ పడను' అని కౌన్సెలింగ్ ఇచ్చినవారి ముందు అంగీకరించి, ఇంటికొచ్చాక మళ్లీ మామూలుగానే తాగడం, సునీతను కొట్టడం మొదలుపెట్టాడు! సునీతకు విడాకులు తప్ప వేరే మార్గం కనిపించలేదు. కోర్టులో కేసు వేసింది. భర్త నుంచి ఇప్పుడు ఆమెకు భరణం కూడా అందుతోంది. 'ది టెలిగ్రాఫ్' పత్రిక ప్రతినిధులతో కూడా ఆమె ధైర్యంగానే చెప్పింది.. ''నా ఫొటో వెయ్యండి, నా గురించి రాయండి. నాలాంటి మహిళలు కొందరికైనా నేనొక ప్రేరణ అయి, వారి జీవితాలు మెరుగయితే అంతకుమించిన సంతృప్తి నాకు ఏముంటుంది?'' అంది సునీత.

ఇరవై ఏళ్లకే ఇద్దరు పిల్లలు

ప్రీతి భోపాల్‌లో ఒక ఫుడ్ కియోస్క్ నడుపుతోంది. రెండు పెళ్లిళ్లు విఫలమై, దారుణమైన జీవితాన్ని అనుభవించి ఇప్పుడు తన బతుకు తను బతుకుతోంది. పదేళ్ల వయసులో ప్రీతికి మొదటి పెళ్లి జరిగింది. వరుడు ఆమెకన్నా చాలా పెద్దవాడు. ఇరవైఏళ్ల వయసు వచ్చేనాటికి ప్రీతికి ఇద్దరు పిల్లలు. భర్త అనారోగ్యంతో చనిపోయాక, రెండో పెళ్లి చేసుకుంది. ఒక మగబిడ్డను కంది. అయితే రెండో పెళ్లి కూడా ఆమెకు నరకమే చూపించింది. భర్త ఎప్పుడూ తిట్టేవాడు, కొట్టేవాడు. అనుమానించేవాడు. ఒకరోజు ముగ్గురు పిల్లల్నీ తీసుకుని ఆ గృహనరకం నుంచి బయట పడింది ప్రీతి. ఇప్పుడు తినుబండారాల బండిని నడిపిన విధంగానే తన జీవితాన్నీ సాఫీగా నడుపుకుంటోంది. పిల్లల్ని చక్కగా చదివించుకుంటోంది.

(సౌజన్యం: ది టెలిగ్రాఫ్)

సాక్షి
ఫ్యామిలీ
నల్లగొండ ॥ గురువారం
31-1-2019

లవ్ డాక్టర్ నన్నడగొద్దు ప్లీజ్

హాయ్ అన్నయ్యా! నేను ఒక అబ్బాయిని లవ్ చేస్తున్నాను. తను కూడా లవ్ చేస్తున్నాడు. రీసెంట్‌గా మా నాన్న చనిపోయారు. అప్పటి నుంచీ అన్నీ తనే అయ్యాడు. కానీ ఈ మధ్య తన బిహేవియర్ ఏం అర్థం కావట్లేదు. తను ఫోన్ చేసినప్పుడు లిఫ్ట్ చెయ్యడం లేట్ అయితే 'ఎవడితో మాట్లాడుతున్నావ్?' అంటాడు. లిఫ్ట్ చెయ్యకపోతే 'ఎవడితో ఉన్నావ్ ఫోన్ లిఫ్ట్ చెయ్యలేదు?' అంటాడు. ఎప్పుడు కాల్ చేసినా ఏదో ఒకటి అంటూ బాధ పెడుతున్నాడు. 'ఎందుకిలా చేస్తున్నావ్' అని అడిగితే... 'నేను ఏమన్నా నువ్వు పడాలి' అంటున్నాడు. ఏం చెయ్యాలో అర్థం కావట్లేదు. ఒకటి మాత్రం నిజమన్నయ్యా! తనకి నేనంటే చాలా.. చాలా ఇష్టం. ప్రాణం కూడా. కానీ ఎందుకిలా ప్రవర్తిస్తున్నాడో అర్థం కావట్లేదు. ఏం చెయ్యాలో మీరే సలహా ఇవ్వండి అన్నయ్యా!

– శ్రావ్య


ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

చాలా ఇన్‌సెక్యూర్‌గా ఉన్నాడు నాన్నా అతను!

తండ్రి స్థానం తీసుకున్నాడని నువ్వు అనుకుంటున్నావు.

కానీ తండ్రిలా కాకుండా ఆసామిలా ఫీల్ అవుతున్నాడు.

'ఆసామి అంటే ఏంటి సార్?'

ఓనర్‌లాగ ఫీల్ అవుతున్నాడు నీలూ!!

'అంటే శ్రావ్య సర్వెంట్‌లాగ ఉండాలనుకుంటున్నాడా సార్?'

సర్వెంట్‌లాగ కాకపోయినా... కంట్రోల్‌లో ఉంచుకోవాలనుకుంటున్నాడు.

'ఎందుకలా చేస్తున్నాడు సార్?'

ఇన్‌సెక్యూరిటీ నీలూ! అమ్మాయి దక్కదన్న ఇన్‌సెక్యూరిటీ!! అమ్మాయికి తన కంటే ఎక్కువ ఫాలోయింగ్ ఉందన్న ఇన్‌సెక్యూరిటీ!! భయం... అమ్మాయి మిస్ అయిపోతుందని..!! తనకు ఉన్నది ప్రేమ కాదు! శ్రావ్యను పోగొట్టుకుంటానన్న ఫియర్!! అలాంటి వాళ్లతో సావాసం చాలా పెయిన్‌ఫుల్. మన లైఫ్ కూడా చాలా ఇన్‌ఫ్లూయెన్స్ అయిపోతుంది. తన బిహేవియర్‌తో కుచించుకుపోతాం. యాంబిషన్ చచ్చిపోతుంది. నిజానికి స్వాభిమానం మిగలదు. తన ప్రవర్తన వల్ల మనకు మన మీద రెస్పెక్ట్ తగ్గిపోతుంది. ఎంత తొందరగా...

'ఆ అబ్బాయి వలలో నుంచి బయటపడితే స్వేచ్ఛగా ఉంటుంది కదా సార్!?'

నాన్న స్థానం ఎవరూ తీసుకోలేరు. నాన్న ప్రేమ ఎవరూ ఇవ్వలేరు. నాన్న కేర్ ఎవ్వరూ ఇవ్వలేరు. కన్ఫ్యూజ్ కావద్దు. ఈ ప్రేమకు, నాన్న ప్రేమకు చాలా తేడా ఉంటుంది. నాన్న చనిపోయినా ఆ జ్ఞాపకాలు.. ఆ అభిమానం... ఆ దీవెనలు నీకు ఎప్పుడూ అందుతూనే ఉంటాయి. ఆ అబ్బాయిని దూరం ఉంచితే నువ్వు బాగుంటావు చెల్లెమ్మా!!

lovedoctorram@sakshi.com

కాసుకో సుడోకు


		4	8	6		3	9	7
	6	1			2			
				4	9	1	6	
1	9	6		8		4		
	3						7	
		2		9		8	3	1
	5	9	4	7				
			9			7	8	
4	8	7		1	3	9		

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3x3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

5	2	3	1	9	4	6	7	8
8	7	6	3	5	2	1	9	4
1	9	4	8	6	7	2	5	3
4	6	8	7	3	1	5	2	9
2	3	7	5	4	9	8	1	6
9	5	1	2	8	6	4	3	7
3	1	5	4	7	8	9	6	2
7	4	9	6	2	5	3	8	1
6	8	2	9	1	3	7	4	5


● వెంకటేశ్


● నాగచైతన్య

వేసవిలో మొదలు

మార్చిలో మొదలు పెట్టడానికి 'వెంకీమామ' అండ్ టీమ్ రెడీ అవుతోంది. వెంకటేశ్, నాగచైతన్య హీరోలుగా బాబీ దర్శకత్వంలో 'వెంకీమామ' అనే సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే. డి. సురేష్‌బాబు ఓ నిర్మాత. ఇందులో నాగచైతన్యకు జోడీగా రకుల్ ప్రీత్ సింగ్ నటిస్తారు. ఇంతకుముందు 'రారండోయ్ వేడుక చూద్దాం' సినిమాలో చైతన్య, రకుల్ జంటగా నటించిన విషయం గుర్తుండే ఉంటుంది. ఇక వెంకీ సరసన శ్రియ లేదా తమన్నా నటించే అవకాశం ఉందని తెలిసింది. ఈ ఇద్దరి హీరోయిన్లతో సినిమాలు చేశారు వెంకీ. అసలు... ఈ సినిమా ఈపాటికే సెట్స్‌పైకి వెళ్లాల్సింది కానీ వెంకటేశ్ కుమార్తె పెళ్లి వేడుక ఉండటంతో సినిమాను మార్చిలో స్టార్ట్ చేయడానికి రెడీ అవుతున్నారట టీమ్. అయితే ఒకసారి షూటింగ్ స్టార్ట్ చేసిన తర్వాత వీలైనంత తొందరగా కంప్లీట్ చేసి ఈ ఏడాదే 'వెంకీమామ'ను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని ప్లాన్ చేస్తున్నారట టీమ్. ఇక ఈ సినిమాలో రియల్‌లైఫ్‌లో మాదిరిగానే మామా అల్లుళ్లగానే కనిపించనున్నారు వెంకీ అండ్ చైతూ.

లవ్ ఇన్ లాస్ ఏంజిల్స్

తీరక లేకుండా పని చెయ్.. ఆ తర్వాత తీరిగ్గా ప్రేమించెయ్ అనే పాలసీని ఫాలో అవుతుంటారు కోలీవుడ్ లవ్ కపుల్స్ విఘ్నేష్ శివన్, నయనతార. షూటింగ్స్‌తో నయనతార, కథలు తయారు చేస్తూ. డైరెక్షన్ చేస్తూ విఘ్నేష్ బిజీబిజీగా గడుపుతారు. ఏ కొంచెం విరామం దొరికినా సరే విదేశాలకు వెళ్లిపోతుంటారు. ప్రేమ యాత్రలకు లాస్ ఏంజిల్స్, లండన్లు నందనవనమూ ఆయనే అంటూ పాడుకుంటుందీ జంట. తాజాగా లాస్ ఏంజిల్స్ వెళ్లారు. ఏ ట్రిప్‌కు వెళ్లినా ఈ ఇద్దరూ దిగిన ఫొటోలను అభిమానుల కోసం విఘ్నేష్ తన సోషల్ మీడియా ద్వారా పంచుకుంటారు. న్యూ ఇయర్‌ను కూడా ఈ జంట లాస్ ఏంజల్స్‌లోనే సెలబ్రేట్ చేసుకున్నారనే సంగతి తెలిసిందే. ఇలా కలసి హాలిడేయింగ్ చేసుకుంటూ, లవ్వింగ్ చేసుకుంటున్నా 'మేం రిలేషన్'లో ఉన్నాం అని మాత్రం బాహాటంగా ఎప్పుడూ అంగీకరించలేదు. చెప్పినా చెప్పకపోయినా పెళ్లి ఎప్పుడో చెప్పండి అని తమిళ ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



● విఘ్నేష్ శివన్, నయనతార




● మిస్తీ చక్రవర్తి

నా పాత్రను తగ్గించేశారు

'మణికర్ణిక' చిత్రం మంచి కలెక్షన్స్‌తో దూసుకెళ్తోంది. ఈ చిత్రంలో కంగనా రనౌత్ నటనను ప్రేక్షకులు అభినందిస్తున్నా, ఆమె ప్రవర్తనను మాత్రం తోటి టెక్నీషియన్స్ విమర్శిస్తున్నారు. దర్శకత్వం విషయంలో క్రిష్ అసంతృప్తి వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. తాజాగా 'నా పాత్రను నిర్దాక్షిణ్యంగా తగ్గించేశారని అందులో నటించిన హీరోయిన్ మిస్తీ చక్రవర్తి ఆరోపించారు. ''మణికర్ణిక' సినిమాలో నా పాత్రకు ప్రాముఖ్యత ఉంటుందని, మంచి సన్నివేశాలున్నాయని క్రిష్‌గారు నాతో చెప్పారు. అలానే అద్భుతమైన సన్నివేశాలు చిత్రీకరించారు కూడా. కానీ, అవన్నీ సినిమాలో కనిపించలేదు. సినిమా పూర్తయ్యాక మళ్లీ కొన్ని సన్నివేశాలు షూట్ చేయడానికి కంగనా నన్ను డేట్స్ అడిగారు. అప్పుడు తీసిన సన్నివేశాలను మొదట షూట్ చేసినవాటి స్థానంలో చేర్చారు. ఒకవేళ కంగనానే దర్శకురాలని ముందే తెలిసుంటే ఈ సినిమా చేసుండేదాన్ని కాదు'' అని పేర్కొన్నారు మిస్తీ.

రాశీ ఎక్స్‌ప్రెస్


గతేడాది విడుదలైన 'ఇమైక్క నొడిగళ్' చిత్రంతో తమిళ చిత్రసీమకు పరిచయమయ్యారు రాశీఖన్నా. ఈ చిత్రం విడుదల ఆలస్యం అయినా మంచి విజయం సాధించింది. ఆ తర్వాత 'జయం' రవితో చేసిన 'అడంగామారు' చిత్రం కూడా హిట్ సాధించింది. ప్రస్తుతం తెలుగు 'టెంపర్' రీమేక్‌లో విశాల్‌తో కలసి యాక్ట్ చేస్తున్నారు రాశి. ఇలా తమిళ జర్నీ సక్సెస్‌ఫుల్‌గా సాగుతోంది ఆమెకు. తాజాగా మరో తమిళ చిత్రంలో యాక్ట్ చేయడానికి అంగీకరించారీ భామ. తమిళ హాట్ ఫేవరెట్ విజయ్ సేతుపతి లేటెస్ట్ చిత్రంలో హీరోయిన్‌గా ఎంపికయ్యారు. విజయ్ చందర్ దర్శకుడు. ''తమిళంలో నా అభిమాన నటుల్లో ఒకరైన విజయ్ సేతుపతి నెక్ట్స్ సిమిమాలో హీరోయిన్‌గా చేస్తున్నాను. కొత్త టీమ్‌తో పని చేయడానికి ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను. మరికొన్ని అనౌన్స్‌మెంట్స్ కూడా త్వరలోనే చెబుతా'' అని పేర్కొన్నారు రాశీఖన్నా. కోలీవుడ్‌లో వరుస అవకాశాలతో రాశీ ఎక్స్‌ప్రెస్ సూపర్ ఫాస్ట్‌గా కదులుతోంది. ప్రస్తుతం చేస్తున్న ఈ రెండు సినిమాలు కూడా హిట్ అయితే తమిళంలో స్టార్ హీరోయిన్స్ లిస్ట్‌లోకి చేరిపోవడం ఖాయం. ప్రస్తుతం తెలుగులో విజయ్ దేవరకొండతో ఓ సినిమాలో నటిస్తున్నారు రాశీఖన్నా.


● రాశీ ఖన్నా

నీకేదంటే ఇష్టం

రామ్ కార్తీక్, పూజిత పొన్నాడ జంటగా లక్ష్మీరాయ్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'వేర్ ఈజ్ వెంకటలక్ష్మి'. కిశోర్ కుమార్ దర్శకత్వం వహించారు. గురునాథ్‌రెడ్డి సమర్పణలో ఎం.శ్రీధర్‌రెడ్డి, హెచ్. ఆనంద్‌రెడ్డి, ఆర్కే రెడ్డి నిర్మించారు. ఈ సినిమా చిత్రీకరణ పూర్తయింది. హారర్ కామెడీ నేపథ్యంలో రూపొందిన ఈ సినిమాను మార్చిలో విడుదల చేయాలనుకుంటున్నారు. ''ఆల్రెడీ రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్, 'పాపా నీకేదంటే ఇష్టం' పాటకు మంచి స్పందన లభిస్తోంది. త్వరలోనే టీజర్‌ను రిలీజ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం. ప్రవీణ్, మధునందన్‌ల కామెడీ సినిమాకు హైలైట్‌గా ఉంటుంది. హరిగౌర మంచి సంగీతం అందించారు'' అని చిత్ర బృందం పేర్కొంది.



● లక్ష్మీ రాయ్


● ఖలీ

టాలీవుడ్‌కి రెజ్లింగ్ స్టార్

ఇండియన్ వరల్డ్ రెజ్లింగ్ ఎంటర్‌టైన్మెంట్ (డబ్ల్యూడబ్ల్యూఈ) రెజ్లర్ 'ది గ్రేట్ ఖలీ' తెలుగు చిత్ర పరిశ్రమకి ఎంట్రీ ఇస్తున్నారు. దర్శకుడు జయంత్ సి. పరాన్జీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'నరేంద్ర' సినిమాలో ఓ కీలక పాత్రలో నటించబోతున్నారు ఈ ఏడడుగుల రెజ్లర్. ఇప్పటికే పలు హాలీవుడ్ సినిమాల్లో, అమెరికన్ టీవీ షోల్లో నటించిన ఖలీ 'బిగ్‌బాస్ 4'లో కూడా కనిపించి అభిమానులను అలరించారు. స్పోర్ట్స్ డ్రామాగా జయంత్ తెరకెక్కిస్తున్న తాజా సినిమాలో నీలేష్ ఎటి, ఇజబెల్లా జంటగా నటిస్తున్నారు. ఇండియా, పాకిస్థాన్ నేపథ్యంలో సినిమా రూపొందుతుండటంతో ఇస్లామిక్ దేశంలో చిత్రీకరణ జరిపేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే 'నరేంద్ర' చిత్రం మొదటి షెడ్యూల్ షూటింగ్ పూర్తి చేసుకుంది. కాగా, ఈ సినిమాతో బాలీవుడ్ మ్యూజిక్ డైరెక్టర్ రామ్ సంపత్ టాలీవుడ్‌కి పరిచయమవుతున్నారు. ఈ చిత్రానికి నిర్మాత: ఇషాన్ ఎంటర్‌టైన్మెంట్స్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: హరీష్ కోయలగుండ్ల, కెమెరా: విరీన్ తంబిదొరై, సంగీతం: రామ్ సంపత్, కథ–దర్శకత్వం: జయంత్ సి. పరాన్జీ.

ఆ రెండూ మిగిలిపోయాయి


● షారుక్ ఖాన్

''నా కెరీర్‌లో నేషనల్ అవార్డు రాకపోవడమే అసంతృప్తి' అని ఓ సందర్భంలో షారుక్ పేర్కొన్నారు. తాజాగా ఈ కామెంట్ మీద ఓ ఈవెంట్‌లో మాట్లాడారాయన. ''అప్పుడు నేను ఇచ్చిన స్టేట్‌మెంట్ కేవలం జోక్ మాత్రమే. నేషనల్ అవార్డ్ రాలేదని నాకు ఎటువంటి విచారం లేదు. ఒకవేళ అవార్డు రాకపోతే అది కోల్పోయానని అనుకునే మనస్తత్వం కాదు నాది. అలాగే ఆర్టిస్టిక్ స్పేస్‌ని ఎక్కువ శాతం వినియోగించలేదని అనుకుంటున్నాను. నేను చేసిన వాటిలో ఎక్కువ శాతం కమర్షియల్ చిత్రాలే ఉన్నాయి. అయినప్పటికీ అందులో ఆర్ట్‌ని తీసుకొచ్చే ప్రయత్నం చేశాను'' అని పేర్కొన్నారు. మరి నేషనల్ అవార్డ్ రాకపోవడం వెలితిగా ఉందా అని మళ్లీ అడగ్గా – ''ఒక నేషనల్ అవార్డు, ఓ ఆస్కార్ సాధిస్తే నా అవార్డుల కలెక్షన్స్ పూర్తవుతుంది'' అని పేర్కొన్నారు షారుక్.

రివ కిషన్ డాటర్ ఆఫ్ రవికిషన్

మద్దాలి శివారెడ్డిగా అల్లు అర్జున్ 'రేసుగుర్రం' సినిమాతో టాలీవుడ్‌కి ఎంట్రీ ఇచ్చారు భోజ్‌పురి నటుడు రవికిషన్. ఆ తర్వాత ఆయన 'కిక్ 2, సుప్రీమ్, రాధ, లై' వంటి సినిమాలు చేశారు. అటు హిందీలోనూ పలు చిత్రాలు చేశారాయన. ఇప్పుడు ఆయన కుమార్తె రివ కిషన్ బాలీవుడ్ ఎంట్రీ ఖరారైంది. బాలీవుడ్‌లో నటి పద్మినీ కోల్హాపురి, నిర్మాత ప్రదీప్ శర్మల కుమారుడు ప్రియాంక్ ప్రదీప్ శర్మ 'సబ్ కుశల్ మంగళ్' అనే సినిమాతో హిందీ పరిశ్రమకు పరిచయం అవ్వబోతున్నారు. ఈ సినిమాలోనే హీరోయిన్‌గా ఎంపికయ్యారు రివ కిషన్. ''నేను హిందీ సినిమా చేయబోతున్నందుకు నాన్నగారు సంతోషంగా ఉన్నారు. షూటింగ్ స్టార్ట్ చేయడానికి ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను'' అని పేర్కొన్నారు రివ కిషన్. ప్రస్తుతం ఈ సినిమా వర్క్‌షాప్స్‌లో పాల్గొంటున్నారు రివ అండ్ ప్రియాంక్. ఈ చిత్రం మార్చిలో జార్ఖండ్‌లో స్టార్ట్ కానుంది. కామెడీ నేపథ్యంలో తెరకెక్కనున్న ఈ సినిమాతో కరణ్ కశ్యప్ దర్శకునిగా పరిచయమవుతారు. ఇందులో నటుడు అక్షయ్ ఖన్నా ఓ కీలక పాత్ర చేయనున్నారు.



● రివ కిషన్

బిచ్చగాళ్లు లేని సమాజాన్ని చూడాలి

అర్జున్ రెడ్డి, నేహా దేశ్‌పాండే జంటగా కె.ఎస్. నాగేశ్వరరావు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'బిచ్చగాడా మజాకా'. 'బ్రేకప్ లవ్ స్టోరీ' అనేది ఉపశీర్షిక. ఎస్.ఎ. రెహమాన్ సమర్పణలో బి. చంద్రశేఖర్ నిర్మించిన ఈ సినిమా ఫిబ్రవరి 1న విడుదలవుతోంది. ఈ సందర్భంగా కె.ఎస్.నాగేశ్వరరావు మాట్లాడుతూ– ''బిచ్చగాళ్ల లేని సమాజం కోసం ఓ యువకుడు సాగించిన పోరాటం ఎలాంటి మలుపులు తిరిగింది? అది తన ప్రేమకథను ఎలా ప్రభావితం చేసింది అన్నదే ఈ చిత్ర కథాంశం. హైదరాబాద్ నగరాన్ని బిచ్చగాళ్లు లేని నగరంగా చేయాలని ప్రభుత్వం తలపెట్టిన యజ్ఞానికి బాసటగా నిలిచే చిత్రమిది. అనాథ అయిన అర్జున్ బిచ్చగాళ్లు లేని సమాజం కోసం ఏం చేశాడన్నది తెరపైనే చూడాలి. శ్రీవెంకట్ పాటలకు చక్కని స్పందన వచ్చింది. చదలవాడ శ్రీనివాసరావు నిర్మిస్తున్న 'లవ్ ఈజ్ బ్లైండ్' చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నాను. 70 శాతం పూర్తయింది'' అన్నారు. సుమన్ మాట్లాడుతూ– ''నాగేశ్వరరావు కథ చెప్పగానే విభిన్నంగా ఉందనిపించింది. సుమన్ ఓ వెరైటీ పాత్ర చేయగలడు అని ఈ సినిమాతో పేరొస్తుంది. మంచి విలన్ పాత్రలు ఇస్తే చేయడానికి రెడీ. నేటి జనరేషన్‌లో రాజమౌళి మాత్రం విలన్‌ని ఎంతో గొప్పగా చూపిస్తున్నారు. 'బాహుబలి'లో హీరో ప్రభాస్ కాదు.. రానా. ఆయన పాత్ర అంత బాగుంది'' అన్నారు.


● కేయస్ నాగేశ్వరరావు

ఎన్ని కళలో!

తనిష్క్ రెడ్డి, మేఘ్లా ముక్తా జంటగా శివ గణేశ్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'సకల కళా వల్లభుడు'. బీరం సుధాకర్ రెడ్డి సమర్పణలో అనిల్, శ్రీకాంత్, త్రినాథ్, కిషోర్ నిర్మించిన ఈ సినిమా ఫిబ్రవరి 1న విడుదల కానుంది. నిర్మాతలు మాట్లాడుతూ– ''ఈ చిత్రంలో నటించిన ఏ ఒక్కరూ కొత్తవారిలా అనిపించరు. అంత అద్భుతంగా నటించారు. తనిష్క్‌రెడ్డి భవిష్యత్‌లో పెద్ద స్టార్ అవుతాడు. అతనితో మరిన్ని సినిమాలు చేయాలనుకుంటున్నాం'' అన్నారు. ''సినిమా అవుట్‌పుట్ చూసుకున్నాం. సంతృప్తిగా ఉంది. నిర్మాతలు సపోర్ట్ చేయడం వల్లే సినిమా అంత బాగా వచ్చింది'' అని శివగణేష్ అన్నారు. ''కథలో కంటెంట్ ఉంటే సపోర్ట్ చేయడానికి ఇండస్ట్రీలో చాలామంది ఉన్నారు. వారిలో బీరం సుధాకర్‌రెడ్డి ఒకరు. ఆయనకు అనిల్, శ్రీకాంత్ తోడై ఖర్చుకు వెనకాడకుండా ఈ చిత్రాన్ని నిర్మించారు. కామెడీ, ఫైట్స్, సెంటిమెంట్.. అన్నీ ఉన్నాయి'' అని తనిష్క్ రెడ్డి అన్నారు. నటుడు రాజేంద్రప్రసాద్, సంగీత దర్శకుడు ఆర్‌పీ పట్నాయక్, నటి అలెక్సా పాల్గొన్నారు.


● మేఘ్లా, తనిష్క్

ఇంజినీరింగ్ విద్యార్థులకు ఈ చిత్రం అంకితం



● ఉదయ్‌కుమార్, ఈశ్వర్, అచ్చిరెడ్డి, సురేష్, కృష్ణారెడ్డి, అంకిత, టువా చక్రవర్తి, భీమ్స్, రఘురాజ్, భాస్కర్‌రాజు

''ఈశ్వర్‌కు హీరో కావాలనే గొప్ప కల ఉంది. ఆ కలను అతని తల్లి దండ్రులు ప్రోత్సహిస్తున్నారు. సినిమా ఫీల్డ్‌లోనే కాదు. ఏ రంగంలో అయినా తల్లి దండ్రుల ప్రోత్సాహం, ఆశీర్వాదం లేకుంటే రాణించడం కష్టం'' అని డైరెక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి అన్నారు. ఈశ్వర్ హీరోగా పరిచయమవుతోన్న చిత్రం '4 లెటర్స్'. 'కుర్రాళ్ళకి అర్థమవుతుందిలే..' అన్నది ఉపశీర్షిక. అంకిత, టువ హీరోయిన్లుగా నటించారు. ఆర్. రఘురాజ్ దర్శకత్వంలో దొమ్మరాజు హేమలత, దొమ్మరాజు ఉదయ్ కుమార్ నిర్మించారు. భీమ్స్ సిసిరోలియో స్వరపరచిన ఈ చిత్రం పాటలను హైదరాబాద్‌లో విడుదల చేశారు. బ్యానర్ లోగోను నిర్మాత కిరణ్, ట్రైలర్‌ను ఎస్వీ కృష్ణారెడ్డి ఆవిష్కరించారు. ఆడియో బిగ్ సీడీని నిర్మాత అచ్చిరెడ్డి, ఎస్వీ కృష్ణారెడ్డి విడుదల చేశారు. ''చిన్న చిత్రాలు హిట్టయితే ఇండస్ట్రీకి మంచిది. ఈ సినిమా పెద్ద విజయం సాధిస్తుంది'' అన్నారు అచ్చిరెడ్డి. ఆర్. రఘురాజ్ మాట్లాడుతూ– ''ఈ చిత్రాన్ని 75 రోజుల్లో పూర్తి చేశాం. టీమ్ ఎంతగానో సహకరించారు. ఇందులో మంచి సందేశం ఉంది. ఈ సినిమాను ఇంజినీరింగ్ స్టూడెంట్స్‌కి అంకితం ఇవ్వాలనుకుంటున్నాం. ఈ సినిమా సెకండాఫ్‌లో ఓ డిఫరెంట్ పాయింట్‌ను టచ్ చేశాం'' అన్నారు. ''ఇంజినీరింగ్ స్టూడెంట్స్ నేపథ్యంలో ఈ సినిమా ఉంటుంది. ఫిబ్రవరి 8న సినిమాను విడుదల చేయాలనుకుంటున్నాం'' అన్నారు ఉదయ్ కుమార్. ''తొలి సినిమాలోనే అన్నపూర్ణమ్మ, పోసాని, సురేష్‌గార్ల వంటి సీనియర్ నటులతో నటించడం హ్యాపీ. ఈ చిత్రంలో మంచి పాత్ర చేశాను. సినిమాను ప్రేక్షకులు ఆదరించాలని కోరుకుంటున్నాను'' అన్నారు ఈశ్వర్. 'మా' అధ్యక్షుడు శివాజీ రాజా, నటుడు సురేశ్, కొరియోగ్రాఫర్ గణేశ్ మాస్టర్, గీత రచయిత చంద్రబోస్, నిర్మాత బెక్కం వేణుగోపాల్, సంగీత దర్శకుడు భీమ్స్, అంకిత, టువ మాట్లాడారు.

అద్దాల గర్భం

సంతానం- సంతోషం 4

సంతానం కోసం తొలుత సహజంగా ప్రయత్నిస్తారు. కుదరకపోతే ఇంట్రాయుటెరైన్ ఇన్‌సెమినేషన్(ఐయూఐ)ని ఆశ్రయిస్తారు. అదీ జరగకపోతే చివరి ప్రయత్నంగా ఐవీఎఫ్ చేస్తారు. అదే... టెస్ట్‌ట్యూబ్ బేబీ! ఆ బేబీ కోసం ఓ పరీక్ష నాళికలో అద్దాల్లోంచి చూస్తూ ఫలదీకరణం చేస్తారు.

టెస్ట్‌ట్యూబ్ అద్దంలోంచి కనిపించే ఆ పిండం అద్దమంత సున్నితమైంది. అద్దంలా భద్రంగా చూసుకోవలసినది. అద్దంలో చందమామను చూపుతూ రామభద్రుడికి బువ్వ తినిపించారని ప్రతీతి. అద్దంలోని చందమామలాంటి బిడ్డను తీసి దంపతులకు ఇవ్వడమంత సంక్లిష్టయత్నం 'ఐవీఎఫ్'! ఆ ప్రక్రియపై అవగాహన కోసమే ఈ కథనం.



గతవారం సంతానం లేని మహిళలకు చేయించాల్సిన అనేక చికిత్సలతో పాటు సంతానసాఫల్య చికిత్సలో భాగంగా చేసే కొన్ని ప్రక్రియల గురించి తెలుసుకున్నాం. అయితే వాటన్నింటికీ తలమానికం లాంటిదీ, చివరి ఆశగా ప్రయత్నించేదీ అయిన 'టెస్ట్ ట్యూబ్ బేబీ' విధానం గురించి ఈ వారం తెలుసుకుందాం.


సాధారణంగా మహిళలో ఒక అండం, పురుషుడి శుక్రకణంతో కలిసి, ఫలదీకరణం జరిగితే, అప్పుడది పిండంగా మారి గర్భాశయంలోకి చేరి (ఇంప్లాంటేషన్ జరిగి), అప్పుడు శిశువుగా మారి, గర్భంలో పెరుగుతుంటుంది.

ఈ ప్రక్రియలో ఎక్కడైనా లోపాలుండి, గర్భం కోసం మందుల ద్వారా ప్రయత్నించినా, భర్త వీర్యాన్ని చిన్న కంటెయినర్‌లో సేకరించి, స్పెర్మ్ వాషింగ్ మీడియాలో దాన్ని శుభ్రపరచి, ఆరోగ్యకరమైన వీర్యకణాలను వేరుపరచి, అండం విడుదలయ్యే రోజుల్లో గర్భాశయంలోపలికి పంపే ఇంట్రా యుటెరైన్ ఇన్‌సెమినేషన్ (ఐయూఐ) అనే ప్రక్రియ కూడా విఫలమయ్యాక... చివరి ఆశగా ఐవీఎఫ్ (ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్) అని పిలిచే ప్రక్రియను ప్రయత్నిస్తారు. దీన్నే జనసామాన్య (పాపులర్) పరిభాషలో 'టెస్ట్‌ట్యూబ్ బేబీ' ప్రక్రియ అంటారు.

ఐవీఎఫ్ ప్రక్రియలో ఏం చేస్తారు?

1 అండాశయాలను ఉత్తేజపరచడం (ఒవేరియన్ స్టిమ్యులేషన్): ఇందులో భాగంగా అండాశయాల నుంచి ఎక్కువ అండాలు (10 – 20... ఆపైన) తయారుకావడం కోసం హార్మోన్ ఇంజెక్షన్లు ఇస్తారు.

ఈ సమయంలో మహిళలకు క్రమంగా వెజైనల్ స్కానింగ్ ద్వారా అండాలను పర్యవేక్షిస్తూ, హార్మోన్ పరీక్షలు చేస్తూ, అండాల సంఖ్య, సైజు నిర్ణీతస్థాయికి వచ్చేవరకు వేచి చూడాల్సి ఉంటుంది.



2 అండాలను తీయడం (ఎగ్/ఊసైట్ రిట్రైవల్) : అండాలు తగిన సైజుకు పెరిగాక, వాటిని స్కానింగ్ ద్వారా చూస్తూ మహిళకు నొప్పి తెలియకుండా మందులు ఇచ్చి, యోని భాగం నుంచి సన్నటి, పొడవాటి సూది ద్వారా ఇరువైపుల ఉన్న అండాశయాల నుంచి అండాలను బయటకు తీస్తారు.

3 ఫలదీకరణ : బయటకు తీసిన అండాలను మైక్రోస్కోప్‌లో పరీక్షిస్తూ, మంచి అండాలను వేరుపరచి, వాటిని శుభ్రపరచి వేరుపరచిన శుక్రకణాలతో న్యూట్రిషన్ మీడియా కలిగిన చిన్న డిష్‌లో కలపడం జరుగుతుంది. కొన్ని గంటల తర్వాత శుక్రకణం, అండంతో కలిసి ఫలదీకరణ జరుగుతుంది. ఇది అనేక కణాలుగా విభజితమవుతూ, పిండంగా మారుతుంది. ఇంతకుమునుపు మనం బయటకు తీసిన అండాలన్నీ ఫలదీకరణ చెందకపోవచ్చు. వాటిలో కొన్ని మాత్రమే పిండంగా ఏర్పడతాయి.

ఐసీఎస్ఐ (ఇక్సీ) : అండాలను, శుక్రకణాలతో కలిపినా, కొన్ని సందర్భాల్లో కొన్ని కారణాల వల్ల శుక్రకణాలు వాటంతట అవే అండంలోకి ప్రవేశించకపోవచ్చు. అలాంటప్పుడు శుక్రకణాన్ని సన్నటి సూది ద్వారా అండంలోకి నేరుగా ఇంజెక్ట్ చేస్తారు. దీన్నే ఇంట్రా సైటోప్లాస్మిక్ స్పెర్మ్ ఇంజెక్షన్ (ఇక్సీ) అంటారు.

4 పిండ విభజన (ఎంబ్రియో కల్చర్) : ఫలదీకరణ జరిగిన అండాలను, న్యూట్రిషన్ మీడియా కలిగిన డిష్‌లో పెట్టి, ఇంక్యుబేటర్‌లో 3 – 5 రోజుల పాటు ఉంచుతారు. వీటిలో కణాలు విభజన చెందుతూ తయారైన పిండాన్ని 3 నుంచి 5 రోజులలోపు బయటకు తీసి, వాటి నాణ్యతను మైక్రోస్కోప్‌లో చూస్తారు.

5 పిండాన్ని గర్భాశయంలోకి పంపడం (ఎంబ్రియో ట్రాన్స్‌ఫర్): అలా ఇంక్యుబేటర్‌లో కాస్తంత పెరిగిన పిండాలలోని మంచి పిండాలను వేరుపరచి, వాటిలో 2, 3 పిండాలను సన్నటి కాన్యులా ద్వారా యోనిభాగం నుంచి నేరుగా గర్భాశయంలోకి ప్రవేశపెడతారు. మిగిలిన పిండాలను ఫ్రీజ్ చెస్తారు.

6 ఇంప్లాంటేషన్ : ఎంబ్రియో ట్రాన్స్‌ఫర్ ద్వారా గర్భాశయంలోకి పంపించిన పిండాలను, గర్భాశయంలోని పొరలోకి అంటుకుపోయి, పెరగడం మొదలవుతాయి. కానీ ఇది అందరిలోనూ జరగకపోవచ్చు. ఈ ప్రక్రియ సజావుగా జరడానికి, గర్భాశయ పొర సరిగా ఉండాలి. దానికి రక్తప్రసరణ, హార్మోన్లతో పాటు ఇంకా తెలియని అనేక రసాయన అంశాలు సక్రమంగా ఉండాలి. అప్పుడు మాత్రమే గర్భాశయం పిండాన్ని స్వీకరిస్తుంది. అలా స్వీకరిస్తేనే గర్భం నిలుస్తుంది. అయితే ఇలా అందరిలోనూ పిండం ఎందుకు అతుక్కోదో ఇంకా చాలావరకు కారణాలు తెలియరాలేదు. ఈ విషయంలో ఇంకా పరిశోధనలు జరుగుతూనే ఉన్నాయి. అందువల్లే, చివరి ఆశ అయిన 'టెస్ట్‌ట్యూబ్' పద్ధతిలోనూ గర్భం దాల్చే అవకాశాలు 40 – 50 శాతం వరకు మాత్రమే ఉంటాయి.

ల్యూటియల్ ఫేజ్ సపోర్ట్

- పిండం గర్భాశయపొరలోకి అంటుకుపోయేలా చేసే 'ఇంప్లాంటేషన్' విజయవంతం అయ్యేందుకు (సక్సెస్ రేటు పెంచడానికి) అనేక రకాల మందులను, మాత్రల రూపంలో, ఇంజెక్షన్ల రూపంలో, జెల్స్ రూపంలో ఇవ్వాలి. ఏదో ఒకటి పనిచేయకపోతుందా అనే ఆశతో ఇవన్నీ చేస్తారు.
- అలాగే కొందరిలో పిండం పై పొరకీ చిన్న చిల్లు పెట్టడం (అసిస్టెడ్ హ్యాచింగ్) వంటి రకరకాల ప్రక్రియలతో ప్రయత్నం చేస్తారు.
- ఇలా అన్ని విధాలా ప్రయత్నించినా కూడా టెస్ట్ ట్యూబ్ పద్ధతి ద్వారా 100 శాతం విజయం సాధించగలమని ఎవరికీ హామీ ఇవ్వరు. ఎందుకంటే ఎవరిలో, ఎందుకు గర్భాశయం పిండాన్ని తీసుకోదో స్పష్టంగా తెలియదు కాబట్టి.
- 'టెస్ట్‌ట్యూబ్ బేబీ' పద్ధతి ఒకరిలో ఒకసారి ఫలించకపోతే, కొన్ని నెలలు ఆగి, మళ్లీ ప్రయత్నించవచ్చు. ఇలా 3 – 6 సార్ల వరకు ప్రయత్నించవచ్చు. ఒకోసారి సఫలం కాకపోతే, మళ్లీ ఒకసారి దంపతులకు చేయించిన పరీక్షలన్నీ తిరిగి చూసుకుంటూ, కారణాలను సమీక్షించుకుంటూ, ఇంకా ఏమైనా సమస్యలున్నాయా అంటూ విశ్లేషించుకుంటూ, వేరే అవసరమైన పరీక్షలు ఇంకా ఏమైనా ఉంటే అవి కూడా చేయించి, చికిత్సల్లో కొద్దిపాటి మార్పులు చేస్తూ, మళ్లీ టెస్ట్‌ట్యూబ్‌బేబీ పద్ధతిని ప్రయత్నిస్తూ ఉంటారు.

కొందరిలో పిండం నాణ్యత సరిగా లేకపోయినా, గర్భాశయంలో లేదా ఎండోమెట్రియమ్ పొరలో కొన్ని బయటకు తెలియని, కనిపించని సూక్ష్మమైన సమస్యలు ఉన్నా గర్భం రాకపోవచ్చు. అలాంటప్పుడు, రెండుమూడు సార్లు ఐవీఎఫ్ పద్ధతిలోనూ గర్భం రానప్పుడు అవసరాన్ని బట్టి దాత నుంచి స్వీకరించిన అండాలనూ లేదా శుక్రకణాలను లేదా పిండాన్ని, దంపతుల అంగీకారం మీద, వాడుకొని ప్రయత్నించవచ్చు. అప్పటికీ కుదరకపోతే అప్పుడు సరోగసీ పద్ధతిని ప్రయత్నించవచ్చు.

ఎంబ్రియో ఫ్రీజింగ్ : ఐవీఎఫ్ ప్రక్రియలో భాగంగా ఫలదీకరించక ఏర్పడిన పిండాల సంఖ్యను బట్టి, ఒకసారి ఒకటి లేదా రెండు పిండాలను గర్భాశయంలోకి పంపి, మిగతా పిండాలను విట్రిఫికేషన్ అనే పద్ధతి ద్వారా ఫ్రీజ్ చేసి భద్రపరుస్తారు. ఇలా భద్రపరచడాన్ని క్రయోప్రిజర్వేషన్ అంటారు. ఐవీఎఫ్ ప్రక్రియ మొదటిసారి సఫలం కానప్పుడు, అలా భద్రపరచిన పిండాలను తీసుకొని మళ్లీ మళ్లీ వాడుకోవచ్చు. లేదా ఇంకొకసారి గర్భం దాల్చాలని కోరుకున్నప్పుడు కూడా వాడుకోవచ్చు. లేదా ఎవరికైనా అవసరమైన దంపతులకు దానం చేయవచ్చు. పరిశోధనలకు ఇవ్వవచ్చు. లేదా వాటిని నిర్జీవపరచమని కోరవచ్చు.

- **ఫ్రోజెన్ ఎంబ్రియో ట్రాన్స్‌ఫర్ (ఎఫ్ఈటీ) :** కొంత మందిలో ఐవీఎఫ్ చేశాక పిండాలు ఏర్పడిన 3వ రోజు నుంచి 5వ రోజు లోపల, వాటిని గర్భాశయంలోకి పంపుతారు. ఆ నెలలో గర్భం నిలబడకపోతే, ఫ్రీజ్ చేసిన ఎంబ్రియోను ఆ మరుసటి నెలలో పంపుతారు. దీనికంటే ముందు గర్భాశయపొర (ఎండోమెట్రియమ్) పొర బాగా ఏర్పడటానికి మందులు ఇచ్చి, స్కానింగ్‌లో ప్రక్రియనంతా పర్యవేక్షిస్తూ, గర్భాశయంలోకి పంపుతారు. కొంతమందిలో ఐవీఎఫ్ చేసిన నెలలో, హార్మోన్స్ సరిగా లేకపోయినా, గర్భాశయపొర సరిగా ఏర్పడకపోయినా, పిండాలను ఫ్రీజ్ చేసి, ఆ తర్వాతి నెలలో గర్భాశయంలోపలికి పంపడం అంటే.... ఫ్రోజెన్ ఎంబ్రియో ట్రాన్స్‌ఫర్ చేయడమాంటారు.

ఐవీఎఫ్ వల్ల దుష్ఫలితాలు

- ఇందులో వాడే మందుల వల్ల కొందరిలో, ఒక్కోసారి వారి శరీర తత్వాన్నిబట్టి తలనొప్పి, వికారం, చిరాకు వంటి లక్షణాలు కనిపించవచ్చు.
- అండాలను బయటకు తీసేటప్పుడు కొందరిలో బ్లీడింగ్ కనిపించవచ్చు. కొందరిలో పేగులకు, మూత్రాశయానికి, రక్తనాళాలకూ ఇన్ఫెక్షన్స్ రావచ్చు. అవి కొద్దిగా దెబ్బతినే అవకాశం ఉండవచ్చు.
- **మల్టిపుల్ ప్రెగ్నెన్సీస్ :** ఐవీఎఫ్‌లో కొందరిలో ఒక్కోసారి కవల పిల్లలు, ముగ్గురు పిల్లలు (ట్రిప్లెట్స్) కూడా కలిగే అవకాశాలు ఉంటాయి. అందువల్ల నెలలు నిండకుండానే కాన్పులు అవ్వడం, పుట్టిన పిల్లలు బరువు తక్కువగా ఉండటం వంటివి కనిపిస్తాయి.

ఒవేరియన్ హైపర్ స్టిమ్యులేషన్ : కొందరిలో ఒక్కొక్కరి శరీరతత్వాన్ని బట్టి మరీ ఎక్కువ అండాలు తయారై, వాటి విడుదలకు వాడే హెచ్‌సీజీ ఇంజెక్షన్ వల్ల అండాశయాలు బాగా వాయడం, కడుపులోకి నీరు రావడం, కడుపులో నొప్పి, వాంతులు కావడం జరగవచ్చు. మరికొందరిలో కడుపు ఉబ్బడం, ఊపిరితిత్తుల్లో నీరు చేరి తీవ్రమైన ఆయాసం, రక్తం గూడు కట్టడం, నిర్లక్ష్యం చేస్తే అది ప్రాణాంతకం అయ్యే అవకాశాలూ ఉంటాయి.

- **ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీ :** కొందరిలో ఐవీఎఫ్ ప్రక్రియలో భాగంగా గర్భాశయంలోకి పంపించిన పిండం కొద్దిగా వెనక్కు వెళ్లి, ట్యూబ్‌లో అంటుకుని, అక్కడ గర్భం మొదలయ్యే అవకాశాలు ఉంటాయి.
- **గర్భస్రావాలు (అబార్షన్లు) :** మామూలుగా గర్భం దాల్చినవాళ్లలోలాగే ఇలా ఐవీఎఫ్ ద్వారా గర్భం దాల్చినవాళ్లలో కూడా ఏ సమయంలోనైనా గర్భస్రావం కావచ్చు. వయసు ఎక్కువగా ఉన్నప్పుడు, పిండం నాణ్యత బాగా లేకపోవడం వంటి సందర్భాల్లో అబార్షన్లు అయ్యే అవకాశాలు కొద్దిగా ఎక్కువ.
- **అవయవలోపాలు :** సాధారణంగా పుట్టే అందరు పిల్లల్లోనూ ఎలాగైతే 2 – 3 శాతం వరకు అవయవలోపాలు వచ్చే అవకాశాలు ఉంటాయో, అలాగే ఈ పిల్లల్లోనూ అవయవలోపాలు వచ్చే అవకాశాలు అంతే ఉంటాయి. కాకపోతే తల్లివయసు ఎక్కువగా ఉన్నప్పుడు పిల్లల్లో అవయవ లోపాలు వచ్చే అవకాశాలు మరింతగా పెరుగుతాయి. (అయితే కేవలం ఐవీఎఫ్ ప్రక్రియ వల్ల ఈ లోపాలు వచ్చాయని భావించేందుకు అవకాశం లేదు).
- **ఒవేరియన్ క్యాన్సర్ :** దీర్ఘకాలంపాటు అండాలు తయారు కావడానికి వాడే మందుల వల్ల, 100 మందిలో ఒకరికి అరుదుగా ఎప్పటికో అండాశయాల క్యాన్సర్ వచ్చేందుకు అవకాశం ఎక్కువ అని ఒక అంచనా.
- **మానసిక ఒత్తిడి :** ఐవీఎఫ్ ప్రక్రియ కాస్త ఖర్చుతో కూడుకున్న ప్రక్రియ కాబట్టి ఇందుకోసం డబ్బు ఖర్చు పెట్టాలి. ఎక్కువ సమయమూ వెచ్చించాలి. ఇంత చేశాక కూడా ఇది గ్యారంటీ లేని చికిత్స కాబట్టి ఈ అన్ని కారణాలతో కాబోయే దంపతుల్లో... ముఖ్యంగా తల్లికావాలని కోరుకుంటున్న మహిళకు ఆందోళన, టెన్షన్, కుంగుబాటు వంటివి కలిగే అవకాశాలుంటాయి.

ఐవీఎఫ్ విజయావకాశాలు (సక్సెస్ రేటు)

ఇది మహిళ వయసు మీద ఆధారపడి ఉంటుంది. 40 ఏళ్లు దాటాక వయసు పెరిగే కొద్దీ సక్సెస్ రేటు తక్కువగా ఉంటుంది. అండాల నాణ్యత, పిండం నాణ్యత తక్కువగా ఉంటే సక్సెస్ రేటు ఆటోమేటిగ్గా తగ్గిపోతుంది. అలాగే గర్భాశయంలో సమస్యలు, అడినోమయోసిస్, ఎండోమెట్రియాసిస్ వంటి సమస్యల తీవ్రత పెరుగుతున్న కొద్దీ విజయావకాశాలూ అదే రీతిలో తగ్గుతుంటాయి.

ఇక జీవనశైలి (లైఫ్‌స్టైల్)పై కూడా విజయావకాశాలు ఆధారపడి ఉంటాయి. ఉదాహరణకు పొగతాగేవారు, ఆల్కహాల్ తీసుకునే అలవాటున్నవారు, అధిక బరువు ఉన్నవారిలో అండాల సంఖ్య, నాణ్యత తక్కువగా ఉంటాయి. దానివల్ల కూడా సక్సెస్‌రేటు తగ్గుతుంది.



ఐవీఎఫ్ ఎవరికి

- సాధారణ చికిత్స, ఐయూఐ చికిత్సలతో గర్భం రాకుండా, వేరే ఇతర సమస్యలేవీ లేకుండా (అన్ ఎక్స్‌ప్లెయిన్‌డ్ ఇన్‌ఫెర్టిలిటీ) ఉండి, ఇంకా వేచి చూసే ఓపిక లేనివాళ్లకి.
- వయసు 38 – 40 ఏళ్లు దాటిన వారికి; ఇంకా 35 ఏళ్లు దాటి, వారి అండాల సంఖ్య, నాణ్యత బాగా తగ్గిపోయి, సాధారణ చికిత్సతో గర్భం రాకపోతే.
- రెండు ట్యూబ్‌లూ మూసుకుపోయిన వాళ్లకి, ట్యూబెక్టమీ అయిపోయిన తర్వాత, మళ్లీ పిల్లలు కావాలనుకున్నప్పుడు; పురుషుల్లో వాసెక్టమీ చేయించుకున్న తర్వాత మళ్లీ ఏదైనా కారణాల వల్ల పిల్లలను కోరుకుని అందుకోసం 'రీకెనలైజేషన్' ఆపరేషన్ చేయించుకున్నా అది సక్సెస్ కానప్పుడు.
- సాధారణ చికిత్సతో అండాలు సరిగా తయారు కానప్పుడు.
- ఎండోమెట్రియాసిస్ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు.
- వీర్యకణాల సంఖ్య, కదలిక, నాణ్యత బాగా తక్కువగా ఉన్నప్పుడు.
- జన్యుపరమైన సమస్యలు ఉన్నప్పుడు : భార్య లేదా భర్తలో ఏవైనా జన్యుపరమైన సమస్య ఉండి, అది పిల్లలకూ వచ్చే అవకాశం ఉన్నప్పుడు, ఐవీఎఫ్ ప్రక్రియను పాటించి, తయారైన పిండాలనుంచి ఒక దాన్ని తీసి, ప్రీ-ఇంప్లాంటేషన్ జెనెటిక్ డయాగ్నసిస్ (పీజీడీ) ద్వారా పరీక్ష చేసి, జన్యు సమస్య లేని పిండాలను వేరుపరచి, తల్లి గర్భాశయంలోకి పంపిస్తారు.



- దాత అండాలను వాడాల్సి వచ్చినప్పుడు
- **క్యాన్సర్ చికిత్స :** శరీరంలో ఎక్కడైనా క్యాన్సర్ నిర్ధారణ అయి, రేడియేషన్, కీమోథెరపీ చికిత్సకు వెళ్లేముందు, అండాలను బయటకు తీసి, వాటిని ఫ్రీజ్ చేసుకోవచ్చు. లేదా అండాలను ఫలదీకరణ చేసుకొని, పిండాలను ఫ్రీజ్ చేసి, చికిత్స పూర్తయ్యాక వాటిని 'ఫ్రోజెన్ ఎంబ్రియో ట్రాన్స్‌ఫర్' పద్ధతిలో గర్భాశయంలోకి పంపవచ్చు.
- **సామాజిక కారణాలు (సోషల్ రీజన్స్) :** కొందరు కెరియర్ కోసం లేదా వ్యక్తిగత కారణాల వల్ల గర్భధారణను వాయిదా వేస్తారు. వాళ్లలో కొందరు ముందుగానే ఐవీఎఫ్ పద్ధతి ద్వారా తయారైన పిండాలను భద్రపరచుకుని, ఆ తర్వాత వీలైనప్పుడు ఫ్రోజెన్ ఎంబ్రియో ట్రాన్స్‌ఫర్ ద్వారా గర్భశయంలోకి ప్రవేశపెట్టుకుని, గర్భం ధరిస్తారు. ఇక మరికొందరు పెళ్లిని వాయిదా వేసుకుని, అండాలను ఫ్రీజ్ చేసుకుంటారు. ఫ్రీజ్ చేసిన అండాలు, పిండాలను ఆ తర్వాత ఉపయోగించుకుంటారు. అయితే బయట కాబోయే తల్లి వయసు పెరిగినప్పటికీ అండం, లేదా పిండానికి మాత్రం అది సేకరించిన నాటి వయసే ఉంటుంది.



డా॥ వేనాటి శోభ,
సీనియర్ గైనకాలజిస్ట్
బర్త్‌రైట్ బై రెయిన్‌బో,
హైదర్‌నగర్, హైదరాబాద్

(పురుషుల్లో ఉండే సమస్యల గురించి యాండ్రాలజిస్ట్‌తో తదుపరి వారం)

పరి పరిశోధన

'విటమిన్ - డి' తో మధుమేహ నివారణ!



సూర్యుడి నుంచి ఉచితంగా అందే విటమిన్ – డి శరీరానికి చేసే ఉపయోగాలు ఎన్నో. బ్రెజిల్‌లోని ద నార్త్ అమెరికన్ మెనోపాజ్ సొసైటీ శాస్త్రవేత్తలు చేసిన తాజా పరిశోధనలు, విటమిన్ – డి ద్వారా మధుమేహం రాకుండా చూసుకోవచ్చు అని చెబుతున్నాయి! కొన్ని ఇతర పరిశోధనలు కూడా విటమిన్ – డి ద్వారా రక్తంలోని గ్లూకోజ్ మోతాదులను నియంత్రించుకోవచ్చునని చెబుతూండటం విశేషం. విటమిన్ – డి లేమి రక్తంలోని గ్లూకోజ్ మోతాదులపై ఎలాంటి ప్రభావం చూపుతుందో తెలుసుకునేందుకు బ్రెజిల్ శాస్త్రవేత్తలు దాదాపు 680 మంది మహిళలపై పరిశోధన చేశారు. దాదాపు 34 శాతం మంది డి – విటమిన్‌ను వాడుతూండగా.. వారిలో గ్లూకోజ్ మోతాదులు తగు నియంత్రణలో ఉన్నట్లు తెలిసింది. మాత్రల రూపంలో కాకుండా.. అప్పుడప్పుడూ ఎండలో గడిపిన వాళ్లలోనూ ఇవే రకమైన ఫలితాలు కనిపించాయని ఈ పరిశోధనలో పాల్గొన్న శాస్త్రవేత్త డాక్టర్ జో ఆన్ పింకెర్టన్ తెలిపారు. విటమిన్ – డి తక్కువగా ఉంటే రక్తంలో గ్లూకోజ్ మోతాదులు ఎక్కువగా ఉన్నట్లు తమ అధ్యయనం ద్వారా తేలిందని చెప్పారు. మరికొన్ని విస్తృత పరిశోధనల ద్వారా ఈ ఫలితాలను నిర్ధారించుకుంటే మధుమేహ నియంత్రణకు చౌకైన కొత్తమార్గం లభిస్తుందని వివరించారు.

వైఫై సంకేతాలతోనే స్మార్ట్‌ఫోన్ ఛార్జింగ్



మీ స్మార్ట్‌ఫోన్‌ను ఇంట్లో ఉండే వైఫై రౌటర్ తోనే చార్జ్ చేసుకోగలిగితే ఎలా ఉంటుంది? ఈ అద్భుతాన్ని సాకారం చేస్తామంటున్నారు మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ శాస్త్రవేత్తలు. వినేందుకు ఆశ్చర్యంగా అనిపిస్తోంది కదూ! కానీ రెక్టెన్నా అనే ప్రత్యేకమైన పరికరం సాయంతో ఇది చాలా సులువైన పనే అని అంటున్నారు టోమ్స్ పలాసియోస్ అనే శాస్త్రవేత్త. ఏసీ విద్యుత్తు ద్వారా పుట్టే విద్యుదయస్కాంత తరంగాలను డీసీ తరంగాలుగా మార్చే పరికరమే రెక్టెన్నా. ఎంఐటీ శాస్త్రవేత్తలు తయారు చేసిన కొత్తరకం రెక్టెన్నా మాత్రం రేడియో తరంగాలను స్వీకరించి ఏసీ విద్యుత్‌తరంగాలుగా మారుస్తుందన్నమాట. అయితే ఇప్పటివరకూ రెక్టెన్నాతో ఉత్పత్తి చేయగలిగిన విద్యుత్తు చాలా తక్కువగా ఉండటంతో ఈ రెక్టెన్నాను విస్తృత స్థాయిలో వాడటం సాధ్యం కాలేదని తమ గాడ్జెట్‌తో ఈ పరిస్థితి మారిపోతుందని టోమ్స్ తెలిపారు. నేచర్ మ్యాగజైన్‌లో ప్రచురితమైన వివరాల ప్రకారం.. ఈ కొత్తతరం రెక్టెన్నాను చాలా చౌకగా, సులువుగా తయారు చేయవచ్చు. హైవేల వెంబడి కొత్త రెక్టెన్నాలను భారీ సైజులో ఏర్పాటు చేయవచ్చునని తద్వారా బ్యాటరీల అవసరం లేకుండా ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు అన్నింటినీ చార్జ్ చేయవచ్చునని తెలిపారు. ప్రయోగాత్మకంగా తాము తయారుచేసిన రెక్టెన్నాలతో 40 మైక్రోవాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేయగలిగామని.. ఎల్ఈడీ స్క్రీన్లు మొదలుకొని అనేక వేరబుల్ గాడ్జెట్స్‌కు ఈ మాత్రం విద్యుత్తు సరిపోతుందని వివరించారు.

సరోగసీ...



సంతానం కోసం పరితపించే జంట ఇక అన్ని విధాలా ప్రయత్నించాక చివరి ఆశగా ప్రయత్నించే ప్రక్రియ 'టెస్ట్‌ట్యూబ్ బేబీ' అన్న విషయం తెలిసిందే. కానీ టెస్ట్‌ట్యూబ్ పద్ధతి ద్వారా 100 శాతం ఫలితాలు ఉండకపోవచ్చు. అయితే ఈ ప్రక్రియను దాదాపుగా 3 – 6 సార్లు ప్రయత్నించాక కూడా కొందరిలో ఫలితం ఉండకపోవచ్చు. పిండం నాణ్యంగా లేకపోవడం, గర్భాశయంలో లేదా ఎండోమెట్రియమ్ పొరలో బయటకు తెలియని లోపాలు, సూక్ష్మమైన సమస్యలు ఉన్నా గర్భం రాకపోవచ్చు. అలాంటప్పుడు, రెండుమూడు సార్లు ఐవీఎఫ్ పద్ధతిలోనూ గర్భం రానప్పుడు అవసరాన్ని బట్టి దాత నుంచి స్వీకరించిన అండాలను లేదా శుక్రకణాలను లేదా పిండాన్ని, దంపతుల అంగీకారం మీద, వాడుకొని ప్రయత్నించవచ్చు. కొందరు దంపతులకు ఇలా దాత నుంచి తీసుకోవడం ఇష్టం ఉండకపోవచ్చు. దాంతో గర్భాన్ని సొంత తల్లి మోసే అవకాశం లేనప్పుడు, ఆమె బదులుగా మరో తల్లిలో ఆ పిండాన్ని పెరగనిచ్చి, కననిచ్చి, బిడ్డ పుట్టాక సొంత తల్లికి అప్పగించే ప్రక్రియనే 'సరోగసీ' అంటారు. అయితే ఇక్కడ ఈ ప్రక్రియలో సరోగేట్ తల్లి కేవలం బిడ్డను మోయడం మాత్రమే చేస్తుంది. మిగతా అండం, శుక్రకణం, అవి కలవడం వల్ల ఏర్పడిన పిండం... ఇవన్నీ సొంత తల్లిదండ్రులకు చెందినవే కావడం వల్ల ఈ ప్రక్రియ వైపునకు చాలామంది బిడ్డలు లేనివారు మొగ్గుచూపారు.

ఇదీ చరిత్ర...

మన భారతదేశంలో మొట్టమొదటి సరోగేట్ బిడ్డ 1994లో పుట్టింది. ఇక 2002లో మొదటిసారి సరోగసీకి చట్టబద్ధత ఏర్పడింది. దాంతో టెస్ట్‌ట్యూబ్ ప్రక్రియ ద్వారా కూడా బిడ్డలు కలగని ఎందరో దంపతులు ఈ ప్రక్రియను ఆశ్రయించారు. ఫలితంగా 2002 నుంచి 2015 వరకు భారత్ సరోగసీకి కేంద్రమైంది. మన దగ్గర ఈ ప్రక్రియకు రూ. 10 లక్షల నుంచి 15 లక్షలు ఖర్చు పెట్టగలిగితే చాలు... బిడ్డను తీసుకుపోవచ్చు. కానీ అదే విదేశాలలోనైతే ఇదే ప్రక్రియకు 75,000 డాలర్ల నుంచి 85,000 డాలర్లు ఖర్చు పెట్టాల్సి రావచ్చు. (అంటే మన కరెన్సీలో దాదాపు 53 లక్షల రూపాయల నుంచి 56 లక్షల రూపాయల వరకు). దాంతో విదేశాలతో పోలిస్తే ఇక్కడ సరోగసీ చవక కావడంతో అక్కడి నుంచి మన దేశానికి విదేశీయులు చాలా పెద్ద సంఖ్యలో వచ్చేవారు. 'వాణిజ్యపరమైన సరోగసీ పద్ధతి' పెద్ద ఎత్తున సాగింది. ఐక్యరాజ్యసమితి 2012లో వేసిన ఒక అంచనా ప్రకారం, భారతదేశంలో సరోగసీ ద్వారా ఏడాదికి 400 మిలియన్ డాలర్ల (2,845 కోట్ల రూపాయల) వాణిజ్యం జరిగినట్లు అంచనా వేసింది. దాదాపు 3,000 సంతానోత్పత్తి కేంద్రాలలో 25,000 మంది పిల్లలు జన్మించినట్లు కూడా అంచనా. దీంతో పాటు మరికొన్ని సమస్యలను గుర్తించిన కేంద్రప్రభుత్వం 2015లో విదేశీ దంపతులకు భారత్‌లో సరోగసీని నిషేధించింది. అంతేకాదు... 2018 డిసెంబర్‌లో మరికొన్ని మార్పులతో 'సరోగసీ (రెగ్యులేషన్) బిల్ 2016 పేరిట ఒక కొత్త చట్టాన్ని లోక్‌సభలో ఆమోదించింది. దాని ప్రకారం ఈ కింది నిబంధనలతో కొత్త చట్టంలో ఈ కింది సవరణలు ఉన్నాయి.

సరోగసీకి ఎవరు అర్హులు

- భారతీయ పౌరులు మాత్రమే.
- మహిళ వయసు 23– 50 ఏళ్లు ఉండాలి.
- పురుషుడి వయసు 26 – 55 ఏళ్లు ఉండాలి.
- వివాహం జరిగి కనీసం ఐదేళ్లు నిండాలి.
- దంపతులిద్దరికీ దత్తత ద్వారాగానీ, సరోగసీ ద్వారాగానీ, సొంత పిల్లలుగానీ ఉండకూడదు.

సరోగసీ తల్లిగా గర్భాన్ని ఇవ్వడానికి ఎవరు అర్హులు?

- దగ్గరి బంధువు
- వివాహితులు
- 25 నుంచి 35 ఏళ్ల మధ్య ఉన్నవారు
- వారికి పిల్లలు కలిగి ఉండాలి.
- ఎన్నారై లేదా విదేశీయులు అయి ఉండకూడదు.
- జీవితకాలంలో ఒకసారి మాత్రమే ఈ ప్రక్రియను అనుసరించడానికి అర్హులు.
- స్వచ్ఛందంగా మాత్రమే ఇది జరగాలి. పారితోషికం తీసుకోకూడదు.

అనుమతి లేనిదెవరికి?

- విదేశీయులకు • ఎన్నారైలకు • స్వలింగసంపర్కులకు • ఒంటరి తల్లిదండ్రులు • విడాకులు పొందిన వితంతువు • అవివాహిత
- ఇప్పటికే పిల్లలున్న జంటలు

అన్ని రాష్ట్రాలకూ వర్తిస్తుందా?

జమ్మూ, కశ్మీర్‌కు తప్ప అన్ని రాష్ట్రాలకూ వర్తిస్తుంది.

ఉల్లంఘనకు పాల్పడితే...

జరిమానాగా పది లక్షల రూపాయల నగదుతో పాటు పదేళ్లకు తగ్గకుండా జైలు శిక్ష. చివరగా... ఇదీ స్థూలంగా కొత్తచట్టంలోని నిబంధనలు. అయితే దీనిపై చాలా చర్చ జరుగుతోంది. అమ్మదనాన్ని అందరూ కోరుకుంటారు. కావాలని ఎవరూ సరోగసీ చేయించుకోరు. అయితే కొందరు గర్భం మోయడానికి భయపడేవారు, అంతకాలం గర్భం మోయడానికి సమయం కేటాయించలేనివాళ్లు సరోగసీ వైపునకు వెళ్తే వెళ్లవచ్చు. కానీ అలాంటివారి సంఖ్య చాలా తక్కువ. అలాంటి సమయంలో ఈ కొత్త చట్టంలోని కొన్ని నిబంధనలు నిజంగా అవసరమైన వారికి కూడా మేలు చేయవంటూ వైద్యవర్గాల్లో ఒక చర్చ మొదలైంది. ఉదాహరణకు పారితోషికం తీసుకొని సరోగసీకి సిద్ధం కావడంపై నిషేధం ఉంది. అలాంటప్పుడు అది రహస్యంగా జరిగే అవకాశాలు లేకపోలేదు. అలాగే కేవలం బంధువులు మాత్రమే అర్హులంటే... ఈ ప్రక్రియకు ఇష్టపడని బంధువర్గాన్ని బలవంతంగా ఒప్పించే అవకాశాలూ ఉంటాయి కదా. ఇక భారతదేశంలోని ఏ రాష్ట్రానికీ లేని సౌలభ్యం జమ్మూకశ్మీర్‌కు ఉంది. అలాంటప్పుడు ఇక్కడి జంటలు అక్కడికి వెళ్లడానికి, అక్కడా అలాంటి అక్రమాలకు అవకాశం ఉండదా అనే ప్రశ్నలు ఎదురవుతుంటాయి. ఇలాంటి ప్రశ్నలు, లొసుగులు ఉన్నందున వైద్యవర్గాల్లోనూ, ఈ ప్రక్రియ ద్వారానే సంతానం కలిగే అవకాశమున్నవారిలోనూ ఈ అంశంపై చర్చ జరుగుతోంది.

మాతృత్వం మహిళలందరూ అనుభవించాలనుకునే అమూల్య భావన. సరోగసీ అనే వసతి ఉందనే ఉద్దేశంతో దాన్నే అందరూ కోరుకోరూ, ఎవరూ అలా వాడుకోరు. అందువల్ల నిబంధనలన్నవి ఎల్లవేళలా అవసరమైన వారికి అందుబాటులో ఉండేలా ఉండాలే తప్ప... ప్రతికూలమూ, ప్రతిబంధకమూ కాకూడదన్నదే వైద్యవర్గాల భావన.



డాక్టర్ నర్మద కటకం
ఫెర్టిలిటీ స్పెషలిస్ట్,
మెడికల్ డైరెక్టర్,
జెనెసిస్ ఫెర్టిలిటీ & లాపరోస్కోపిక్ సెంటర్,
కొత్తపేట, హైదరాబాద్

సాక్షి భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

గురువారం
31-1-2019

జాబ్ ట్రెండ్స్



ఐటీ రంగం.. కోర్సు ఏదైనా.. బ్రాంచ్ ఏదైనా.. లక్షల మంది విద్యార్థులు, నిరుద్యోగుల ఆశ! కానీ, గత కొంతకాలంగా ఐటీ వృద్ధి రేటులో మందగమనం.. దాంతో నియామకాల్లోనూ తగ్గుదల ఉద్యోగార్థులను నిరాశ పరచింది! మరి కొత్త సంవత్సరం 2019లో ఐటీ రంగం ఆశల ఊసులు మోసుకొస్తుందా..! సాఫ్ట్‌వేర్ కంపెనీలు భారీగా నియామకాలు చేపట్టనున్నాయా... ఆకర్షణీయ వేతనాలు అందించనున్నాయా..!? అంటే... అవుననే సమాధానం వినిపిస్తోంది!! ఐటీ రంగం వృద్ధి, నియామకాల తీరుతెన్నులపై తాజా సర్వేలు, నిపుణుల విశ్లేషణ..

ఐటీ.. జోష్!

- వృద్ధిరేటు పుంజుకొని పునర్వైభవం దిశగా సాఫ్ట్‌వేర్ రంగం!
- 2019లో నియామకాలు ఊపందుకుంటాయంటున్న నిపుణులు
- లాభాల బాటలో ఐటీ సంస్థలు.. పెరుగుతున్న ఎగుమతులు
- ఏఐ, ఐవోటీ, మెషిన్ లెర్నింగ్, డేటా, బ్లాక్‌చైన్‌లో ఎక్కువగా కొలువులు

కొత్త సంవత్సరంలో ఐటీ

అటు వ్యాపార వృద్ధిలో.. ఇటు నియామకాల పరంగా గత కొంతకాలంగా ఐటీ (ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) రంగం ఒడిదుడుకులు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. అయితే 2019లో ఐటీ రంగం పునర్వైభవం పొంది.. భారీగా నియామకాలు చేపట్టే అవకాశముందని పలు సర్వేల తాజా అంచనా. వ్యాపార కార్యకలాపాల పరంగా సానుకూల పరిస్థితులు కనిపించడమే ఇందుకు కారణమని ఐటీ రంగ నిపుణులు పేర్కొంటున్నారు. కొత్త సంవత్సరంలో ఐటీ రంగం వృద్ధి నమోదు చేసుకోవడం ఖాయమని.. ఆ క్రమంలో క్లయింట్లకు వేగంగా సర్వీసులు అందించడానికి వీలుగా కొత్త నియామకాలు చేపట్టే అవకాశముందని నాస్కామ్ తదితర సంస్థల అంచనా. ఐటీ రంగం ఈ ఏడాది ఆశాజనక వృద్ధి నమోదు చేసుకుంటుందనడానికి.. అదే విధంగా కొత్త నియామకాలు పెరుగుతాయనడానికి మరో నిదర్శనం.. ఇటీవల ప్రకటించిన మూడో త్రైమాసిక ఫలితాల్లో దాదాపు అన్ని ఐటీ సంస్థలు వృద్ధి నమోదు చేసుకోవడమే!

పెరుగుతున్న ఎగుమతులు

అమెరికాలో హెచ్-1బి వీసాలపై ఆంక్షల నేపథ్యంలో ఇంతకాలం ఆఫ్‌షోర్ కేంద్రాల ద్వారా కార్యకలాపాలు నిర్వహిస్తున్న సంస్థలు.. గత కొంతకాలంగా తమ పంథా మార్చుకున్నాయి. ఎగుమతులే ఆధారంగా విదేశీ క్లయింట్లకు సర్వీసులు అందిస్తున్నాయి. ఫలితంగా 2018లో భారత్ నుంచి ఐటీ రంగం ఎగుమతుల విలువ 126 బిలియన్ డాలర్లుగా నమోదైంది. రెవెన్యూ వృద్ధి సైతం ఏడు నుంచి తొమ్మిది శాతానికి పెరిగింది. ఈ విధంగా ఐటీ రంగంలో కార్యకలాపాలు విస్తరిస్తున్న తరుణంలో సంస్థలు.. క్లయింట్లకు అందించే సేవల్లో లోటుపాట్లు లేకుండా చూసేందుకు వీలుగా మళ్లీ కొత్త నియామకాల బాటపడుతున్నాయి. గతేడాది చివరి నాటికి దేశ ఐటీ రంగంలో మొత్తం ఉద్యోగుల సంఖ్య 4.5 మిలియన్ల మంది కాగా.. వీరిలో 40 శాతం మంది ఫ్రెషర్స్ ఉన్నట్లు అంచనా. కొత్త సంవత్సరంలో ఫ్రెషర్స్ నియామకాలు మరింత జోరందుకోనున్నాయి. కొత్తగా దాదాపు రెండు లక్షల ఉద్యోగాలు లభించడం ఖాయమని పలు నివేదికలతోపాటు పరిశ్రమ నిపుణులు చెబుతున్నారు.



ఫ్రెషర్స్‌కు ఆశాదీపంలా

ఇటీవల ఆశాజనక వృద్ధిరేటు నమోదు చేసుకోవడంతో ఐటీ రంగ కంపెనీలు ఉద్యోగార్థులకు ఆశాదీపంలా కనిపిస్తున్నాయి. వాస్తవానికి గత ఏడేళ్లుగా ఐటీ కంపెనీల ఫ్రెషర్స్ నియామకాలు 20 నుంచి 25 శాతం దాటలేదు. కానీ, ఈ ఏడాది 50 శాతానికి చేరుకునే అవకాశముందని నిపుణులు పేర్కొంటున్నారు. వేతనాల్లోనూ గతేడాదితో పోల్చితే 20 శాతం అధికంగా లభించే అవకాశం ఉందంటున్నారు. తాజాగా నౌకరీ డాట్ కామ్ విడుదల చేసిన హైరింగ్ ఔట్‌లుక్ రిపోర్ట్-2019 ప్రకారం ఐటీ రంగం వచ్చే ఆరునెలల్లో దాదాపు లక్షన్నర ఉద్యోగాలను కల్పించనుంది. ఇందులో 30 శాతం నుంచి 40 శాతం ఫ్రెషర్స్ ఉంటారని సర్వే పేర్కొంది. గతేడాదితో పోల్చితే ఫ్రెషర్స్ నియామకాల్లో 20 శాతం మేర వృద్ధి ఉంటుందని సర్వేలో పాల్గొన్న 40 శాతం సంస్థలు పేర్కొనడం విశేషం.

టెక్ స్టార్టప్స్.. వెన్నుదన్ను

సాఫ్ట్‌వేర్ కంపెనీలతోపాటు టెక్ స్టార్టప్స్ సైతం ఐటీ ఉద్యోగార్థులకు వెన్నుదన్నుగా నిలవనున్నట్లు పలు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రస్తుతం దేశంలో దాదాపు 40 వేల స్టార్టప్ కంపెనీలు కార్యకలాపాలు కొనసాగిస్తుండగా... వాటిలో 80 శాతం టెక్ స్టార్టప్ సంస్థలే! ఇవి కూడా గతేడాది వ్యాపార వృద్ధి పరంగా పురోగతి సాధించాయి. దాదాపు 130 బిలియన్ డాలర్ల పెట్టుబడులను సొంతం చేసుకున్నాయి. ఇదే పరిస్థితి రానున్న రోజుల్లోనూ కొనసాగనుందని.. ఫలితంగా ఈ సంస్థలు నూతన నియామకాలు చేపట్టడం ఖాయమని నిపుణులు చెబుతున్నారు.

ఐఐటీలు, నిట్‌ల్లో భారీ ఆఫర్లు

ప్రముఖ ఇన్‌స్టిట్యూట్‌లు ఐఐటీలు, నిట్‌లలో ఇటీవల ముగిసిన తొలిదశ క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్స్‌లో ఈ ఏడాది పలు మధ్యతరహా ఐటీ సంస్థల నుంచి దిగ్గజ ఐటీ సంస్థల వరకు నియామకాలు చేపట్టాయి. భారీ సంఖ్యలో ఆఫర్లు ఇచ్చాయి. దీంతో తొలిదశలోనే ఐఐటీలు, ఎన్ఐటీల్లో 80 శాతం మందికి ఉద్యోగాలు లభించాయి. వీటిలో 40 శాతం మేర కోర్ ఐటీ ప్రొడక్ట్ సర్వీసెస్ సంస్థలే కావడం గమనార్హం. బీఎఫ్ఎస్ఐ, కన్సల్టింగ్ రంగ కంపెనీలు కూడా తమ సంస్థల్లోని టెక్నికల్ విభాగాల్లోనే అధిక శాతం నియామకాలు చేపట్టాయి. టైర్-1, మెట్రో నగరాలతోపాటు టైర్-2, టైర్-3 నగరాల్లోని ఇన్‌స్టిట్యూట్‌ల నుంచి కూడా ఐటీ కంపెనీలు నియామకాలు చేపట్టే అవకాశముందని అంచనా వేస్తున్నారు.

ఇప్పటికే ప్రకటించిన సంస్థలు

పలు ఐటీ దిగ్గజ సంస్థలు ఇప్పటికే తమ కొత్త నియామకాల ప్రణాళికలు ప్రకటించాయి. 2018-19 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికి 30 వేల ఫ్రెషర్స్‌ను రిక్రూట్ చేసుకున్నామని..

2019-20లో ఇది మరింత పెరిగే అవకాశముందని టీసీఎస్ ప్రకటించింది. ఇదేవిధంగా ఇన్ఫోసిస్ 25 వేల నుంచి 30 వేల వరకు; కాగ్నిజెంట్ 15 వేల నుంచి 20 వేల వరకు; విప్రో టెక్నాలజీస్ 20 వేల వరకు ఫ్రెషర్స్‌ను నియమించుకునేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు పేర్కొన్నాయి.

ఆ ఆరు విభాగాల్లో

సంస్థలు ప్రధానంగా ఆరు విభాగాల్లోనే కొత్త నియామకాలకు ప్రాధాన్యమిస్తున్నాయి. అవి.. - ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) -మెషిన్ లెర్నింగ్ - డేటా అనలిటిక్స్ - బ్లాక్ చైన్ టెక్నాలజీ - క్లౌడ్ టెక్నాలజీస్ - ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐవోటీ). ఈ విభాగాల్లో ఫ్రెషర్స్‌కు నైపుణ్యాలను బట్టి ప్రాజెక్ట్ అసోసియేట్, ప్రాజెక్ట్ లీడ్, డేటా అసోసియేట్, ఏఐ ఎగ్జిక్యూటివ్ వంటి హోదాలు కల్పిస్తున్నాయి. ఆటోమేషన్ నేపథ్యంలో ప్రత్యేకంగా ఈ విభాగాలకే ప్రాధాన్యమిస్తున్న సంస్థలు.. ఫ్రెషర్స్‌కు వాటికి సంబంధించిన శిక్షణనిచ్చేందుకు సైతం సమాయత్తం అవుతున్నాయి. అకడమిక్‌గా ఈ కొత్త టెక్నాలజీ నైపుణ్యాలు పూర్తిగా లభించని ప్రస్తుత పరిస్థితుల్లో.. ఫ్రెషర్స్‌కు శిక్షణనివ్వాలని భావిస్తున్నాయి.

ఫ్రీలాన్సర్లకూ అవకాశాలు

ఐటీలో ఆటోమేషన్, కోడింగ్, ప్రోగ్రామింగ్ నైపుణ్యాలున్న వారికి ఫ్రీలాన్సింగ్ విధానంలో నియమించుకునేందుకు కూడా కంపెనీలు సిద్ధపడుతున్నాయి. పలు నివేదికల ప్రకారం అంతర్జాతీయంగా ఐటీ రంగంలో ఫ్రీలాన్సర్లకు సంబంధించి మన దేశం రెండో స్థానంలో నిలుస్తోంది. ముఖ్యంగా బ్లాక్ చైన్, డీప్ లెర్నింగ్ విభాగాలకు సంబంధించి ఫ్రీలాన్సింగ్ అవకాశాలు లభిస్తున్నాయి. ఫ్రీలాన్సింగ్‌కు సంబంధించి ఎక్కువగా.. అనుభవం గడించిన, అత్యున్నత నైపుణ్యాలున్న మిడిల్ లెవల్ ఎగ్జిక్యూటివ్స్‌కే సంస్థలు ప్రాధాన్యమిస్తున్నాయి.

బేసిక్ స్కిల్స్ తప్పనిసరి

కొత్త సంవత్సరంలో ఆటోమేషన్ ఆధారిత ఉద్యోగాలు భారీ సంఖ్యలో లభించడం ఖాయం. అయితే ఆయా ఉద్యోగాలు సొంతం చేసుకునేందుకు సాఫ్ట్‌వేర్ రంగంలో బేసిక్ నైపుణ్యాలుగా భావించే కోడింగ్, ప్రోగ్రామింగ్, అప్లికేషన్, లాంగ్వేజ్ స్కిల్స్ తప్పనిసరి. ఎలాంటి కొత్త టెక్నాలజీని రూపొందించాలన్నా, అప్లై చేయాలన్నా ఈ నైపుణ్యాలు తప్పనిసరి.

– వి.రాజన్న, ఎస్‌వీపీ, టీసీఎస్-హైదరాబాద్.

కలిసొచ్చే కొత్త సంవత్సరం

నా అంచనా ప్రకారం ఫ్రెషర్స్‌కు ఐటీ నియామకాల పరంగా 2019 కలిసొచ్చే సంవత్సరమే. కోర్ ఐటీ సంస్థల్లోనే రెండున్నర లక్షల ఉద్యోగాలు లభించే పరిస్థితి కనిపిస్తోంది. దీనికి అదనంగా టెక్ స్టార్టప్స్‌లో రెండు లక్షల నుంచి రెండున్నర లక్షల ఉద్యోగాలు అందుబాటులోకి వచ్చే అవకాశముంది. వీటిలో ఫ్రెషర్స్ వాటా 60 శాతం పైగానే ఉంటుంది. అయితే కంపెనీలు ఆటోమేషన్ ఆధారిత కార్యకలాపాలు సాగిస్తున్న నేపథ్యంలో ఉద్యోగార్థులు సంబంధిత నైపుణ్యాలు సొంతం చేసుకోవడం మేలు చేస్తుంది.

– టి.వి.మోహన్‌దాస్‌పాయ్, ఐటీ రంగ నిపుణులు.

కంపెనీలు కోరుకుంటున్న నైపుణ్యాలు

- ఆటోమేషన్ సంబంధిత లేటెస్ట్ టెక్నాలజీపై పట్టు
- కోడింగ్, ప్రోగ్రామింగ్
- క్రియేటివిటీ
- కాంప్లెక్స్ ప్రాబ్లమ్ సాల్వింగ్ స్కిల్స్
- క్రిటికల్ థింకింగ్
- పీపుల్ మేనేజ్‌మెంట్
- కోఆర్డినేటింగ్ స్కిల్స్
- సర్వీస్ ఓరియెంటేషన్
- నెగోషియేషన్ స్కిల్స్
- డెసిషన్ మేకింగ్
- కాగ్నిటివ్ స్కిల్స్, ఫ్లెక్సిబిలిటీ
- ఎమోషనల్ ఇంటెలిజెన్స్

ఉపయోగపడే సర్టిఫికేషన్లు

- జావా
- సీ, సీ++
- పైథాన్
- ఏఐ అండ్ ఎంఎల్
- క్రిప్టో కరెన్సీ

వేతనం.. ఆకర్షణీయం

పే ప్యాకేజ్‌లు కూడా ఆకర్షణీయంగా ఉండనున్నాయి. నైపుణ్యాలున్న యువతకు వారికి లభించిన జాబ్ ప్రొఫైల్, సంస్థ స్థాయిని బట్టి రూ.మూడు లక్షల నుంచి రూ.పది లక్షల వరకు వార్షిక వేతనం లభించనుందని అంచనా. తాజా క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో ఐఐటీలు, ఎన్ఐటీల్లో వేతనం సగటున రూ.పది లక్షలుగా నిలిచింది. టెక్ స్టార్టప్ సంస్థలైతే.. సగటున అయిదు లక్షల వేతనంతోపాటు స్టాక్ ఆప్షన్స్, లాభాల్లో డివిడెండ్ వంటివి కూడా ఆఫర్ చేస్తున్నాయి.

ఐటీ రంగం.. ముఖ్య గణాంకాలు

- 2018లో భారత ఐటీ రంగం ఎగుమతుల విలువ 126 బిలియన్ డాలర్లు.
- ఏడు నుంచి తొమ్మిది శాతం వృద్ధి బాటలో సాఫ్ట్‌వేర్ సంస్థలు.
- 2018 చివరికి ఈ రంగంలో మొత్తం 4.5 మిలియన్ల మందికి ఉపాధి. వీరిలో 40 శాతం మేరకు ఫ్రెషర్స్.
- గతేడాదితో పోల్చితే ఈ సంవత్సరం ఫ్రెషర్స్ నియామకాల్లో 20 నుంచి 25 శాతం పెరుగుదల.
- సగటున రూ.మూడు లక్షల నుంచి రూ.పది లక్షల వార్షిక వేతనం అందే అవకాశం.

ఉద్యోగ సమాచారం

ఓఎన్‌జీసీ- సదరన్ సెక్టార్‌లో 86 పోస్టులు

ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఓఎన్‌జీసీ).. సదరన్ సెక్టార్‌లో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 86 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాలు:** అసిస్టెంట్ టెక్నీషియన్, అసిస్టెంట్ గ్రేడ్-3, జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ టెక్నీషియన్, జూనియర్ అసిస్టెంట్, జూనియర్ ఫైర్ సూపర్‌వైజర్, జూనియర్ మోటార్ వెహికల్ డ్రైవర్, జూనియర్ ఫైర్‌మ్యాన్.
- **అర్హత:** పోస్టులను బట్టి మెట్రిక్యులేషన్, సంబంధిత విభాగాల్లో గ్రాడ్యుయేషన్, ఇంజనీరింగ్ గ్రాడ్యుయేషన్, డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు హెవీ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్, నిర్దేశ శారీరక ప్రమాణాలుండాలి.
- **వయసు:** 2019, ఫిబ్రవరి 20 నాటికి 18-30 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వేషన్ అభ్యర్థులకు సడలింపు ఉంటుంది.
- **ఎంపిక:** కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్/ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, టైపింగ్ టెస్ట్, డ్రైవింగ్ టెస్ట్ ఆధారంగా.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్/ఓబీసీలకు రూ. 370. (రిజర్వేషన్ అభ్యర్థులకు ఉచితం).
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఫిబ్రవరి 20, 2019.
- **వెబ్‌సైట్:** www.ongcindia.com

ఎన్ఎల్‌సీ ఇండియాలో 35 పోస్టులు

నైవేలీ (తమిళనాడు)లోని భారత ప్రభుత్వ రంగ సంస్థ ఎన్ఎల్‌సీ ఇండియా లిమిటెడ్ వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 35 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ ఖాళీలు:** డిప్యూటీ మెడికల్ ఆఫీసర్-9, బయోకెమిస్ట్-1, ఫార్మసిస్ట్ గ్రేడ్-బి (ఆయుర్వేద)-2, డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ (మెకానికల్-6, ఎలక్ట్రికల్-3, సీ అండ్ ఐ-2, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్-4)-15, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్)-8.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్/ఆఫ్‌లైన్. ముందుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఆ దరఖాస్తు హార్డ్‌కాపీని ప్రింట్ తీసుకుని, దానికి ఇతర ధ్రువీకరణ పత్రాలు జతచేసి పోస్టులో పంపాలి.
- **దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** ఫిబ్రవరి 4, 2019.
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఫిబ్రవరి 25, 2019.
- **హార్డ్‌కాపీలను పంపడానికి చివరితేదీ:** మార్చి 4, 2019.
- **వెబ్‌సైట్:** www.nlcindia.com

ఆర్థికంలో విజయానికి..

గ్రూప్స్ ప్రత్యేకం

ఆర్థికశాస్త్రం ముఖ్యాంశాలు



మైనింగ్ రంగం




భారత ఆర్థికవ్యవస్థలో మైనింగ్ ప్రధాన రంగం. స్వాతంత్ర్యానంతరం ఖనిజాల ఉత్పత్తి, విలువ విషయంలో గణనీయమైన పురోగతి ఏర్పడింది. భారత్ మొత్తం 95 ఖనిజాలను ఉత్పత్తి చేస్తోంది. వీటిలో 4 ఇంధనం, 10 లోహ, 23 అలోహ, 3 అణు, 55 మైనర్ లోహాలు. 2017-18లో మొత్తం ఖనిజాల ఉత్పత్తి విలువ (అణు, ఇంధన ఖనిజాలు మినహా) రూ. 1,13,541 కోట్లు. 2016-17తో పోల్చితే ఉత్పత్తి విలువలో పెరుగుదల 13 శాతంగా నమోదైంది. గనుల మంత్రిత్వ శాఖ వార్షిక నివేదిక 2017-18 ప్రకారం బొగ్గు, లిగ్నైట్ ఉత్పత్తిలో మూడో స్థానం.. క్రూడ్ పెట్రోలియం ఉత్పత్తిలో 23వ స్థానం... బాక్సైట్, క్రోమైట్, ఇనుప ధాతువు ఉత్పత్తిలో నాలుగో స్థానం... అల్యూమినియం, జింక్ ఉత్పత్తిలో 5వ స్థానం.. మాంగనీస్ ముడి ఖనిజం ఉత్పత్తిలో ఆరో స్థానం.. కాపర్(శుద్ధి చేసిన)ఉత్పత్తిలో ఏడో స్థానం.. ఉక్కు (క్రూడ్/లిక్విడ్) ఉత్పత్తిలో మూడో స్థానం.. మాగ్నసైట్ ఉత్పత్తిలో 11వ స్థానం... లెడ్ ఉత్పత్తిలో 17వ స్థానాన్ని భారత్ సొంతం చేసుకుంది.

- 2016-17తో పోల్చినప్పుడు 2017-18లో ఖనిజాల ఉత్పత్తిలో పెరుగుదల వరుసగా... కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, గోవా, ఒడిషా, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, జమ్మూకాశ్మీర్‌లలో నమోదైంది. కాగా తగ్గుదల వరుసగా... మేఘాలయ, జార్ఖండ్, అసోం, తమిళనాడు, హిమాచల్ ప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల్లో నమోదైంది. మైనర్ ఖనిజాల ఉత్పత్తి విలువ 2016-17లో రూ.52,810 కోట్లు. వీటి ఉత్పత్తిలో వాటాల పరంగా ఆంధ్రప్రదేశ్ ప్రథమ స్థానాన్ని.. రాజస్థాన్, తెలంగాణ వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాలు పొందాయి.

జాతీయ తయారీ రంగ విధానం

స్థూలంగా భారత ఆర్థిక వ్యవస్థను ప్రాథమిక, ద్వితీయ, తృతీయ రంగాలుగా విభజించడం జరిగింది. ప్రాథమిక రంగంలో... వ్యవసాయం, పశుసంపద, అడవులు, మత్స్యసంపద, గనులు-క్వారీయింగ్ ఉపరంగాలు. అలాగే ద్వితీయ రంగంలో.. తయారీ ముఖ్య కార్యకలాపం. తృతీయ రంగాన్ని సేవా రంగంగా పరిగణిస్తాం. పరిశ్రమలు, వాణిజ్య మంత్రిత్వ శాఖ పరిధిలోని 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండస్ట్రియల్ పాలసీ, ప్రమోషన్' 2011, నవంబర్ 4న జాతీయ తయారీ విధానాన్ని ప్రకటించింది. ప్రస్తుతం ప్రపంచంలో చైనా తయారీ రంగానికి ముఖ్య కేంద్రంగా నిలిచింది. చైనా జీడీపీలో తయారీ రంగ వాటా సుమారు 34 శాతం. కాగా ప్రస్తుతం భారత జీడీపీలో తయారీ రంగ వాటా సుమారు 16 శాతం.

ముఖ్యాంశాలు



1. జాతీయ తయారీ రంగం ముఖ్య లక్ష్యం... 2022 నాటికి దేశ జీడీపీలో తయారీ రంగ వాటాను 25 శాతానికి పెంచడంతో పాటు వంద మిలియన్ల మందికి ఉపాధి అవకాశాలు కల్పించడం.
2. రాష్ట్రాల భాగస్వామ్యంతో పారిశ్రామిక రంగ వృద్ధిని వేగవంతం చేయాలనే అంశంపై జాతీయ తయారీ రంగ విధానం ఆధారపడి ఉంది. విధానాల రూపకల్పనతోపాటు ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్య నమూనాలో అవస్థాపనా సౌకర్యాల అభివృద్ధిని కేంద్ర ప్రభుత్వం కల్పిస్తుంది.
3. గ్రామీణ యువతలో ఉపాధి అవకాశాలు పెంపొందించేందుకు వీలుగా.. వారిలో నైపుణ్యత మెరుగుపరచడానికి శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలి. భారత జనాభాలో 60 శాతానికిపైగా పని చేసే వయో వర్గంలో ఉన్నారు.
4. భారత సమగ్ర అభివృద్ధికి జాతీయ తయారీ రంగ విధానం అనువైన వాతావరణం కల్పిస్తుంది.
5. జాతీయ పెట్టుబడి, తయారీ జోన్ల ఏర్పాటు (ఎన్ఐఎంజెడ్).. జాతీయ తయారీ రంగ విధానంలో భాగంగా ఉంటుంది.
6. ఇప్పటివరకు 14 ఎన్ఐఎంజెడ్‌ల ఏర్పాటుకు ప్రభుత్వం సూత్రప్రాయ ఆమోదం తెలిపింది.
7. చిన్న, మధ్య తరహా సంస్థలకు ప్రోత్సాహకాలు... యువ శ్రామిక శక్తికి శిక్షణ.. వ్యాపార నియంత్రణల సడలింపు.. గ్రీన్ టెక్నాలజీతోపాటు సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధికి ఆర్థిక, సంస్థాగత యంత్రాంగం ఏర్పాటు వంటివి జాతీయ తయారీ రంగ విధానంలో ముఖ్యాంశాలు!

ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన

భారత ప్రభుత్వం 2016, జనవరిలో నూతన వ్యవసాయ బీమా పథకం..'ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన'నను ప్రకటించింది. జాతీయ వ్యవసాయ బీమా పథకం(1999), సవరించిన(మోడిఫైడ్) జాతీయ వ్యవసాయ బీమా పథకం (2010-11) స్థానంలో.. ఈ పథకాన్ని కేంద్రం ప్రవేశపెట్టింది. ఈ కొత్త పథకాన్ని ప్రైవేట్ రంగంతోపాటు ప్రభుత్వ రంగంలోని వ్యవసాయ బీమా కంపెనీలు అమలుచేస్తాయి. 2016-17లో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద మొత్తం పంట విస్తీర్ణంలో 30 శాతం అమలుకాగా.. 2018-19 నాటికి దాన్ని 50 శాతానికి విస్తరించాలన్నది లక్ష్యం.

ముఖ్యాంశాలు



1. అన్ని ఖరీఫ్ పంటలకు రెండు శాతం, రబీ పంటలకు 1.5 శాతం ప్రీమియాన్ని రైతులు చెల్లిస్తారు.
2. వాణిజ్య పంటలు, తోట పంటల విషయంలో రైతులు చెల్లించాల్సిన ప్రీమియం 5 శాతం.
3. ఈ పథకం కింద రైతులు చెల్లించాల్సిన ప్రీమియం తక్కువ. మిగతా ప్రీమియాన్ని ప్రభుత్వం చెల్లిస్తుంది. ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టం సంభవించినప్పుడు బీమా మొత్తాన్ని రైతులకు చెల్లిస్తారు.
4. ప్రభుత్వ సబ్సిడీకి గరిష్ట పరిమితి లేదు. బ్యాలెన్స్ ప్రీమియం 90 శాతం ఉన్నప్పటికీ ఈ మొత్తాన్ని ప్రభుత్వం భరిస్తుంది.
5. ప్రత్యక్షంగా 25 శాతం క్లెయిమ్‌ను రైతుల ఖాతాలో జమ చేస్తారు. రాష్ట్రం మొత్తానికి ఒక బీమా కంపెనీ క్షేత్రస్థాయిలో నష్టానికి సంబంధించిన అంచనాను రూపొందిస్తుంది.
6. సాంకేతిక పరిజ్ఞానం వినియోగాన్ని ఈ పథకం కింద ప్రోత్సహిస్తారు. రైతులకు క్లెయిమ్‌ల చెల్లింపులో జాప్యాన్ని తగ్గించడానికి, పంటకోత గణాంకాలను నమోదు చేయడానికి స్మార్ట్‌ఫోన్లను వినియోగిస్తారు.

జనాభా వృద్ధి



ప్రపంచంలో జనాభా పరంగా చైనా తర్వాతి స్థానంలో భారత్ ఉంది. ప్రపంచ మొత్తం విస్తీర్ణంలో భారత్ వాటా 2.4 శాతం కాగా... ప్రపంచ జనాభాలో భారత్ వాటా 17.5 శాతంగా ఉంది. 2011లో భారత జనాభా 121.09 కోట్లు. ఇది అమెరికా, ఇండోనేషియా, బ్రెజిల్, పాకిస్థాన్, బంగ్లాదేశ్, జపాన్‌ల మొత్తం జనాభాకు సమానం. భారత్‌లో పెరుగుతున్న జనాభా భూమిపై ఒత్తిడి పెంచుతోంది. 1901 మొదలు 110 ఏళ్ల కాలంలో... భారత్ జనాభా 97 కోట్లు పెరిగింది. సగటు సాంవత్సరిక జనాభా వృద్ధి రేటు 1981 గణాంకాల ప్రకారం 2.22 శాతం కాగా 2011 గణాంకాల ప్రకారం అది 1.64 శాతం. దేశంలో జనసాంద్రత ప్రతి చదరపు కిలోమీటరుకు 1901లో 77గా ఉండగా.. అది 2011లో 382. ప్రస్తుతం భారత్ జనాభా పరిణామ సిద్ధాంతం రెండో దశలో ఉంది. అయితే ఇటీవల కాలంలో జనాభా వృద్ధిరేటులో తగ్గుదల కారణంగా త్వరలో జనాభా పరిణామ సిద్ధాంతం మూడోదశలోకి ప్రవేశిస్తుందని అంచనా. భారత్‌లో జనాభా పెరుగుదలకు అధిక జననరేటు, అల్ప మరణ రేటుతోపాటు వలసలను కారణంగా పేర్కొనవచ్చు. భారత్‌లో జనాభా విస్ఫోటనానికి అధిక జనన రేటు, అల్ప మరణ రేటును ముఖ్య కారణాలుగా పేర్కొనవచ్చు.

- దేశంలో అధిక జనన రేటుకు.. ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయ రంగం ముఖ్య కార్యకలాపంగా ఉండటం.. వ్యాధి నిరోధక శక్తిని కలిగించే ప్రక్రియ(ఇమ్యునైజేషన్) నెమ్మదిగా సాగడం.. పేదరిక తీవ్రత ఆర్థిక కారకాలుగా చెప్పొచ్చు. కాగా ఉమ్మడి కుటుంబ వ్యవస్థ, వివాహ వయసు తక్కువగా ఉండటం, విద్యా ప్రమాణాల లభ్యత తక్కువగా ఉండటం, మతపరమైన ఆచారాలను సాంఘిక కారకాలుగా పేర్కొనవచ్చు.
- భారత్‌లో మరణ రేటు తగ్గుదలకు.. కలరా, మశూచి, మలేరియా, కుష్ఠు వ్యాధి వంటి రోగాలు తగ్గుముఖం పట్టడం.. సురక్షితమైన తాగు నీటి లభ్యత.. మెరుగైన పారిశుద్ధ్యం.. విద్యాసౌకర్యాలు అందుబాటులోకి వచ్చి అక్షరాస్యత పెరగడం.. మెరుగైన వైద్య సౌకర్యాలు వంటివి ప్రధాన కారణాలుగా చెప్పొచ్చు.
- గత ఆరున్నర దశాబ్దాల కాలంలో అఖిల భారత స్థాయిలో జననాల రేటు కొంత తగ్గింది. కేరళ, తమిళనాడు, గోవాలలో జననాల రేటులో అధిక తగ్గుదల నమోదైంది.

ముద్రా బ్యాంకు

సూక్ష్మ సంస్థలు నిధుల కోసం స్థానిక వడ్డీ వ్యాపారులపై అధికంగా ఆధారపడుతుంటాయి. భారత ఆర్థిక వ్యవస్థలో సూక్ష్మ సంస్థలు కీలకమైనవి. దీన్ని దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం 2015 ఏప్రిల్‌లో.. 'మైక్రో యూనిట్స్ డవలప్‌మెంట్ అండ్ రీఫైనాన్స్ ఏజెన్సీ బ్యాంక్(ముద్రా బ్యాంక్)ను ఏర్పాటుచేసింది. భారత ప్రభుత్వ అంచనాల ప్రకారం దేశంలో పెద్ద పరిశ్రమలు 1.25 కోట్ల మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తుండగా.. సూక్ష్మ సంస్థల్లో 12 కోట్ల మంది ఉపాధి పొందుతున్నారు. సూక్ష్మ సంస్థల యూనిట్ల యజమానులు సుమారు 5.7 కోట్ల మంది రూ.11 లక్షల కోట్ల నిధులు వినియోగించుకుంటున్నారు. ముద్రా బ్యాంకు నమూనా ప్రకారం సూక్ష్మ యూనిట్లు రీఫైనాన్స్ మార్గం ద్వారా రూ.10 లక్షల రుణాన్ని పొందుతాయి. ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, జిల్లా బ్యాంకుల ద్వారా సూక్ష్మ యూనిట్లు రుణాన్ని పొందుతాయి. మూడు విధాలైన పరపతిని సూక్ష్మ యూనిట్లు పొందుతాయి. శిశు పథకం కింద రూ.50,000 రుణాన్ని; కిశోర్ పథకం కింద రూ.50,000 నుంచి రూ.5 లక్షల రుణాన్ని; తరుణ్ పథకం కింద రూ.5 లక్షల నుంచి 10 లక్షల వరకు సూక్ష్మ యూనిట్లు రుణం పొందొచ్చు. పండ్లు, కూరగాయల వర్తకులు ఈ పథకానికి అర్హులు. అయితే వ్యవసాయ రంగానికి ఈ పథకం ద్వారా రుణం లభించదు. ఈ పథకం కింద ఏ విధమైన స్థిర వడ్డీరేటు ఉండదు. ప్రస్తుతం బ్యాంకులు ఈ పథకం ద్వారా ఇచ్చే రుణాలపై ఏడు శాతం వడ్డీ వసూలు చేస్తున్నాయి. నష్ట భయం అధికంగా ఉండే సంస్థలపై వడ్డీ రేటు ఎక్కువగా ఉంటుంది.


డా॥ తమ్మా కోటిరెడ్డి
ప్రొఫెసర్, ఐబీఎస్, హైదరాబాద్

సాక్షి స్పోర్ట్స్
గురువారం
31-1-2019

దక్షిణాఫ్రికాదే వన్డే సిరీస్

పాకిస్తాన్‌తో కేప్‌టౌన్‌లో బుధవారం జరిగిన ఐదో వన్డేలో దక్షిణాఫ్రికా ఏడు వికెట్ల తేడాతో గెలిచింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 3–2తో సొంతం చేసుకుంది. తొలుత పాకిస్తాన్ 50 ఓవర్లలో 8 వికెట్లకు 240 పరుగులు చేసింది. ఫఖర్ జమాన్ (73 బంతుల్లో 70 ; 10 ఫోర్లు) టాప్ స్కోరర్. అనంతరం దక్షిణాఫ్రికా 40 ఓవర్లలో 3 వికెట్లకు 241 పరుగులు చేసి నెగ్గింది. డి కాక్ (58 బంతుల్లో 83 ; 11 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుపు ఇన్నింగ్స్ ఆడగా... డు ప్లెసిస్ (50 నాటౌట్), వాన్ డెర్ డసెన్ (50 నాటౌట్) అజేయ అర్ధ సెంచరీలు చేశారు.

భారత్‌కు ఎదురుందా!

ఐదేళ్ల క్రితం భారత జట్టు న్యూజిలాండ్‌లో జరిగిన ఐదు వన్డేల సిరీస్‌లో ఒక్క మ్యాచ్ కూడా గెలవలేకపోయింది. నాలుగు మ్యాచ్‌లు ఓడగా ఒక మ్యాచ్ 'టై'గా ముగిసింది. కానీ ఆస్ట్రేలియాపై ఆధిపత్యం ప్రదర్శించిన తర్వాత కూడా ఈసారి కివీస్ గడ్డపై భారత్ ప్రదర్శన ఇంత అద్భుతంగా, ఏకపక్షంగా ఉంటుందని ఎవరూ ఊహించలేకపోయారు. సొంతగడ్డపై ప్రత్యర్థికి ఉండే బలం, పరిస్థితులువంటి ప్రతికూలతలను సునాయాసంగా అధిగమించిన టీమిండియా ఇప్పటికే సిరీస్‌ను సొంతం చేసుకోగా... అటు స్వదేశంలో చేతులెత్తేసిన విలియమ్సన్ బృందం పరువు కాపాడుకోవాల్సిన స్థితిలో నిలిచింది. ఈ నేపథ్యంలో మరో పోరుకు రంగం సిద్ధమైంది. తన 200వ వన్డేను చిరస్మరణీయం చేసుకోవాలని భావిస్తున్న రోహిత్ నాయకత్వంలో భారత్ సిరీస్ స్కోరును 4–0గా మారుస్తుందో లేదో చూడాలి.

మరో విజయంపై టీమిండియా దృష్టి

- రోహిత్ శర్మ నాయకత్వంలో బరిలోకి
- నేడు న్యూజిలాండ్‌తో నాలుగో వన్డే
- పరువు కాపాడుకునే ప్రయత్నంలో కివీస్

ఉదయం గం.7.30 నుంచి స్టార్ స్పోర్ట్స్-1లో ప్రత్యక్ష ప్రసారం


విలియమ్సన్, రాస్ టేలర్

హామిల్టన్: న్యూజిలాండ్‌తో తమ రెండో వన్డే సిరీస్‌ను గెలిచిన భారత్ ఆ రికార్డును మరింత ఘనంగా మార్చేందుకు సిద్ధమవుతోంది. 2009లో ఇక్కడ సిరీస్ గెలిచినప్పుడు మూడు వన్డేలు నెగ్గిన టీమిండియా తొలిసారి సిరీస్‌లో నాలుగో విజయంపై కన్నేసింది. జట్టు ఫామ్‌ను బట్టి చూస్తే అదేమీ అసాధ్యం కాకపోవచ్చు. మరోవైపు న్యూజిలాండ్ ఒక్క మ్యాచ్‌లోనైనా నెగ్గాలని భావిస్తోంది. ఇరు జట్ల మధ్య నేడు జరిగే నాలుగో వన్డే కివీస్‌కు కీలకంగా మారింది. సిరీస్ గెలిపించిన అనంతరం విరాట్ కోహ్లి విశ్రాంతి తీసుకోవాలని నిర్ణయించుకోగా... రోహిత్ శర్మ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు.

గిల్ సందేహమే!

తొలి మూడు వన్డేల్లో భారత జట్టు ఆటతీరు చూస్తే తుది జట్టులో ఎలాంటి మార్పులు అవసరం లేదు. అయితే కోహ్లి దూరం కావడంతో ఆ ఒక్క స్థానానికి ఖాళీ ఏర్పడింది. కోహ్లి నుంచి పెద్ద ఎత్తున ప్రశంసలు పొందిన శుబ్‌మన్ గిల్‌ను మూడో స్థానంలో ఆడించే అవకాశం కనిపించింది. అయితే కండరాల గాయం నుంచి కోలుకున్న ధోని మ్యాచ్ కోసం సిద్ధమయ్యాడు. బుధవారం అతను పూర్తి స్థాయిలో ప్రాక్టీస్‌లో కూడా పాల్గొన్నాడు. దినేశ్ కార్తీక్, రాయుడు కూడా తమ బాధ్యతను సమర్థంగా నెరవేరుస్తున్నారు. కాబట్టి కొత్త కుర్రాడికి కచ్చితంగా అవకాశం ఇవ్వాలని మేనేజ్‌మెంట్ నిర్ణయించుకుంటే తప్ప గిల్‌కు చోటు దక్కదు. మార్పులు లేకపోతే రాయుడు మూడో స్థానంలో బరిలోకి దిగవచ్చు. ఓపెనర్లు రోహిత్, ధావన్ చెలరేగుతుండగా, మిగతా బ్యాట్స్‌మెన్‌లో జాదవ్ కూడా బాగా ఆడుతున్నాడు. పాండ్యా గత మ్యాచ్‌లో తన విలువేంటో చూపించాడు. ఇక స్పిన్ ద్వయం కుల్దీప్, చహల్ మరోసారి ప్రత్యర్థిని దెబ్బ తీసే వ్యూహాలతో సిద్ధంగా ఉన్నారు. సిరీస్‌లో ఇప్పటి వరకు వీరిద్దరు కలిసి 14 వికెట్లు పడగొట్టారు. పేసర్లు భువనేశ్వర్, షమీ చెలరేగిపోతున్నారు. వీరి లయను కొనసాగించాలని జట్టు భావిస్తే ఇద్దరికీ అవకాశం దక్కుతుంది. లేదా కుర్రాళ్లు ఖలీల్, సిరాజ్‌లలో ఒకరికి మరో అవకాశం ఇచ్చి ప్రయత్నించాలని భావిస్తే షమీకి విశ్రాంతి ఇవ్వవచ్చు. మొత్తంగా అందరూ మెరుగ్గా ఆడుతుండటంతో జట్టులో అంతులేని ఆత్మవిశ్వాసం కనిపిస్తోంది.

కివీస్ కష్టాలు తీరేనా...

సొంతగడ్డపై తమ వన్డే చరిత్రలో న్యూజిలాండ్ మూడు సార్లు మాత్రమే ఒకే సిరీస్‌లో నాలుగు మ్యాచ్‌లు ఓడింది. ఇప్పుడు మరోసారి అలాంటి పరాభవం ముంగిట నిలిచింది. భారత జట్టు దూకుడుకు ఎలాంటి సమాధానం ఇవ్వాలో అర్థం కాని పరిస్థితిలో కివీస్ టీమ్ కనిపిస్తోంది. ఇప్పటి వరకు చూస్తే జట్టులో ఏ ఒక్కరు కూడా కనీసం రెండు మ్యాచ్‌లలోనైనా బాగా ఆడారని చెప్పలేం. విలియమ్సన్, టేలర్, లాథమ్ తలా ఒక అర్ధ సెంచరీ చేసినా అవి జట్టుకు ఉపయోగపడలేదు. ఓపెనింగ్ కూడా జట్టు ప్రధాన సమస్యగా మారింది. తమ ధాటి ప్రదర్శనతో సిరీస్‌లో ఆధిపత్యం ప్రదర్శిస్తారని భావించిన గప్టిల్, మున్రోలు ఘోరంగా విఫలం కావడం జట్టును దెబ్బ తీస్తోంది. మిడిలార్డర్‌లో నికోల్స్ కూడా అదే తరహాలో విఫలమయ్యాడు. ఇలాంటి స్థితిలో ఏ ఒక్కరి మీద జట్టు ఆధారపడలేకపోయింది. బ్యాటింగ్‌లో అందరూ సమష్టిగా రాణిస్తేనే జట్టు కోలుకోగలుగుతుంది. ముఖ్యంగా స్పిన్ ద్వయం కుల్దీప్, చహల్‌లను సమర్థంగా ఎదుర్కోవడంపైనే జట్టు విజయావకాశాలు ఆధార పడి ఉన్నాయి. కివీస్ బౌలింగ్ కూడా ప్రభావవంతంగా లేదు. బౌల్ట్ తన స్థాయికి తగ్గట్లుగా ఆడలేకపోగా, బ్రేస్‌వెల్ పూర్తిగా విఫలమయ్యాడు. ఇక 'ఫాస్టెస్ట్' బౌలర్‌గా గుర్తింపు తెచ్చుకున్న లోకీ ఫెర్గూసన్ భారత బ్యాట్స్‌మెన్‌పై ప్రభావం చూపలేకపోయాడు. కొత్తగా జట్టులోకి వచ్చిన నీషమ్, టాడ్ ఆస్టల్‌లు తుది జట్టులో ఉండే అవకాశం ఉంది. ఇది గెలిస్తే కనీసం క్లీన్‌స్వీప్ నుంచి తప్పించుకునే అవకాశం కివీస్‌కు కలుగుతుంది.



"విజయాలను అలవాటుగా మార్చుకున్న మేం అదే జోరును కొనసాగించాలని భావిస్తున్నాం. ప్రధాన జట్టంతా ప్రపంచ కప్‌కు సన్నద్ధమై ఉంది. అయితే రిజర్వ్ ఆటగాళ్లకు కూడా మ్యాచ్‌లు ఆడే అవకాశం ఇవ్వడం మంచిది. ఎందుకంటే మెగా టోర్నీలో అనుకోకుండా బరిలోకి దిగాల్సి వస్తే అప్పటికి తగిన మ్యాచ్ అనుభవం లేకపోతే కష్టం. అందుకే ఈవిషయంపై మేనేజ్‌మెంట్ దృష్టి పెట్టింది. ఇంగ్లండ్ తరహా పరిస్థితులే న్యూజిలాండ్‌లో ఉంటాయి కాబట్టి మా ప్రపంచకప్ సన్నాహాలకు ఇది సరైన వేదిక."


–ఆర్. శ్రీధర్, భారత ఫీల్డింగ్ కోచ్

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), ధావన్, రాయుడు, కార్తీక్/గిల్, జాదవ్, ధోని, పాండ్యా, భువనేశ్వర్, షమీ, కుల్దీప్, చహల్.
న్యూజిలాండ్: విలియమ్సన్ (కెప్టెన్), గప్టిల్, మున్రో, టేలర్, లాథమ్, నికోల్స్, నీషమ్, సాన్‌ట్నర్, ఆస్టల్, ఫెర్గూసన్, బౌల్ట్.

పిచ్, వాతావరణం

సెడన్ పార్క్ మైదానం బ్యాటింగ్‌కు అనుకూలం. గత మూడు వన్డేల్లో 300 పరుగుల లోపు లక్ష్యాలను జట్లు సునాయాసంగా ఛేదించాయి. స్పిన్ ప్రభావం చూపిస్తుంది. వర్షంతో సమస్య లేదు.


రోహిత్ శర్మ

200 స్టార్ @200

సాక్షి క్రీడావిభాగం

వన్డే క్రికెట్‌లో ఎవరికీ సాధ్యం కాని రీతిలో మూడు డబుల్ సెంచరీలు బాదిన భారత స్టార్ ఓపెనర్ రోహిత్ శర్మ కెరీర్‌లో మరో డబుల్ సెంచరీ కొట్టేందుకు చేరువయ్యాడు. ఈ ద్విశతకాల వీరుడు నేడు కెరీర్‌లో 200వ వన్డే మ్యాచ్ ఆడబోతున్నాడు. భారత్ తరపున ఈ ఘనత సాధించిన 15వ ఆటగాడు రోహిత్. వన్డేల్లో అత్యధిక స్కోరు (264) సహా అనేక ఘనతలు తన ఖాతాలో వేసుకున్న 32 ఏళ్ల ఈ ముంబైకర్ పలు చిరస్మరణీయ విజయాల్లో భాగంగా నిలిచాడు. కోహ్లి (4,248 పరుగులు), శిఖర్ ధావన్ (4,334 పరుగులు)లతో రోహిత్ నమోదు చేసిన రికార్డు భాగస్వామ్యాలు టీమిండియాకు మరచిపోలేని మధుర జ్ఞాపకాలను అందించాయి. దిగ్గజాలు కూడా సాధించలేని రీతిలో వన్డేల్లో రోహిత్ కళ్లు చెదిరే గణాంకాలు నమోదు చేశాడు. కోహ్లి అద్భుత ప్రదర్శనతో కొన్ని సార్లు రోహిత్ ఆట మరుగున పడినట్లు కనిపించినా... 2013 నుంచి 2018 వరకు వరుసగా ఆరేళ్ల పాటు రోహిత్ ప్రతీ సంవత్సరం అత్యధిక పరుగులు చేసిన భారత ఆటగాడిగా నిలిచాడంటే అతిశయోక్తి కాదు.

ఆరేళ్లు అంతంతే...

2007లో తొలి వన్డే ఆడిన నాటి నుంచి 2012 వరకు... 2013 నుంచి ఇప్పటి వరకు... రోహిత్ కెరీర్‌ను ఈ రెండు భాగాలుగా విశ్లేషించవచ్చు. తొలి ఆరేళ్ల పాటు 'ప్రతిభావంతుడు'గా గుర్తింపు ఉన్నా దానికి న్యాయం చేయలేకపోయిన ఆటగాడిగానే రోహిత్ కనిపించాడు. ఆస్ట్రేలియాలో 2008 సీబీ సిరీస్‌లో రెండు కీలక అర్ధ సెంచరీలు సహా అప్పుడప్పుడు కొన్ని మెరుపులు ఉన్నా అవి రోహిత్ కెరీర్‌కు కావాల్సిన ఊపును ఇవ్వలేకపోయాయి. 2011లో దక్షిణాఫ్రికా గడ్డపై ఓపెనర్‌గా ప్రయత్నిస్తే చచ్చీ చెడి 23, 1, 5 పరుగులు చేశాడు. దాంతో వరల్డ్ కప్‌లో చోటు కూడా గల్లంతయింది. కొద్ది రోజులకే వెస్టిండీస్‌తో సిరీస్‌లో రాణించిన తర్వాత కూడా తడబాటు కొనసాగింది. 2012 వరకు కేవలం 2 సెంచరీలు చేస్తే అవి జింబాబ్వే, శ్రీలంకపైనే వచ్చాయి. అదే ఏడాది చివర్లో అతని ఆఖరి ఆరు ఇన్నింగ్స్‌ల స్కోర్లు 5, 0, 0, 4, 4, 4 మాత్రమే! ఈ స్థితిలో అతని కెరీరే ముగిసిపోయే పరిస్థితి కనిపించింది.

చాంపియన్స్ ట్రోఫీతో షురూ...

2013 జనవరిలో ఇంగ్లండ్‌తో మ్యాచ్‌లో ధోని మరోసారి రోహిత్‌ను ఓపెనర్‌గా పంపే సాహసం చేశాడు. ఈ మ్యాచ్‌లో అతను 83 పరుగులు చేశాడు. అయితే అసలు మాస్టర్ స్ట్రోక్ మాత్రం అదే ఏడాది జూన్‌లో చాంపియన్స్ ట్రోఫీతో మొదలైంది. ఈ టోర్నీతో మొదలైన రెగ్యులర్ ఓపెనర్ ప్రస్థానం రోహిత్‌ను వన్డే క్రికెట్ హీరోను చేసింది. అదే ఏడాది ఆస్ట్రేలియాపై సాధించిన తొలి డబుల్ సెంచరీతో అతని కెరీర్ తారాజువ్వలా దూసుకుపోయింది. తొలి ఆరేళ్లతో పోలిస్తే ఓపెనర్‌గా వచ్చాక పరుగులు, సగటు, సెంచరీలు, స్ట్రైక్‌రేట్... ఇలా ప్రతీదాంట్లో రోహిత్ శిఖర సమాన పురోగతి సాధించాడు. 2013నుంచి 2018 వరకు ఆరేళ్ల పాటు ప్రతీ సంవత్సరం అతని బ్యాటింగ్ సగటు 50 కంటే ఎక్కువగా ఉండటం మరో విశేషం. ఇప్పటికే వన్డే క్రికెట్‌లో అనేక రికార్డులు తన పేరిట లిఖించుకున్న రోహిత్ మున్ముందు మరెన్నో ఘనతలు సాధిస్తాడని ఆశిద్దాం.

రోహిత్ శర్మ కెరీర్	మ్యాచ్‌లు	ఇన్నింగ్స్‌లు	పరుగులు	సగటు	స్ట్రైక్‌రేట్	100	50
2007- 2012 వరకు	86	81	1978	30.43	77.94	2	12
2013 నుంచి ఇప్పటి వరకు	113	112	5821	60.01	92.94	20	27
ఓవరాల్‌గా	199	193	7799	48.14	88.61	22	39

సత్యన్ కొత్త చరిత్ర

ఐటీటీఎఫ్ ర్యాంకింగ్స్‌లో అత్యుత్తమ స్థానం సాధించిన భారత ప్లేయర్‌గా రికార్డు



న్యూఢిల్లీ: అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ సమాఖ్య (ఐటీటీఎఫ్) ప్రపంచ ర్యాంకింగ్స్‌లో భారత్ తరపున ఆల్‌టైమ్ బెస్ట్ ర్యాంక్ సాధించిన క్రీడాకారుడిగా జ్ఞానశేఖరన్ సత్యన్ చరిత్ర సృష్టించాడు. బుధవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో సత్యన్ మూడు స్థానాలు ఎగబాకి 28వ ర్యాంక్‌ను అందుకున్నాడు. ఇప్పటివరకు భారత్ తరపున అత్యుత్తమ ర్యాంక్ సాధించిన ప్లేయర్‌గా ఆచంట శరత్ కమల్ (30వ ర్యాంక్) పేరిట ఉన్న రికార్డును సత్యన్ సవరించాడు. గత ర్యాంకింగ్స్‌లో 30వ స్థానంలో ఉన్న శరత్ కమల్ మూడు స్థానాలు పడిపోయి 33వ ర్యాంక్‌కు చేరాడు. తమిళనాడుకు చెందిన 26 ఏళ్ల సత్యన్ ఏడాది కాలంగా అంతర్జాతీయస్థాయిలో నిలకడగా రాణిస్తున్నాడు. గతేడాది కామన్వెల్త్ గేమ్స్‌లో సత్యన్ టీమ్ విభాగంలో స్వర్ణం, మిక్స్‌డ్ డబుల్స్‌లో కాంస్యం, పురుషుల డబుల్స్‌లో రజతం సాధించాడు. ఆస్ట్రియా ఓపెన్ వరల్డ్ టూర్ ప్లాటినమ్ టోర్నమెంట్‌లో ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరాడు. మహిళల సింగిల్స్‌లో మనిక బత్రా టాప్–50లోకి స్థానం పొందిన తొలి భారతీయ క్రీడాకారిణిగా నిలిచింది. ఆమె పది స్థానాలు ఎగబాకి 47వ ర్యాంక్‌కు చేరుకుంది. గతేడాది కామన్వెల్త్ గేమ్స్‌లో మనిక మహిళల సింగిల్స్, టీమ్ విభాగంలో స్వర్ణ పతకాలు సాధించింది.

పోలీసుల చిత్రహింసలు తప్పించుకునేందుకే...

- స్పాట్ ఫిక్సింగ్ చేశానని ఒప్పుకున్నా
- సుప్రీం కోర్టుకు తెలిపిన శ్రీశాంత్



న్యూఢిల్లీ: దర్యాప్తులో భాగంగా ఢిల్లీ పోలీసుల చిత్రహింసల నుంచి తప్పించుకునేందుకే స్పాట్ ఫిక్సింగ్‌కు పాల్పడినట్లు ఒప్పుకున్నానని... తాను మాత్రం ఏ తప్పూ చేయలేదని భారత మాజీ క్రికెటర్ శ్రీశాంత్ సుప్రీం కోర్టుకు తెలిపాడు. 2013 ఐపీఎల్‌లో ఫిక్సింగ్‌కు పాల్పడినట్లు తేలడంతో అతనిపై క్రికెట్ బోర్డు జీవితకాల నిషేధం విధించింది. దీనిపై కేరళకు చెందిన ఈ మాజీ పేసర్ న్యాయపోరాటం చేస్తున్నాడు. బుధవారం జస్టిస్ అశోక్ భూషణ్, జస్టిస్ కె.ఎం.జోసెఫ్‌లతో కూడిన ద్విసభ్య బెంచ్ ఈ కేసును విచారించింది. పోలీస్ టార్చర్ నుంచి తప్పించుకోవడానికే శ్రీశాంత్ నిందను మోశాడని అతని లాయర్ కోర్టుకు వివరించారు. శ్రీశాంత్‌ను బుకీలు సంప్రదించిన మాట నిజమేనని అయితే తను మాత్రం బుకీల బుట్టలో పడలేదని దీనికి సంబంధించి మలయాళంలో బుకీ–శ్రీశాంత్‌ల మధ్య జరిగిన సంభాషణను లాయర్ కోర్టుకు అందజేశాడు. మైదానంలో టవల్‌తో తుడుచుకోవడం, ఆడించడమనేది సహజమని, ఇలా అందరు క్రికెటర్లు చేస్తారని దీన్ని ఫిక్సింగ్‌కు సంజ్ఞగా భావించడం తగదని శ్రీశాంత్ తరపు న్యాయవాది సల్మాన్ ఖుర్షీద్ వాదించారు. దీనిపై న్యాయమూర్తులు స్పందిస్తూ... బుకీలు ఫిక్సింగ్‌కు పాల్పడమని సంప్రదించినపుడు క్రికెటర్ ఆ విషయాన్ని భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ)కి ఎందుకు తెలపలేదని లాయర్ ఖుర్షీద్‌ను ప్రశ్నించారు. దీన్నిబట్టి శ్రీశాంత్ ప్రవర్తన ఎలాంటిదనే విషయం తేటతెల్లమవుతోందని బెంచ్ స్పష్టం చేసింది.



పెళ్లి చేసుకోనున్న స్పెయిన్ టెన్నిస్ స్టార్ రాఫెల్ నాదల్

అంతర్జాతీయ పురుషుల టెన్నిస్ బిగ్-4లో రోజర్ ఫెడరర్, నొవాక్ జొకోవిచ్, ఆండీ ముర్రే ఇప్పటికే పెళ్లి చేసుకున్నారు. ఈ జాబితాలో చివరివాడైన స్పెయిన్ స్టార్ రాఫెల్ నాదల్ ఈ ముగ్గురి సరసన చేరనున్నాడు. తన ప్రియురాలు ఫ్రాన్సెస్కా పెరెల్‌ను వచ్చే వేసవిలో నాదల్ వివాహం చేసుకోనున్నట్లు స్పెయిన్‌కు చెందిన హోలా మేగజైన్ కథనాన్ని ప్రచురించింది. 14 ఏళ్లుగా వీరి మధ్య ప్రేమాయణం సాగుతుండగా... గతేడాది మే నెలలో ఫ్రాన్సెస్కాకు నాదల్ పెళ్లి ప్రతిపాదన చేసినట్లు సమాచారం.

టోక్యో ఒలింపిక్స్ వరకు...

'టాప్'లో సైనా, సింధు, శ్రీకాంత్

పారా అథ్లెట్లకు పెద్దపీట ▪ జాబితాను సవరించిన 'సాయ్'



న్యూఢిల్లీ: అంతర్జాతీయ టోర్నమెంట్లలో టైటిల్స్ గెలుస్తున్న మేటి షట్లర్లు పీవీ సింధు, సైనా నెహ్వాల్‌లకు టార్గెట్ ఒలింపిక్స్ పోడియం (టాప్) పథకాన్ని పొడిగించారు. సింగిల్స్‌లో వీరిద్దరితో పాటు కిడాంబి శ్రీకాంత్, సమీర్ వర్మ, హెచ్.ఎస్.ప్రణయ్‌లకూ టోక్యో ఒలింపిక్స్–2020 దాకా 'టాప్' చేయూతనిచ్చేందుకు కేంద్ర క్రీడాశాఖ నిర్ణయించింది. ఈ మేరకు సవరించిన 'టాప్' జాబితాను భారత స్పోర్ట్స్ అథారిటీ (సాయ్) బుధవారం ప్రకటించింది. అయితే మరో తెలుగుతేజం భమిడిపాటి సాయిప్రణీత్, లక్ష్య సేన్‌లను ఈ జాబితా నుంచి తప్పించింది. డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ షట్లర్లు సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి, అశ్విని పొన్నప్ప, సిక్కి రెడ్డి, ప్రణవ్ చోప్రాలు 'టాప్' జాబితాలో ఉన్నారు. కాగా ప్రదర్శన బాగుంటే టాప్‌లో చేర్చే 'వాచ్‌లిస్ట్' లో జక్కంపూడి మేఘన, పూర్వీషారామ్, మను అత్రి, సుమీత్ రెడ్డిలు ఉన్నారు. '2024 ఒలింపిక్స్ డెవలప్‌మెంటల్ గ్రూప్'లో సైక్లింగ్‌ను చేర్చే అంశాన్ని బుధవారం నాటి సమావేశంలో చర్చించారు. జూనియర్ ఆసియా ట్రాక్ సైక్లింగ్ చాంపియన్‌షిప్‌లో ఇటీవల భారత్ 10 పతకాలు సాధించింది. దీంతో సైక్లిస్ట్‌లు అల్బెన్, రొనాల్డో సింగ్, జేమ్స్ సింగ్, రోజిత్ సింగ్‌లను ఈ డెవలప్‌మెంటల్ తుది జాబితాలో చేర్చారు.

పారాలింపియన్లకు అండదండ...

తాజా 'టాప్' పథకంలో పారా అథ్లెట్లకు పెద్దపీట వేశారు. పారాలింపిక్స్, పారా ఆసియా క్రీడల్లో భారత దివ్యాంగ క్రీడాకారులు పతకాలతో దేశానికి కీర్తిప్రతిష్టలు తెస్తుండటంతో ఈసారి ఏకంగా 12 మంది పారా అథ్లెట్లను ఎంపిక చేశారు. పారా ఆసియా క్రీడల స్వర్ణ విజేత శరద్ కుమార్ (హైజంప్), వరుణ్ భటి (హైజంప్), జావెలిన్ త్రోయర్లు సందీప్ చౌదరి, సుమిత్, సుందర్ సింగ్ గుర్జార్, రింకు, అమిత్ సరోహ (క్లబ్ త్రోయర్), వీరేందర్ (షాట్‌పుట్), జయంతి బహెరా (మహిళల 400 మీ. పరుగు) 'టాప్' జాబితాలో ఉన్నారు.

భారత 'ఎ' జట్టులో భరత్, రికీ భుయ్




న్యూఢిల్లీ: ఇంగ్లండ్ లయన్స్‌తో జరిగే తొలి అనధికారిక టెస్టులో పాల్గొనే భారత 'ఎ' జట్టును ప్రకటించారు. ఫిబ్రవరి 7 నుంచి 10 వరకు కేరళలోని వాయనాడ్‌లో ఈ మ్యాచ్ జరుగుతుంది. 14 మంది సభ్యుల బృందానికి మహారాష్ట్ర క్రికెటర్ అంకిత్ బావ్నె సారథ్యం వహిస్తాడు. ఆంధ్ర రంజీ ఆటగాళ్లు కోన శ్రీకర్ భరత్, రికీ భుయ్‌లకు ఈ జట్టులో చోటు లభించింది. ప్రస్తుత రంజీ సీజన్‌లో రికీ భుయ్ ఎనిమిది మ్యాచ్‌లు ఆడి నాలుగు సెంచరీలతో కలిపి మొత్తం 775 పరుగులు సాధించాడు. వికెట్ కీపర్ అయిన భరత్ హైదరాబాద్‌తో జరిగిన రంజీ మ్యాచ్‌లో 178... బెంగాల్‌పై 61... పంజాబ్‌పై 76 పరుగులు చేశాడు.

ఫైనల్లో హరియాణా హ్యామర్స్

గ్రేటర్ నోయిడా: ప్రొ రెజ్లింగ్ లీగ్ (పీడబ్ల్యూఎల్)లో హరియాణా హ్యామర్స్ జట్టు వరుసగా రెండో ఏడాది ఫైనల్ చేరింది. ఢిల్లీ సుల్తాన్స్‌తో జరిగిన సెమీఫైనల్లో హరియాణా హ్యామర్స్ 6–3తో విజయం సాధించింది. హ్యామర్స్ తరపున రవి కుమార్ (57 కేజీలు), అనస్తాసియా నిచిత (మహిళల 57 కేజీలు), అలెగ్జాండర్ ఖొట్సియాన్‌స్కీ (125 కేజీలు), రజనీశ్ (65 కేజీలు), అలీ షబనోవ్ (86 కేజీలు), కిరణ్ (76 కేజీలు) తమ బౌట్‌లలో గెలిచారు. ఢిల్లీ సుల్తాన్స్ తరపున సబోలెవ్ (74 కేజీలు), పింకీ (మహిళల 53 కేజీలు), సాక్షి మలిక్ (మహిళల 62 కేజీలు) విజయాలను అందుకున్నారు.

'పంచాయతీ'పదనిసలు



సర్పంచ్, వార్డు సభ్యుడిగా గెలుపొందిన నానమ్మ, మనవడు

ఒక్క ఓటుతో గెలుపు

నానమ్మ సర్పంచ్‌గా.. మనవడు వార్డు సభ్యుడిగా..

బాన్సువాడ: ఒక్క ఓటు విలువ ఎంతో కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్ మండలం బస్వాయిపల్లిలో నిరూపితమైంది. గ్రామానికి చెందిన ఫాతిమా టీఆర్‌ఎస్ మద్దతుతో సర్పంచ్‌గా బరిలో నిలిచారు. బుధవారం పోలింగ్ నిర్వహించారు. ఫాతిమాకు 177 ఓట్లు రాగా, ఆమె ప్రత్యర్థి సుల్తానాకు 176 ఓట్లు వచ్చాయి. దీంతో ఒక్క ఓటుతో ఫాతిమా గెలుపొందినట్లు అధికారులు ప్రకటించారు. ఆమె మనవడు రెహాన్ వార్డు సభ్యుడిగా పోటీ చేశాడు. అతడికి 25 ఓట్లు రాగా.. ప్రత్యర్థి మౌలానాకు 24 ఓట్లు వచ్చాయి. ఇతను సైతం ఒక్క ఓటుతో గెలుపొందడం విశేషం.

దేవుల్‌నాయ్‌తండాలో..

ఇచ్చోడ: ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలో నూతనంగా ఏర్పడిన దేవుల్‌నాయ్ తండా పంచాయతీలో పోటీ చేసిన రాథోడ్ బీంబాయి ఒక్క ఓటుతో విజయం సాధించారు. మొత్తం 238 ఓట్లు ఉండగా భీంబాయికి 117 ఓట్లు రాగా, సమీప ప్రత్యర్థి అభ్యర్థి రాథోడ్ రాందాస్‌కు 116 ఓట్లు వచ్చాయి. 5 ఓట్లు నోటాకు రావడంతో ఒక్క ఓటుతో రాథోడ్ భీంబాయి గెలుపొందినట్లు అధికారులు ప్రకటించారు.

టాస్‌తో వరించిన అదృష్టం



మంచిర్యాల రూరల్: టాస్‌తో ఆ అభ్యర్థిని అనుకోని విజయం వరించి ప్రజాప్రతినిధిగా చేసింది. హాజీపూర్ మండలం పెద్దంపేట గ్రామ పంచాయతీ బరిలో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థి పొట్టాల సుమలత, టీఆర్‌ఎస్ పార్టీ బలపర్చిన అభ్యర్థి తిరుమల సుగుణ సర్పంచ్ స్థానానికి పోటీ పడ్డారు. బుధవారం జరిగిన పోలింగ్‌లో 1230 పోల్ అయ్యాయి. ఇద్దరికి 607 ఓట్ల చొప్పున వచ్చాయి. దీంతో అధికారులు టాస్ వేయగా.. సుమలతను అదృష్టం వరించింది. సర్పంచ్ అభ్యర్థిగా విజయం సాధించింది. అనూహ్య విజయంతో కాంగ్రెస్ శ్రేణులు సంబురాల్లో మునిగి తేలాయి.

లాటరీతో గెలిచిన సోమలగడ్డ సర్పంచ్

గోవిందరావుపేట: జయశంకర్ భూపాలపల్లి జిల్లా గోవిందరావుపేట మండలంలో నూతనంగా ఏర్పడిన సోమలగడ్డ గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నిక డ్రా తో నిర్ణయించారు. సర్పంచ్ పదవి బరిలో ఐదుగురు అభ్యర్థులు ఉన్నారు. బుధవారం జరిగిన ఎన్నికల్లో మొత్తం 291 ఓట్లు పోలయ్యాయి. అందులో మంగ ఏలేంద్ర, తత్రు భీమయ్యకు సమానంగా 135 ఓట్ల చొప్పున వచ్చాయి. దీంతో అధికారులు డ్రా తీసి ఏలేంద్రను సర్పంచ్‌గా నిర్ణయించారు.

ఓటు పాట్లు



వరంగల్ రూరల్ జిల్లాలోని నెక్కొండ మండలం మంగళి తండావాసుల బాధ వర్ణనాతీతం. సూరిపల్లికి మంగళితండా ఆమ్లెట్ విలేజీగా ఉంది. పంచాయతీ ఎన్నిల్లో భాగంగా పోలింగ్ కేంద్రం అధికారులు సూరిపల్లిలో ఏర్పాటు చేశారు. సూరిపల్లి, తండా మధ్య వాగు వల్ల రాకపోకలకు ఇబ్బందవుతోంది. బుధవారం ఓటు వేసేందుకు వెళ్లిన జనం ఇలా టైర్ల సాయంతో వాగు దాటాల్సి వచ్చింది. మరికొందరు14 కిలోమీటర్లు చుట్టూ తిరిగి సూరిపల్లికి వాహనాల్లో చేరారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, వరంగల్ రూరల్

'లక్కీ' సర్పంచ్



గంగులోతు హుస్సేన్

కేసముద్రం: పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ పదవికి పోటీ పడిన ఇద్దరు సర్పంచ్ అభ్యర్థులకు సమానంగా ఓట్లు రావడంతో ఎన్నికల అధికారి నిర్వహించిన డ్రాలో లక్కీగా ఒకరికి సర్పంచ్ పదవి దక్కిన సంఘటన మహబూబాబాద్ జిల్లాలోని కేసముద్రం మండలంలోని పెద్దమోరితండాజీపీలో బుధవారం చోటుచేసుకుంది. పెద్దమోరితండా జీపీకి ఎస్టీ జనరల్ రిజర్వేషన్ కేటాయించగా, గుగులోతు హుస్సేన్, ఆంగోతు లక్ష్మణ్‌లు ఎన్నికల్లో పోటీ పడ్డారు. ఈ మేరకు బుధవారం పోలింగ్ జరుగగా, మొత్తం 427 ఓట్లు ఉన్న ఆ జీపీలో, 421 ఓట్లు పోలయ్యాయి. ఓట్ల లెక్కింపులో 5 ఓట్లు చెల్లకుండా పోగా, చెల్లుబాటైన 416 ఓట్లలో ఇద్దరు అభ్యర్థులకు చెరి సమానంగా 208 చొప్పున లభించాయి. దీంతో ఎన్నికల అధికారి వెంకటేశ్వర్లు ఎన్నికల నిబంధనల ప్రకారం ఇద్దరు అభ్యర్థుల పేర్లతో చెరో 5 చీటీలను రాసి, ఆ చీటీలను డ్రా తీశారు. ఈ మేరకు హుస్సేన్ పేరున్న చీటీ వచ్చింది. దీంతో హుస్సేన్ సర్పంచ్‌గా ఎన్నికైనట్లు ప్రకటించారు. లక్కీగా హుస్సేన్ పేరున్న చీటీ రావడంతో ఆయన మద్దతు దారులు సంబురాలు చేసుకున్నారు.

నిండా ముంచిన అకాల వర్షాలు

సన్నరకాలకు ధరలేక పెద్ద ఎత్తున వరి నిల్వ

- నెల రోజులుగా ఎదురుచూపులు
- ఊహించని వర్షంతో తడిసిన ధాన్యం

సాక్షి వనపర్తి : పండిన పంటను అసలే కొనేవారు లేక దిగాలుతో ఉన్న రైతులను ఇటీవల కురిసిన అకాల వర్షం మరింత ఇబ్బందుల్లోకి నెట్టేసింది. వనపర్తి జిల్లాలో పెద్దసంఖ్యలో రైతులు సన్న రకాలకు చెందిన వరి సాగు చేశారు. ఇందులో ఒక్క పెబ్బేరు మండలం రంగాపూర్ గ్రామానికి చెందిన సుమారు 200 మంది రైతులే 1,500 ఎకరాల్లో సన్నరకం వరి సాగు చేశారు. దిగుబడి బాగా రావడంతో సుమారు 45 వేల నుంచి 50 వేల బస్తాల ధాన్యాన్ని రంగాపూర్‌లోని కృష్ణా నది పుష్కర ఘాట్‌లో ఉన్న సిమెంటు ఫ్లోర్‌పై నిల్వ ఉంచారు. పంట కోసి రెండు నెలలు దాటినా కొనేవారు లేకపోవడంతో ఎదురు చూస్తున్నారు. పంట దిగుబడి బాగా వస్తుందన్న భావనతో సన్నరకాలైన సూపర్ ఫైన్, అక్షయ గోల్డ్, శ్రీరామ్ గోల్డ్, ఆర్‌ఎన్‌ఆర్, హెచ్‌ఎంటీ, 402, సౌభాగ్య వంటి కొత్త రకాలను సాగు చేశారు. రైతులు ఊహించినట్టుగానే పంట దిగుబడి కూడా బాగానే వచ్చింది. పెబ్బేరు, శ్రీరంగాపురం పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో 18,200 ఎకరాల్లో వరి పంటను సాగు చేయగా అందులో సన్న రకాలు 3వేల ఎకరాల వరకు ఉన్నాయి. అయితే సన్న రకాలకు చెందిన ధాన్యం క్వింటాలుకు రూ.2,200 పైగా అమ్ముకుంటేనే రైతుకు ఆదాయం చేకూరుతుంది. లేదంటే నష్టం తప్పదు. అందువల్లనే రైతులు దొడ్డు రకం ధాన్యాన్ని ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు అమ్ముకుంటారు. కానీ సన్నరకాలను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్మడానికి ఇష్టపడరు. రైస్‌మిల్లర్ల యజమానులు, వ్యాపారులు సన్నరకం ధాన్యాన్ని కొని బియ్యంగా మార్చి అమ్ముకుంటారు.

అకాల వర్షంతో తడిసిన ధాన్యం

సన్నరకాలను సాగు చేసిన రైతులు కేవలం వ్యాపారులపైనే అధార పడటంతో వారు కొనుగోలు చేస్తేనే దిక్కుఅనే రీతిలో పరిస్థితి తయారైంది. కొంతమంది ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో వచ్చిన ధరకు అమ్ముకున్నా.. మరికొంతమంది మాత్రం లాభం వచ్చే వరకు వేచి చూద్దామనే ధోరణితో నిల్వ ఉంచారు. రంగాపూర్ పుష్కర ఘాట్‌లో సిమెంట్ కాంక్రీట్ వేసి ఉండటంతో గ్రామానికి చెందిన రైతులు అంతా పండించిన ధాన్యాన్ని ఇక్కడే కుప్పలుగా పోసి నిల్వ ఉంచారు. ఇప్పుడు వర్షాలు కూడా పడే కాలం కాకపోవడంతో పెద్దగా రక్షణ ఏర్పాట్లు కూడా ఏమీ చేసుకోలేదు. కానీ ఉన్నట్టుండి ఈనెల 26, 27వ తేదీల్లో అకాల వర్షం రావడంతో ధాన్యం కుప్పల కిందకు నీరు చేరింది. దీంతో చాలావరకు ధాన్యం తడిసి గడ్డలుగా మారగా.. మరి కొంత నీటిలో కొట్టుకుపోయింది. తడవకుండా ఉన్న కొంతవరకు ధాన్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలించారు. కింది భాగంలో నీరు నిల్వ ఉండటంతో మొలకలు కూడా వచ్చాయి. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలు కూడా మూతపడటంతో వీరు ప్రస్తుతం వ్యాపారులు ఎంత అడిగితే అంతకు ముట్టచెప్పాల్సిన పరిస్థితి నెలకొంది. లేదంటే సుమారు 50 వేల బస్తాల ధాన్యం పండించిన రైతులు అప్పులను మూటకట్టుకోవల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కేంద్రాలను ఏర్పాటు చేసి తమ ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.



తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న మహిళలు



పుష్కర ఘాట్‌లో ఆరబెట్టిన వరి ధాన్యం రాశులు

నిల్వ ఉన్న విషయం మాకు తెలీదు



రైతులు ఇంత పెద్ద మొత్తంలో ధాన్యం నిలువ ఉంచిన విషయం మా దృష్టికి రాలేదు. కొనుగోలు కేంద్రాలను ఇప్పటికే మూసివేశాం. ఆయా కేంద్రాల ద్వారా రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేశాం. అయినా ఈ రైతులు అధిక ధర వస్తుందని ఆశపడి కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకురాలేదు. ఇటీవల కురిసిన వర్షాలకు తడిసిన ధాన్యంపై వ్యవసాయ శాఖ ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తుంది. ఆ తర్వాత ప్రభుత్వం ఆదేశిస్తే ఏదైనా నిర్ణయం తీసుకోవడానికి అవకాశం ఉంటుంది.

– లక్ష్మయ్య, పౌరసరఫరాల శాఖ మేనేజర్, వనపర్తి జిల్లా

బాబుకు తగ్గుతున్న ఆదరణ

అందుకే ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు: కవిత

- వైఎస్ జగన్, కేటీఆర్ భేటీతో అభద్రతాభావంలో బాబు
- అన్ని పార్టీల్లో వారసులు.. పనిచేసే వారికే పట్టం గడుతారు
- మందిర్ రాజకీయం నడపడం బీజేపీకి పరిపాటే
- ప్రియాంకది గెస్ట్‌రోల్ నుంచి పర్మినెంట్ రోల్ అని ఎద్దేవా
- నిజామాబాద్‌లో 'ఆస్క్ కవిత'పేరిట రచ్చబండ

నిజామాబాద్: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఆ రాష్ట్రంలో రోజు రోజుకు ప్రజాదరణ తగ్గుతోందని, అది గమనించి ప్రజలను తప్పుదోవ పట్టించే మాటలు మాట్లాడుతున్నారని నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. బుధవారం నిజామాబాద్‌లో 'ఆస్క్ కవిత'పేరిట ప్రత్యేక రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్విట్టర్‌తో పాటు, స్థానికులు అడిగిన పలు ప్రశ్నలకు ఆమె సమాధానమిచ్చారు. రాష్ట్రాల ప్రయోజనాల కోసం ఫెడరల్ ఫ్రంట్‌తో వైఎస్సార్సీపీ జాతీయ స్థాయిలో కలసి పనిచేస్తుందని భావిస్తున్నామని చెప్పారు. ఇందులో భాగంగానే టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారని పేర్కొన్నారు. ఈ విషయమై చంద్రబాబు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, కేవలం అభద్రత భావంతోనే అలా మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. ప్రజలు ఎవరిని ఆదరిస్తే ఎన్నికల్లో వారే విజయం సాధిస్తారని అన్నారు. ప్రియాంక గాంధీ ఇన్నాళ్లు గెస్ట్‌రోల్ చేశారని, ఇప్పుడు పర్మినెంట్ రోల్ చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఈసారి బడ్జెట్ సమావేశాల్లో కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించి నిధులు కేటాయించాలని కోరుతానని చెప్పారు.

అన్ని పార్టీల్లో వారసులు

బీజేపీ, కాంగ్రెస్ సహా అన్ని పార్టీలలో వారసులు ఉన్నారని కవిత పేర్కొన్నారు. తాము తెలంగాణ కోసం సుదీర్ఘంగా ఉద్యమం చేశామని, దాంతో తమ కుటుంబం మొత్తం రాజకీయాల్లోకి రావాల్సి వచ్చిందని వివరించారు. పనిచేసే వారికే ఎన్నికల్లో ప్రజలు పట్టం గడుతారని చెప్పారు. గాంధీ, అంబేద్కర్‌లలో ఎవరు గొప్పవారని అడిగిన ప్రశ్నకు.. అంబేద్కర్ అన్నివర్గాల ప్రజల సమానత్వాన్ని కోరగా, గాంధీజీ దేశ ప్రజలకు స్వాతంత్ర్యం తెచ్చి పెట్టారన్నారు. ఇద్దరూ గొప్పవారని, కానీ మార్గాలు మాత్రం వేరన్నారు. కేటీఆర్ గురించి అభిప్రాయం వ్యక్తం చేయాలని కోరగా తండ్రిగా, రాజకీయవేత్తగా, అన్నగా, భర్తగా సమర్థవంతంగా బాధ్యతలు నెరవేరుస్తున్నారని కితాబిచ్చారు. తన సొంత ఖర్చులతో నిజామాబాద్ జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు మధ్యాహ్నం భోజనం పథకం అమలు చేస్తున్నానని, ఈ విధానాన్ని రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రులలో అమలు చేయాలని సీఎం దృష్టికి తీసుకువెళ్తానన్నారు. టీఆర్‌ఎస్ ఎంపీలనే మరోసారి ఎందుకు గెలిపించాలని ఓ యువకుడు అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ.. ఇతర పార్టీలకు అవకాశం ఇస్తే జాతీయ సమస్యలను ప్రస్తావిస్తూ కాలయాపన చేస్తారని, తమ ఎంపీలు రాష్ట్రం సమస్యలు కేంద్రానికి వివరించి అభివృద్ధికి ఎక్కువ నిధులు తీసుకొస్తారని పేర్కొన్నారు. ఇన్నాళ్లు కాంగ్రెస్, బీజేపీలకు అవకాశం ఇచ్చిన ప్రజలు టీఆర్‌ఎస్‌కు ఇచ్చిన అవకాశంతో ఎలాంటి అభివృద్ధి జరుగుతుందో రాష్ట్రంలో చూస్తున్నారన్నారు. మందిర్, మసీదు వెనుక రాజకీయం నడపడం బీజేపీకి పరిపాటేనని కవిత విమర్శించారు.



నర్సు కావాలనుకున్నా కానీ..!

చిన్నప్పుడు ఆస్పత్రులకు వెళ్లినప్పుడు తెల్లగౌను వేసుకుని రోగులకు వైద్య సేవలు అందిస్తున్న వారిని చూసి నర్సు వృత్తిలో చేరాలని అనిపించేదని కవిత తన చిన్ననాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. మారిన పరిస్థితులకు అనుగుణంగా ఇంజినీరింగ్ చదివి ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లానని చెప్పారు. సాఫ్ట్‌వేర్ రంగంలోకి వచ్చాక వ్యాపారం చేయాలనుకున్నానని, ఈ తరుణంలోనే తెలంగాణ ఉద్యమం తన భవిష్యత్తును మార్చేసిందని పేర్కొన్నారు. తన కుటుంబంతో పాటు ఉద్యమంలో పాలుపంచుకుని రాజకీయాల్లోకి రావాల్సిన పరిస్థితి ఏర్పడిందని కవిత తన అంతరంగాన్ని ఆవిష్కరించారు.

సిద్దిపేటను గెలిపిద్దాం

- స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేలో ఓటెయ్యండి
- సిద్దిపేట ప్రజలకు హరీశ్‌రావు వినతి



సిద్దిపేటజోన్: 'స్వచ్ఛ సర్వేక్షణ్–2019లో సిద్దిపేట మున్సిపాలిటీ ప్రస్తుతం జాతీయ స్థాయిలో టాప్ –10లో ఉంది. పట్టణంలో పరిశుభ్రత, చెత్త సేకరణ, ఓడీఎఫ్, తదితర అంశాల్లో మీ అభిప్రాయాలను ఫీడ్‌బ్యాక్ రూపంలో అందించి సిద్దిపేటను మరింత ఆశీర్వదించండి. మీ అభిప్రాయంతో సిద్దిపేట మున్సిపాలిటీ స్వచ్ఛ సర్వేక్షణ్‌లో నంబర్ 1గా నిలవాలి. అందుకు మీ చైతన్యం ఎంతో అవసరం. జనవరి 31లోగా ప్రతి పౌరుడు ఫీడ్‌బ్యాక్ అందించి మద్దతు తెలపాలి'అని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పట్టణ పౌరులకు విజ్ఞప్తి చేశారు. ఈ యేడు స్వచ్ఛ సర్వేక్షణ్–2019లో సిద్దిపేట మున్సిపాలిటీ పాల్గొంటోందని, ప్రతి పౌరుడు ఇందులో భాగస్వాములై పట్టణాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిపి మన గౌరవాన్ని మరింత ఇనుమడింప చేయాలని సూచించారు. స్మార్ట్‌ఫోన్ ఉన్న పట్టణ యువత, ప్రజలు ఈ కార్యక్రమంపై దృష్టిపెట్టి తమ అభిప్రాయాన్ని తెలపాలని కోరారు. ప్రజలు ఫీడ్‌బ్యాక్ తెలిపేందుకు గురువారమే చివరి రోజని హరీశ్‌రావు పేర్కొన్నారు.

పంచాయతీ ఎన్నికల్లో విషాదం

- విధి నిర్వహణలో గుండెపోటుతో వీఆర్‌వో మృతి
- పరిగి మండలంలో పోలింగ్ కేంద్రంలోనే మహిళ మృతి

దౌల్తాబాద్: పంచాయతీ ఎన్నికల్లో విషాదం చోటుచేసుకుంది. మూడోవిడత పంచాయతీ ఎన్నికల్లో భాగంగా.. బుధవారం వికారాబాద్ జిల్లాలో ఎన్నికల నిర్వహణలో ఉన్న వీఆర్‌వో, ఓటేసి వెళ్తూ ఓ మహిళ గుండెపోటుతో మృతిచెందారు. కొడంగల్ నియోజకవర్గంలోని దౌల్తాబాద్ మండలం చంద్రకల్ గ్రామానికి చెందిన నర్సప్ప (50) కోస్గి మండలం ముశ్రీఫా వీఆర్‌ఓగా పనిచేస్తున్నారు. బుధవారం తుదివిడత పంచాయతీ ఎన్నికల కోసం.. కోస్గి మండలం ముశ్రీఫా గ్రామానికి వెళ్లాడు. విధి నిర్వహణలో ఉండగా ఒక్కసారిగా గుండెపోటు రావడంతో నర్సప్ప కిందపడిపోయాడు. స్థానికులు గమనించి కోస్గి ఆసుపత్రికి తరలించారు. అప్పటికే నర్సప్ప మృతిచెందినట్లు చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

మరో ఘటనలో ఓటరు

పరిగి మండలం మిట్టకోడూర్ గ్రామానికి చెందిన కోరె వెంకటమ్మ (65) బుధవారం పంచాయతీ ఎన్నికల్లో ఓటేసేందుకు ఉదయం 9 గంటల ప్రాంతంలో పోలింగ్ కేంద్రానికి వచ్చింది. ఓటేసేందుకు వరుసలో నిల్చుని ఉంది. ఓటేసిన వెంటనే వెంకటమ్మకు గుండెపోటు రావడంతో ఆమె పోలింగ్ కేంద్రంలోనే కుప్పకూలారు. వెంటనే కుటుంబసభ్యులు, స్థానికులు స్పందించి ఆమెను ఇంటికి తీసుకువెళ్లారు. పరిశీలించిన స్థానిక వైద్యులు ఆమె చనిపోయినట్లు వెల్లడించారు.

పోలింగ్ సిబ్బందిపై టీఆర్‌ఎస్ శ్రేణుల దాడి

కొల్లాపూర్ రూరల్: నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండల పరిధిలోని ముకిడిగుండం గ్రామంలో బుధవారం జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా ఘర్షణ చోటు చేసుకుంది. ఓట్ల లెక్కింపు పూర్తయ్యాక ఉద్రిక్తత చోటు చేసుకుంది. గ్రామంలో టీఆర్‌ఎస్ మద్దతు తెలిపిన ఏడుగురు వార్డుసభ్యులు గెలవగా. సర్పంచ్‌గా మాత్రం కాంగ్రెస్ మద్దతు తెలిపిన అభ్యర్థి గెలుపొందారు. వార్డుసభ్యులందరూ టీఆర్‌ఎస్ మద్దతుదారులే గెలిచినప్పుడు సర్పంచ్ మాత్రం గెలవకపోవడంపై ఆగ్రహించిన టీఆర్‌ఎస్ శ్రేణులు.. పోలింగ్ సిబ్బంది కాంగ్రెస్‌కు సహకరించాంటూ దాడికి దిగారు. దీంతో ఆందోళనకు గురైన కౌంటింగ్ సిబ్బంది గదిలో తలుపులు వేసుకుని లోపలే ఉండిపోయారు. ఆ సమయంలో పోలీసులు తక్కువగా ఉండడం, టీఆర్‌ఎస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో ఉండటంతో వారిని వారించడం కష్టతరంగా మారింది. సీఐ సైదాబాబు గ్రామం చేరుకుని టీఆర్‌ఎస్ కార్యకర్తలను చెదరగొట్టారు. తర్వాత సీఐ నచ్చజెప్పడంతో కార్యకర్తలు శాంతించారు. ఈ కారణంగా ఉపసర్పంచ్ ఎన్నిక వాయిదా వేయగా.. ఎన్నికల సిబ్బంది పోలీసు బందోబస్తు నడుమ కొల్లాపూర్ చేరుకున్నారు.

చెదరగొట్టిన పోలీసులు



కార్యకర్తలకు నచ్చజెప్పున్న సీఐ సైదాబాబు

కోమటిరెడ్డి స్వగ్రామంలో టీఆర్‌ఎస్ గెలుపు

నార్కట్‌పల్లి: కాంగ్రెస్ సీనియర్ నేతలు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య స్వగ్రామమైన నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం బి.వెల్లంలలో బుధవారం జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ బలపరిచిన అభ్యర్థి యానాల మాధవి గెలుపొందారు. గ్రామంలో 2,636 ఓట్లకు 2,443 ఓట్లు పోలయ్యాయి. 169 ఓట్ల మెజారిటీతో మాధవి గెలుపొందారు. ఇరవై ఏళ్లుగా ఈ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్, ఎంపీటీసీ అభ్యర్థులు గెలుపొందుతూ వస్తున్నారు. కాగా, గ్రామంలో బుధవారం ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్యలు తమ ఓటు హక్కును కూడా వినియోగించుకున్నారు.

జనశక్తి అగ్రనేతలకు మాతృవియోగం

- వయోభారంతో కూర మల్లమ్మ కన్నుమూత
- నేడు వేములవాడలో అంత్యక్రియలు

వేములవాడ: జనశక్తి అగ్రనేతలైన కూర రాజన్న, కూర దేవేందర్ అలియాస్ అమర్‌ల మాతృమూర్తి కూర మల్లమ్మ (101) బుధవారం ఉదయం కన్నుమూశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని ముదిరాజ్‌వీధిలోని వారి నివాసంలో ఆమె తుదిశ్వాస వదిలారు. మల్లమ్మ భర్త బాలయ్య చాన్నాళ్ల క్రితమే చనిపోయారు. వారికి ఇద్దరు కుమారులు కూర రాజన్న, కూర దేవేందర్‌లతో పాటు, ఇద్దరు కూతుళ్లు తార, నాగలక్ష్మి ఉన్నారు. కాగా, ఉద్యమ నేతలుగా ఎదిగిన కూర రాజన్న, కూర దేవేందర్ ఉద్యమంలోనే కొనసాగుతూ తల్లివంక చూడలేకపోయారు. ఈ క్రమంలో కుమారుల కోసం ఎదురుచూస్తూ మల్లమ్మ చాలా రోజులు గడిపింది. ఉద్యమకారుల నుంచి తన కుమారుల క్షేమ సమాచారాలు తెలుసుకుంటూ ఉండేదని స్థానికులు తెలిపారు. ఈ క్రమంలో 2009లో కూర రాజన్న బయటికొచ్చిన సమయంలో వేములవాడకు చేరుకుని తల్లి మల్లవ్వను కలుసుకుని వెళ్లారు. ఇటీవల రాజన్న అనారోగ్యం బారిన పడినప్పుడు తల్లి మల్లవ్వ హైదరాబాద్ చేరుకుని కొడుకుని చూసి వచ్చినట్లు చెప్పారు. అమర్ భార్య విమల.. మల్లమ్మ మృతదేహం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. మల్లమ్మ అంత్యక్రియలు గురువారం స్థానిక మూలవాగులో నిర్వహిస్తున్నట్లు విమలక్క తెలిపారు.



కూర మల్లమ్మ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న అమర్, విమలక్క

ప్రణయ్ మళ్లీ పుట్టాడు!

- మగబిడ్డకు జన్మనిచ్చిన అమృత
- ఫేస్‌బుక్‌లో పోస్ట్


మిర్యాలగూడ అర్బన్ : నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో పరువు హత్యకు గురైన ప్రణయ్ భార్య అమృత హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో బుధవారం మగబిడ్డకు జన్మనిచ్చింది. ఈ సందర్భంగా ఆమె 'ప్రణయ్ మళ్లీ పుట్టాడు'అంటూ ఫేస్‌బుక్‌లో పోస్ట్ పెట్టింది. 2018 సెప్టెంబర్ 14న ప్రణయ్ హత్యకు గురైన విషయం తెలిసిందే. మొదట తమ పెళ్లి రోజును పురస్కరించుకుని అమృత తన ఫేస్‌బుక్‌లో ఒక ఫొటోతో పాటు సందేశాన్ని పోస్టు చేసింది. 'నీకు (ప్రణయ్) మన పెళ్లిరోజు శుభాకాంక్షలు.. మన వివాహమై నేటికి ఏడాది అయ్యింది. గతేడాది ఇదే రోజు నీ చెయ్యి పట్టుకుని నడిచేందుకు అతృతగా ఎదురుచూసిన సమయం ఇది. ఇప్పుడు మన బిడ్డను నా చేతుల్లోకి తీసుకునేందుకు ఎదురుచూస్తున్నాను. ఇది త్వరలోనే నెరవేరబోతుంది. లవ్‌యూ లల్లు.. నిన్ను చాలా మిస్ అవుతున్నాను'అంటూ ఆ సందేశంలో పేర్కొంది. దీంతో అమృత పెట్టిన పోస్టుకి నెటిజన్లు వేల సంఖ్యలో స్పందించారు. ధైర్యంగా ఉండాలంటూ కామెంట్లు పెడుతున్నారు. అనంతరం మధ్యాహ్నం అమృత మగబిడ్డకు జన్మనిచ్చినట్లు మరో పోస్టు పెట్టింది.



ప్రణయ్, అమృత (ఫైల్)

మ్యాజిక్ ఫిగర్‌కు ఎన్డీఏ దూరం

- లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ కూటమికి 252 స్థానాలు
- మెజారిటీ మార్క్ అయిన 272కి 20 సీట్లు తక్కువ
- యూపీఏకి 147; బీజేపీకి 215, కాంగ్రెస్‌కు 96
- కీలకం కానున్న ఇతరులు గెలిచే 144 స్థానాలు
- ఏపీలో వైఎస్సార్సీపీ, పశ్చిమ బెంగాల్లో టీఎంసీ హవా
- తేల్చిన 'టైమ్స్‌నౌ– వీఎంఆర్' సర్వే



న్యూఢిల్లీ

రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని నేషనల్ డెమొక్రాటిక్ అలయన్స్(ఎన్డీయే) కూటమి అధికారానికి 20 సీట్ల దూరంలో నిలవనుందని తాజా సర్వే ఒకటి తేల్చింది. ఎన్డీయేకు 252, కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏకు 147, ఈ రెండు కూటముల్లోనూ లేని ఇతర పార్టీలకు 144 సీట్లు వస్తాయని ఆ సర్వే అంచనా వేసింది. జనవరి నెలలో ఆంగ్ల వార్తాచానెల్ 'టైమ్స్ నౌ'.. వీఎంఆర్ సంస్థతో కలిసి.. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే వచ్చే ఫలితాలపై సర్వే నిర్వహించింది. జనవరి 14 నుంచి 25వ తేదీ వరకు దేశవ్యాప్తంగా 15, 731 మంది ఓటర్ల నుంచి అభిప్రాయాలు సేకరించింది. గతంలో ఇండియాటుడే, రిపబ్లిక్ చానెళ్లు ప్రకటించిన సర్వేల తరహాలోనే ఈ సర్వే సైతం 'ఇతరులకు' కీలక స్థానం కల్పించింది. మొత్తం 543 సీట్లలో మెజారిటీ మార్కు 272కి 20 సీట్ల దూరంలో ఎన్డీయే నిలవడం విశేషం. యూపీఏకు కేవలం 147 సీట్లు రానున్న నేపథ్యంలో.. ఇతర పార్టీలు సాధించిన 144 స్థానాలు అత్యంత కీలకం కానున్నాయి. దేశవ్యాప్తంగా బీజేపీకి 215, కాంగ్రెస్‌కు 96 సీట్లు వస్తాయని ఈ సర్వే అంచనా వేసింది. 2014లో ఎన్డీయే 336 సీట్లు సాధించి అధికారంలోకి రాగా, అందులో మెజారిటీ మార్కు 272ను మించి 282 సీట్లు బీజేపీ గెల్చుకున్నవే కావడం గమనార్హం. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ కేవలం 44 సీట్లు సాధించగా, ఈ ఎన్నికల్లో కొంత పుంజుకున్నా.. సెంచరీ స్థానాలకు కొంత దూరంగానే నిలుస్తుందని సర్వే తేల్చింది.

ఇతరుల్లో..

మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్, వైఎస్ జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్సీపీ తమతమ రాష్ట్రాల్లో అత్యధిక స్థానాలు గెలుచుకుంటాయని సర్వే పేర్కొంది. పశ్చిమ బెంగాల్లోని మొత్తం 42 స్థానాల్లో 32 సీట్లను తృణమూల్ కాంగ్రెస్.. ఆంధ్రప్రదేశ్‌లోని మొత్తం 25 సీట్లలో అత్యధికంగా 23 స్థానాలను వైఎస్సార్సీపీ గెలుచుకుంటాయంది.

తెలంగాణలోని మొత్తం 17 స్థానాల్లో 10 సీట్లను తెలంగాణ రాష్ట్ర సమితి(టీఆర్ఎస్), 5 స్థానాలను కాంగ్రెస్, ఒక్కో సీటు చొప్పున బీజేపీ, ఎంఐఎం గెలుచుకుంటాయంది.

ఒడిశాలో బీజేపీ బలం పుంజుకుంటుందని సర్వే అంచనా వేసింది. మొత్తం 21 సీట్లలో 13 స్థానాలను బీజేపీ గెలుచుకోగా, బీజేడీ 8 సీట్లకు పరిమితమవుతుందని వెల్లడించింది. ఇక్కడ 2014లో బీజేడీ 20 సీట్లు గెలుచుకుంది. 2019లో ఈశాన్య రాష్ట్రాల్లోని 11 సీట్లలో బీజేపీ 9 స్థానాలు గెలుచుకుంటుందని టైమ్స్ నౌ– వీఎంఆర్ సర్వే పేర్కొంది.

యూపీలో..

కీలక రాష్ట్రమైన ఉత్తర ప్రదేశ్‌లోని మొత్తం 80 స్థానాల్లో ఎస్పీ– బీఎస్పీ కూటమికి 51, ఎన్డీయేకు 27 సీట్లు వస్తాయని, కాంగ్రెస్ 2 స్థానాలకే పరిమితమవుతుందని తేల్చింది. 2014లో వేర్వేరుగా పోటీ చేసి ఎస్పీ 5 సీట్లు గెలుచుకోగా, బీఎస్పీ బోణీ చేయకపోవడం గమనార్హం. ఆ ఎన్నికల్లో యూపీలో ఎన్డీయే 73 సీట్లు గెలుచుకుంది.

ఇతర కీలక రాష్ట్రాల్లో..


రాజస్తాన్‌లో బీజేపీ గతంలో మొత్తం 25 సీట్లను గెలుచుకోగా, ఈసారి ఆ సంఖ్య 17కి తగ్గుతుందని, 8 సీట్లను కాంగ్రెస్ గెలుచుకుంటుందని సర్వే పేర్కొంది. 2014లో గుజరాత్‌లోని మొత్తం 26 సీట్లను క్లీన్‌స్వీప్ చేసిన బీజేపీ ఈసారిఅందులోనుంచి రెండు సీట్లను కాంగ్రెస్‌కు కోల్పోనుంది. కర్నాటకలో బీజేపీ, కాంగ్రెస్‌లు చెరో 14 సీట్లు గెలుచుకుంటాయి. మధ్యప్రదేశ్‌లోని 29 సీట్లలో బీజేపీ 23, కాంగ్రెస్ 6 గెలుచుకోనున్నాయి. 2014లో బీజేపీ 27, కాంగ్రెస్ 2 సీట్లు గెలుచుకున్నాయి. మహారాష్ట్రలోని మొత్తం 48 సీట్లలో ఎన్డీయే 43 (2014 కన్నా ఒక సీటు ఎక్కువ), యూపీఏ 5 గెలుచుకుంటాయి. బిహార్లో(40) గత ఎన్నికల్లో ఎన్డీయే 30 సీట్లు గెలుచుకోగా.. ఈ సారి 25 కి పరిమితమవుతుంది. యూపీఏ బలం 15కి పెరుగుతుంది.

- కేంద్ర పాలిత ప్రాంతాల్లో దాద్రా నగర్ హవేలీ (1), డామన్ దయ్యూ (1), అండమాన్ నికోబార్ దీవులు (1) లోక్‌సభ స్థానాలను ఎన్డీయే పార్టీలు, అటు చండీగఢ్ (1) స్థానాన్ని యూపీఏ గెలుస్తుంది. లక్షద్వీప్ (1)లో ఎన్సీపీ, సిక్కింలో ఉన్న ఒక్క స్థానాన్ని ఇతరులు గెలుచుకుంటారు. పుదుచ్చేరిలోనూ ఒక లోక్‌సభ సీటు ఉన్నప్పటికీ దాని గురించి సర్వే నివేదికలో ప్రస్తావించలేదు.

రాష్ట్రాల వారీగా సర్వే ఫలితాలు

రాష్ట్రం (మొత్తం సీట్లు)	ఎన్డీయే	యూపీఏ	ఇతరులు
ఉత్తరప్రదేశ్ (80)	27	2	51 (ఎస్పీ–బీఎస్పీ కూటమి)
మహారాష్ట్ర (48)	43	5	0
పశ్చిమ బెంగాల్ (42)	9	1	32 (తృణమూల్ కాంగ్రెస్)
బిహార్ (40)	25	15	0
తమిళనాడు(39)	0	35	4 (అన్నాడీఎంకే)
మధ్యప్రదేశ్ (29)	23	6	0
కర్ణాటక (28)	14	14	0
గుజరాత్ (26)	24	2	0
ఆంధ్రప్రదేశ్ (25)	0	0	23 (వైఎస్సార్‌సీపీ)+2 టీడీపీ
రాజస్తాన్ (25)	17	8	0
ఒడిశా (21)	13	0	8(బీజేడీ)
కేరళ (20)	1	0	16 (యూడీఎఫ్)+3(ఎల్డీఎఫ్)
తెలంగాణ (17)	1	5	10 (టీఆర్ఎస్)+1
అస్సాం (14)	8	3	2(ఏఐయూడీఎఫ్)+1
జార్ఖండ్ (14)	6	8	0
పంజాబ్ (13)	0	12	1 (ఆప్)
ఛత్తీస్‌గఢ్ (11)	5	6	0
హరియాణ (10)	8	2	0
ఢిల్లీ(7)	6	0	1(ఆప్)
జమ్మూ కశ్మీర్ (6)	1	1	4 (నేషనల్ కాన్ఫరెన్స్)
ఉత్తరాఖండ్ (5)	5	0	0
హిమాచల్ ప్రదేశ్ (4)	3	1	0
అరుణాచల్ ప్రదేశ్ (2)	2	0	0
గోవా (2)	1	1	0
మణిపూర్ (2)	1	1	0
త్రిపుర (2)	2	0	0
నాగాలాండ్ (1)	1	0	0
మేఘాలయా (1)	1	0	0
మిజోరాం (1)	1	0	0

మహాకూటమి గెలిస్తే రోజుకో ప్రధాని



ఖాన్‌పూర్: దేశంలోని విపక్ష పార్టీలన్నీ కలిసి ఏర్పడిన మహాకూటమిపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా నిప్పులుచెరిగారు. మహాకూటమి అధికారంలోకి వస్తే రోజుకో ప్రధాని మారతారని అన్నారు. ఉత్తరప్రదేశ్‌లో బుధవారం బీజేపీ క్షేత్ర స్థాయి కార్యకర్తలతో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. మహాకూటమి గెలిస్తే ప్రధానమంత్రిగా సోమవారం మాయావతి, మంగళవారం అఖిలేశ్ యాదవ్, బుధవారం మమతా బెనర్జీ, గురువారం శరత్ పవార్, శుక్రవారం దేవెగౌడ, శనివారం ఎంకే స్టాలిన్ ఉంటారని.. ఆదివారం ప్రధాని పదవికి సెలవిస్తారని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో పోటీ చేసే ముందు తమ ప్రధాని అభ్యర్థి ఎవరో చెప్పాలని మహాకూటమిని డిమాండ్ చేశారు. బీజేపీలో నాలుగు 'బీ'లు ఉన్నాయని.. 'భద్రా భారత్', 'బన్నా భారత్'అని అన్నారు. ఇక మహాకూటమిలో కూడా నాలుగు 'బీ'లు ఉన్నాయని అవి బువా (ఆంటీ), భతీజా (అల్లుడు), భాయ్ (సోదరుడు), బెహెన్ (సోదరి) అని అన్నారు.

కార్తీ.. చట్టంతో ఆటలాడొద్దు: సుప్రీం

న్యూఢిల్లీ: కేంద్ర మాజీ మంత్రి చిదంబరం కుమారుడు కార్తీ చిదంబరానికి సుప్రీం కోర్టు ఘాటైన హెచ్చరిక చేసింది. చట్టంతో ఆటలాడుకోవద్దని హితవు పలికింది. విదేశాలకు వెళ్లేందుకు అనుమతి కోరిన కార్తీని ముందుగా రూ.10 కోట్లు తమ రిజిస్ట్రీ వద్ద డిపాజిట్ చేయాలని ఆదేశించింది. 'ఫిబ్రవరి 10 నుంచి 26 వరకు ఎక్కడికంటే అక్కడికి వెళ్లిపోవచ్చని కాకపోతే విచారణకు మాత్రం సహకరించాలి' అని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ పేర్కొన్నారు. 'విచారణకు సహకరించాల్సి ఉంటుందనే విషయాన్ని మీ క్లయింట్‌కు చెప్పండి. మీరు సహకరించలేదు. చాలా విషయాలు చెప్పాల్సి ఉంది' అని కార్తీ తరఫు న్యాయవాదికి ధర్మాసనం చెప్పింది. అంతర్జాతీయ టెన్నిస్ టోర్నమెంట్స్ కోసం వచ్చే నెల ఫ్రాన్స్, స్పెయిన్, జర్మనీ, బ్రిటన్ దేశాలకు వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని కార్తీ కోరారు. మాజీ టెన్నిస్ ఆటగాడిగా, ప్రస్తుత అడ్మినిస్ట్రేటర్‌గా, వ్యాపారవేత్తగా వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో సుమలత పోటీ?



సాక్షి బెంగళూరు: మాజీ మంత్రి, కన్నడ రెబెల్‌స్టార్, దివంగత అంబరీశ్ భార్య సుమలత రాజకీయాల్లోకి రానున్నట్లు ప్రచారం జరుగుతోంది. మాండ్య లోక్‌సభ స్థానం నుంచి ఆమె పోటీచేస్తారని సమాచారం. ఆమె భర్త అంబరీశ్ కాంగ్రెస్‌లో కొనసాగడం తెల్సిందే. అనారోగ్యంతో ఆయన 2018 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయలేదు. కాంగ్రెస్ నుంచి సుమలత పోటీ చేయాలనుకున్నా మాండ్య స్థానాన్ని సంకీర్ణంలోని జేడీఎస్ ఆశిస్తోంది. ప్రముఖ నిర్మాత రాక్‌లైన్ వెంకటేశ్ తదితరులు సుమలతకు మద్దతుగా ఉన్నట్లు తెలుస్తోంది. స్వతంత్ర అభ్యర్థిగానైనా బరిలో నిలిచేందుకు ఆమె సిద్ధమని సమాచారం. కాంగ్రెస్– జేడీఎస్ కూటమిలో భాగంగా మాండ్య స్థానం నుంచి సీఎం కుమారస్వామి కొడుకు నిఖిల్ పోటీ చేస్తారని వార్తలొస్తున్నాయి. సుమలత పోటీ చేస్తే నిఖిల్ గెలుపు కష్టమని రాజకీయ విశ్లేషకుల అంచనా. సుమలతకు జేడీఎస్ వర్గాల నుంచి భారీ స్థాయిలో మద్దతు ఉన్నట్లు సమాచారం. దీంతో సుమలత, నిఖిల్ మధ్య ఓట్లు చీలి చివరకు బీజేపీ గెలిచే చాన్సుందని భావిస్తున్నారు.

కర్ణాటకలో కదం తొక్కిన మహిళా లోకం

సాక్షి బెంగళూరు: కర్ణాటకలో సంపూర్ణ మద్యపాన నిషేధం కోరుతూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వందల కిలో మీటర్లు నడుచుకుంటూ బెంగళూరు నగరానికి చేరుకున్న వేలాది మంది మహిళలు బుధవారం విధానసౌధ (శాసనసభ భవనం) ముట్టడికి యత్నించారు. మహాత్మా గాంధీ మద్య రహిత సమాజాన్ని చూడాలని కలలు కన్నారనీ, ఆయన వర్ధంతి రోజు కాబట్టే బుధవారం అసెంబ్లీని ముట్టడించాలని ఇక్కడకు వచ్చామని యాత్రలో పాల్గొన్న మహిళలు తెలిపారు. ఈ నెల 19న చిత్రదుర్గ జిల్లాలో ఈ పాదయాత్ర ప్రారంభమైంది. మైసూరు, తుమకూరు, మండ్య, రామనగర, చామరాజనగర తదితర 23 జిల్లాల నుంచి వేలాదిగా వచ్చిన మహిళలు మంగళవారం రాత్రి నగరంలోని యశ్వంతపురకు వచ్చి ఆ తర్వాత మల్లేశ్వరం క్రీడా మైదానంలో బస చేశారు. పాదయాత్రలో మొత్తం 3 వేల మంది వరకు మహిళలు పాల్గొన్నారు.

లోకాయుక్త కోసం హజారే దీక్ష



సాక్షి, ముంబై: లోక్‌పాల్ నియామకం, లోకాయుక్త చట్టం సత్వర అమలు, రైతుల సమస్యలపై సామాజిక వేత్త అన్నా హజారే నిరాహార దీక్ష చేపట్టారు. మహారాష్ట్రలోని సొంతూరు రాలేగావ్‌సిద్ధిలో దీక్ష మొదలు పెట్టారు. అవినీతి నుంచి విముక్తి చేయాలని మోదీ సర్కారు కోరుకోవడమే లేదన్నారు. మహారాష్ట్ర సీఎం ఫడ్నవిస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. లోక్‌పాల్ బిల్లు ఐదేళ్ల కిందనే ఆమోదం పొందినా లోక్‌పాల్, లోకాయుక్తలను నియమించాలనే ఉద్దేశం ప్రభుత్వానికి లేదన్నారు. ఈ దీక్ష వ్యక్తికో, పార్టీకో వ్యతిరేకంకాదని దేశ ప్రజల హితవు కోసమేనన్నారు. ప్రభుత్వం మనసులో అమలు చేయాలని ఉంటే ఎందుకు జాప్యం చేసినట్టు అని ప్రశ్నించారు.

రాజకీయ రంగు పులమడం కోర్టు ధిక్కారమే

న్యూఢిల్లీ: న్యాయవాదులు మీడియా ముందు జడ్జీలను వ్యక్తిగతంగా విమర్శించడం చాలా సాధారణమైపోయిందని సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. కొన్ని కేసుల్లో కోర్టు తీర్పులకు రాజకీయ రంగులు పులుముతున్నారని మండిపడింది. ఇది ముమ్మాటికీ కోర్టు ధిక్కరణకు పాల్పడటమేనని స్పష్టం చేసింది. కేసులను విచారించేందుకు న్యాయస్థానాలకు ఓ వ్యవస్థ అంటూ ఉందనీ, ఈ వ్యవహారంలో మీడియా విచారణ సరికాదని వ్యాఖ్యానించింది. మద్రాస్ హైకోర్టు ఇచ్చిన కొన్ని సవరణ ఆదేశాలను కొట్టివేసిన జస్టిస్ అరుణ్ మిశ్రా, జస్టిస్ వినీత్ శరణ్‌ల ధర్మాసనం ఈ మేరకు స్పందించింది. తీర్పుల విషయంలో విమర్శలు ఎదుర్కొంటున్న జడ్జీలు.. మీడియాకు తమ వాదనను వినిపించాల్సిన అవసరం లేదని అత్యున్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. అదే సమయంలో న్యాయవాదులు కూడా జడ్జీలను ప్రభావితం చేసేలా వ్యవహరించరాదని స్పష్టం చేసింది.

'హంగ్' అభివృద్ధికి అడ్డు

- పూర్తి మద్దతుతోనే పురోభివృద్ధి
- అగ్రవర్ణాల రిజర్వేషన్‌పై ధైర్యంగా ముందడుగేశాం
- సూరత్, దండి సభల్లో మోదీ



రాజ్‌ఘాట్‌లో గాంధీ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న ప్రధాని మోదీ

సూరత్ / దండి: భారత్‌లో తాము అధికారంలోకి రాకముందు ఏ రాజకీయ పార్టీకీ పూర్తి స్థాయి మెజారిటీ రాకపోవడంతో దేశాభివృద్ధి ఆగిపోయిందని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. రాజకీయ అస్థిరత కారణంగా కొన్ని రంగాల్లో భారత్ తిరోగమనం దిశగా వెళ్లిందని వ్యాఖ్యానించారు. దేశాభివృద్ధి కోసం కేంద్రంలో పూర్తిస్థాయి మెజారిటీ ఉన్న ప్రభుత్వం ఏర్పాటు కావాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. గుజరాత్‌లోని సూరత్‌లో విమానాశ్రయం విస్తరణ పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం బహిరంగ సభలో మాట్లాడిన మోదీ.. ప్రతిపక్షాల వ్యవహారశైలిని తీవ్రంగా తప్పుపట్టారు.

'రియల్' ధరలు తగ్గుముఖం: భారత్‌లో గత 30 ఏళ్లలో ఏ పార్టీకి మెజారిటీ దక్కలేదు. దీంతో సంకీర్ణ ప్రభుత్వాలు ఏర్పడి దేశాభివృద్ధి కుంటుపడింది. కానీ యువతరం 2014లో విజ్ఞతతో ఆలోచించి ఓటేయడంతో భారత్ ఈరోజు పురోగమిస్తోంది. యువతీయువకుల ఓట్లు 30 ఏళ్ల రోగాన్ని నిర్మూలించాయి. కేంద్రంలో పూర్తి మెజారిటీతో ఉన్న సుస్థిర ప్రభుత్వం ఏర్పడింది. అధికారం అప్పగించినందుకు మీరేం చేశారు? అని ప్రజలు నన్ను ప్రశ్నించవచ్చు. నేను జవాబిచ్చేందుకు సిద్ధంగా ఉన్నా. ఒకవేళ మెజారిటీ కాకుండా సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడి ఉంటే మీకు చాలా కారణాలు చెప్పి ఉండేవాడిని. యూపీఏ ప్రభుత్వం 25 లక్షల ఇళ్లను నిర్మిస్తే.. మా ప్రభుత్వం నాలుగున్నరేళ్ల కాలంలో ఏకంగా 1.30 కోట్ల గృహాల నిర్మాణం పూర్తిచేసింది. ఈ లక్ష్యాన్ని చేరుకోవాలంటే కాంగ్రెస్‌కు ఇంకో పాతికేళ్లు పడుతుంది' అని మోదీ తెలిపారు. నోట్ల రద్దుపై స్పందిస్తూ..'నోట్ల రద్దు తర్వాత యువత తక్కువ ధరలకే వాళ్లు ఇళ్లను కొనుగోలు చేయగలుగుతున్నారు. నోట్ల రద్దు, రియల్‌ఎస్టేట్ నియంత్రణ సంస్థతో రియల్‌ఎస్టేట్ రంగంలో పేరుకుపోయిన నల్లధనాన్ని నియంత్రించగలిగాం. సంపూర్ణ మెజారిటీ ఉన్న కారణంగానే ముద్ర పథకాన్ని తీసుకొచ్చాం' అని వెల్లడించారు. అగ్రవర్ణాల పేదలకు 10% కోటా కల్పించే విషయంలో ఎన్డీయే ప్రభుత్వం ధైర్యంగా ముందడుగు వేసిందన్నారు.

ఆ ప్రశ్నలను ప్రజలు మర్చిపోలేదు...

సూరత్ సభ తర్వాత నవ్‌సరి జిల్లాలోని దండికి చేరుకున్న ప్రధాని.. గాంధీ వర్ధంతి నేపథ్యంలో జాతీయ ఉప్పు సత్యాగ్రహ స్మారకం, మ్యూజియాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత మాట్లాడుతూ..'మహాత్మా గాంధీ దండియాత్ర (ఉప్పు సత్యాగ్రహం) సందర్భంగా ఇది సాధ్యమా? అని పలువురు అనుమానం వ్యక్తం చేశారు. కానీ ఉప్పుకున్న శక్తి, సమాజంలో వేర్వేరు వర్గాలతో దానికున్న అనుబంధం గాంధీకి తెలుసు. అందువల్లే బాపూ ముందుకు సాగారు. ఒకవేళ ఇలాంటి ప్రతికూల మనస్తత్వమున్న వ్యక్తుల ప్రభావానికి గాంధీ లోనై ఉద్యమాన్ని ఆపేసుంటే ఏం జరిగేది? దురదృష్టవశాత్తూ ఇలాంటి వ్యక్తులు మన దేశంలో ఇంకా ఉన్నారు. మరుగుదొడ్లు కట్టడం వల్లే ఏం మార్పు వస్తుంది? ఇది ప్రధాని చేయాల్సిన పనేనా? గ్యాస్ కనెక్షన్లు సామాన్యుల జీవితాన్ని ఎలా బాగుచేస్తాయి? ఇలా వారువేసిన ప్రశ్నలను ప్రజలు ఇంకా మర్చిపోలేదు. 2014 నుంచి ఇప్పటివరకూ 9 కోట్ల మరుగుదొడ్లను నిర్మించాం. ఫ్రాన్స్‌లోని ఈఫిల్ టవర్, అమెరికాలోని స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ వంటి చారిత్రక కట్టడాలపై ఆయా దేశాల పౌరులు ఎన్నడూ విమర్శించలేదు' అని మోదీ పేర్కొన్నారు.

పరామర్శలోనూ రాజకీయాలా?

రాహుల్‌పై గోవా సీఎం మండిపాటు




సిబ్బంది సాయంతో అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు వస్తున్న పారికర్

న్యూఢిల్లీ: అనారోగ్యంతో ఉన్న వ్యక్తిని పరామర్శించి, దానిని రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించడం తగదని గోవా సీఎం మనోహర్ పారికర్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీపై ధ్వజమెత్తారు. మంగళవారం పారికర్‌ను పరామర్శించిన అనంతరం రాహుల్‌గాంధీ కొచిలో ఓ సమావేశంలో మాట్లాడుతూ తమ మధ్య రఫేల్ కుంభకోణంపై చర్చ జరిగిందని వెల్లడించిన విషయం విదితమే. అనిల్ అంబానీకి ప్రయోజనం కలిగించేందుకు మోదీ ప్రయత్నించారని, ఈ విషయంలో పారికర్ తనకు సంబంధం లేదని తెలిపారని రాహుల్ వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. దీనిపై పనాజీలోని గోవా అసెంబ్లీ భవనంలో పారికర్ మాట్లాడుతూ 'రాహుల్‌తో నా భేటీ కేవలం అయిదు నిమిషాలు మాత్రమే జరిగింది. ఆ భేటీలో రాహుల్ రఫేల్‌పై మాట్లాడలేదు. అసలు భేటీలో ఆ అంశమే ప్రస్తావనకు రాలేదు' అని స్పష్టం చేశారు. తనతో జరిగిన పరామర్శ భేటీని కూడా రాహుల్ అల్పమైన రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా కూడా రాహుల్‌పై మండిపడ్డారు.

ఎన్నికల ముందు మతఘర్షణలు!

- ముస్లింలపై దాడులు పెరిగితే ఇస్లామిక్ ఉగ్రసంస్థలకు ఊతం
- అమెరికా సెనెట్ కమిటీకి ఇంటెలిజెన్స్ చీఫ్ కోట్స్ నివేదిక



వాషింగ్టన్: సార్వత్రిక ఎన్నికల వేళ ప్రధాని మోదీ నేతృత్వంలోని బీజేపీ హిందుత్వ ఎజెండాతో ముందుకెళితే భారత్‌లో మతఘర్షణలు చెలరేగే అవకాశముందని నేషనల్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ డాన్ కోట్స్ తెలిపారు. గత ఐదేళ్ల కాలంలో బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మతపరమైన ఉద్రిక్తతలు, విద్వేషం పెరిగాయని వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా 2019లో ఎదురుకానున్న విపత్కర పరిస్థితులపై కోట్స్ సెనెట్ సెలక్ట్ కమిటీ ఆన్ ఇంటెలిజెన్స్ ముందు హాజరై నివేదికను సమర్పించారు. ఈ సందర్భంగా కోట్స్ మాట్లాడుతూ..'మోదీ నేతృత్వంలోని బీజేపీ హిందుత్వ అజెండాను ప్రచారాస్త్రంగా చేసుకుంటే భారత్‌లో సార్వత్రిక ఎన్నికల వేళ మత ఘర్షణలు చోటుచేసుకునే అవకాశముంది. దాంతో, ఇస్లామిక్ ఉగ్రవాద సంస్థలు భారత్‌లో సులభంగా తమ ప్రాబల్యాన్ని విస్తరిస్తాయి' అని హెచ్చరించారు.

భారత్‌పై ఉగ్రదాడులు కొనసాగుతాయి..

అంతేకాకుండా భారత్–పాకిస్తాన్ సంబంధాలు లోక్‌సభ ఎన్నికలు ముగిసేవరకూ మెరుగుపడే అవకాశం లేదని కోట్స్ అభిప్రాయపడ్డారు. పాకిస్తాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఉగ్రవాద సంస్థలు భారత్, అఫ్గానిస్తాన్‌పై 2019లోనూ దాడులు కొనసాగిస్తాయని హెచ్చరించారు. తమకు ప్రమాదకరంగా మారిన ఉగ్రవాదులను మాత్రమే ఏరివేస్తూ, ఇతర ఉగ్రమూకలకు ఆశ్రయమిస్తున్న పాకిస్తాన్ అమెరికా ఆగ్రహానికి గురికాక తప్పదని వ్యాఖ్యానించారు. అఫ్గానిస్తాన్‌లో తాలిబన్లపై పోరాడుతున్న అమెరికాకు పాక్ వ్యవహారశైలి నిరాశపరుస్తోందన్నారు. భారత్‌లో లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మత ఉద్రిక్తతలు, అఫ్గానిస్తాన్‌లో 2019, జూన్–జూలై నెలల్లో అధ్యక్ష ఎన్నికలు సందర్భంగా తాలిబాన్ల దాడులు, ఉగ్రవాదుల పూర్తిస్థాయి ఏరివేతకు పాక్ నిరాకరణ వంటి కారణాల వల్ల ఈ ఏడాది దక్షిణాసియాలో హింసాత్మక ఘటనలు పెరిగే అవకాశముందని హెచ్చరించారు. సెనెట్ సెలక్ట్ కమిటీ ఆన్ ఇంటెలిజెన్స్ ముందు కోట్స్‌తో పాటు సీఐఏ డైరెక్టర్ గినా హాస్పెల్, ఎఫ్‌బీఐ చీఫ్ క్రిస్టోఫర్ రే, రక్షణ నిఘా సంస్థ(డీఐఏ) డైరెక్టర్ రాబర్ట్ అష్లేతో పాటు పలువురు హాజరయ్యారు.

నేడు ఫెర్నాండెజ్ అంత్యక్రియలు

న్యూఢిల్లీ: మాజీ రక్షణమంత్రి, సోషలిస్ట్ దిగ్గజం జార్జి ఫెర్నాండెజ్(88) అంత్యక్రియలు గురువారం ఢిల్లీలో నిర్వహించనున్నారు. ఫెర్నాండెజ్ కోరిక మేరకు తొలుత ఆయన పార్థివదేహాన్ని దహనంచేసి, అస్థికలను పృథ్వీరాజ్ రోడ్డులోని క్రైస్తవ శ్మశానవాటికలో ఖననం చేయనున్నట్లు ఆయన భార్య లీలా కబీర్ వెల్లడించారు. గురువారం ఉదయం వరకు ప్రముఖుల, అభిమానుల సందర్శనలు, నివాళుల తర్వాత మధ్యాహ్నం మూడింటికి స్వగృహం శాంతినివాస్ నుంచి అంతిమయాత్ర మొదలవుతుందని ఆమె పేర్కొన్నారు. అమెరికాలో ఉంటున్న ఫెర్నాండెజ్ ఏకైక కుమారుడు సియాన్ ఈరాత్రికల్లా ఢిల్లీ చేరుకోనున్నాడు.

రామాలయ నిర్మాణానికి 21న శ్రీకారం: స్వరూపానంద

అలహాబాద్: అయోధ్యలో రామమందిర నిర్మాణానికి వచ్చే నెల 21న శ్రీకారం చుడతామని ఆధ్యాత్మిక నాయకుడు స్వామి స్వరూపానంద సరస్వతి బుధవారం చెప్పారు. బుల్లెట్లను ఎదుర్కోడానికైనా సరే తాము సిద్ధమేనన్నారు. మూడు రోజుల కుంభమేళా ముగింపు సందర్భంగా ఈ నిర్ణయాన్ని అలహాబాద్ (ప్రయాగ్ రాజ్)లో స్వరూపానంద ప్రకటించారు. అయోధ్యలో గతంలో సేకరించిన, వివాదరహిత భూమిని తిరిగి వాస్తవ యజమానులకు అప్పగించేందుకు అనుమతివ్వాలంటూ సుప్రీంకోర్టులో కేంద్రం పిటిషన్ వేసిన మరుసటి రోజే ఈ ప్రకటన రావడం గమనార్హం. అలహాబాద్‌లో ధర్మ సభ అనంతరం ద్వారాకా పీఠానికి చెందిన శంకరాచార్య ఓ ప్రకటన విడుదల చేస్తూ హిందువులంతా ఒక్కొక్కరు నాలుగు ఇటుకలు పట్టుకుని ఫిబ్రవరి 21న అయోధ్యకు రావాలని పిలుపునిచ్చారు. సాధువులంతా వసంతపంచమి రోజైన ఫిబ్రవరి 10న అలహాబాద్ నుంచి అయోధ్యకు తమ యాత్రను ప్రారంభిస్తారన్నారు. ప్రభుత్వం, సుప్రీంకోర్టు అంటే తమకు గౌరవం ఉందనీ, అయితే ఇప్పుడు తాము రామాలయ నిర్మాణం ప్రారంభించకపోతే ఇంకెప్పటికీ కుదరకపోవచ్చని పేర్కొన్నారు.

నేటి నుంచి పార్లమెంటు

రఫేల్, రైతుల సమస్యలపై నిలదీతకు విపక్షాలు రెడీ

సాక్షి ప్రతినిధి, న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలకు ముందు చివరి పార్లమెంటు సమావేశాలు నేటి నుంచి ఫిబ్రవరి 13 వరకూ జరగనున్నాయి. గురు వారం ఉదయం 11 గంటలకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. పౌరసత్వ బిల్లు, ట్రిపుల్ తలాక్ బిల్లు, ప్రజా ప్రాతినిధ్య చట్టం–2017 బిల్లు, కంపెనీల చట్టం బిల్లు, నేషనల్ మెడికల్ కౌన్సిల్ బిల్లులను ఈ సమావేశాల్లోనే ఆమోదింపజేసుకోవాలన్న కృతనిశ్చయంతో ఎన్డీయే ప్రభుత్వం ఉంది. అయితే ఈ బిల్లులపై జేడీయూ సహా పలు మిత్రపక్షాలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. మరోవైపు రఫేల్ యుద్ధ విమానాల ఒప్పందం, రైతుల సమస్యలపై ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు కాంగ్రెస్ నేతృత్వంలో విపక్షాలు సిద్ధమయ్యాయి. ఈ నేపథ్యంలో గురువారం ప్రారంభమయ్యే పార్లమెంటు సమావేశాలు వాడీవేడిగా సాగనున్నాయి. అయోధ్య చుట్టూ వివాదాస్పదం కాని స్థలాన్ని యజమానులకు తిరిగి ఇచ్చేస్తామని కేంద్రం చెప్పడంపైనా చర్చ సాగే అవకాశముంది. కాగా, తాత్కాలిక బడ్జెట్‌ను కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ శుక్రవారం పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నారు. మరోవైపు సమావేశాల నేపథ్యంలో రాజకీయ పార్టీల ఫ్లోర్ లీడర్లతో లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ సమావేశమయ్యారు. ఈ లోక్‌సభ సమావేశాలు సజావుగా సాగేలా సహకరించాలని కోరారు.

అమెరికాను వణికిస్తున్న ఆర్కిటిక్ చలి

షికాగోలో మైనస్ 30 డిగ్రీల సెల్సియస్



షికాగోలో రైలుపట్టాలపై మంచు కరిగించేందుకు నిప్పపెట్టిన దృశ్యం

షికాగో: భీకరస్థాయిలో విరుచుకుపడుతున్న ఆర్కిటిక్ చలి దెబ్బకు అమెరికాలో లక్షలాది ప్రజలు గజగజ వణికిపోతున్నారు. ఇళ్లలోనే ఉండిపోవాలని చాలా సంస్థలు తమ ఉద్యోగులకు సమాచారమిచ్చాయి. చాలా రాష్ట్రాల్లో పాఠశాలలు, వ్యాపార, ప్రభుత్వ కార్యాలయాలు మూతపడ్డాయి. ఇప్పటికే 2000కుపైగా విమాన సర్వీసులు రద్దయ్యాయి. ఎలాంటి విపత్కర వాతావరణ పరిస్థితిల్లోనైనా ఉత్తరాలను బట్వాడా చేసే 'యూఎస్ పోస్టల్ సర్వీస్' సైతం ఇండియానా, మిషిగాన్, ఇల్లినాయిస్‌సహా 5 రాష్ట్రాల్లో తన సేవలను అర్ధంతరంగా నిలిపేసింది. ఉత్తర డకోటా, దక్షిణ డకోటా మొదలుకొని ఓహియో దాకా (1,930 కిలోమీటర్ల పొడవునా) డజనుకుపైగా రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు ఇటీవల కాలంలో ఎన్నడూలేనంతటి కనిష్టస్థాయిలకు పడిపోయాయి. ఆరుబయటకెళ్లి ఎక్కువసేపు మాట్లాడొద్దని, సెకన్లలోనే ఒళ్లు మొద్దుబారేలా చేసే చలివాతావరణం ఆవరించి ఉందని అమెరికన్ పౌరులను జాతీయ వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. షికాగోలో ఉష్ణోగ్రత ఏకంగా మైనస్ 30 సెల్సియస్‌గా నమోదైంది. షికాగోలో మైనస్ 50కి సైతం పడిపోయే ప్రమాదముంది. అంటార్కిటికా ఖండంలోని కొన్నిచోట్ల సైతం ఇంతటి చలిలేదు. నార్త్ డకోటాలో ఉష్ణోగ్రత మైనస్ 35 డిగ్రీ ఫారన్‌హీట్‌గా నమోదైంది. కొన్ని రైళ్ల సర్వీసులనైనా నడిపేందుకు వీలుగా, మంచును కరిగించేందుకు షికాగోలో రైళ్ల పట్టాల దగ్గర సిబ్బంది మంటలు అంటించారు. అమెరికా రాజధాని వాషింగ్టన్‌లో 'మంచు ఎమర్జెన్సీ'ని ప్రకటించారు. ఇల్లినాయిస్, మిషిగాన్, విస్కాన్సిన్ రాష్ట్రాల్లో వాతావరణ ఎమర్జెనీ ప్రకటించారు. కెనడాలో సైతం చలి విజృంభిస్తోంది.

ట్రంప్ వ్యంగ్య ట్వీట్: అమెరికాను మంచు దుప్పటి కప్పేసిన వేళ అధ్యక్షుడు ట్రంప్ తన వాదనను వ్యంగ్యంగా తెరపైకి తెచ్చారు. భూతాపం(గ్లోబల్ వార్మింగ్) అనేదే లేదని వాదించే ట్రంప్ బుధవారం.. 'గ్లోబల్ వార్మింగ్ ఎక్కడ? త్వరగా అమెరికాకు వచ్చెయ్. ఈ చలిలో మాకు నీ అవసరం చాలా ఉంది' అంటూ ట్వీట్ చేశారు. దీనిపై జాతీయ వాతావరణ శాఖ ఘాటుగా స్పందించింది. 'చలి తుపాన్లు వచ్చినంతమాత్రాన గ్లోబల్ వార్మింగ్ అనేది లేదని కాదు'అంటూ ట్వీట్ చేసింది.

సాక్షి బిజినెస్
గురువారం 31-1-2019
WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
1 ▼	1 ▼
35,591	10,652

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30గం॥లకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	7,122	▲ 90
డోజోన్స్	24,927	▲ 347
ఎఫ్‌టీఎస్ఈ 100	6,942	▲ 108
డాక్స్	11,182	▼ 37
షాంఘై	2,575	▼ 19
నికాయ్	20,556	▼ 108

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	థామస్‌కుక్	70.05	72.15
£	బ్రిటన్ పౌండ్	థామస్‌కుక్	92.25	94.08
€	యూరో	థామస్‌కుక్	80.65	82.07
¥	జపాన్ ఎన్ (100)	థామస్‌కుక్	63.00	68.00
AUS	ఆస్ట్రేలియా డాలర్	థామస్‌కుక్	50.45	52.07
SS	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	51.01	54.05
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	17.65	20.07
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	--	--
¥	చైనా యువాన్	థామస్‌కుక్	9.55	11.25

చందా కొచర్ దోషే!!

- నిబంధనలు ఉల్లంఘించిన మాట నిజమే
- తేల్చిన జస్టిస్ శ్రీకృష్ణ కమిటీ
- ఆమెను తొలగించినట్లే పరిగణిస్తాం
- ఇచ్చిన బోనస్‌లన్నీ వెనక్కి తీసుకుంటాం
- ఐసీఐసీఐ బ్యాంక్ వెల్లడి



న్యూఢిల్లీ: వీడియోకాన్ గ్రూప్‌నకు రుణాల వివాదంపై విచారణ జరిపిన జస్టిస్ బి.ఎన్.శ్రీకృష్ణ కమిటీ... ఈ వ్యవహారంలో ప్రైవేట్ రంగ ఐసీఐసీఐ బ్యాంక్ మాజీ సీఈవో చందా కొచర్‌ని దోషిగా తేల్చింది. బ్యాంకు నిబంధనలను ఆమె ఉల్లంఘించారని స్పష్టం చేసింది. ఐసీఐసీఐ బ్యాంక్ బుధవారం ఈ విషయాలు వెల్లడించింది. చందా కొచర్ ఇప్పటికే రాజీనామా చేసినప్పటికీ... నివేదిక నేపథ్యంలో ఆమెను విధుల నుంచి తొలగించినట్లుగా పరిగణిస్తామని పేర్కొంది. రాజీనామా కాస్తా ఉద్వాసనగా మారడంతో ఆమె పొందిన ఇంక్రిమెంట్లు, బోనస్‌లు, వైద్య చికిత్స పరమైన ప్రయోజనాలు, స్టాక్ ఆప్షన్స్ మొదలైనవి రద్దవుతాయని తెలిపింది. 2009 ఏప్రిల్ నుంచి 2018 మార్చి దాకా చందా కొచర్ పొందిన బోనస్‌లన్నీ కూడా వెనక్కి తీసుకుంటామని పేర్కొంది. వివాదం వెలుగు చూశాక చాన్నాళ్ల దాకా చందా కొచర్‌ను వెనకేసుకొచ్చిన బ్యాంక్... తాజాగా నివేదిక నేపథ్యంలో స్వరం మార్చడం గమనార్హం. ఈ వివాదంలో చందా కొచర్, ఆమె భర్త దీపక్ కొచర్ తదితరులపై సీబీఐ ఇప్పటికే ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. 'ఐసీఐసీఐ బ్యాంక్ నైతిక నియమావళి, విధుల నిర్వహణకు సంబంధించిన నిబంధనలను చందా కొచర్ ఉల్లంఘించారని విచారణ నివేదికలో వెల్లడైంది' అని ఐసీఐసీఐ బ్యాంక్ తెలిపింది. ఆమె అశ్రద్ధ వల్ల బ్యాంక్ విధానాలు నిర్వీర్యమయ్యాయని ఆక్షేపించింది.

ఆకాశం నుంచి అధఃపాతాళానికి..

దేశీ రిటైల్ బ్యాంకింగ్ స్వరూపాన్ని మార్చేసిన అత్యంత శక్తిమంతమైన మహిళగా కొన్నాళ్ల క్రితం దాకా సర్వత్రా ప్రశంసలు అందుకున్న చందా కొచర్ .. వీడియోకాన్ రుణ వివాదంతో అప్రతిష్ట పాలైన సంగతి తెలిసిందే. 2012లో వీడియోకాన్ గ్రూప్‌నకు ఐసీఐసీఐ బ్యాంక్ ఇచ్చిన రూ. 3,250 కోట్ల రుణాల విషయంలో అవకతవకలు జరిగాయని, ఈ లావాదేవీల ద్వారా చందా కొచర్ భర్త దీపక్ కొచర్, ఆమె కుటుంబ సభ్యులు లబ్ధి పొందారంటూ కొన్నాళ్ల క్రితం ప్రజావేగు ఒకరు బైటపెట్టడంతో ఈ కేసుపై అందరి దృష్టి మళ్లింది. బ్యాంకు నుంచి రుణం పొందిన వెంటనే వీడియోకాన్ గ్రూప్ అధినేత వేణుగోపాల్ ధూత్ .. దీపక్ కొచర్‌కు చెందిన న్యూపవర్ రెన్యూవబుల్స్ సంస్థలో కొంత మొత్తాన్ని ఇన్వెస్ట్ చేసినట్లు ఆరోపణలున్నాయి. వీడియోకాన్‌కు రుణాలు మంజూరు చేసిన కమిటీలో చందా కొచర్ కూడా ఉండటం అనుమానాలు రేకెత్తించింది. ఐసీఐసీఐ బ్యాంక్ యాజమాన్యం ముందుగా చందా కొచర్‌ను వెనకేసుకొచ్చినప్పటికీ.. వివాదం మరింత ముదరడంతో వెనక్కి తగ్గింది. 2018 జూన్ 6న సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బీఎన్ శ్రీకృష్ణ సారథ్యంలో సమగ్ర విచారణ కోసం స్వతంత్ర కమిటీ వేసింది. ఈ కమిటీ ఇచ్చిన నివేదికను బుధవారం జరిగిన బోర్డు సమావేశంలో పరిశీలించిన డైరెక్టర్లు తాజా నిర్ణయం తీసుకున్నారు. ఈ వివాదంపై విచారణ జరుపుతున్న సీబీఐ.. ఇటీవలే చందా కొచర్, దీపక్ కొచర్, వీడియోకాన్ గ్రూప్ ఎండీ వేణుగోపాల్ ధూత్ తదితరులపై క్రిమినల్ కుట్ర, మోసం అభియోగాలతో ఎఫ్ఐఆర్ నమోదు చేసింది.

షాకింగ్ నిర్ణయం

తనను విధుల నుంచి తొలగించినట్లుగా పరిగణించాలన్న బ్యాంక్ బోర్డు నిర్ణయంపై చందా కొచర్ విచారం వ్యక్తం చేశారు. ఇది తనను తీవ్ర నిరాశకు, షాక్‌కు గురిచేసిందన్నారు. బ్యాంకు మంజూరు చేసే రుణాలకు సంబంధించి తీసుకునే నిర్ణయాలేవీ ఏకపక్షంగా ఉండవని ఆమె స్పష్టం చేశారు. 'అంతిమంగా సత్యమే జయిస్తుందని నమ్ముతున్నాను. కఠిన నిర్ణయాలు తీసుకోవడంలో నేనెప్పుడూ వెనుకాడలేదు, ఒక ప్రొఫెషనల్‌గా ఎప్పుడూ నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించలేదు' అని చందా కొచర్ చెప్పారు.

లాభం 3% డౌన్

రూ. 1,605 కోట్లు • మొండిబాకీలకు పెరిగిన కేటాయింపులు

న్యూఢిల్లీ: మొండిబాకీలకు కేటాయింపులు పెరగడంతో ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఐసీఐసీఐ బ్యాంక్ నికర లాభం అక్టోబర్– డిసెంబర్ త్రైమాసికంలో 3 శాతం క్షీణించి రూ.1,605 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం ఇదే వ్యవధిలో లాభం రూ.1,650 కోట్లు. క్యూ3లో ఆదాయం రూ. 16,832 కోట్ల నుంచి రూ.20,163 కోట్లకు పెరిగింది. నికర వడ్డీ ఆదాయం 21 శాతం వృద్ధితో రూ. 5,705 కోట్ల నుంచి రూ.6,875 కోట్లకు పెరిగింది. ట్రెజరీ ఆదాయం కూడా రూ. 66 కోట్ల నుంచి ఏకంగా రూ.479 కోట్లకు ఎగియగా, నికర వడ్డీ మార్జిన్ 3.40 శాతంగా నమోదైంది. మొండి బాకీలు క్షీణించినప్పటికీ.. వాటికి సంబంధించిన కేటాయింపులు రూ. 3,570 కోట్ల నుంచి రూ. 4,244 కోట్లకు పెరిగాయి.

కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన చూస్తే లాభం 1.1 శాతం క్షీణించి రూ. 1,874 కోట్లుగా నమోదైంది. అనుబంధ సంస్థల పనితీరు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో పాటు అసెట్ క్వాలిటీ మెరుగుపడినా.. మొండిబాకీలకు మరింత ప్రొవిజనింగ్ చేయాలని బ్యాంక్ భావించడమే ఇందుకు కారణం. మొత్తం ప్రొవిజనింగ్ 18.89 శాతం పెరిగింది. ప్రొవిజనింగ్ కవరేజీ నిష్పత్తిని మెరుగుపర్చుకోవడం, గత మొండిబాకీల ప్రభావాన్ని తగ్గించుకోవడంపై ప్రధానంగా దృష్టి పెట్టినట్లు సంస్థ సీఈవో సందీప్ బక్షి తెలిపారు.



2.58 శాతానికి ఎన్‌పీఏలు..

మూడో త్రైమాసికంలో ఐసీఐసీఐ బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ) స్వల్పంగా 7.82% నుంచి 7.75%కి తగ్గాయి. అటు నికర ఎన్‌పీఏలు 4.20 శాతం నుంచి 2.58 శాతానికి దిగివచ్చాయి. విలువపరంగా చూస్తే మాత్రం స్థూల ఎన్‌పీఏలు రూ. 46,038 కోట్ల నుంచి రూ.51,591 కోట్లకు పెరగ్గా, నికర మొండిబాకీలు మాత్రం రూ.23,810 కోట్ల నుంచి రూ. 16,252 కోట్లకు తగ్గాయి. బుధవారం బీఎస్ఈలో ఐసీఐసీఐ బ్యాంక్ షేరు 5.29 శాతం ఎగిసి రూ. 365.25 వద్ద క్లోజయ్యింది. మార్కెట్లు ముగిశాక ఫలితాలు వెలువడ్డాయి.

ఐవోసీకి నిల్వల సెగ..

- క్యూ3లో లాభం 91 శాతం క్షీణత
- రూ. 717 కోట్లకు డౌన్

న్యూఢిల్లీ: చమురు రేట్లు క్షీణించడం, అధిక ధరలకు ఖరీదు చేసిన ఇంధన నిల్వల విలువ పడిపోవడం తదితర కారణాలు ప్రభుత్వ రంగ ఇండియన్ ఆయిల్ (ఐవోసీ) ఆర్థిక పనితీరుపై ప్రతికూల ప్రభావం చూపాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో సంస్థ లాభం ఏకంగా 91 శాతం క్షీణించి రూ. 717 కోట్లకు పడిపోయింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం ఇదే వ్యవధిలో లాభం రూ. 7,883 కోట్లు. మరోవైపు టర్నోవరు రూ. 1.32 లక్షల కోట్ల నుంచి రూ. 1.6 లక్షల కోట్లకు చేరింది. నాలుగేళ్ల గరిష్ట స్థాయి నుంచి చమురు ధరలు క్షీణించడంతో.. అప్పటికే నిల్వ చేసి పెట్టుకున్న ఇంధన విలువ గణనీయంగా పడిపోయిందని, ఇది ఆర్థిక ఫలితాలపై ప్రతికూల ప్రభావం చూపిందని ఐవోసీ పేర్కొంది. ఇక దేశీయంగా ఇంధన అమ్మకాలు 3 శాతం పెరిగి 21.5 మిలియన్ టన్నులకు చేరాయని వివరించింది. బుధవారం బీఎస్ఈలో ఐవోసీ షేరు 2 శాతం క్షీణించి రూ. 134.65 వద్ద క్లోజయ్యింది.



ప్రభుత్వం వైపు బ్యాంకింగ్ చూపు..

- అధిక నిధులపై పీఎస్‌బీల ఆశ
- బ్యాంకు ఖాతాలపై జీఎస్టీ హేతుబద్ధీకరణ
- దేశవ్యాప్తంగా ఒకే స్టాంప్ డ్యూటీ
- 80సీ కింద డిపాజిట్ కాల వ్యవధి తగ్గించాలి
- వడ్డీ ఆదాయంపై టీడీఎస్ మినహాయింపు రూ.30వేలకు...
- బడ్జెట్‌పై బ్యాంకింగ్ ఆకాంక్షలు

న్యూఢిల్లీ: దేశ ఆర్థిక వ్యవస్థలో కీలకమైన బ్యాంకింగ్ రంగం... వచ్చే బడ్జెట్‌పై భారీ ఆశలు కాకపోయినా కనీసం కొన్ని కీలకమైన చర్యలు అయినా ఉంటాయని ఆశిస్తోంది. భారీ ఎన్‌పీఏలు, ఎన్‌పీఏ కేసుల దివాలా పరిష్కార ప్రక్రియల్లో జాప్యం వంటి సమస్యలను ఈ రంగం ఎదుర్కొంటోంది. ముఖ్యంగా ఇన్‌ఫ్రా, స్టీల్ రంగాలకు ప్రభుత్వరంగ బ్యాంకులే (పీఎస్‌బీలు) ఎక్కువ రుణాలు ఇచ్చి ఉండటంతో వీటికి అధిక ఎన్‌పీఏల సమస్య ఉంది. అయితే, రుణాలకు డిమాండ్ పెరుగుతుండటం, అదే సమయంలో కొత్తగా మొండి బాకీలుగా మారేవి తగ్గడం కాస్తంత ఊరట. కనుక గడ్డు పరిస్థితుల నుంచి గట్టేందుకు ప్రభుత్వం నుంచి అధిక మూలధన నిధుల సాయాన్ని ప్రభుత్వరంగ బ్యాంకులు ఆశిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం రీక్యాపిటలైజేషన్ సాయం కింద ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి పీఎస్‌బీలకు రూ.2.11 లక్షల కోట్ల సాయాన్ని ప్రకటించింది. ఇందులో బ్యాంకులు తమ వంతుగా రూ.58,000 కోట్లను మార్కెట్ల నుంచి సమీకరించుకోవాల్సి ఉంది. ఒకవేళ ఇందులో లోటు ఏర్పడితే ప్రభుత్వం అదనపు సాయం చేయనుంది. తదుపరి ఆర్థిక సాయాన్ని మధ్యంతర బడ్జెట్లో ప్రభుత్వం ప్రకటిస్తుందని పీఎస్‌బీలు ఆశిస్తున్నాయి. మొండి బకాయిల సమస్యను ఎదుర్కొనే దిశగా ప్రభుత్వం పలు చర్యలను ప్రకటించొచ్చని పలువురు బ్యాంకర్లు అంచనా వేస్తున్నారు కూడా. ఐఎల్ఎఫ్ఎస్ సంక్షోభం అనంతరం ఎన్‌బీఎఫ్‌సీ రంగంలో ఏర్పడిన లిక్విడిటీ పరిస్థితులు ఇంకా పూర్తిగా సర్దుకోకపోవడంతో ఈ దిశగా చర్యలను కూడా ఆశిస్తున్నారు.



బ్యాంకింగ్ రంగం కోర్కెలు ఇవీ..

- బ్యాంకు ఖాతాలపై జీఎస్టీని హేతుబద్ధీకరించాలి. రుణాలు, డాక్యుమెంట్లకు సంబంధించి దేశవ్యాప్తంగా ఒకటే స్టాంప్ డ్యూటీని అమలు చేయాలి.
- బ్యాంకుల్లో రూ.లక్ష డిపాజిట్‌పై ప్రస్తుతం ఇన్సూరెన్స్ కవరేజీ ఉండగా, దీన్ని 5 లక్షలకు పెంచాలి.
- గ్రామీణ ప్రాంతాల్లో ఏటీఎంల ఏర్పాటుపై సబ్సిడీలు కల్పించాలి.
- సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపునిస్తున్న ఫిక్స్‌డ్ డిపాజిట్‌కు ఐదేళ్ల లాకిన్ ప్రస్తుతం ఉండగా, ఈ కాల వ్యవధిని తగ్గించాలి.
- ఒక ఆర్థిక సంవత్సరంలో డిపాజిట్లపై వడ్డీ ఆదాయం రూ.10,000 మించితే మూలం వద్దే పన్ను మినహాయించి బ్యాంకులు ఆదాయపన్ను శాఖకు జమ చేస్తున్నాయి. ఈ పరిమితిని రూ.30,000కు పెంచాలి.
- ఇన్‌ఫ్రా రంగానికి రుణాలిచ్చేందుకు గాను పన్ను రహిత బాండ్ల ద్వారా నిధుల సమీకరణకు బ్యాంకులకు కూడా అవకాశం కల్పించాలి.
- కార్పొరేట్ వ్యవహారాల శాఖ పరిధిలోని అన్ని కార్పొరేట్లకు, పీఎస్‌యూలు, ఎన్‌హెచ్ఏఐ, డిస్కమ్‌లకు 'ట్రేడ్ రిసీవబుల్స్ డిస్కౌంటింగ్ సిస్టమ్(టీఆర్ఈడీఎస్)'ను తప్పనిసరి చేయాలి. మూలధన నిధుల కొనసాగింపునకు ఇది అవసరం. ఇది లేకే ఎన్‌పీఏల సమస్య పెరుగుతోంది.



ఎస్ఎంఈల డిమాండ్లు



- ఎస్ఎంఈలకు రుణ లభ్యతను పెంచడంతో పాటు ప్రోత్సాహం అవసరం.
- భారత్‌మాలా తరహా మరిన్ని ప్రాజెక్టులను రవాణా రంగానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం ప్రకటించాలి.
- రిటైల్ రంగానికి సంబంధించి జాతీయ విధానం తీసుకురావాలి. సంస్కరణలతో వినియోగం పెరుగుతుంది. రిటైల్‌కు పరిశ్రమ హోదా కల్పించాలి.
- గ్రామీణ రంగానికి, సాగుకు ఎక్కువ నిధుల కేటాయింపులు చేయాలి.
- భారత్ స్టేజ్–6 కాలుష్య విడుదల ప్రమాణాలకు మళ్లాల్సి ఉండడంతో ఆటోమొబైల్ వాహనాలపై జీఎస్టీ రేట్లు తగ్గించాలి. దీనివల్ల ఆటోమొబైల్‌పై ఆధారపడిన విడిభాగాల పరిశ్రమకూ చేయూత లభిస్తుంది.
- మెటల్స్, మైనింగ్‌లో దేశీయ కంపెనీలకు ప్రోత్సాహం ఉండాలి.
- లాజిస్టిక్స్ పార్కులను ఏర్పాటు చేయాలి.
- పర్యావరణ పరిరక్షణ, టెక్నాలజీ అప్‌గ్రేడేషన్ కోసం దిగుమతి చేసుకునే క్యాపిటల్ గూడ్స్‌పై పన్నును పూర్తిగా ఎత్తివేయాలి.
- టెక్నాలజీలను అందిపుచ్చుకునేందుకు ప్రభుత్వం నుంచి విధానపరమైన సహకారం కావాలి. తమ వ్యాపార అస్తిత్వానికి, వృద్ధికి టెక్నాలజీ ఎంతో అవసరమని అధిక శాతం ఎస్ఎంఈలు అభిప్రాయపడుతున్నాయి.

ప్రత్యేక కంపెనీగా పోస్టల్ ఇన్సూరెన్స్: సిన్హా



న్యూఢిల్లీ: పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ విభాగాన్ని ప్రత్యేక కంపెనీగా ఏర్పాటు చేయాలని పోస్టల్ శాఖ భావిస్తోంది. పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ కార్యకలాపాలను ఒక ప్రత్యేక వ్యాపార విభాగంగా (సెపరేట్ బిజినెస్ యూనిట్) ఏర్పాటు చేయాలని యోచిస్తోంది. ఈ మేరకు కేబినెట్ నోట్‌ను పంపామని సమాచార శాఖ మంత్రి మనోజ్ సిన్హా చెప్పారు. రెండు వారాల్లో ఈ నోట్‌ను కేబినెట్ ఆమోదించే అవకాశాలు ఉన్నట్లు తెలియజేశారు. మొదటి దశలో ఎస్‌బీయూను, రెండో దశలో పూర్తి స్థాయి బీమా కంపెనీని ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ (ఐపీపీబీ)రెండో వార్షికోత్సవాల సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ విషయాలు వెల్లడించారు. ఇటీవల ఐపీపీబీ 1.26 లక్షల యాక్సెస్ పాయింట్లను ఏర్పాటు చేసిందని, 10 రోజుల్లో మరో పదివేల యాక్సెస్ పాయింట్లను ఏర్పాటు చేయనున్నదని వివరించారు.

బజాజ్ ఆటో లాభం 20% అప్

న్యూఢిల్లీ: అమ్మకాల్లో వృద్ధితో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో బజాజ్ ఆటో నికర లాభం 20 శాతం పెరిగి రూ. 1,221 కోట్లకు చేరింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే వ్యవధిలో సంస్థ నికర లాభం రూ. 1,014 కోట్లు. ఇక తాజా క్యూ3లో మొత్తం ఆదాయం 19% వృద్ధి చెంది రూ. 6,595 కోట్ల నుంచి రూ. 7,879 కోట్లకు చేరింది. వాహన విక్రయాలు 26 శాతం వృద్ధితో 10.01 లక్షల నుంచి 12.60 లక్షల యూనిట్లకు చేరాయి. దేశీయంగా మోటార్ సైకిల్స్ అమ్మకాలు 4,66,431 నుంచి 6,44,093 యూనిట్లకు పెరిగాయి. బుధవారం బజాజ్ ఆటో షేరు బీఎస్ఈలో 2.65 శాతం క్షీణించి రూ. 2,499 వద్ద క్లోజయ్యింది.



తనఖా.. తడాఖా!



(సాక్షి, బిజినెస్ విభాగం)

- భారీగా షేర్లను కుదువ పెడుతున్న ప్రమోటర్లు
- జీ షేర్ల పతనంతో ఉలిక్కిపడ్డ మార్కెట్
- రుణదాతల విక్రయంతో షేర్లు మరింత పతనం
- ప్రమోటర్ల తనఖా షేర్లు పెరిగితే ప్రమాదమే!
- దూరంగా ఉంటేనే మేలంటున్న నిపుణులు

ప్రమోటర్లు తమ వాటాలను తనఖా పెట్టి... వాటిపై భారీగా రుణాలు తీసుకుని... ఆ రుణాలను వేరేచోట పెట్టుబడులుగా పెట్టడం ఇపుడు కొత్త సమస్యలకు దారితీస్తోంది. జీ ఎంటర్‌టైన్‌మెంట్ లిమిటెడ్ షేర్ల ఉదంతంతో ఇలాంటి కంపెనీలపై ఇన్వెస్టర్లు ఫోకస్ చేయాల్సిన అవసరం మళ్లీ తెరపైకి వచ్చింది. జీ షేర్ల పతనాన్ని అడ్డుకోవడంలో ప్రమోటర్ కంపెనీ ఎస్సెల్ గ్రూప్ విఫలం కావడంతో... 3 రోజుల క్రితం వాటిని తనఖా ఉంచుకున్న ఫైనాన్షియల్ సంస్థలు కొన్ని మార్కెట్లో విక్రయిచేశాయి. ఫలితంగా ఒకేరోజు ఈ షేరు 30 శాతానికి పైగా పతనమైంది. తరవాత కొంత కోలుకున్నా... మొత్తంగా జీ ఎంటర్‌టైన్మెంట్ షేర్ ఈ నెలలో 20 శాతానికి పైగా పతనమైంది. ఈ నేపథ్యంలో షేర్ల తనఖా వ్యవహారమేంటి? ప్రమోటర్లు షేర్లను ఎందుకు తనఖా పెడతారు? తనఖా షేర్లను ఆర్థిక సంస్థలు విక్రయించవచ్చా? ఇలాంటి సంస్థల షేర్లను ఇన్వెస్టర్లు కొనుగోలు చేయవచ్చా ? ఈ అంశాలపై సాక్షి బిజినెస్ ప్రత్యేక కథనమిది...

షేర్ల తనఖా అంటే....

లిస్టెడ్ కంపెనీలైనా, అన్‌లిస్టెడ్ కంపెనీలైనా ప్రతి కంపెనీలో ప్రమోటరుకు కొంత వాటా ఉంటుంది. ఈ వాటాగా ఉండే షేర్లను ప్రమోటర్లు తనఖా పెట్టి రుణం తీసుకుంటారు. ప్రమోటర్లు నిధులు సమీకరించే విధానాల్లో ఈ తనఖా ఒకటి. కంపెనీ అవసరాల కోసమో, తమ వ్యక్తిగత అవసరాల కోసమో, లేదంటే కంపెనీ విస్తరణ కోసమో.. ప్రమోటర్లు ఈ రుణాలు తీసుకుంటారు. లిస్టెడ్ కంపెనీలైతే మార్కెట్ ధరకన్నా తక్కువే ఆర్థిక సంస్థలు రుణంగా మంజూరు చేస్తాయి. ఈ సందర్భంగా ప్రమోటరుకు– సదరు ఆర్థిక సంస్థకు మధ్య కుదిరే ఒప్పందంలో... ఒక కటాఫ్ ధరను నిర్ణయించుకుంటారు. ఒకవేళ ఈ షేరు గనక మార్కెట్లో నిర్దేశిత ధరకన్నా తక్కువకు పతనమైతే... రుణంగా ఇచ్చిన మొత్తాన్ని రాబట్టుకోవటానికి ఆర్థిక సంస్థలు షేర్లను మార్కెట్లో విక్రయించవచ్చనేది ఒప్పందంలోనే ఉంటుంది.

ఇదే సందర్భంలో ఆర్థిక సంస్థలు గనక ఆ షేర్లను మార్కెట్లో అమ్మకుండా ఉండాలంటే... తీసుకున్న రుణానికి సరిపోయేలా మరిన్ని షేర్లు తనఖా పెట్టాలని (మార్జిన్ కాల్) ప్రమోటర్‌ను సదరు ఆర్థిక సంస్థ అడుగుతుంది. ఒకవేళ షేర్లు కాకున్నా అప్పటికప్పుడు కొంత మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుంది. ఈ విషయంలో ప్రమోటర్ విఫలమైనా, ఈ రుణాలను ప్రమోటర్ చెల్లించలేకపోయినా, తనఖా షేర్లను విక్రయించుకునే హక్కు రుణదాతలకు ఉంటుంది. ఇలా రుణదాతలు ఓపెన్ మార్కెట్లో షేర్లను తెగనమ్మితే షేర్ ధర మరింతగా పతనమవుతుంది. ఒక్కోసారి షేర్ల తనఖా కారణంగా ప్రమోటర్ల వాటా కరిగిపోయి కంపెనీలు చేతులు మారే పరిస్థితులూ రావచ్చు.

పెరుగుతున్న షేర్ల తనఖా...

బీఎస్ఈలో లిస్టయిన 195 కంపెనీల ప్రమోటర్లు తమ వాటాలో దాదాపు సగానికి పైగా షేర్లను తనఖా పెట్టారని ప్రైమ్ డేటాబేస్ వెల్లడించింది. గతేడాది ఒక్క డిసెంబర్ క్వార్టర్‌లోనే తనఖా పెట్టిన షేర్ల విలువ రూ.2.50 లక్షల కోట్లకు పెరిగింది. ఇది బీఎస్ఈలో లిస్టైన మొత్తం కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్‌లో రెండు శాతం. నిఫ్టీ 50 కంపెనీల్లో అధికంగా తనఖా పెట్టిన షేర్ల కంపెనీల జాబితాలో జీ ఎంటర్‌టైన్మెంట్ ఉంది. ప్రమోటర్లు తమకున్న వాటాలో దాదాపు సగానికి పైగా (59.40 శాతం) షేర్లను తనఖా పెట్టారు.

ప్రమోటర్లు తమ వాటాలో దాదాపు 80% వాటా షేర్లను తనఖా పెట్టి రుణాలు తీసుకున్న కంపెనీలు కూడా ఉన్నాయి. వీటిలో స్టెరిలైట్ టెక్నాలజీస్, రిలయన్స్ పవర్, జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ, కాఫీ డే ఎంటర్‌ప్రైజెస్, డిష్ టీవీ, రిలయన్స్ క్యాపిటల్, ఫ్యూచర్ కన్సూమర్, ఇండియాబుల్స్ రియల్ ఎస్టేట్, మ్యాక్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్‌లు... ఈ కంపెనీ ప్రమోటర్లు తమ తమ వాటాల్లో 80 శాతానికి పైగా షేర్లను తనఖా పెట్టారని అంచనా. ఇలా అధిక భాగం తనఖాలో ఉన్న ప్రమోటర్ల కంపెనీల షేర్లు గత ఏడాది దాదాపు 80 శాతం వరకూ పతనమయ్యాయంటే తనఖా షేర్ల తీరుకు నిదర్శనం. ఈ జాబితాలో అట్లాంటా, పార్శ్వనాథ్ డెవలపర్స్, డీబీ రియల్టీ, ఓమాక్సీ, కాఫీడే ఎంటర్‌ప్రైజెస్ వంటి కంపెనీల షేర్లున్నాయి.

తనఖా షేర్లు కొనచ్చా?

సాధారణంగా ఫండమెంటల్స్ పటిష్టంగా ఉన్న కంపెనీల షేర్లనే కొనుగోలు చేయాలని విశ్లేషకులు సూచిస్తుంటారు. ప్రమోటర్ల షేర్లలో అధిక భాగం తనఖాలో ఉంటే ఇలాంటి కంపెనీల షేర్లకు దూరంగా ఉంటేనే మేలన్నది నిపుణుల సూచన. అయితే కంపెనీ భవిష్యత్తు అంచనాలు బాగా ఉంటే, షేర్ల తనఖా నిధులతో విస్తరణ చేపడితే అది మంచి అవకాశమేనని వారంటున్నారు. ప్రమోటర్ల షేర్ల తనఖా అంతకంతకూ పెరిగిపోతుంటే కంపెనీ ఫండమెంటల్స్‌పై సందేహాలు రావడం సహజం. 10 శాతం వరకూ షేర్లను తనఖా పెడితే ఆందోళన చెందాల్సిన పనిలేదని నిపుణులు అంటున్నారు. అయితే క్వార్టర్ క్వార్టర్‌కు షేర్ల తనఖా పెరిగిపోతే మాత్రం ఆందోళనకరమేనన్నది వారి అభిప్రాయం. మార్కెట్ పతన బాటలో ఉన్నప్పుడు షేర్ల తనఖా వార్తలు సెంటిమెంట్‌ను మరింత బలహీనపరుస్తాయనేది బ్రోకరేజ్ సంస్థల మాట!!

తనఖాలో టాప్...జీఎంఆర్, అపోలో

రాష్ట్రానికి చెందిన మౌలిక సదుపాయాల కంపెనీ జీఎంఆర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఆసుపత్రులు నిర్వహించే అపోలో తనఖా విషయంలో టాప్‌లో ఉన్నాయి. జీఎంఆర్ ఇన్‌ఫ్రాలో ప్రమోటర్లకు దాదాపు 63 శాతం వాటా ఉంది. కాకపోతే ఈ వాటాలో ఏకంగా 83 శాతం వరకూ తనఖాలోనే ఉంది. ప్రస్తుతం జీఎంఆర్ షేరు ధర రూ.15.50గా ఉండగా... కంపెనీ మార్కెట్ విలువ 9,300 కోట్ల వరకూ ఉంది. ఒకదశలో రూ.126 వరకూ వెళ్లిన ఈ షేరు ప్రస్తుతం రూ.15.50కి చేరింది. భారీ రుణ భారంలో కూరుకుపోయిన ఈ కంపెనీ షేరు ధర పతనమవుతున్న కొద్దీ.. ప్రమోటర్లు మరిన్ని షేర్లను తనఖా పెడుతూ వస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. అలాగే రాష్ట్రానికి చెందిన హెల్త్‌కేర్ సంస్థ అపోలో హాస్పిటల్స్‌కు సంబంధించి ప్రమోటర్ల దగ్గర 34 శాతం వాటా ఉండగా... దాన్లో 74 శాతాన్ని తనఖా పెట్టినట్లు ప్రైమ్ డేటాబేస్ వెల్లడించింది.

భారీగా తనఖాలో ఉన్న కంపెనీలు

కంపెనీ పేరు	మొత్తం ప్రమోటర్ల వాటా	తనఖాలో ఉన్న ప్రమోటర్ల వాటా
జీ ఎంటర్‌టైన్‌మెంట్	42	49
సీజీ పవర్	34	100
స్టెరిలైట్ టెక్నాలజీస్	54	96
గాయత్రి ప్రాజెక్ట్స్	45	94
రిలయన్స్ ఇన్‌ఫ్రా	49	83
రిలయన్స్ పవర్	75	85
రిలయన్స్ క్యాపిటల్	52	74
రిలయన్స్ కమ్యూనికేషన్స్	53	30
జీఎమ్ఆర్ ఇన్‌ఫ్రా	63	83
డిష్ టీవీ ఇండియా	61	82
మ్యాక్స్ ఫైనాన్షియల్	28	81
కాఫీ డే ఎంటర్‌ప్రైజెస్	54	80
అపోలో హాస్పిటల్స్	34	74
ఇండియాబుల్స్ రియల్‌ఎస్టేట్	39	61
ఫ్యూచర్ కన్సూమర్	46	60
ఫ్యూచర్ రిటైల్	47	47
ఇండియా సిమెంట్స్	28	46
అదానీ పోర్ట్స్ అండ్ సెజ్	62	45
అదానీ పవర్	75	29
జైన్ ఇరిగేషన్	29	45
జేఎస్‌డబ్ల్యూ స్టీల్	43	44
ఎన్‌సీసీ	18	43

(ఇవి వివిధ సంస్థల అంచనాలు...శాతాల్లో...)

హైదరాబాద్‌లో ఫాక్స్‌కాన్ ఏఐ ఆర్‌అండ్‌డీ సెంటర్

తైవాన్‌కు చెందిన ఫాక్స్‌కాన్ టెక్నాలజీ గ్రూప్ అనుబంధ సంస్థ ఫాక్స్‌కాన్ ఇండస్ట్రియల్ ఇంటర్నెట్.. హైదరాబాద్‌లో అడ్వాన్స్‌డ్ ఇండస్ట్రియల్ ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్సీ పరిశోధన మరియు అభివృద్ధి (ఏఐ–ఆర్‌అండ్‌డీ) కేంద్రాన్ని ఏర్పాటు చేస్తోంది. ఈ మేరకు తెలంగాణ ఐటీ అండ్ ఈసీ విభాగంతో ఒప్పందం చేసుకుంది. ఈ కేంద్రం ద్వారా ఫాక్స్‌కాన్ గ్రూప్‌కు స్మార్ట్ మ్యానుఫాక్చరింగ్ సొల్యూషన్స్ సేవలందిస్తుందని కంపెనీ ప్రకటన తెలిపింది.

ఎస్‌ఎంఈలకు టాటా టెలి సరికొత్త సేవలు

చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎస్‌ఎంఈ) కోసం టాటా టెలి బిజినెస్ సరికొత్త సేవలను ప్రారంభించింది. ఆయా సంస్థల సెక్యూరిటీ, ప్రైవసీ సామర్థ్యాన్ని పెంచేందుకు స్మార్ట్ వర్చువల్ ప్రైవేట్ నెట్‌వర్క్ (వీపీఎన్) సొల్యూషన్స్ సేవలను అందుబాటు లోకి తీసుకొచ్చినట్లు కంపెనీ ప్రకటన పేర్కొంది.

డీఐపీపీ... పేరు మారింది

పారిశ్రామిక విధానం, ప్రోత్సాహక విభాగం (డీఐపీపీ–డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండస్ట్రియల్ పాలసీ అండ్ ప్రమోషన్) పేరును కేంద్రం మార్చింది. ఇక నుంచి ఈ విభాగాన్ని పారిశ్రామిక, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగంగా (డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్–డీపీఐఐటీ) వ్యవహరిస్తారు. అంతర్గత వాణిజ్యానికి ప్రత్యేక మంత్రిత్వ శాఖ అవసరమన్న వ్యాపారుల సమాఖ్య సీఏఐటీ (కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్) డిమాండ్ నేపథ్యంలో ఈ మార్పు జరిగింది.

కార్పొ బ్రీఫ్స్...

• హోటల్ బుకింగ్స్ వ్యాపారంలోకి పేటీఎం

వ్యాపార విస్తరణలో భాగంగా రూ.500 కోట్లను వెచ్చించనున్నట్లు పేటీఎం ప్రకటించింది. ట్రావెల్ ఆపరేషన్స్ నిమిత్తం ఈ మొత్తాన్ని వినియోగించనున్నట్లు తెలిపింది. తమ ప్లాట్ ఫాంపై హోటల్ బుకింగ్స్ సేవలను ప్రారంభించినట్లు తెలిపింది. నైట్‌స్టే సంస్థను సొంతం చేసుకున్నట్లు వెల్లడించింది.

• ఎయిర్‌టెల్ ఆఫ్రికాకు భారీ నిధులు

ఖతార్ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ నుంచి 200మిలియన్ డాలర్ల పెట్టుబడిని పొందినట్లు ఎయిర్‌టెల్ ఆఫ్రికా ప్రకటించింది. ఈక్విటీ ఇష్యూ ద్వారా ఈ మొత్తాన్ని పొందగా.. రుణాల చెల్లింపునకు దీనిని వినియోగించనున్నట్లు తెలిపింది.

• ఆయిల్ ఇండియా బాండ్ల జారీ

విదేశీ బాండ్ల జారీ ప్రక్రియ ద్వారా 550 మిలియన్ డాలర్ల రుణాన్ని పొందినట్లు ఆయిల్ ఇండియా వెల్లడించింది. 10–ఏళ్ల కాలపరిమితి కలిగిన ఈ బాండ్లపై 5.12 శాతం ఫిక్సిడ్ వడ్డీని చెల్లించనున్నట్లు తెలియజేసింది. మధ్య ప్రాచ్యం, యూరప్, ఆసియాల్లో ఈ బాండ్లను జారీ చేయగా.. 4.5 శాతం ఓవర్‌సబ్‌స్క్రైబ్ అయినట్లు వివరించింది.

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (24 క్యారెట్లు)	34,110	▲ 360
బంగారం (22 క్యారెట్లు)	32,490	▲ 350
వెండి (కిలో)	43,800	▲ 200
చెన్నై		
బంగారం (24 క్యారెట్లు)	33,190	▲ 170
బంగారం (22 క్యారెట్లు)	31,610	▲ 160
వెండి (కిలో)	43,800	▲ 200
హైదరాబాద్		
బంగారం (24 క్యారెట్లు)	33,190	▲ 170
బంగారం (22 క్యారెట్లు)	31,610	
వెండి (కిలో)	43,800	
ప్రొద్దుటూరు		
బంగారం (24 క్యారెట్లు)	33,650	▲ 150
బంగారం (22 క్యారెట్లు)	31,210	▲ 240
వెండి (కిలో)	41,400	▲ 600
విశాఖపట్నం		
బంగారం (24 క్యారెట్లు)	34,060	▲ 260
బంగారం (22 క్యారెట్లు)	31,680	▲ 230
వెండి (కిలో)	41,000	--
విజయవాడ		
బంగారం(24 క్యారెట్లు)	34,150	
బంగారం (22 క్యారెట్లు)	31,300	
వెండి (కిలో)	41,300	
ఏపీ బులియన్ అసోసియేషన్		
బంగారం (24 క్యారెట్లు)	34,140	▲ 160
బంగారం (22 క్యారెట్లు)	31,610	▲ 280
వెండి (కిలో)	41,300	▲ 100

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	54.72 (రాత్రి 11.30కు)	$53.31 (మంగళవారం ముగింపు)
బ్రెంట్	62.24 (రాత్రి 11.30కు)	$61.20 (మంగళవారం ముగింపు)

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్/100కు రూ.లలో) 31-01-2019

విశాఖ	395-00
చిత్తూరు	423-00
వరంగల్	397-00
చెన్నై	430-00
ముంబై	450-00
విజయవాడ	395-00
నమక్కల్	420-00
గోదావరి	395-00
30-01-2019 ఫామ్ ధర...	
హైదరాబాద్	395-00
రిటైల్ (ఒక గుడ్డుకు)	4.55
బెంగళూరు	425-00
కోల్‌కత్త	430-00
ఢిల్లీ	417-00

బడ్జెట్ ముందు ఇన్వెస్టర్ల అప్రమత్తత

సూచీలు అక్కడక్కడే..

గురు, శుక్రవారాల్లో ఎఫ్‌అండ్‌ఓ ఎక్స్‌పైరీ, అమెరికా ఫెడ్ రేట్లపై నిర్ణయం, కేంద్రం మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టనుండటం తదితర అంశాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. కొత్త పొజిషన్లకు దూరంగా ఉంటున్నారు. దీంతో కీలకమైన సెన్సెక్స్, నిఫ్టీ సూచీలు బుధవారం పెద్దగా మార్పులు లేకుండా ముగిశాయి. సెన్సెక్స్ స్వల్పంగా 1.25 పాయింట్లు నష్టపోయి 35,591.25 వద్ద, నిఫ్టీ 0.40 పాయింట్లు నష్టపోయి 10,651.80 వద్ద క్లోజయ్యాయి. దాదాపు అయిదు శాతం పైగా ఎగిసిన ఐసీఐసీఐ బ్యాంక్, టాటా స్టీల్ వంటి దిగ్గజాలు.. సూచీలు భారీగా పడిపోకుండా కాస్త అడ్డుకట్ట వేశాయి. 'అమెరికా–చైనా వాణిజ్య యుద్ధ భయాలు, ఫెడ్ సమావేశం, బడ్జెట్ వంటి అంశాలన్నీ దృష్టిలో ఉంచుకుని ఇన్వెస్టర్లు జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు' అని విశ్లేషకులు తెలిపారు. బడ్జెట్ ప్రతిపాదనల ప్రకారం ఏయే రంగాలకు ఊతం లభించనుంది, ప్రభుత్వం నిధులెలా సమకూర్చుకుంటుంది తదితర అంశాలన్నింటిపైనా ఇన్వెస్టర్లు ఆసక్తిగా ఉంటారని పేర్కొన్నారు.



మెటల్, బ్యాంకింగ్ స్టాక్స్ ర్యాలీ...

బుధవారం 200 పాయింట్ల లాభంతో ప్రారంభమైన సెన్సెక్స్ 359 పాయింట్ల శ్రేణిలో తిరుగాడింది. రంగాలవారీగా చూస్తే మెటల్, బ్యాంకింగ్ స్టాక్స్ పెరగ్గా.. ఎఫ్‌ఎంసీజీ, రియల్టీ స్టాక్స్‌లో అమ్మకాలు జరిగాయి. స్మాల్‌క్యాప్ సూచీ 0.78 శాతం, మిడ్‌క్యాప్ సూచీ 0.22 శాతం పెరిగాయి. ఆర్థిక ఫలితాల నేపథ్యంలో ఐసీఐసీఐ బ్యాంక్ అత్యధికంగా 6.05 శాతం పెరగ్గా, ఆగ్నేయాసియా వ్యాపార విక్రయంతో రుణభారం తగ్గుతుందన్న వార్తలతో టాటా స్టీల్ 5.14 శాతం పెరిగాయి.

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	16,129
ఎన్‌ఎస్‌ఈ	34,975
ఎన్‌ఎస్‌ఈ (డెరివేటివ్స్)	11,19,139
ఎఫ్‌ఐఐ	130
డీఐఐ	502

యాక్సిస్ జూమ్: మెరుగైన ఆర్థిక ఫలితాల నేపథ్యంలో యాక్సిస్ బ్యాంక్ షేరు 4.56% పెరిగింది. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ. 7,745 కోట్లు ఎగిసి రూ. 1,77,563 కోట్లకు చేరింది. బీఎస్‌ఈలో సుమారు 18 లక్షలు, ఎన్‌ఎస్‌ఈలో 4 కోట్ల షేర్లు చేతులు మారాయి. ఇక హెచ్‌సీఎల్ టెక్, బజాజ్ ఫైనాన్స్, ఎస్‌బీఐ, ఎల్‌అండ్‌టీ, వేదాంత మొదలైనవి సుమారు మూడు శాతం దాకా పెరిగాయి. అటు బజాజ్ ఆటో, కోటక్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ, యస్ బ్యాంక్ మొదలైనవి 2.64 శాతం మేర క్షీణించాయి.

రీట్స్, ఇన్విట్స్‌పై సెబీ సంప్రతింపుల పత్రం

వీటిని మరింత ఆకర్షణీయం చేసేందుకు యత్నాలు



రీట్స్, ఇన్విట్స్‌కు సంబంధించి నిబంధనలను మరింత సరళీకరించాలని మార్కెట్ నియంత్రణ సంస్థ, సెబీ యోచిస్తోంది. నిధుల సమీకరణ విషయంలో వీటిని జారీచేసే సంస్థలకు మరింత వెసులుబాటును ఇవ్వడమే కాకుండా, వీటిల్లో ఇన్వెస్ట్ చేయడానికి ఇక ఇన్వెస్టర్లను ఆకర్షించడానికి గాను నిబంధనలను మరింతగా సడలించాలని సెబీ ఆలోచిస్తోంది. దీని కోసం ఒక సంప్రదింపుల పత్రాన్ని విడుదల చేసింది. వచ్చే నెల 18 వరకూ ఈ పత్రంపై అభిప్రాయాలు సేకరిస్తారు. తదనంతరం తుది నిబంధనలను విడుదల చేస్తారు. 2014లో రీట్స్, ఇన్విట్స్‌కు అనుమతి ఇచ్చినప్పటికీ, ఇప్పటివరకూ మూడు ఇన్విట్స్ మాత్రమే లిస్ట్ కాగా, ఒక రీట్ ఐపీఓకు సిద్ధమవుతోంది.

నిఫ్టీ 50

టాప్ 10 గెయినర్స్ (రూపాయిల్లో)

Symbol	LTP	(%)Change
ICICIBANK	368.4	6.21
TATASTEEL	468.7	5.61
AXISBANK	691	4.58
HINDALCO	205.35	2.91
HCLTECH	1,016.20	2.81
ZEEL	387.15	2.58
SBIN	287.35	2.41
BAJFINANCE	2,575.00	2.36
UPL	770	1.28
LT	1,291.10	1.02

టాప్ 10 లూజర్స్ (రూపాయిల్లో)

Symbol	LTP	(%)Change
IBULHSGFIN	665	-4.81
ADANIPORTS	338	-3.22
BAJAJ-AUTO	2,492.00	-2.95
KOTAKBANK	1,219.00	-2.59
INFRATEL	289.95	-2.49
IOC	134.1	-2.37
HDFC	1,878.90	-2.26
HINDPETRO	230.5	-2.04
TECHM	717.2	-1.95
YESBANK	199.35	-1.75

నేటి బోర్డు సమావేశాలు

హీరో మోటోకార్ప్, భారతీ ఎయిర్‌టెల్, వేదాంత, ఎన్‌ఎమ్‌డీసీ, పవర్ గ్రిడ్, పెట్రోనెట్ ఎల్‌ఎన్‌జీ, డాబర్ ఇండియా, దేనా బ్యాంక్, ఇమామి, ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్, వి–గార్డ్ ఇండస్ట్రీస్, అపోలో మైక్రో సిస్టమ్స్, చంబల్ ఫర్టిలైజర్స్, ఈఐహెచ్ అసోసియేట్ హోటల్స్, హిందుస్తాన్ బయో, లారస్ ల్యాబ్స్, సుందరమ్ ఫైనాన్స్

సేవల విస్తృతిపై అపోలో ఫోకస్

జాయింట్ ఎండీ సంగీత రెడ్డి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఆసుపత్రుల విస్తరణ కంటే సేవల విస్తృతిపైనే ఈ ఏడాది ఎక్కువగా ఫోకస్ చేస్తామని అపోలో హాస్పిటల్స్ గ్రూప్ జాయింట్ ఎండీ సంగీత రెడ్డి తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో ఫిక్కీ సమావేశంలో పాల్గొన్న ఆమె 'సాక్షి' బిజినెస్ బ్యూరో ప్రతినిధితో ప్రత్యేకంగా మాట్లాడారు. 'ఆసుపత్రుల పరంగా దేశంలో మేమే నంబర్ వన్ స్థానంలో ఉన్నాం. అవసరమైన చోట హాస్పిటల్, ఫార్మసీల ఏర్పాటు ప్రక్రియ సహజంగా జరుగుతుంది. దానికంటే ముఖ్యంగా ఇప్పుడున్న మొత్తం ఆసుపత్రుల్లో అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులోకి తేవటంపై దృష్టి సారిస్తాం. హెల్త్ చెకప్స్‌ను ప్రమోట్ చేయడం, జన్యు ఔషధాలు, రోగుల ఇంటెస్టిన్ (ప్రేగు) అధ్యయనం ప్రధానాంశాలుగా చేసుకున్నాం. ఒక అడుగు ముందుకేసి వైద్య సేవల రంగాన్ని నిర్వచిస్తాం. చెన్నైలో అపోలో ప్రోటాన్ క్యాన్సర్ సెంటర్‌ను 150 పడకల సామర్థ్యంతో నెలకొల్పాం. దక్షిణాసియాలో ఇది తొలి ప్రోటాన్ థెరపీ సెంటర్. క్యాన్సర్ చికిత్సలో అత్యాధునిక పెన్సిల్ బీమ్ టెక్నాలజీని వాడుతున్నాం. లక్నోలో 250 పడకలతో ఏర్పాటవుతున్న ఆసుపత్రి రెండు నెలల్లో ప్రారంభం కానుంది' అని సంగీత రెడ్డి వెల్లడించారు.



ఫిక్కీ సదస్సులో... తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్, ఫిక్కీ ప్రెసిడెంట్ సోమ్నాయ్, ఆర్‌బీఐ మాజీ గవర్నర్ వైవీ రెడ్డి, అపోలో హాస్పిటల్స్ గ్రూప్ జాయింట్ ఎండీ సంగీత రెడ్డి (ఎడమ నుంచి)

తెలంగాణలో లాజిస్టిక్స్ పార్కులు

తెలంగాణలో మరో రెండు లాజిస్టిక్స్ పార్కులు ఏర్పాటు కానున్నాయి. అదానీ గ్రూప్, టెక్స్‌టైల్ రంగ సంస్థ వెల్‌స్పన్ గ్రూప్ వీటిని ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చినట్లు తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్ వెల్లడించారు. బుధవారమిక్కడ జరిగిన ఫిక్కీ నేషనల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ మీటింగ్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ఈ విషయం చెప్పారు. 'తెలంగాణకు గడిచిన నాలుగున్నరేళ్లలో సుమారు రూ.1.5 లక్షల కోట్ల విలువైన పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చాయి. వీటిలో 60 శాతం కార్యరూపం దాల్చాయి. రానున్న కాలంలో ఇది 90–95 శాతానికి వెళ్తుందన్న నమ్మకం ఉంది. కొన్ని కంపెనీలు రెండు, మూడవ దఫా కూడా విస్తరించాయి. ఈ రాష్ట్రం అనుసరిస్తున్న పారిశ్రామిక విధానమే ఇందుకు కారణం. ఏడు కేసుల్లో మినహా 8,500 పైచిలుకు కంపెనీలకు 15 రోజుల్లోగా అనుమతులు మంజూరు చేశాం' అని గుర్తు చేశారు.

కోబ్రాపోస్ట్ కథనం అసత్యం!

- ఖండించిన డీహెచ్‌ఎఫ్‌ఎల్
- ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్ విక్రయం !

ముంబై: డీహెచ్‌ఎఫ్‌ఎల్ కంపెనీ రూ.31,000 కోట్ల కుంభకోణానికి పాల్పడిందంటూ ఆన్‌లైన్ న్యూస్ పోర్టల్, కోబ్రాపోస్ట్ వెల్లడించిన వార్త సత్యదూరమని ఆ కంపెనీ ఖండించింది. ఎలాంటి డొల్ల కంపెనీలకు రుణాలివ్వలేదని, పార్టీలకు విరాళాలు ఇచ్చామనడం కూడా అబద్ధమేనని కంపెనీ చైర్మన్ కపిల్ వాధ్వాన్ పేర్కొన్నారు. వికాస్ శేఖర్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదులోని అంశాల ఆధారంగానే కోబ్రాపోస్ట్ అసత్య కథనాన్ని పోస్ట్ చేసిందని విమర్శించారు. కాగా తమ అనుబంధ సంస్థ, ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్‌కు విక్రయానికి సంబంధించిన వివరాలను మరో రెండు రోజుల్లో వెల్లడిస్తామని వివరించారు.

డిసెంబర్ త్రైమాసిక ఫలితాలు...

❖ స్వల్పంగా పెరిగిన 'హెక్సావేర్' లాభం



న్యూఢిల్లీ: ఐటీ సేవల కంపెనీ హెక్సావేర్ టెక్నాలజీస్ నికర లాభం డిసెంబర్ త్రైమాసికంలో 2 శాతం పెరిగి, రూ.123.4 కోట్లుగా నమోదయ్యింది. 2017 ఇదే కాలంలో ఈ మొత్తం రూ.120.9 కోట్లు. ఇక ఆదాయాలు 24.6 శాతం వృద్ధితో రూ.1,004.8 కోట్ల నుంచి రూ.1,252.4 కోట్లకు పెరిగాయి. కంపెనీ జనవరి–డిసెంబర్ కాలాన్ని ఆర్థిక సంవత్సరంగా భావిస్తోంది. ఈ ప్రాతిపదికన మొత్తం ఆర్థిక సంవత్సరంలో నికర లాభం 16.8 శాతం పెరిగి రూ.583.5 కోట్లకు చేరింది. కాగా డిసెంబర్ త్రైమాసికంలో కంపెనీ షేర్‌కు రూ.2.50 మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది.

❖ ఎన్‌టీపీసీ నికర లాభం రూ.2,385 కోట్లు

మధ్యంతర డివిడెండ్, బోనస్ ప్రకటన



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ విద్యుత్ ఉత్పత్తి సంస్థ ఎన్‌టీపీసీ.. ప్రస్తుత ఆర్థిక సంవత్సర మూడో త్రైమాసికానికి (క్యూ3, అక్టోబర్–డిసెంబర్) రూ.2,385 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గతేడాది ఇదేకాలంలో రూ.2,361 కోట్ల నికర లాభాన్ని నమోదుచేసిన సంస్థ.. అధిక ఇంధన వ్యయం, పెరిగిన రుణ భారం కారణంగా ఈ క్యూ3లో లాభాలు ఫ్లాట్‌గా ఉన్నాయని వివరించింది. నికర ఆదాయం 15.27 శాతం వృద్ధితో రూ.24,308 కోట్లకు చేరుకుంది. ఫలితాల సందర్భంగా బుధవారం సమావేశమైన కంపెనీ డైరెక్టర్లు.. ప్రతి షేరుకు (రూ.10 ముఖవిలువ) 35.8 శాతం మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించారు. ప్రతి 5 షేర్లకు ఒక బోనస్ షేరును ప్రతిపాదించారు.

❖ ఎల్‌ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ లాభం 25% అప్

ముంబై: ఎల్‌ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ నికర లాభం డిసెంబర్ క్వార్టర్లో 25.5 శాతం వృద్ధి చెంది రూ.596 కోట్లకు చేరుకుంది. అంతక్రితం ఏడాది ఇదేకాలానికి కంపెనీ లాభం రూ.475 కోట్లుగా నమోదైంది. ఈ క్యూ3లో ఆదాయం రూ.4,439 కోట్లు కాగా, వడ్డీ ఆదాయం రూ.4,414 కోట్లుగా నమోదైనట్లు కంపెనీ స్టాక్ ఎక్స్ఛేంజీలకు అందించిన సమాచారంలో తెలియజేసింది. వ్యయం రూ.2,908 కోట్ల నుంచి ఈసారి రూ.3,579 కోట్లకు పెరిగినట్లు తెలిపింది.

❖ భారత్ ఫైనాన్షియల్ ఇంక్లూజన్ ఆకర్షణీయ ఫలితాలు

హైదరాబాద్: మైక్రో ఫైనాన్స్ రంగంలోని భారత్ ఫైనాన్షియల్ ఇంక్లూజన్ కంపెనీ డిసెంబర్ త్రైమాసికానికి ఆకర్షణీయ ఫలితాలను ప్రకటించింది. నికర లాభం అంతక్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 49 శాతం వృద్ధితో రూ.288 కోట్లకు చేరింది. ఆదాయం రూ.893 కోట్లుగా ఉంది. స్థూల ఎన్‌పీఏలు 0.6 శాతంగా, నికర ఎన్‌పీఏలు 0.2 శాతంగా ఉన్నాయి. స్థూల రుణ పోర్ట్‌ఫోలియో 45 శాతం పెరిగి రూ.16,651 కోట్లుగా ఉంది. కంపెనీ నెట్‌వర్త్ రూ.3,903 కోట్లుగా, క్యాపిటల్ అడెక్వసీ రేషియో 36.2 శాతంగా ఉన్నట్టు సంస్థ తెలిపింది.

❖ హెరిటేజ్ ఫుడ్స్ లాభం రూ.20 కోట్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో హెరిటేజ్ ఫుడ్స్ రూ.20.10 కోట్ల నికర లాభాన్ని (పీఏటీ) ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో నికర లాభం రూ.16.76 కోట్లుగా ఉంది. 31 శాతం వృద్ధి నమోదయింది. ఇక, ఆదాయం 2018క్యూ3లో రూ.578.93 కోట్లుగా ఉండగా... 2019 క్యూ3 నాటికి 6.9 శాతం వృద్ధితో రూ.618.76 కోట్లకు చేరింది.

ఫిలిప్పైన్స్‌లో ఓయో హోటల్స్ అండ్ హోమ్స్

5 కోట్ల డాలర్ల పెట్టుబడులు పెడతాం • ఓయో హోటల్స్ అండ్ హోమ్స్ సీఓఓ అభినవ్ సిన్హా



న్యూఢిల్లీ: ఆతిథ్య రంగ దిగ్గజం ఓయో.. ఫిలిప్పైన్స్ దేశంలో ప్రవేశించింది. ఆ దేశంలో కార్యకలాపాల కోసం 21 ఫ్రాంచైజ్డ్, లీజ్డ్ హోటళ్లతో ఒప్పందం కుదుర్చుకున్నామని ఓయో తెలిపింది. ప్రస్తుతం తాము భారత్‌తో పాటు చైనా, మలేషియా, నేపాల్, ఇంగ్లాండ్, యూఏఈ, ఇండోనేషియా... మొత్తం ఏడు దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్నామని ఓయో హోటల్స్ అండ్ హోమ్స్ సీఓఓ అభినవ్ సిన్హా చెప్పారు. ఫిలిప్పైన్స్ తమకు ఎనిమిదో దేశమని వివరించారు. భవిష్యత్తులో ఈ దేశంలో 5 కోట్ల డాలర్లు పెట్టుబడులు పెట్టనున్నామని, వెయ్యికి పైగా ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు కల్పించనున్నామని పేర్కొన్నారు. ప్రస్తుతం ఫిలిప్పైన్స్ దేశంలో 500 రూమ్స్ ఆఫర్ చేస్తున్నామని, ఈ సంఖ్యను 2020 కల్లా పదివేలకు పెంచుకోవడం లక్ష్యమని వివరించారు. ఇక ప్రపంచవ్యాప్తంగా తమ నెట్‌వర్క్‌లో 13,000 లీజ్డ్, ఫ్రాంచైజ్డ్ హోటళ్లు, 3,000 హోమ్స్ ఉన్నాయని పేర్కొన్నారు.

ద్రవ్యలోటు కట్టుతప్పే అవకాశం లేదు: ఎస్‌బీఐ రిసెర్చ్

ముంబై: ప్రభుత్వ ఆదాయాలు– వ్యయాలకు మధ్య నికర వ్యత్యాసమైన ద్రవ్యలోటు... ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు ఉంటుందని ఎస్‌బీఐ రిసెర్చ్ తన తాజా విశ్లేషణలో పేర్కొంది. ద్రవ్యలోటు లక్ష్యాలను దాటే అవకాశం ఉందని పలు నివేదికలు పేర్కొన్న నేపథ్యంలో తాజా సర్వే వెలువడటం గమనార్హం. 2018–19 ఆర్థిక సంవత్సరం స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో 3.3 శాతంగా ద్రవ్యలోటు ఉండాలని వార్షిక బడ్జెట్ నిర్దేశించింది. విలువలో ఇది రూ.6.24 లక్షల కోట్లు. అయితే 2018 నవంబర్ పూర్తయ్యే నాటికే ఈ లోటు రూ.7.16 లక్షల కోట్లను తాకింది. ఆర్థిక సంవత్సరం మొత్తంలో లోటు కొరత లక్ష కోట్ల వరకూ ఉండవచ్చని అంచనా. అయితే లోటు కట్టుతప్పదన్నది తాజా ఎస్‌బీఐ రిసెర్చ్ విశ్లేషణ. 2019–20లో జీడీపీ విలువలో ద్రవ్యలోటు 3.2 శాతం ఉంటుందని రిసెర్చ్ అంచనా. విలువ రూపంలో ఇది రూ.6.72 లక్షల కోట్లు.

డిసెంబర్‌లో కంపెనీల విదేశీ రుణం మూడు రెట్లు!

పరిమాణం 3.81 బిలియన్ డాలర్లు

న్యూఢిల్లీ: భారత కంపెనీల విదేశీ రుణ సమీకరణ 2017 డిసెంబరుతో పోలిస్తే 2018 డిసెంబర్‌లో మూడు రెట్లు పెరిగింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తాజా గణాంకాల ప్రకారం ఈ పరిమాణం 3.81 బిలియన్ డాలర్లు. ఇందులో విదేశీ వాణిజ్య రుణ (ఈసీబీ) సమీకరణల పరిమాణం 3.77 బిలియన్ డాలర్లు. రూపీ డినామినేటెడ్ బాండ్ల (ఆర్‌డీబీ) ద్వారా సమీకరణల మొత్తం 37.04 మిలియన్ డాలర్లు. 2017 డిసెంబర్‌లో ఈసీబీ ద్వారా దేశీయ కంపెనీల రుణ సమీకరణ పరిమాణం 1.31 బిలియన్ డాలర్లు.

సంస్థలు ఇవీ...

తాజా సమీక్షా నెల్లో విదేశీ రుణం సమీకరించిన కంపెనీల్లో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (1.3 బిలియన్ డాలర్లు), భారత్ ఒమెన్ రిఫైనరీస్ లిమిటెడ్ (125 మిలియన్ డాలర్లు), పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(196 మిలియన్ డాలర్లు), ఎన్‌టీపీసీ, హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ (300 మిలియన్ డాలర్ల చొప్పున)లు ఉన్నాయి.

ద్వితీయార్థం దాకా ఇంతే!

- ట్రక్ మార్కెట్‌కు యాక్సిల్ లోడ్ నిబంధనల దెబ్బ
- మహీంద్రా ట్రక్ అండ్ –బస్ సీఈఓ వినోద్ సహాయ్

ముంబై, సాక్షి బిజినెస్ బ్యూరో: గతేడాది ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త యాక్సిల్ లోడ్ నిబంధనలు హెవీ, మీడియమ్ కమర్షియల్ వెహికల్ మార్కెట్‌ను కుంగదీశాయని, వీటి ప్రతికూల ప్రభావం ఈ సంవత్సరం రెండో అర్ధభాగం వరకు కొనసాగవచ్చని మహీంద్రా అండ్ మహీంద్రా ట్రక్ అండ్ బస్ సీఈఓ వినోద్ సహాయ్ చెప్పారు. ఈ నిబంధనల వల్ల మీడియం, హెవీ కమర్షియల్ వెహికల్ అమ్మకాలు దాదాపు 25 శాతం క్షీణించాయన్నారు. నిబంధనల ప్రభావం తమపై కూడా పడిందని, అందుకే గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈ క్యూ3లో వ్యాపారం దాదాపు 30– 40 శాతం మేర కుంచించుకుపోయిందని చెప్పారు. ''క్రమంగా ఈ నెగెటివ్ ప్రభావం నుంచి మార్కెట్ కోలుకుంటోంది. క్యూ4 నాటికి విక్రయాల్లో వృద్ధి తరుగుదల పది శాతానికి పరిమితం కావచ్చు. కొత్త నిబంధనలతో పాత ట్రక్కు యజమానులకు ఊరట లభించింది. దీంతో కొత్త వాహనాల కొనుగోళ్లు గణనీయంగా పడ్డాయి'' అని వివరించారు. కొత్త యాక్సిల్ లోడు నిబంధనల ప్రభావం ఈ ఏడాది ద్వితీయార్థానికి పూర్తిగా తొలగిపోతే తిరిగి ట్రక్ మార్కెట్ వృద్ధి బాట పట్టవచ్చని అంచనా వేశారు. బీఎస్6 నిబంధనలు అమల్లోకి వస్తే ట్రక్ ధరలు రూ.లక్ష నుంచి 3 లక్షల వరకు పెరగవచ్చని చెప్పారు.



ఐసీవీ విభాగంపై ప్రత్యేక ఫోకస్: పవన్ గోయింకా

ఐసీవీ (ఇంటర్‌మీడియరీ కమర్షియల్ వెహికల్స్) విభాగం ఏటా 15–17 శాతం చక్రీయ వృద్ధి సాధిస్తోందని ఎంఅండ్‌ఎం ఎండీ పవన్ గోయింకా చెప్పారు. ఆటో కంపెనీలు హెచ్‌సీవీ (హెవీ కమర్షియల్ వెహికల్స్) వచ్చిన తరుగుదలను తట్టుకునేందుకు ఐసీవీ, ఎల్‌సీవీ మార్కెట్‌పై ఎక్కువ ఫోకస్ పెడుతున్నాయని, అందుకే తాము ఈ విభాగంలో ప్రవేశించామని తెలిపారు. ఈ విభాగంలో టాప్3 కంపెనీలతో (టాటామోటార్స్, అశోక్ లేలాండ్, వోల్వో ఐషర్) పోటీ పడేలా ఫ్యూరియో ట్రక్ మోడల్‌ను డిజైన్ చేశామన్నారు. ''దీనిపై రూ.600 కోట్లు వెచ్చించాం. ఐసీవీ విభాగంలో సింగిల్ ట్రక్ ఓనర్స్ ఎక్కువమంది ఉంటారు. వీరిని దృష్టిలో పెట్టుకుని ఈ మోడల్‌ను తెచ్చాం. ఫ్యూరియోను గతేడాదే ఆవిష్కరించినా, ఆరు నెలలపాటు అన్ని రకాలుగా సమీక్షించామని, ఎటువంటి లోపాలు లేవని నిర్ధారించుకొని మార్కెట్లోకి విడుదల చేశాం'' అన్నారు.

మరికొన్ని కంపెనీల ఫలితాలు క్లుప్తంగా... (రూ. కోట్లలో)

	నికర లాభం			మొత్తం ఆదాయం		
కంపెనీ	2018–19	2017–18	వృ/క్షీ(%)	2018–19	2017–18	వృ/క్షీ(%)
జూబిలెంట్ ఫుడ్‌వర్క్స్	96	66	46	943	798	18
ఆశోక బిల్డ్‌కాన్	62	47	32	1,091	675	62
టోరెంట్ ఫార్మా	246	58	324	2,051	1,463	40
మహీంద్ర హాలిడేస్	21	32	-33	247	266	-7
ధాంపూర్ సుగర్స్	82	75	10	799	784	2
మహీంద్రా లాజిస్టిక్స్	19	15	24	981	835	18
టాటా కమ్యూనికేషన్స్	173	10	1630	4,269	-	4.9
అజంతా ఫార్మా	67	147	-55	485	587	-
చోళమండలం	304	-	41	-	-	-
జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ	146	-	-	2,491	2,081	19

ఎన్‌ఎస్‌ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ADANI PORT	338.15	349.25
ASIAN PAINT	1390.4	1393.3
AXIS BANK L	690.95	660.75
BAJAJ AUTO	2499.7	2567.65
BAJAJ FINSE	6247.2	6233.05
BAJAJ FINAN	2595.5	2515.55
BHARTI AIRT	303.7	307.85
BPCL	342.7	344.9
CIPLA LTD	505.8	505.05
COAL INDIA	225.2	222.55
EICHER MOTO	18919.15	18877.25
GAIL (INDIA	321.6	323.6
GRASIM INDU	725	733.5
HCL TECHNOL	1018.4	988.45
HDFC LTD	1885.8	1922.3
HDFC BANK L	2034.7	2057.6
HERO MOTOCO	2611	2633.3
HINDALCO I	205.8	199.55
HPCL	231.15	235.3
HUL	1733.35	1756.7
INDIABULLS	672.9	698.6
ICICI BANK	365.9	346.85
INDUSIND BA	1476.1	1461.85
BHARTI INFR	290.3	297.35
INFOSYS LIM	725.9	727.9
INDIAN OIL	134.55	137.35
ITC LTD	275.5	278.45
JSW STEEL L	268.9	270.95
KOTAK MAHIN	1222.2	1251.4
LARSEN & T	1294.45	1278.05
MAHINDRA &M	678.65	669.65
MARUTI SUZU	6548.25	6526.95
NTPC LTD	138.7	138.5
OIL AND NAT	139.7	141.05
POWER GRID	187.1	185.6
RELIANCE IN	1195.7	1210.65
STATE BANK	287.45	280.6
SUN PHARMAC	417.95	422.4
TATA MOTORS	174.6	173.6
TATA STEEL	467.45	443.8
TCS	1981.4	1982.75
TECH MAHIND	714.6	731.5
TITAN COMPA	968.9	966.1
ULTRATECH C	3442.2	3409.65
UPL LIMITED	767.35	760.3
VEDANTA LIM	194.1	192.65
WIPRO LTD	363.25	359.4
YES BANK	199.5	202.9
ZEE ENTERTA	388.85	377.4

నిఫ్టీ నెక్స్ట్ ఫిఫ్టీ

ABB INDIA L	1264.65	1258.9
ADITYA BIRL	82.3	82.7
ACC LIMITED	1386.6	1359.65
AMBUJA CEME	204.65	200.85
ASHOK LEYLA	80.95	82.3
BANDHAN BAN	405.95	409.6
BANK OF BAR	113.7	113.75
BHARAT ELEC	84	81.85
BHEL	63.9	64.4
BIOCON LIMI	646.1	648.2
BOSCH LIMIT	18454.1	18171.95
BRITANNIA I	3208.8	3180.05
CADILA HEAL	319.15	321.7
COLGATE PAL	1272.9	1263.75
CONTAINER C	661.45	642.85
DABUR INDIA	431.15	423.15
DLF LIMITED	164.2	164.9
AVENUE SUPE	1374.2	1384.55
GENERAL INS	242.95	243.75
GODREJ CONS	693.5	751.2
HAVELLS IND	703.35	700.95
HDFC STAND	370.4	360.3
HINDUSTAN Z	261.65	259.6
ICICI LOMBA	855.8	831.7
ICICI PRU L	292.15	294.4
VODAFONE ID	30.55	30.7
INTERGLOBE	1174.75	1184.65
L&T FINANCE	132.7	131
LIC HOUSING	433.5	452.5
LUPIN LIMIT	866.9	860.65
MARICO LIMI	365.9	365.5
UNITED SPIR	550.1	552.45
MOTHERSON S	141.3	142.25
MRF LTD	61329.4	61868.15
NHPC LTD	24.5	24.45
THE NEW IND	174.05	176.6
NMDC LTD.	96.1	92.05
ORACLE FIN	3768.95	3748.25
OIL INDIA L	166.6	170.3
PIRAMAL ENT	2075.35	2124.4
PETRONET LN	225.6	223.05
P&G HYGIENE	9919.6	9892.6
PIDILITE IN	1110.1	1105.85
STEEL AUTHO	47.3	46.2
SBI LIFE IN	599.95	606.1
SHREE CEMEN	15450.35	15456.35
SIEMENS LTD	1013.45	1011.95
SHRIRAM TRA	1014.7	1026.6
SUN TV NETW	533.65	533.45

బీఎస్‌ఈలో ఏపీ,టీఎస్ స్టాక్స్

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
AditSpin	5.5	5.67
Alphageo	472.8	486.55
Alu Flouride	87.05	89.85
Amar Raja Bat	750.8	749.7
And Bank	25.8	26
And Cemen	4.72	4.5
And Paper	428.2	420.05
And Petro	57.5	55.35
Anjani Portl	113.4	107.6
Aries Agro Ltd	88.7	88.55
Aurobindo Ph	778.4	760.85
Avantel Soft	220.05	225.55
Avanti Feeds	316.4	309.7
BN Rathi Sec	24.85	24
Balaji Amin	422.65	424.85
Bambino Agro	180	184.5
Bartronics	6.51	6.5
Bhagira Chem	423.65	423
Bhagya Nag	33.25	35.45
Bhagya Wood	18.6	19.45
Bhaskar Agro	30.7	31.3
Brilliant Sec	0.9	0.9
CIL Securi	14.5	14.85
Cont Coffee	267.75	270.5
CoroFert	447.4	442.9
Cosboard Ind	12.77	13.03
Country Club	6.63	6.59
Cybermate	1.93	1.84
DR Reddy	2651.15	2661.6
Danlaw Tec	83.1	86.15
Divi's Lab	1498	1501.95
Divya Granit	95.1	98.7
Dredgin Corp	400.35	382.2
Empee Sugars	1.4	1.39
Everest Org	165.3	137.75
Fortune Info	42.8	39.9
Four Soft	35.75	35.25
GMR Infra	15.4	15.55
GVK Power	6.65	6.62
Gati Corpn	74.65	72.65
Gayatri Proj	166.25	169.4
Gayatri Sugrs	2.68	2.67
Gennex Lab	3.13	2.91
GodavDru	21.25	21.55
Goldstn Tele	225.1	226.45
Goldstone Tech	12.7	12.1
Granules (I)	92.4	88.4
HBL Nife Pow	26.85	24.65
HYDIndus	1826.9	1790.75
Heritage Food	493.5	474.35
HindFlurocarb	15.1	15.2
IDL Industrs	235	241
IVRCL Infras	0.9	0.92
IndoNationl	685	672.3
Infotech En	615	584.5
Invinex Lab	49.2	48.8
JSTL	34.5	31.3
KCP LTD	84	83.9
KNR Constructio	204.5	205.6
Kabsons Indu	5.44	5.72
KakatiCem	183	182.65
Kallam Spg	17.2	17
Kernex Micro	25.4	24.2
Krebs Bio	107	113.95
LGS Global	2.95	2.83
LancoIndus	175.6	174.55
Lokesh Mach	41.45	42.45
Lotus Choc	24.85	23.9
MIC Elec	0.85	0.85
Madhucon Proje	6.05	6.15
Maytas Infra	11.1	11.65
Mold-tek	46	45.7
Moldtek Plastic	221.4	223.6
Moschip Semi	20.75	20.7
NCCBlue Wat	7.32	7.18
NCLInd	119.3	121.65
NETTLINX	42.95	43.7
NMDC Ltd	96.15	91.85
NagarAgrich	27.25	27.25
NagarConst	80.4	81.4
Natco Pharma	681.3	665.5
Nava Bh Ventur	106.5	108.65
Neha Inter	4.19	4.11
Neocure Ther	2.24	2.3
Neuland Lab	492.7	500.4
Nihar Info Glo	10.81	10.31
Nile	305.3	333.2
Northgate Tech	0.57	0.59
Oil Country	13.05	14.3
Ortin Lab	15	14.6
Padmalaya Tele	2	2.09
Panyam Cemen	10.86	10.73
PennInd	35.35	35.7
Phytochem I	42	39.6
Pitti Lamin	57.7	48.5
Pokarna	178	175.85
Prajay Engs	8.25	8.05
PremiExpl	241.5	251.55
Prism Cement	69.9	73.25
Raasi Refrac	18.96	19.95
Ragsan Petro	62.05	59.1
Rain Industries	116.75	112.6
Raj Packagin	27	27
Ram Informat	43	42.25
RavilGr	15.05	14.35
Reg.Ceramic	4.09	4.3
Restile Cer	3.85	3.77
Roopa Indus	10	10.07
Sai Wires(I)	1	1.05
Samkrg Pist	178.4	178.45
Sampre Nutri	44.55	44.55
SangInd	56.4	55.85
Satvah. Ispat	9.9	9
Saven Techno	26.45	27.8
Sibar Auto	27.55	29
Softsol	35	34.6
South Bio Tech	1.91	1.94
South Magnes	12.72	12.12
SrRayAlk	33.8	33.75
Srinivasa Ship	39	37.55
Starchik Sp	27.3	26
Sujana Metal	0.39	0.39
Sujana Univers	0.3	0.31
Surana Tele	4.39	4.33
Suryachakra Pow	0.28	0.27
Suryalata Sp	127.5	127.5
SuvarCem	67.95	66
Suven Pharma	193.45	192.75
TCI Finance	14.65	14.8
Taj Gvk Hotel	177.7	176.6
Tanla Solutions	39.3	37.3
Trans Biotek	5.44	5.48
Transport Co	279.1	275.75
Trendy Knit	0.19	0.2
Usher Agro	2.38	2.38
V&K Soft	4.1	4.1
VBC Ferro	36.4	38
VST Indus	3259.4	3230.4
Vamshi Rubb	28	30
Viceroy Hotels	3.29	3.46
VijayTextil	36.7	34.85
Vimta Labs	255	253.15
Virat Crane	28	29
Virinchi Con	73.6	73.15
VisakaInd	365	368.6
Vista Pharma	24.55	24.05
Vivimed Labs	22.85	22.9
Vjil Consult	33.2	34.65
ZenoTech Lab	27.6	28.15

భారత్‌లో అవినీతి తగ్గుతోంది..!

చైనా, పాకిస్తాన్ కంటే పరిస్థితి మెరుగు

- ప్రపంచ దేశాల్లో 78వ ర్యాంకు
- 'ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ 'వార్షిక నివేదికలో వెల్లడి

భారతదేశంలో వేళ్లూనుకుపోయిన అవినీతి తగ్గుముఖం పడుతోందని 2018 ప్రపంచ అవినీతి సూచి వెల్లడించింది.మన పొరుగు దేశాలైన చైనా, పాకిస్తాన్ కంటే మన దేశంలో అవినీతి చాలా తక్కువగా ఉందని ప్రపంచ దేశాల అవినీతిపై అధ్యయనం చేసే 'ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్'సంస్థ తన వార్షిక నివేదికలో తెలిపింది. మొత్తం 180 దేశాల్లో అవినీతి అతి తక్కువ ఉన్న దేశాల్లో భారత్ 78వ స్థానంలో నిలిచింది. చైనా 87వ స్థానంలో ఉంటే, పాకిస్తాన్ 117వ స్థానంలో ఉందని ఆ అధ్యయనంలో తేలింది. 'ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్'ఏటా కరప్షన్ పెర్సెప్షన్ ఇండెక్స్ (సీపీఐ)ను విడుదల చేస్తూ ఉంటుంది. ఇందులో



అవినీతి స్కేల్‌ని జీరో నుంచి 100 వరకు కొలుస్తూ ఉంటారు. జీరో వస్తే అవినీతి బలంగా వేళ్లూనుకుందని అర్థం. అదే 100 పాయింట్లు వస్తే అవినీతి రహిత దేశంగా పేర్కొంటారు. ఈ ఏడాది సీపీఐలో మూడింట రెండు వంతుల దేశాల స్కోర్ 50 కంటే తక్కువగానే వచ్చాయి. 2017లో భారత్ సీపీఐ స్కోర్ 40 ఉంటే, ఈ ఏడాది 41కి చేరింది. భారత్‌లో సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ అవినీతిలో ఆ మాత్రం తగ్గుదల కనిపించడం మంచి పరిణామమేనని ఆ నివేదిక అభిప్రాయపడింది. *– సాక్షి, నాలెడ్జ్ సెంటర్*

అన్నాహజారే నేతృత్వంలో ఉద్యమ ప్రభావంతో...

2011లో అవినీతికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా యువత ప్రముఖ సామాజిక కార్యకర్త అన్నాహజారే నేతృత్వంలో కదం తొక్కింది. జన లోక్ పాల్ చట్టాన్ని తీసుకువచ్చి అవినీతిని అంతం చేయాలంటూ డిమాండ్లు మిన్నంటాయి.దీనిపై ప్రభుత్వం సరైన రీతిలో స్పందించకపోయినప్పటికీ, క్షేత్రస్థాయిలో అవినీతిని అరికట్టడానికి ఎలాంటి ప్రత్యేకమైన చర్యల్ని తీసుకోకపోయినప్పటికీ ఆనాటి ఉద్యమ ప్రభావంతో అవినీతి కాస్తో కూస్తో తగ్గిందని ఆ నివేదిక అభిప్రాయపడింది.

మొదటి ర్యాంకు డెన్మార్క్, అట్టడుగు స్థానంలో సోమాలియా

ఇక అవినీతి అత్యంత తక్కువగా ఉన్న దేశాల్లో మొదటి స్థానంలో డెన్మార్క్ నిలవగా, రెండో స్థానంలో న్యూజిలాండ్ ఉంది. ఆ దేశాల సీపీఐ స్కోర్లు 88, 87గా ఉన్నాయి. ఇక అవినీతి ఊబిలో కూరుకుపోయిన దేశాల్లో సోమాలియా 10 పాయింట్లతో మొదటి స్థానంలో ఉంది. ఆ తర్వాత సిరియా, దక్షిణ సూడాన్ చెరో 13 పాయింట్లతో రెండో స్థానంలో ఉన్నాయి.

అమెరికాలో కాస్త పెరిగిన అవినీతి

అమెరికాలో గతేడాది కంటే సీపీఐ పాయింట్లు 4 తగ్గి 75 నుంచి 71కి పడిపోయాయి. దీంతో అమెరికా అవినీతి అతి తక్కువగా ఉన్న మొదటి 20 దేశాల జాబితాలో స్థానం పొందలేకపోయింది. 2011 తర్వాత మొదటి 20 దేశాల్లో చోటు దక్కకపోవడం అమెరికాకు ఇదే మొదటిసారి. ఇది అగ్రదేశానికి ఆందోళన కలిగించే అంశమే. సీపీఐ స్కోర్ నాలుగు పాయింట్లు దిగజారడం అంటే అత్యున్నత స్థాయిలో నైతిక విలువలు పడిపోతున్నాయనే ఆందోళన కలుగుతోందని 'ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్'అమెరికా ప్రతినిధి జియో రాయటర్ అన్నారు. దేశంలో ఇదే స్థాయిలో అవినీతి కొనసాగితే దేశానికి అదే పెద్ద సమస్య అవుతుందని జియో పేర్కొన్నారు.

కేన్సర్ ఇక ఖతమే!

కేన్సర్ సోకిందంటే చాలు..
ఇక మరణమే అని అనుకునేవారు ఒకప్పుడు!
సాంకేతిక పరిజ్ఞానంలో వచ్చిన మార్పులో..
పరిశోధనల ఫలితమో కానీ
ఇప్పుడు ఈ వ్యాధి సోకినా కొన్నేళ్లపాటు
బతికేయొచ్చు అన్న భరోసా వచ్చింది..
ఇప్పటికీ సాధ్యం కాని విషయం ఏంటంటే..
కేన్సర్‌ను నయం చేయడం!
ఈ లోటును ఏడాదిలోపే
తాము భర్తీ చేస్తామంటోంది ఏఈబీఐ
అంతటి అద్భుతం ఈ కంపెనీ చేతిలో ఏముంది?



ఏటా రెండు కోట్ల మంది ప్రాణాలు బలితీసుకుంటున్న కేన్సర్ మహమ్మారికి చెక్ పెట్టేందుకు ఏఈబీఐ ఓ వినూత్నమైన మార్గాన్ని ఎంచుకుంది. దీన్ని అర్థం చేసుకోవాలంటే.. హెచ్ఐవీ చికిత్సను ఒక్కసారి గుర్తుచేసుకోవాలి. ఒకప్పుడు ఈ వ్యాధికి బోలెడన్ని మాత్రలు ఇచ్చేవారు. రోజుకు ఇరవై ముప్పై మాత్రలు వేసుకున్నా ప్రాణాలకు గ్యారంటీ ఉండేది కాదు. కానీ.. యాంటీరెట్రోవైరల్ డ్రగ్స్ (ఏఆర్‌టీ) రంగ ప్రవేశంతో ఈ పరిస్థితిలో మార్పు వచ్చింది. మూడు మందులను కలిపివాడే ఈ ఏఆర్‌టీ మందుల వాడకంతో ఇప్పుడు హెచ్ఐవీతోనూ దశాబ్దాల పాటు బతకడం సాధ్యమవుతోంది. దాదాపు ఇలాంటి పద్ధతినే కేన్సర్ వ్యాధికి వర్తింప జేసింది ఇజ్రాయెల్ కంపెనీ ఏఈబీఐ. ఈ పద్ధతికి ఏఈబీఐ పెట్టిన పేరు ముటాటో. మల్టీటార్గెట్ టాక్సిన్‌కు క్లుప్తరూపం ఈ ముటాటో. కేన్సర్ చికిత్సకు ఇప్పటివరకూ వాడుతున్న వేర్వేరు పెప్టైడ్‌లను కలిపి వాడటం ఈ పద్ధతిలోని కీలకాంశం. ఇవన్నీ ఏక కాలంలో కేన్సర్ కణాలపై దాడి చేస్తాయి. ఫలితంగా కేన్సర్ కణాలు నాశనమవుతాయని ఏఈబీఐ సీఈవో ఇలాన్ మొరాద్ చెబుతున్నారు. ఈ కొత్త పద్ధతి కేన్సర్ కణాల సృష్టికి కారణమైన మూలకణాలను లక్ష్యంగా చేసుకుని పనిచేస్తుందని అంటున్నారు. కేన్సర్ కణాలు సాధారణంగా రోగ నిరోధక వ్యవస్థ కళ్లు కప్పేందుకు డీఎన్ఏలో మార్పులు జరుగుతుంటాయని.. తమ పద్ధతి ద్వారా ఇది కూడా వీలుకాదని వివరించారు. *– సాక్షి నాలెడ్జ్ సెంటర్*



వినూత్న పద్ధతిలో మందును కనుగొన్న ఇజ్రాయెల్ కంపెనీ

- హెచ్ఐవీ చికిత్స విధానం స్ఫూర్తితో రూపకల్పన
- ముటాటోగా నామకరణం..
- పలు రకాల పెప్టైడ్‌ల ద్వారా నయం చేసేందుకు ప్రయత్నాలు
- వచ్చే ఏడాది అందుబాటులోకి..!

పరిశోధనకు నోబెల్..

ఏఈబీఐ అభివృద్ధి చేస్తున్న కొత్త కేన్సర్ చికిత్స పద్ధతి ఇంకో ఏడాదిలోపే అందరికీ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని ఇలాన్ చెబుతున్నారు. ఎస్ఓఏపీ అనే ప్లాట్‌ఫాం ద్వారా అన్ని రకాల కేన్సర్లపై పోరాడే లక్షణాలు ఉన్న పెప్టైడ్‌లను గుర్తించడం ద్వారా ఈ కొత్త పద్ధతి తొలి రోజు నుంచి ప్రభావం చూపుతుందని అంచనా. బ్యాక్టీరియాలపై దాడి చేసే వైరస్‌లోకి నిర్దిష్ట ప్రొటీన్లను ఉత్పత్తి చేసే డీఎన్ఏ పోగులను ప్రవేశపెట్టడం ద్వారా ఇది జరుగుతుంది. ఈ ప్రొటీన్‌ను సులువుగా గుర్తించవచ్చని, అదెలా పనిచేస్తుందో కూడా గమనిస్తుండవచ్చని చెబుతున్నారు. ఈ పద్ధతి ద్వారా కొత్త, వినూత్నమైన పెప్టైడ్‌లను సృష్టించొచ్చన్న పరిశోధనకే గతేడాది నోబెల్ బహుమతి దక్కింది. ఏఈబీఐ ఎలుకలపై ప్రయోగాలు చేసి సానుకూల ఫలితాలు రాబట్టింది.

వ్యక్తిగత వైద్యం..

ముటాటో కేన్సర్ చికిత్స పద్ధతిలో ఉండే ఇంకో విశేషం ఇది అందరికీ ఒకే మందు ఇవ్వడం కుదరదు. కేన్సర్ కణితి నుంచి నమూనా సేకరించి అందులో ఎక్కువగా కనిపిస్తున్న కణ లక్ష్యాలను ముందుగా గుర్తిస్తారు. ఆ తర్వాత వాటికి విరుగుడుగా పనిచేసే పెప్టైడ్‌లను సిద్ధం చేసి అందిస్తారు. అంటే ఇది వ్యక్తిగత వైద్యం అన్న మాట. వేర్వేరు కేన్సర్లకు అవసరమైన పెప్టైడ్‌లన్నీ ఒకే ప్లాట్‌ఫాంపై ఏర్పాటు కావడం వల్ల కేన్సర్ కణాలకు మాత్రమే నష్టం జరుగుతుందని కంపెనీ చెబుతోంది. కేన్సర్‌కు ప్రస్తుతం ఉపయోగిస్తున్న కీమోథెరపీ, రేడియేషన్ చికిత్స పద్ధతులు అనేక దుష్ప్రభావాలు చూపుతాయన్నది అందరికీ తెలిసిన విషయమే. బహుళ పెప్టైడ్ విధానం వల్ల ఈ సమస్యలేవీ ఉండవు. పైగా ముటాటో మందులు జీవితాంతం వాడాల్సిన అవసరం లేదు. కొన్ని వారాల పాటు మందులు వాడితే సరిపోతుంది. అంతా బాగుందికానీ.. ఏఈబీఐ ప్రయోగాలకు సంబంధించి ఇప్పటివరకూ ఇతర శాస్త్రవేత్తల సమీక్ష జరగలేదు. ఈ లోటును కూడా పూరించుకుంటే కేన్సర్‌పై పోరులో కొత్త అధ్యాయం మొదలైనట్లే.

సీతారామలో కీలక ముందడుగు

అటవీ అనుమతులకు కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ ఓకే • కాల్వల, టన్నెళ్ల పనికి లైన్‌క్లియర్

సాక్షి, హైదరాబాద్: సీతారామ ఎత్తిపోతల పథకంలో మరో కీలక ముందడుగు పడింది. భద్రాద్రి-కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లోని 6.74 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు ఉద్దేశించిన ఈ పథకానికి తుది అటవీ అనుమతులు మంజూరయ్యాయి. ఈ అనుమతిని మంజూరు చేస్తూ కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ చెన్నై కార్యాలయం డిప్యూటీ కన్జర్వేటర్ కె.గణేశ్‌కుమార్ ఉత్తర్వులిచ్చారు. గోదావరిపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని దుమ్ముగూడెం ఆనకట్ట నుంచి నీటిని మళ్లించి భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల పరిధిలోని 6.75 లక్షల ఎకరాలకు నీరందించేందుకు సీతారామ ఎత్తిపోతల పథకం నిర్మాణాన్ని తెలంగాణ ప్రభుత్వం చేపట్టింది. ఈ ప్రాజెక్టు కోసం 20,946.72 ఎకరాల భూసేకరణ జరపాల్సి ఉండగా, అటవీభూమి 3,827.63 ఎకరాలు. మణుగూరు డివిజన్‌లో 212.95 హెక్టార్లు, పాల్వంచ పరిధిలో 618.95, కొత్తగూడెం డివిజన్ పరిధిలో 369.09, సత్తుపల్లిలో 277.41, ఖమ్మం డివిజన్ పరిధిలో 52.64 హెక్టార్ల భూమి అవసరం ఉంది. ఈ అటవీ భూముల పరిధిలో కాల్వలు, టన్నెళ్లు, విద్యుత్ లైన్ నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. ఈ అటవీ అనుమతులకు స్టేజ్-1 క్లియరెన్స్ గతేడాదే మంజూరైంది. ఇప్పటికే వన్యప్రాణి బోర్డు, పర్యావరణ అనుమతులూ మంజూరయ్యాయి. తాజాగా అటవీ అనుమతులకు క్లియరెన్స్ దక్కడంతో పనులు వేగం పుంజుకోనున్నాయి.

Published and Printed by K. Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., Editor: V. Murali, Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792